# 169 తెలుగువారి సంప్రదాయాలు



నిత్ర పబ్లికేషన్స్

రాంకర్రి జ్ఞాన కేంద్ర

www.ramkarri.org

#జ్ఞాన కేంద్ర నుండి అద్భుత కథనాలను వ్యక్తిగతంగా పొందాలి అనుకుంటే "ఓం" అని 8096339900 కి మీ వాట్సప్ నుండి సందేశం పంపించండి.

www.ramkarri.org

# మా మాట

హిందూ సమాజం అన్నా, హిందూ సంప్రదాయాలు అన్నా ప్రపంచ దేశాల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. గతం నుంచీ పాటిస్తూ వచ్చిన ఒక నిర్దిష్టమైన పద్ధతినే సంప్రదాయం అంటారు. తెలుగువారి సంప్రదాయాలు, వేడుకలు భారతీయ సంప్రదాయాలలో మిళితమై ఉంటాయి. తెలుగు వారికంటూ కొన్ని ప్రత్యేక సంప్రదాయాలు, వేడుకలు, అలవాట్లు, కళా ప్రదర్శనలు ఉన్నాయి.

తెరమరుగైపోతున్న అలాంటి అనేక సంప్రదాయాలు, వేడుకలను ఒక చోట ప్రోదిచేసి అందించాలని మేము ప్రయత్నించాము. ఈ సంప్రదా యాలు, వేడుకలలో కొన్ని ప్రాంతీయ భేదాలతో భిన్నంగా కనిపించవచ్చు. ఒక్కొక్క ప్రాంతంలో ఒకే విధమైన వేడుకను భిన్నంగా నిర్వహించుకుంటారు.

విషయ సేకరణకు, పటములకు మేము అనేక గ్రంథములను, పత్రికలను, వ్యాసములను, అంతర్జాలములోని వివిధ సైట్లను, సంప్ర దాయాలను విశ్లేషించే ఎన్నో గ్రంథాలను పరిగణనలోనికి తీసుకొన్నాము. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలుపుకొంటున్నాము. కనుమరు గౌతున్న ఏ ఒక్క సంప్రదాయాన్నైనా మీ దృష్టికి మేము తేగలిగితే మా లక్ష్యం నెరవేరినట్లేనని భావిస్తాము... ధన్యవాదములతో....

– నిత్య పబ్లికేషన్స్

We have made many efforts to present this bok without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition.

# విషయసూచిక

1. వేంకటేశ్వర స్వామికి ఎదురు నడుచుట .................... 11
2. శ్రీ వెంకటేశ్వరస్వామికి అఖండ దీపారాధన వేడుక ....... 14
3. శ్రీ వేంకటేశ్వర స్వామి ముడుపు................................ 16
4. మాలక్ష్మమ్మ చెట్టువద్ద వేడుక ................................ 18
5. యారనాలు వేడుక .............................................. 19
6. నలుగు వేడుక .................................................... 20
7. గుమ్మం దగ్గర పేర్లు చెప్పే వేడుక............................ 21
8. మరదలు మాడ వేడుక ......................................... 22
9. దొంగవేలం ......................................................... 22
10. అలకపాన్పు వేడుక.............................................. 23
11. గర్భాదానం ........................................................ 24
12. పూలచెండ్లాట వేడుక.......................................... 28
13. పెండ్లి కుమార్తెకు పుట్టింటివారి సారె....................... 30
14. మీదుకట్టే విధానము .......................................... 32
15. పదహారు రోజుల పండుగ ................................... 33
16. పెండ్లికూతురును నెలలోపల పంపుట ...................... 35
17. ఆడపిల్లను కాపురానికి పంపుట ............................ 36
18. చలువ కావిడ ..................................................... 37
19. ఆషాడపట్టి ......................................................... 38

20. శ్రావణ పట్టి ........ 38
21. పుంసవనం ........ 39
22. సీమంతం ........ 43
23. వెన్నెల భోజనముల వేడుక ........ 47
24. జాతకర్మ ........ 48
25. పురిటి స్నానము వేడుక ........ 51
26. పిల్లల స్నానం తరువాత ........ 54
27. దిష్టి తీయటం ........ 56
28. నామకరణం/బారసాల ........ 59
29. ముదిమనవల సంతానము అయితే ........ 63
30. బావిలో చేద వేయుట ........ 64
31. నిష్క్రమణ ........ 67
32. అన్నప్రాశన ........ 70
33. 8-12వ నెలలలో వేడుకలు ........ 75
34. పుట్టినరోజు వేడుక ........ 76
35. చూడాకరణ సంస్కారం/పుట్టు వెంట్రుకలు ........ 78
36. తలమీద శిఖ ........ 82
37. కర్ణవేధ ........ 83
38. భోగిపండ్లు ........ 87
39. అక్షరాభ్యాసం ........ 90
40. ఓణీలు-పంచెల వేడుక ........ 94
41. పుష్పవతి అయినప్పుడు పాటించే సంప్రదాయాలు ........ 96

42. సమర్త స్నానము ........ 99
43. కేశాంత ........ 100
44. సమావర్తన ........ 101
45. మొలత్రాడు ........ 103
46. ముక్కుపుడక ........ 105
47. పెళ్ళి చూపులు ........ 108
48. నిశ్చితార్థం ........ 110
49. ముహూర్త నిశ్చయం ........ 112
50. లగ్న పత్రిక వివరణ........ 115
51. అంకురారోపణము ........ 116
52. పసుపు కొట్టుట........ 117
53. పందిరి రాట........ 118
54. కళ్యాణ మండప (వేదిక) నిర్మాణము ........ 119
55. పెండ్లి పెట్టె ........ 121
56. మంగళ సూత్రము తీసుకురావటము ........ 122
57. స్నాతకం/సమావర్తనము ........ 123
58. కాశీ యాత్ర ........ 128
59. పెళ్ళికొడుకును-పెళ్ళికూతురును చేయడం ........ 130
60. వరపూజ (ఎదురుకోలు)........ 133
61. ముఖాలు కడిగించు వేడుక........ 134
62. లాజహోమం........ 135
63. గౌరీ పూజ-వర పూజ ........ 136

64. గోత్రం-ప్రవర ........................................ 138
65. గంపలో వధువు ........................................ 140
66. కాళ్లు కడగడం ........................................ 142
67. మాంగల్య ధారణ ........................................ 145
68. బ్రహ్మ ముడి ........................................ 148
69. పాణిగ్రహణం ........................................ 151
70. వధువు కాళ్ళకి మట్టెలు ........................................ 153
71. ఉంగరాలు తీయడం ........................................ 154
72. బొమ్మని అప్పగింత ........................................ 155
73. అప్పగింతలు ........................................ 156
74. ధృవనక్షత్రం ........................................ 158
75. అరుంధతి నక్షత్ర దర్శనము ........................................ 159
76. పేరంటాలు పెట్టడం ........................................ 160
77. మంగళసూత్రం ........................................ 161
78. ఒడిబియ్యం ........................................ 165
79. బొట్టు ........................................ 168
80. శంఖుస్థాపన ........................................ 172
81. గృహప్రవేశము ........................................ 176
82. అద్దె ఇల్లు - గృహప్రవేశం ........................................ 178
83. భోగిమంటలు ........................................ 180
84. సంకురుమయ్య ........................................ 181
85. బొమ్మలకొలువు ........................................ 182

86. గొబ్బెమ్మల కొలువు వేడుక ........ 190
87. ముగ్గులు ........ 194
88. హరిదాసులు ........ 198
89. తప్పెటగుళ్ళు ........ 201
90. కొమ్మునృత్యం ........ 209
91. జముకుల కథలు ........ 210
92. బొడ్రాయి ........ 213
93. కాశీ కథలు చెప్పే కాశీ కావడి ........ 215
94. లంబాడీల నృత్యం ........ 218
95. ధింసా నృత్యం ........ 221
96. గుస్సాడీ నృత్యం ........ 223
97. గరగ నృత్యం ........ 226
98. దండారి నృత్యం ........ 230
99. పేరిణి నృత్యం ........ 232
100. డప్పు నృత్యం ........ 234
101. కూచిపూడి నృత్యం ........ 237
102. దేవదాసి నృత్యం ........ 242
103. వీరనాట్యము ........ 245
104. యక్షగానం ........ 246
105. బుట్టబొమ్మలు ........ 251
106. గంగిరెద్దులాట ........ 254
107. ఎడ్ల పందెములు ........ 259

108. పొట్టేలు పందెములు ........................................ 260
109. కోడి పందెములు ........................................ 261
110. పాములాళ్ళు ........................................ 263
111. కోయవాళ్ళు ........................................ 264
112. నాగోబా జాతర ........................................ 265
113. సమ్మక్క, సారలమ్మ జాతర ........................................ 270
114. బతుకమ్మ పండుగ ........................................ 274
115. రొట్టెల పండుగ, నెల్లూరు ........................................ 278
116. ప్రభలు ........................................ 282
117. కోటప్పకొండ ప్రభల సంస్కృతి ........................................ 286
118. తెప్పోత్సవాలు ........................................ 288
119. సేవ ........................................ 291
120. రుంజ వాయిద్యము ........................................ 292
121. కోలాటం ........................................ 295
122. పగటి వేషాలు ........................................ 301
123. జోగాట ........................................ 306
124. బుర్ర కథ ........................................ 307
125. హరికథ ........................................ 311
126. జంగందేవరలు ........................................ 313
127. బుడబుక్కలవాడు ........................................ 316
128. చెక్క భజనలు ........................................ 318
129. చిలక జోస్యం ........................................ 324

130. సోది ........................................ 326
131. ఎలుగుబంట్ల వేషాలు ........................................ 328
132. భోగం మేళాలు ........................................ 329
133. ఫకీరు వేషం ........................................ 330
134. వైకుంఠపాళి ........................................ 332
135. దాగుడుమూతలు ........................................ 335
136. ఒప్పులకుప్ప ........................................ 337
137. అచ్చనగండ్లు ........................................ 340
138. తొక్కుడుబిళ్ళ ........................................ 342
139. చెమ్మచెక్క-చారడేసి మొగ్గ ........................................ 343
140. ఓమన గుంటలు ........................................ 346
141. కుచ్చుకుచ్చు పుల్లాలు ........................................ 349
142. అవ్వా-అప్పచ్చా ........................................ 351
143. అప్పడప్పడ తాండ్ర ........................................ 352
144. ఒంగు దూకుళ్ళు ........................................ 353
145. గుజ్జన గూళ్ళు (బువ్వాట) ........................................ 331
146. బొంగరాలాట ........................................ 356
147. గోళీలాట ........................................ 358
148. కర్రా బిల్లా (చిల్లగర్ర ఆట) ........................................ 359
149. అష్టాచెమ్మా........................................ 361
150. గుడుగుడు గుంజం ........................................ 363
151. వన భోజనాలు ........................................ 366

152. పూర్ణకుంభం ........................................ 368
153. మామిడి తోరణాలు ........................................ 370
154. పట్టు వస్త్రములు ధరించుట ........................................ 373
155. కాళ్ళకి పారాణి ........................................ 374
156. దీపం పెట్టడం ........................................ 376
157. హారతి ........................................ 378
158. మంగళ హారతులు ........................................ 381
159. ముత్తయిదువకు బొట్టు పెట్టడం ........................................ 382
160. ప్రదక్షిణము ........................................ 383
161. నమస్కారము ........................................ 387
162. పంచాంగ శ్రవణం ........................................ 389
163. జానపదుల వివాహంలో కొన్ని ఘట్టాలు ........................................ 391
164. కనకాభిషేకము ........................................ 393
165. షష్టిపూర్తి వేడుక ........................................ 394
166. భీమ రథశాంతి వేడుక........................................ 396
167. విజయరథశాంతి వేడుక ........................................ 397
168. సహస్ర చంద్రదర్శన వేడుక ........................................ 398
169. అంత్యేష్టి........................................ 400

# 1. వేంకటేశ్వర స్వామికి ఎదురు నడుచుట



సాధారణంగా వివాహం సందర్భంగా కొందరు తమ కులదైవమైన వెంకటేశ్వర స్వామికి మ్రొక్కి వివాహపనులు ప్రారంభిస్తారు. వివాహానికి ముందుగానే వారు గతంలో మ్రొక్కినట్లు వేంకటేశ్వరస్వామివారికి ఎదురు నడిచి స్వామివారిని సేవించుకొంటారు. ఈ సందర్భంగా జరిగే తతంగం ఈ విధంగా సాగుతుంది.

వధువు పసుపునీళ్ళల్లో ముంచిన కండువా వల్లెవాటుగా వేసుకొంటుంది. వరుడు పసుపులో ముంచిన వస్త్రాలను ధరిస్తాడు.

అఖండ దీపారాధన కొరకు ఒక పొంగలి, పెద్దవాళ్ళ కొరకు ఒక పొంగలి రెండు గిన్నెలలో చేయబడుతుంది.

వడపప్పు, పానకం, చలిమిడి రెండు సెట్లుగా సర్దుకోవాలి. ఒక గిన్నెలో మూడు గిద్దల బియ్యములో రెండవ గిన్నెలో మూడు గుప్పిళ్ళు మాలక్ష్మమ్మకు పొంగలి చేయాలి.

కుటుంబంలో అందరూ తలస్నానం చేస్తారు. అప్పటి వరకు భోజనం చేయని నూతన వస్త్రాలు ధరించుకోవాలి. మగవాళ్ళు అందరూ నామం బొట్టు పెట్టుకొంటారు.

ఒక ప్లేట్లో పానకము, వడపప్పు, చలిమిడి, పండ్లు, పూలు, కొబ్బరి కాయ వీటిని  గుడికి తీసుకుని వెడతారు. ఒక సెట్ వడపప్పు ఇంట్లో అందరికీ పంచి, రెండవ సెట్ వడపప్పు గుళ్ళో అందరికీ పంచుతారు. పెండ్లికుమారునికి బుగ్గన చుక్క, పారాణి, నామము బొట్టు పెట్టాలి.

పెండ్లికుమార్తెకు బుగ్గన చుక్క, పారాణి, కల్యాణం బొట్టు పెడతారు. ముందుగా తల్లి పసుపు నీళ్ళు చల్లుతూ నడుస్తుంది. పెండ్లికుమారుడు పసుపు గుడ్డ కట్టిన చెంబు (హుండీ) పట్టుకోవలెను.

పెండ్లికుమారునికి తండ్రి తడి టర్కీటవల్ గుండ్రంగా చుట్టి దానిమీద ఖాళీ మూకుడు, పైన బొగ్గుల మూకుడు పెట్టి పట్టుకుని నడిచెదరు. ప్రక్కన ఒకరు సాంబ్రాణి వేస్తూ గోవిందా! గోవిందా! అంటూ గోవింద నామాలను జపిస్తూ నడుస్తారు.

ఎదురు నడుచుటకు బయలుదేరునప్పుడు వాకిట్లోకి రాగానే ఆడపడుచు వారుపోసి కర్పూరము వెలిగించి హుండీకి హారతి అద్దిన తరువాత నడువవలెను.

హుండీలో డబ్బులు వడ్డించిన స్త్రీలకు బొట్టుపెట్టి పండు లేదా పటిక బెల్లమును ప్రసాదముగా ఇచ్చెదరు. మగవారికి ప్రసాదము నిచ్చెదరు.

దారిలో ఎవరికైనా ఒళ్ళు పెరిగి స్వామి ఒంటిమీదకు వచ్చినచో పసుపు నీళ్ళు చల్లాలి. తగ్గకపోతే నాలుగు కొబ్బరికాయలు కొట్టవలెను. అందువలన కొన్ని కొబ్బరికాయలు వెంట తీసుకుని వెళ్ళవలెను.

అలా నడుస్తూ గోవిందలు కొడుతూ వేంకటేస్వర స్వామివారి గుడికి వెళ్ళి పూజ చేయించుకొని తిరిగి వచ్చెదరు. ఇంటి ముందుకు వచ్చిన తరువాత వారు పోసి ఆడపడుచు కర్పూరము వెలిగించి హుండీకి హారతి అద్దవలెను. మెయిన్‌గేట్ వద్ద ఒక గొలుసును అటు ఇటూ ఇద్దరు పట్టుకోవాలి. ఆ గొలుసు క్రిందనుండి ఇంట్లోకి రావలెను.

పెండ్లికుమారుడు హుండీని దేవుని మందిరం వద్ద ఉంచవలెను. హుండీలో వచ్చిన చిల్లర ఇంటి ఆడపడుచు 3 గుప్పిళ్ళు తీసుకోవలెను.

ఆడపిల్ల పెండ్లికి ఎదురు నడిచిన మొత్తం తిరుపతి హుండీలో వడ్డించాలి. హుండీలో వచ్చిన చిల్లరను కొత్త చేతిగుడ్డలో ముడివేసి దేవుడి మందిరంలో పెట్టి తిరుపతి హుండీలో వడ్డించాలి.

ఎదురు నడిచి ఇంటికి వచ్చిన తరువాత వరుని పెండ్లికుమారునిగాను, వధువును పెండ్లికుమార్తెగాను చేయుదురు.

సాధారణంగా ఈ తంతు ఈ విధంగా సాగుతుంది. కొన్ని ప్రాంతాలలో అప్పటి ఆచార వ్యవహారాలను బట్టి కొన్ని కొన్ని మార్పులు ఉంటాయి.

# 2. శ్రీ వెంకటేశ్వరస్వామికి అఖండ దీపారాధన వేడుక



**కావలసిన వస్తువులు :** మూకుడు, నూనె 250 గ్రా., ఎండుకొబ్బరి చిప్ప, మల్లుగుడ్డ అరమీటరు, నామము, తిరుచూర్ణము, సాంబ్రాణి.

మగపిల్లవాని పెండ్లి అయిన తరువాత శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతము చేసుకున్న తరువాత శ్రీవెంకటేశ్వరస్వామి వారికి అఖండ దీపారాధన చేయుదురు. ఇంటిలో పూజా మందిరంలో మట్టిమూకుడుకు పసుపురాసి, కుంకుమబొట్లు పెట్టి, ఆవునెయ్యి, నువ్వుల నూనె మూకుడులో వేసి, వెంకటేశ్వరస్వామి వారిని మదిలో తలుస్తూ, నూతన దంపతులు అఖండ దీపారాధన వెలిగించాలి.



ఈ సందర్భంగా ఐదుగురు బాలదాసులు అనగా పది సంవత్సరముల లోపు మగపిల్లలకు ముఖాన గోవింద నామములు పెట్టి, తుండ్లు, కట్టించి వారిని గోవిందునిగా భావించి వారిచేత గోవింద నామం జపింపచేయాలి. పిల్లలకు కొత్త టవలు పండు తాంబూలము ఇవ్వవలెను. ఐదుగురు ముత్తైదువులకు బాలదాసులకు విందు భోజనము ఏర్పాటు చేయాలి. ఆ తరువాత ముత్తైదువులకు జాకెట్టు వస్త్రము, పసుపు, కుంకుమ, తాంబూలం ఇవ్వవలెను.

ఒక మూకుడులో నిప్పులు తయారుచేసి పెండ్లికొడుకు పట్టుకొనగా, పెండ్లికూతురు సాంబ్రాణి వేసుకుంటూ భోజనములు వడ్డించిన తరువాత గోవింద నామం జపిస్తూ వారిముందు తిరగాలి. అనంతరం అందరూ భోజనము చేయవచ్చును.

# 3. శ్రీ వేంకటేశ్వర స్వామి ముడుపు



కలియుగ వైకుంఠ నాథుడు శ్రీవేంకటేశ్వరుడు కష్టంలో కడతేర్చే తమ దైవం అని భావించి స్వామివారికి తమ కోరికలు చెప్పుకొని పూర్వం ముడుపు కట్టేవాళ్ళు.

## ముడుపు అంటే ఏమిటి? ఎలా కట్టాలి?

వివాహం కోసం, వ్యాపార వృద్ధి కోసం, పిల్లల కోసం, ఉద్యోగం కోసం, ప్రమోషన్ కోసం, ఇల్లు కానీ స్థలం కానీ కొనడం అమ్మడం కోసం, ఉద్యోగం పొందటం కోసం, అనారోగ్యంతో ఉన్నవారికి బాగవ్వాలి అని, పంట నష్టం కలగకుండా చేతికి రావాలి అని, ఆటంకంగా ఉన్న

నిర్మాణం పూర్తి కావాలని .. ఇలా లేదా వారికి ఉన్న వ్యక్తిగత సమస్యల నివారణ కొరకు వేంకటేశ్వర స్వామికి ముడుపు కడతారు.

శ్రీవేంకటేశ్వరస్వామికి ముడుపు శనివారం రోజు ఉదయం నిత్య దీపారాధన చేసి ముందుగా వినాయకుడికి పూజ చేయాలి. మీ కోరిక చెప్పి స్వామికి ముడుపు కడుతున్న సంకల్పం నెరవేరాలి అని కోరుకొని, ఒక తెల్లటి బట్టకి పసుపు తడిపి ఆరబెట్టి.. ఆ బట్టకి నాలుగు వైపులా కుంకుమ రాసి అందులో 11 రూపాయలు లేదా మీరు మొక్కుకున్న ధనాన్ని స్వామివారిని స్మరించుకుంటూ పెట్టి మీరు ఎందుకు ముడుపు కడుతున్నారో మనఃస్ఫూర్తిగా భక్తిగా స్వామికి చెప్పుకుని డబ్బు పెట్టిన పసుపు బట్టని మూడు ముడులు వేసి స్వామి వారి ఫోటో ముందు పెట్టాలి. కోరిక తీరాక ముడుపుతో దర్శనానికి వస్తాను అని ముందే మాట ఇవ్వాలి,

శ్రీ వేంకటేశ్వర స్వామి అష్టోత్తరం, గోవిందనామాలు లేదా మీకు ఇష్టమైన స్వామివారి స్తోత్రాలు చదువుకొని స్వామికి హారతి ఇచ్చాక ముడుపుకి కూడా హారతి ఇవ్వాలి. ఆముడుపు మీపని అయ్యే వరకు స్వామివారికి ముందే ఉంచాలి. కోరిక తీరాక ఆ ముడుపు తీసుకొని తిరుమలకి దర్శనానికి వెళ్లి ముడుపుతో పాటు కొద్దిగా వడ్డీ కూడా కలిపి హుండీలో వేయాలి. ఇది భక్తితో, నమ్మకంతో చేసిన వారికి వారి వారి కోరికలు నెరవేరగలవు అని చెప్పబడుతుంది.

# 4. మాలక్ష్మమ్మ చెట్టువద్ద వేడుక



మనము నివసించే ఊరిలో మహాలక్ష్మమ్మ చెట్టు అని పూజలు అందు కునే వేపచెట్టు ఉంటుంది. ఆ దేవాలయం వద్దకు మేళ తాళములతో కొత్త దంపతులను తీసుకెళ్ళి ఆ దేవతా వృక్షానికి పూజ చేయించెదరు. అలాంటి అవకాశం లేనిచో ఒక పూలకుండీకి పసుపురాసి కుంకుమ బొట్లతో అలంకరించి, ఆ కుండీలో ఒక వేపకొమ్మపెట్టి ఆ కుండీ వద్ద నూతన దంపతులు దీపారాధన చేసి ఆ చెట్టుకు పూజచేయుదురు. ఆ తల్లికి పొంగలి, పండ్లు యారనాలు నైవేద్యము మొదలగునవి సమర్పిం చెదరు. ఆ యారనాలు ఏదైనా అమ్మవారి గుడిలో ఇవ్వవలెను.

# 5.యారనాలు వేడుక



పెండ్లికూతురు తల్లివాళ్ళు పెండ్లికొడకు వాళ్ళు నోము నోచుకొనునప్పుడు తీసుకు రావలసినవి.

పసుపు 1 కేజీ, కుంకుమ 1 కేజీ, సున్నిపిండి 1 కేజీ, కొబ్బరిచిప్పలు 100, ఏవైనపండ్లు 100, వక్క ప్యాకెట్లు 2 డజన్లు, ఆకులు 5 కట్టలు, ప్రదానములో వచ్చిన పళ్లెములు, అందరికి నూతనవస్త్రాలు. ఇవన్నీ కలిపి 11 పళ్ళెములలో సర్ది తీసుకురావలెను.

ఆడపడుచుకు సూటుకేసులో, చీర, జాకెట్టు, పసుపు కుంకుమలు, కుంకుమ బరిణె, కాటుక, దువ్వెన, అద్దము, పౌడరు, ఇవి అన్నీ ఆ సూటుకేసులో సర్ది ఉంచాలి.

# 6.నలుగు వేడుక



ఈ వేడుక కూడా ఇరువర్గాల వారు సంతోషంతో చేసుకునే వేడుక. ఆడపడు చులకు, వియ్యపురాలికి గంథము రాయటం సరదాగా వారిని ఆటపట్టించడానికి మిరపకాయలదండలు, సీమచింత గింజలదండలు, కుట్టుడాకుల టోపీలు, కూరగాయల దండలు, అప్పడాలు, వడియాలతో కడియాలు వంటి హాస్యపు పనులు చేస్తారు. వేడుకలు అయిపోయిన తరువాత ఒక సూట్‌కేసులో ఇతర అలంకరణ సామాగ్రి ఉంచి వియ్యపు వారికి అందిస్తారు.

# 7.గుమ్మం దగ్గర పేర్లు చెప్పే వేడుక



బావలు, బావమరదులు, వదినలు, మరదళ్ళు, ఆడ పడుచులు చేసే వేడుక ఇది. వివాహం అయిన తరువాత అత్తవారింట అడుగు పెట్టే ముందు కొత్త పెళ్ళికూతురు చేత గుమ్మం ముందు అందరు అడ్డంగా నిలబడి, సరదాగా ఆమె భర్త పేరును చెప్పమని అలాగే భార్య పేరును భర్తను చెప్పమని అల్లరి చేస్తారు. అలా చెప్పిన తరువాత లాంఛనంగా వారివద్ద నుండి కొంత డబ్బును తీసుకుంటారు.

# 8.మరదలు మాడ వేడుక

పూర్వము స్త్రీలు ధరించే బంగారు ఆభరణాలలో మాడ అనేది ఒక బంగారపు ఆభరణము. పెళ్ళిలో పెళ్ళికుమార్తెకు మాడ అనే ఆభరణం కూడా పెట్టి అలంకరించేవారు. ఆనాటి వేడుకలలో ఆ బంగారపు మాడను బావ, వదిన వరసలు అయినటువంటి వారు పెళ్ళికుమార్తెకు తెలియకుండా దాచి ఆమెను ఆటపట్టించేవారు. ఆ వేడుక ఈనాడు ఈ విధంగా మార్పు చెందింది. పెండ్లికుమార్తె అక్కచెల్లెళ్ళుకానీ, అన్నతమ్ముళ్లు గానీ పెళ్లికుమార్తెను ఒక గదిలో దాస్తారు. వరుడు తన భార్యను వెదికి ఎక్కడ ఉందో తెలుసు కోవాలి. ఆ సందర్భంగా బావగారికి నూతన వస్త్రాలు పెట్టి భార్యతో ఆనందంగా నడుస్తారు. ఇది బావమరదుల మధ్య అనుబంధం ఏర్పడటానికి ఈ వేడుక ఏర్పాటు చేసారు.

# 9.దొంగవేలం

ఇది పెళ్ళికొడుకు అత్తగారి ఇంటిలో జరిపే వేడుక. వధువు ఇంట్లో ఒక గడపపై వెండిగిన్నెలో మినప సున్నివుండను ఉంచుతారు. దానిని వరుడు దొంగిలించి ఎక్కడో దాస్తాడు. పూర్వం పెళ్ళి శుభకార్యాలలో ఆనందంగా చేసుకునే ఇదో వేడుక.

# 10.అలకపాన్పు వేడుక



గర్భాదాన సమయంలో పెండ్లికొడుకు అలిగి ఒక మంచంపై కూర్చుంటాడు. ఎవరేం మాట్లాడినా, ఏం చేసినా ఉలకుడు పలకడు. చివరకు తన మామగారు వచ్చి బ్రతిమిలాడతాడు. చివరికి అతని కోరిక ఆయనకు తెలియజేస్తాడు. అప్పుడు మామగారు అల్లుని కోరిక తీర్చడం గానీ, తీరుస్తానని మాటివ్వడంగాని జరిగాక అల్లుడు అలక మాని అందరితో ఆనందంగా గడుపుతాడు.

# 11.గర్భాదానం



షోడశ కర్మలలో మొదటిది, జీవి ఆవిర్భావానికి ముందే జరుపబడు ముఖ్యమైన సంస్కారం గర్భాదానం. గర్భాదానం వలన పిండోత్పత్తి జరిగి జీవి ఆవిర్భావానికి దోహదం చేస్తుంది. స్త్రీ పురుష (భార్యాభర్తలు) తొలి సమాగమ సందర్భములో మంచిబిడ్డని ఆశించి ఈ కార్యక్రమాన్ని జరుపుతారు. ఈ సందర్భములో చదివే మంత్రాలు కూడా సత్సంతానాన్ని కోరుకుంటున్నట్లుగా తెలియజేస్తాయి.

దీనినే వాడుక భాషలో ఫస్ట్‌నైట్ లేదా తొలిరాత్రిగా లేదా శోభనము అని అభివర్ణిస్తారు. గర్భాదాన క్రియనే వాస్తవిక వివాహమని కొందరు అందురు. కొన్ని ప్రాంతాలలో దీనిని బట్ట లిచ్చుట, గృహప్రవేశము చేయించుట, బల్దానము అని కూడా అంటారు.

ఈ కార్యక్రమము సామాన్యముగా వధువు ఇంట జరుగుట మన సంప్రదాయముగా వచ్చుచున్నది. మంచమును మల్లెపూలు, గులాబి, సంపెంగలతో అలంకరించాలి. మంచము మీద కొత్త దుప్పటి వేయాలి. 200 మూరల పూలతో అలంకరణ చక్కగా చేయాలి. గదిలో టేబులు మీద వస్త్రము వేసి, చిన్న పళ్ళెములలో 10 రకాల స్వీట్లు, రెండు కిళ్ళీలు పెట్టాలి. అత్తగారి వాళ్ళు ఐదు లేక తొమ్మిది పళ్ళెములలో స్వీట్స్, హాట్స్ తీసుకువస్తారు. అమ్మాయికి పసుపు కుంకుమ, స్వీటు, హాటు, ఆకులు, వక్కలు, కొబ్బరిబోండాలు, పూలు, పండ్లు, అరిశెలు, బిస్కెట్లు అందజేయాలి. వెండిగ్లాసుతోపాలు పెట్టాలి.

పాలు తప్పక ఇద్దరూ కలసి తాగవలెను. అమ్మాయికి తెలుపుచీర అత్తగారు పెండ్లికుమారునికి తెలుపు పంచెలు మామగారు ఇవ్వవలెను. దంపతులకు రాత్రికి భోజనము పెట్టిన తరువాత రూములో ఎదురు ఎదురుగా మంచము మీద కూర్చుండబెట్టి పాన్పువేసి సముహూర్తము వరకు చెండాట ఆడించాలి. తరువాత వారిచేత దంపతులకు తాంబూ లాలు ఇప్పించాలి. ఈ తాంబూలము అమ్మాయి వాళ్ళ జాకెట్టు వస్త్రము, తమలపాకులు, పండ్లు, వక్క, కొబ్బరి బోండాలు, దక్షిణ, కొత్తదంపతుల

చేత పాత దంపతులకు ఇప్పించవలెను. 5 లేక 9 మంది దంపతులకు ఈ విధంగా ఇప్పించవలెను. హారతి వెలిగించి వారి కళ్ళకు అద్ది పేర్లు చెప్పించి పురోహితుడు సూచించిన ముహూర్తమునకు నూతన దంపతులను గదిలో ఉంచి అందరూ గదినుండి బయటకు రావాలి.

## ఋణ విముక్తి కొరకు

సుసంతాన్ని పొందటం ద్వారా సమాజానికి తమ వంతు సేవ చేయటానికి, తాము తమకున్న మూడు రకాల ఋణాలను (దేవఋణం, ఋషి ఋణం, పితౄణం) తీర్చుకోవడానికి దంపతులు ఉమ్మడిగా చేసే సంస్కారం ఇది. సుసంతాన ప్రాప్తికోసం గర్భాదాన సంస్కారం నియ మితమైన మంచి రోజున జరగటం వల్ల దైవబలం కలిసి వస్తుందని భావన.

## దేవతలమని భావన

తల్లిదండ్రుల చిత్త వృత్తులు సంతానోత్పత్తి కాలములో ఎలా ఉంటాయో అటువంటి లక్షణాలు కలిగిన శిశువే జన్మిస్తారు అని నమ్మకము. కావున తల్లిదండ్రులు గర్భాదాన సమయమున తాము దేవతలమని, పతి ప్రజాపతి యొక్క అంశ గలవాడని, పత్ని వసుమతి రూపమని తలచి దేవతా చింతనము చేయుచు గర్భాదానము చేయవలెను అని శాస్త్రాలు చెబుతున్నాయి.

సంతానము మాత పితల యొక్క ఆత్మ, హృదయము, శరీరము నుండి జనించుచున్నది గదా! అందువలన తల్లిదండ్రుల దేహము (స్థూల,

సూక్ష్మ) లోని దోషములు బిడ్డకు సంక్రమించును. ఈ దోషము సంక్ర మించకుండా ఇందుకు అనువైన కాలమును నిర్ణయించుకొని సంతాన కాల మందు మనస్సు, శరీరమునందుగల పశుభావనను తొలగిం చుకొని సాత్త్వికమగు దైవ భావము కలిగియుండుట కొరకే ఈ గర్భాధాన సంస్కా రము విధింపబడింది.

## గర్భాదానమునకు తగిన శుభ కాలము

**శుభ నక్షత్రములు:**శ్రవణము ,రోహిణి ,అనూరాధ, స్వాతి, రేవతి, మూల, ఉత్తర, ఉత్తరాషాడ, ఉత్తరాభాద్ర, శతబిషము, ఇవి **మిక్కిలి శ్రేష్టము.** పుష్యమి, ధనిష్ఠ ,మృగశిర, అశ్వని ,చిత్త,పునర్వసు, ఇవి **మధ్యరకము.**

**తిధులు :** 2, 3 ,5 ,10.

**వారములు :** సోమ, బుధ, గురువారములు.

సంధ్యా పర్వత ప్రదోవ్రత శ్రాద్ధ రోజులు మంచివికావు.

**శుభ లగ్నములు :** వృషభ, కర్కాటక, కన్య, తుల, ధనుస్సు, మీన లగ్నములు. లగ్న శుద్ధి అష్టమ శుద్ధి తప్పనిసరి.

పంచపర్వములు, సంధ్యాసమయము, శ్రాద్ధ దినములు పనికిరావు.

విప్రులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అను నాలుగు వర్ణములలో మొదటి ముగ్గురికీ ద్విజులు అని పేరు, ద్విజులకు గర్భాధానాది సంస్కార ములను సమంత్రకముగా చేయవలెను అని యాజ్ఞవల్క్యుడు చెప్పెను.

# 12.పూలచెండ్లాట వేడుక



పెండ్లి అయిన తరువాత పెండ్లి కూతురు పెండ్లి కుమారుడు, భోజనము చేసిన తరువాత నేలమీద దుప్పటి పరచి ఇద్దరినీ ఎదురు ఎదురుగా కూర్చోబెట్టాలి. పెండ్లి కుమారుడు తూర్పు ముఖం పెట్టి కూర్చోవాలి. ముందుగా పూలమాల బంతివలె ఉండ చుట్టినట్లుగా చుట్టి చేండ్లాట ఆడించాలి. బంగారు గొలుసుతో ఆడించాలి. తరువాత సరిబేసి సంఖ్యల ఆట ఆడించాలి. 2, 4, 6, 8, 10, 12 ఇవి సరి సంఖ్యలు. 1, 3, 5,

7, 9, 11 ఇవి బేసి సంఖ్యలు. రూపాయి బిళ్ళలుకాని, వక్కలుగాని ఇద్దరికి 54 చొప్పున ఇవ్వాలి. అబ్బాయి కొన్నింటిని గుప్పిటలో పట్టుకుని సరియా, బేసియా అని అడిగినప్పుడు అమ్మాయి సరైన సమాధానం చెప్పిన అవి అమ్మాయికి వచ్చును. లేనిచో ఎన్ని ఉంటే అన్ని అమ్మాయి అబ్బాయికి ఇచ్చుకోవాలి. ఖాళీచేయి పెట్టినచో పుట్టి అందురు, దానికి 30 చొప్పున ఇచ్చుకోవాలి. అబ్బాయి అమ్మాయికి ఎడమచేతితో బొట్టు పెట్టవలెను. అమ్మాయిచేత అబ్బాయికి కుడిచేతితోబొట్టు పెట్టించాలి. అబ్బాయిచేత అమ్మాయికి గంధము పూయించాలి. అమ్మాయిచేత అబ్బాయికి చేతులకు గంధము పూయించాలి. పన్నీరుకాని స్ప్రేకాని ఒకరిపై ఒకరికి చల్లించాలి. ఒక అరటిపండు వలచి అబ్బాయి కొంత తినిన తరువాత మిగతా దానిని అమ్మాయిచేత తినిపించాలి.

ఈ వేడుక చాలా సరదాగా ఉండి నూతన దంపతులకు ఇద్దరి మధ్య బిడియం పోయి సరదాగా ఉంటారు. ఐదుగురు దంపతులకు తాంబూలము అందించవలెను. రెండు పండ్లు, ఆకులు, వక్కలు దక్షిణపెట్టి కొత్తదంపతులచేత తాంబూలం ఇప్పించవలెను. ఇక్కడ పాన్పుపై పరిచిన దుప్పటి ఆడ పడుచుకు చెందుతుంది. తన పుట్టింటిలోనికి మరొక స్త్రీ ప్రవేశించడం వలన తన గుర్తింపు తగ్గిపోతుంది, సోదరుడు తనకు దూరమౌతున్నాడని అను కోకుండా ఆడపడుచులకు అనేక సందర్భాలలో ప్రాముఖ్యం ఇవ్వటం తెలుగువారి పెండ్లి సంప్రదాయాలలో వేడుకగా, వాడుకగా వస్తుంది.

# 13. పెండ్లి కుమార్తెకు పుట్టింటివారి సారె



వివాహం అయిన 16 రోజుల లోపుగానీ, నెల లోపుగాని, 3వ నెల లోపల ఒక మంచి ముహూర్తము చూసుకొని అమ్మాయికి సారెపెట్టి పంపించాలి. అమ్మాయి వాళ్ళు 5 కేజీల చలిమిడి, 1 కేజీ పసుపు, 2 కేజీల సున్నిపిండి, 1/2 కేజీ కుంకుమ, అరటిపండ్ల గెల, మిఠాయి ఉండలు, దువ్వెనలు, అద్దములు, స్థోమత కొద్దీ ఇరుగు పొరుగువారికి

పంచుటకు కొన్ని వస్తువులు ఇవ్వవలెను. అత్తవారింట కుటుంబ సభ్యులు అందరికి వీలు అయినంత వరకు నూతన వస్త్రాలు పెట్టవలెను. చాకలికి, వారి ఇంటి పనిమనిషికి కూడా నూతన వస్త్రాలు ఇవ్వవలెను.

అమ్మాయికి చీరలు, లంగాలు, తువ్వాళ్ళు, దుప్పట్లు, గలేబులు, స్టీలు సామానులు, బొట్టుపెట్టె, అలంకరణ సామానులు, కంచము, గ్లాసు, వీలు అయినంత వెండి సామానులు, నగదు ఇవ్వవలెను.

అమ్మాయిని పీటపై తూర్పు ముఖంగా కూర్చుండబెట్టి చీర కొంగులో చలిమిడి, 2 జాకెట్టు ముక్కలు, చిల్లర డబ్బులు, కొబ్బరికాయ, పసుపు, కుంకుమ పెట్టాలి. అత్తగారి ఇంటినుండి అమ్మాయిని తీసుకొని వెళ్ళడానికి వచ్చిన వారికి నూతన వస్త్రాలు పెట్టాలి.

అమ్మాయితో పాటు మనవారు ఎవరో ఒకరు ఆమెతో పాటు వెళ్ళవలెను. సారె కూడా పెండ్లి విషయాలు మాట్లాడుకున్నప్పుడే సారె నిమిత్తము కూడా మాట్లాడుకోవడము మంచిది. లేదా మన శక్తిని బట్టి పెట్టవచ్చును. అమ్మాయికి సారె అనే శుభకార్యం తప్పక జరిపించాలి.

## నాలుగు స్తంభాలాట

**ఈ** ఆట ఆడుకునేందుకు ఇంటిలో నాలుగు స్తంభాలు ఉండాలి. ఈ ఆటను ఆడుటకు ఐదుగురు బాల బాలికలు ఉండాలి. ముందుగా పంటలను వేయాలి. పండని వారు దొంగ పెట్టాలి. నలుగురు నాలుగు స్తంభాల వద్ద ఉంటారు. స్తంభం దగ్గర ఉన్నవారు వేరొక స్తంభం వద్దకు మారాలి. ఈ మార్పు సమయంలో ఏ స్తంభమూ కూడా ఖాళీగా ఉండకూడదు. ఖాళీగా ఉన్న స్తంభాన్ని దొంగగా పెట్టిన వారు ఆ స్తంభాన్ని తాకినచో మిగిలిన వ్యక్తి దొంగగా పెట్టాలి.

# 14.మీదుకట్టే విధానము





ముందుగా గృహంలోని సింహద్వారమునకు మామిడి తోరణం కట్టవలెను. వరిపిండితో నేలపై పద్మం ఆకారంలో ముగ్గు వేసి, దానిపై పసుపు, కుంకుమలతో అలంకారం చేసి దానిపై క్రొత్త వస్త్రమును (పసుపుతో తడిపి నది) వేసి దానిపై కేజింపావు బియ్యం పోసి, జత తమలపాకులు ఉంచి దానిపై పసుపుతో చేసిన విఘ్నేశ్వరుని ఉంచి గణపతికి షోడ శోపచారములతో పెండ్లి కుమార్తె తల్లిదండ్రులు పూజ

చేయవలెను. తరువాత తిరగలికి పసుపురాసి కుంకుమ బొట్లు పెట్టి తిరగలి పిడికి తోరము కట్టి, ఒక ముత్తయిదువుచే తిరగలిలో 5 గుప్పెళ్లు సెనగలు పోసి విసరవలెను. ఈ విధంగా ఐదుగురు ముత్తయిదువులచే చేయించవలెను. తరువాత గణపతిని ఒక చిన్న పెట్టెలో ఉంచి బియ్యం, విసిరిన సెనగలు ఈ క్రొత్త టవలులో ఉంచి మూట కట్టి దేవునిగదిలో భద్ర పరచాలి. 16 రోజుల పండుగ రోజుగానీ, ఆ లోపుగానీ ఆ మూటను తీసి సెనగపప్పు బియ్యముతో ఉండ్రాళ్ళు చేసి గణపతికి నైవేద్యం సమర్పించి తరువాత అందరికి పంచిపెట్టవచ్చును. (ఆచారాన్ని బట్టి మినప వడియాలు కూడా పెడతారు). దీనినే మీదు కట్టే విధానం అంటారు.

# 15.పదహారు రోజుల పండుగ

పెండ్లి తరువాత 16వ రోజున వరుని ఇంటిలో వధూవరుల తల్లి దండ్రులు బంధుమిత్రులతో కలసి పదహారు రోజుల పండుగ అనే వేడుకను చాలా సంతోషంగా జరుపుకుంటారు. ఈ పండుగతో ఈ పెళ్ళితంతు కార్యక్రమం పూర్తి అయినట్లే !

అంకురార్పణ చేసినప్పుడు మూకుళ్ళలో మట్టిపోసి నవధాన్యాలు చల్లిస్తారు. ఆ మూకుళ్ళను ఇంటికి తెచ్చుకొని ప్రతిరోజూ నీరు పోయాలి.

అవి మొక్కలు మొలచును. ఆ మూకుళ్ళలో ఉన్న మట్టి తీసి మొక్కలను కడగవలెను. ఆ కడిగినమొక్కలను మూడు గుమ్మముల వద్ద రెండు వైపుల కొన్ని కొన్ని మొక్కలు ఉంచాలి.

శుభ్రము చేసిన మూకుడుకు పసుపురాసి కుంకుమ బొట్టుపెట్టి ఒక గిద్ద బియ్యము, పండు తాంబూలము, జాకెట్టు వస్త్రము, దక్షిణ పెట్టి పెండ్లికూతురుచేత ముత్తయిదువులకు ఇప్పించవలెను. ఆనాడు భోజనములో అట్లు వడ్డించాలి. భోజనము అయిన తరువాత పసుపు త్రాడుతో ఉన్న మంగళ సూత్రములు బంగారు గొలుసులోకి మార్చవలెను. పెండ్లిరోజున తాళిబొట్టుకు ఉన్న పసుపుతాడును పేని దానికి సూత్రము ఎక్కించి కట్టవలెను.

పెండ్లికూతురు వాళ్ళు పెండ్లికుమారునికి, తండ్రికి, తల్లికి నూతనవస్త్రాలు పెట్టవలెను. ఉదయమే నవ దంపతులకు హారతి పట్టి మంగళస్నానము చేయించాలి.

పెండ్లికుమారుడు స్నానము అయినాక దేవునివద్ద కూర్చొని ఉత్తర జంధ్యాలు, బటువు, కంకణము, తీయవలెను, వడిగట్టు బియ్యము అమ్మాయి వాళ్ళ బియ్యము అబ్బాయివారికి అబ్బాయి వారి బియ్యము అమ్మాయి వారికి ఇచ్చుకోవాలి. ఆ రోజు ఆ బియ్యముతో పొంగలిచేసి నైవేద్యము పెట్టవలెను. బటువు, కంకణము, ఉత్తర జంధ్యములు పెండ్లి కుమారుని సోదరికి అందజేయాలి.

# 16. పెండ్లికూతురును నెలలోపల పంపుట



తెలుపురంగు డిజైను ఉన్న కొత్త చీర తీసుకు రావాలి. భోజనాలు అయిన తరువాత ఇంటి మధ్యలో పీటవేసి, ఆ పీటపై తూర్పు ముఖంగా కూర్చోబెట్టి, కొత్త చీర ఆమెకు పెట్టాలి. ఆ చీర కట్టుకున్న తరువాత పీటపె కూర్చుండపెట్టి ఒడిలో మూడు ముద్దల చలిమిడి, పసుపు కుంకుమ, జాకెట్టు వస్త్రము, తాంబూలము, పండ్లు, పీచుతో వున్న కొబ్బరి కాయ, పూలు, ఐదు గుప్పిళ్ళు బియ్యముతో వడిలో పెట్టవలెను. ఈ విధంగా ఈ వేడుక జరిపించాలి.

# 17.ఆడపిల్లను కాపురానికి పంపుట



ఇంట్లో అందరికీ నూతన వస్త్రములు, గలీబులు, కంచము, జాకెట్లు, మేకప్‌బాక్స్, టవల్సు, గ్లాసు, లంగాలు, వెండి సామాన్లు, చేతిగుడ్డలు, వెండిబిందె, దుప్పట్లు, బకెట్టు, సూట్‌కేసు, కప్పులు, తెరలు, బొట్టుపెట్టె, బీరువా. చాకలికి, పనిమనిషికి, చీరలు అమ్మాయికి కావలసిన వస్తువులు యింకేవైనా ఇవ్వవచ్చును. కొత్తచీర కట్టుకున్న తరువాత వడిలో వడిబాలు, పసుపు కుంకుమ, గాజులు, తాంబూలము పెట్టి వడిలో అద్దాలు 5, సబ్బులు 5, పౌడరు డబ్బాలు 5, దువ్వెనలు 5, బొమ్మలు 5, కుంకుమ బరిణెలు 5, కాటుక కాయలు 5, గంధపు డబ్బాలు 5, షాంపూ సీసాలు 5 మొదలైనవి 9 రకాలుగా పెట్టి ఒడి నింపవలెను. పసుపు చెంబుచేతికి అందించాలి. కాపురానికి పంపునపుడు కంచము ఇవ్వకూడదు. తరువాత ఎప్పుడైనా ఇవ్వవచ్చును.

# 18. చలువ కావిడ



పెండ్లి అయిన సంవత్సరములో వచ్చే ఎండాకాలములో అల్లుడు గారికి చలువ కావిడి అనే వేడుక జరిపిస్తారు. తాటి ముంజలు, సపోట, కరబూజ, పుచ్చకాయ, బత్తాయిలు, ద్రాక్ష మొదగు ఫలాలు అందజేస్తారు. స్థోమత కలిగినవారు వెండివి, పండ్లుకూడ ఇవ్వవచ్చును. ఆ సందర్భంలో అల్లుడుగారికి నూతన వస్త్రములు కూడా అందజేయాలి.

# 19. ఆషాడపట్టి

ఆషాఢ మాసంలో అల్లుడుగారికి ఆషాఢపట్టి అని అత్తింటివారు ఈ వేడుక జరిపిస్తారు. సిరాబుడ్డి, పెన్ను, గోలీలు, బంగారము, పచ్చీసు, కీ చైన్లు, జేబులో పెట్టుకొనుటకు పర్సు, వెండి వస్తువులు, అబ్బాయికి నూతన వస్త్రములు, పండ్లు, తాంబూలాలతో వారికి అందజేస్తారు.

# 20. శ్రావణ పట్టి

ఇది శ్రావణ మాసంలో అమ్మాయి తల్లిదండ్రులు జరిపిస్తారు. వెండి గోరింటాకు గిన్నె, పుల్ల, గ్లాసు, వామనగుంటల పీట, గవ్వలు, లక్ష్మీరూపు, లక్ష్మీ విగ్రహము, పూలు, పండ్లు అమ్మాయికి చీర, జాకెట్టు, పూజ సామాను, మరికొన్ని బంగారపు వస్తువు ఇచ్చి ఈ వేడుక జరుపుకుంటారు. దీనినే శ్రావణ పట్టి అందురు.

# 21.పుంసవనం



గర్భాదానం తరువాత చేయు సంస్కారమే పుంసవనము. 'పుంసవనం' అంటే మగబిడ్డ జననానికి ఆత్రపడటం అర్థం.

స్త్రీ గర్భం ధరించినట్లు రూఢి అయిన తర్వాత ఆమెకు కుమారుడు పుట్టాలని చంద్రుడు పురుషరాశిలో ఉన్నప్పుడు జరిపే సంస్కారం పుంసవనం. గర్భిణీ స్త్రీ ఆ రోజంతా ఉపవాసముంటుంది. ఆ రాత్రికి మొలకెత్తిన మర్రి విత్తనాలను నూరి ఆ రసాన్ని **"హిరణ్యగర్భ:..."** అని మంత్రాలు చదువుతూ ఆమె కుడి ముక్కులో వేస్తారు. చంద్రుడు పురుష రాశిలో

ఉన్నప్పుడు ఇలా చేయడం ద్వారా దృఢకాయుడు, ఆరోగ్య వంతుడైన కుమారుడు పుడతాడని నమ్మకం.

ఒకప్పటి సమాజమున పుత్రోదయమునకు నాటి పరిస్థితుల దృష్ట్యా గణనీయ స్థానము ఉండేది. తండ్రి రుణ విమోచనముకే కాకుండా యుద్ధాదులందు పురుషులు పాల్గొనే విధానము బట్టి కూడా పురుష సంతానమునకు అగ్రతాంబూలము ఉండేది. ఒక వేళ స్త్రీ సంతతి కలిగిననూ మహోత్తర పురుషులు వీరికి కలుగుదుగాక అనే ఆశాభావము కూడా ఇందు కనుపించుచున్నది.

## పుంసవనము చేయవలసిన తిథులు

విదియ, తదియ, పంచమి, షష్టి, సప్తమి, అష్టమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి, పౌర్ణమి అనుకూలమైన తిథులు.

## పుంసవనము చేయదగు నక్షత్రములు

హస్త, మూల, శ్రవణం, పునర్వసు, మృగశిర, పుష్యమి, రోహిణి, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర, స్వాతి, అనురాధ, అశ్వని.

## పుంసవనము చేయదగు వారములు

సోమవారం, బుధవారం, గురువారం, శుక్రవారం

## పుంసవనము చేయదగులగ్నములు

వృశ్చిక, సింహరాశులు తప్ప మిగిలిన లగ్నములన్నీ పుంసవనము నకు పనికివస్తాయి.

సప్తమ నవమరాశులు, శుద్ధిగగల లగ్నమును నిర్ణయించుకొని పుంసవనము చేసినచో సంస్కార ఫలము పొందుదురని చెప్పబడుచున్నది.

## పుంసవన సంస్కారం చేయు విధానము

ప్రాతః కాలమున స్వాధర్మ విదిత విధులు పూర్తిచేసిన తరువాత గణపతి పూజ, పుణ్యాహవచనం గావించి, పుంసవన సంస్కారము కొరకు సంకల్పించవలెను. భార్యను తన కుడి వైపు కూర్చోబెట్టుకొని, రక్షాబంధనము (కంకణము) కట్టవలెను.

ఎనిమిది సంవత్సరములు గల కన్యచే మఱ్ఱి చెట్టుకు గల జంట పండ్లు ఉన్న కొమ్మ చిగురును నూరించి ఒక తెల్లని కొత్తవస్త్రములో రసమును వడగట్ట వలెను.

గర్భవతిని పడమర ముఖముగా కూర్చోబెట్టి శిరస్సును తూర్పునకు ఉండునట్లు తలను పై కెత్తి భర్త ఆ రసమును కుడి చేతి బొటను వ్రేలుతో భార్య కుడి ముక్కు రంధ్రమున పిండవలయును. ఆ స్త్రీమూర్తి ఆ రసమును ఉమ్మి వేయరాదు.

ఈ సందర్భములో ఈ క్రింది అర్థముగల మంత్రములను చదువుతారు. పది మాసములు భరించి, శిశువును కనుటకు ఈ పది వ్రేళ్ళతో నిన్ను అంతటా తాకుచున్నాను. సోమరసము ఎట్లు జారుచున్నదో, సముద్రము గాలిచే కదలునో అట్లే నీ గర్భము నుండి శిశువు బయటకు

వచ్చుగాక, ఆయుస్సు, వర్చుస్సు, కీర్తి, పరాక్రమము, ఆహారమును తినుటయందు పటుత్వము కలిగియుండుగాక. శిశువు అపాయము లేనిదై నీకు అపాయము కలుగకుండుగాక.

మిత్ర, వరుణ, అగ్ని, వాయువు అశ్వని దేవతలు మొదలైన దేవతల ప్రార్ధన మంత్రాలతో భర్త భర్య యొక్క నాభి ప్రదేశమును తాకవలయును. ఆ సమయమున భర్త భార్యతో మనకు పుట్టబోవు సంతానము మంచి ఆయుష్షు, వర్చుస్సు, కీర్తి, పరాక్రమము, పటుత్వము కలిగిన వాడు కావలెను అని చెప్పి దేవతలను ప్రార్ధించవలెను.

అంతేకాక ప్రసవ సమయములో శిశువునకు కానీ నీకు కానీ ఎటు వంటి అపాయము కలగకుండా ఉండుగాక అని భార్యతో చెప్పి దేవతలను ప్రార్ధించవలెను.

తరువాత ఆవుపాలు,పెరుగు, నెయ్యి సమభాగములలో కలిపి అందు ఒక గోధుమ గింజను రెండు మినప గింజలను ఉంచి మనకు కలుగబోవు సంతానము పురుష సంతానము కావలెను అను భావనతో భార్యచే త్రాగించవలను.

## స్త్రీ గర్భము దాల్చిన ప్రతిసారి ఈ విధి అవసరమా?

మొదటి సంతానమునకు మాత్రము 4వ నెలలో ఖచ్చితముగా చేయవలెను అని చెప్పబడుతుంది.

# 22.సీమంతం



తల్లి సౌభాగ్యాన్ని, పుట్టబోయే బిడ్డ దీర్ఘాయుష్షును కోరుతూ చేసేది సీమంతం అనే సంస్కారం. కడుపులోని బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగడానికి తల్లి శారీరక, మానసిక ఉల్లాసం ఎంతో అవసరం. అందుకోసం ఆమె, ఆమె భర్త పాటించవలసిన నియమాలు ఈ సంస్కారంలో భాగంగా ఉన్నాయి. వాటిలో ఒకటి దోహదం (అంటే గర్భిణీ స్త్రీ భర్త ఆమె కోరిక ఏమిటో తెలుసుకుని తీర్చడం).

సీమంతం అంటే పాపిడి తీయడమని అర్థం. అంటే ఆ సమయంలో భర్త ఆమెను అంత అపురూపంగా చూసుకోవాలని అర్థం.

గర్భిణిని అమంగళకరమైన శక్తులు ఆవహించి ఉండునని, వానిని నివారించుటకై ఈ సీమంత సంస్కారము ఉన్నట్లు తెలియుచున్నది. అశ్వలాయన స్మృతి ప్రకారము రుధిరాశన తత్పరులైన రాక్షస శక్తులు ప్రథమ గర్భమును తినుటకు వచ్చుదురు. భర్త ఆ రాక్షస శక్తుల నుండి

తన భార్యను రక్షించుకొనుటకై శ్రీని ఆవాహన చేయవలెను. అందు కొరకు ఈ సంస్కారము చేయవలెను అని అశ్వలాయన స్మృతి చెప్పుచున్నది.

ప్రాక్సూత్ర కాలమున సామవేదమంత్ర బ్రాహ్మణమున సీమంత ప్రస్తావన ఉన్నది. దాని ప్రకారము సీమంత సంస్కారము చేయుచు భర్త ఈ విధముగా చెప్పబడినది. "ప్రజాపతి మహైశ్వర్యము కొరకు ఏ విధముగా అతిథియొక్క సీమను నిర్ధారణ చేసెనో అట్లే సంతతి యొక్క దీర్ఘాయుష్య కొరకు ఈమె (భార్య) కేశములను విభజించుచున్నాను లేక సంవారణము (సీమానం నయామి) చేయుచున్నాను. పుత్ర పౌత్రాదులను కలిగించి నా ముసలితనము వరకు దీర్ఘజీవిగా చేసెదను". ఇచ్చటనే ఉదుంబ వృక్షముతో స్త్రీకి పోలిక చెప్పబడినది. అనగా బహు సంతతి కలిగిన స్త్రీకి ఉదుంబవృక్షముతో పోలిక కలిగినది. అటు తర్వాత భర్త దేవతలను ప్రార్థించి గర్భదోషములు తొలగింజేయు, భవిష్యత్ సంతాన కళ్యాణమునకై గర్భపోషణ చేసే నేతితో చరుపాక ప్రదర్శనము మొదలగు క్రియలను చేయును.

ఇది గర్భాకాలమున ఆరవనెలన గాని, ఎనిమిదవ నెలనగాని జరుపవలెను (దేశకాలమానములు బట్టి ఇవి వేర్వేరుగా ఉండవచ్చును). జ్యోతిష గ్రంథములను అనుసరించి శిశు జన్మము జరిగేంత వరకు వీలగు సమయములో ఈ సంస్కారము చేయవచ్చునని చెప్పబడినది.

## సీమంతంలో పాటించాల్సిన విధానాలు

గాజులు ఎరుపు, పచ్చ రంగు సహజంగా వేసుకుంటారు. నలుపు, నీలం రంగు గాజులు తప్ప మిగిలిన ఏ రంగు గాజులు అయిన

సీమంతంలో వేసుకోవచ్చు. చేతినిండుగ 20, 21, 25 ఉండేలాగా వేసుకోవాలి. ప్రసవం అయ్యేవరకు కూడా ఈ గాజులు వుండాలి. దీని వలన నాడి మీద వత్తిడి పడి సుఖ ప్రసవం అవటానికి అవకాశం వుంటుంది అని నమ్మకము. 7, 12 సంఖ్య ఉండకూడదు. 13 గాజులు ధరించటం మంచిది. సంఖ్యతో సంబంధం లేకుండా ఎంత ఎక్కువ గాజులు వేసుకుంటే అంత మంచిది. యవల మొలకలతో చేసిన మాల/ దండ గర్భవతి మెడలో వేయాలి. భర్త భార్యకి ఏరు పంది ముళ్ళుతో పాపిడి తీయాలి.

## సీమంతము చేయు విధానము

ప్రాతః కాలమున గణపతి పూజ, పుణ్యాహవాచనము చేసి, రక్షా బంధనమైన తరువాత ఈ సంస్కారము ఆరంభమగును. 'ధాతా దదాతు' అను ఎనిమిది హోమములు కర్త చేయును. అగ్నికి పడమరగా భార్యను తూర్పు ముఖముగా ఉండునట్లు కూర్చోపెట్టాలి. మూడు మచ్చలుగల ఏదుపంది ముల్లుతో (మొదట నలుపు, ఎరుపుతో కూడిన నలుపు, తెలుపు రంగు) మూడు బర్హిస్సు కట్టలతోను, బ్రహ్మమేడిపండ్ల గుత్తితోను అనగా ఇవన్నీ కలిపి కట్టతో పాపిడిపైకి తీసుకురావలెను. తరువాత 'రాకా మహగ్ం' మొదలైన మంత్రాలు చదువుదురు. "పూర్ణిమను పిలుచు చున్నాను. ఈ పనిని నెరవేరునట్లు చేయవలసినది. మంచి బుద్ధి దాన గుణము కలిగిన కుమారుని ఇచ్చుగాక" అని పై మంత్రమునకు అర్థము. పైన చెప్పిన కట్టతో బొడ్డు నుంచి ప్రారంభించి పైకి కదుపుతూ తలపైన పాపిడి వరకు తుడిచి దానిని పారవేయవలయును. తరువాత "యౌగంధరి .. "

మొదలైన మంత్రములలోని చరిత్రను పాడవలసినదని వీణా గాయకులను ఆజ్ఞాపింతురు. తరువాత మొలకెత్తిన యవధాన్యమును దారమునకు దండగా గుచ్చి గర్భిణి కొప్పుకు కట్టుదురు. భార్యాభర్తలు ఇద్దరు నక్షత్రములు కనపడు వరకు మాట్లాడకుండా తూర్పుగాకానీ, ఉత్తరమువైపునకు గాని నడిచి ఆవుదూడను తాకి అప్పటి వరకు పాటించిన మౌనమును వదలి మాట్లాడుకొనవచ్చును.

కొన్ని ధర్మశాస్త్రములలో గర్భిణికి దగ్గరగా ఉన్న బ్రాహ్మణ ముత్తైదులు మంగళసూచకములైన వాక్యములను చెప్పవలయును అని ఉన్నది. అనగా ముత్తైదువలు "నీవు వీర పుత్రునకు తల్లివి అవుదువుగాక, జీవ పుత్రులను కలిగి ఉండెదవు గాక !" మొదలైన వాక్యములను చెప్పుదురు. ఈ వాక్యముల వలన తల్లిపై మరియు కలుగబోవు శిశువుపై మంచి ప్రభావము చూపును అని నమ్మకము. ఈ సందర్భములోనే కోడ దూడను తాకవలయును అనుట పురుష సంతతికి ప్రతీకగా చెప్పుదురు.

నీటిలో బంగారము పూసిన కంచుపాత్రను భర్త భార్యకు చూపుతూ ఏమి చూచుచున్నావు అని అడుగగా, సంతానమును, ఆయుర్దాయమును చూచుచున్నాను అని భార్యతో అనిపించవలెను అని జైమిని గృహ్యా సూత్రములలో కలదు. ప్రస్తుత సీమంత సంస్కారములో పైన చెప్పిన ఆచారములు చాలా వరకు లోపించినవి. పువ్వులు పెట్టుట, గాజులు తొడుగుట మొదలైన ఆచారములను నేడు పాటించుచున్నారు. కొన్ని ప్రాంతాలలో 8వ నెలలో మేడిపండ్ల గుత్తులను కట్టుట మొదలైన ఆచారమును నేటికి పాటించుచున్నారు.

# 23.వెన్నెల భోజనముల వేడుక

ఈ వేడుక అమ్మాయికి తొమ్మిదోనెల వచ్చిన తరువాత దశమినాడు పౌర్ణమి లోపు ఏదో ఒక రోజు ఈ వేడుక జరుపుకోవాలి.

**స్వీటు :** పంచదారతో చక్కెర పొంగలి, కోవా, కాజుబర్ఫీ, హల్వా పిండి ముక్కలు, గడ్డి జున్ను, హల్వా, సగ్గుబియ్యం లేక సేమియా పాయాసం

**హాటు :** కొబ్బరి అన్నము, ఫ్రైడ్‌రైస్, కట్టెపొంగలి, దద్దోజనము.

**కూరలు :** క్యాబేజి కూర, కాలీఫ్లవరు పసుపు లేకుండా వండవలెను.

**చట్నీ :** కొబ్బరి పచ్చడి, ఉల్లిపాయ పెరుగు చట్నీ.

**పులుసు :** పెసరకట్టు పసుపు లేకుండా, సగ్గుబియ్యం వడియాలు.

మేడపైన గానీ, ఓపెన్ స్థలములో గానీ, భోజనములు ఏర్పాటు చేయాలి. భోజనాలలో అందరిముందుర అన్ని తినుబండారాలు వడ్డించిన తరువాత ఒకసారి అన్ని లైట్లు ఆపివేయాలి. అప్పుడు చంద్రుని వెన్నెల తెల్లటి, చల్లటి వెలుతురు భోజనముల పైనపడును. అందరు తెలుపు డిజైను చీరలు కట్టుకుందురు. కడుపుతో ఉన్న అమ్మాయి పక్కన మరొక గర్భిణి ధరించిన అమ్మాయిని భోజనము చేయునప్పుడు కూర్చుండపెట్టుదురు. ఆ సమయంలో ఆమెకు ఒక ఉయ్యాల కానుకగా ఇవ్వాలి. ఆ వేడుక సమయములో కడుపుతో ఉన్న ఆడపిల్లలను బంతిలో వరుసగా కూర్చుండపెట్టవచ్చును. ఊయలలు అందరికి ఇవ్వవచ్చును. లేనిచో ఐదుగురికి అయినా ఇవ్వవచ్చును. స్తోమతను బట్టి వెండివి లేక చెక్కవి ఏవైనా ఇవ్వవచ్చును.

# 24.జాతకర్మ



పది నెలలు తల్లి గర్భంలో ఉండి ఈ ప్రపంచానికి వచ్చిన జీవికి జరిపే తొలి సంస్కారం ఇది. బిడ్డ ఆరోగ్యానికి ఉద్దేశించినది. శుచి శుభ్రతలు ఈ సంస్కారంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి.

శిశువు పుట్టిన వెంటనే వర్ష, తిథి, మాస, నక్షత్ర, యోగ, కర్మ, లగ్న, భావ, స్థితి మొదలగు వాటిని అనుసరించి మరియు గ్రహదృష్టిని, విగ్రహ దృష్టిని, శిశువు దృష్టిని, తల్లిదండ్రుల దృష్టిని, పేషికాస్థితిని

అనుసరించి శుద్ధి కొరకు శాంతి కొరకు భవిష్య భాగ్యోదయం కొరకు చేయునది జాతకర్మ.

శిశువు జన్మించిన వార్త వినగానే జాతక కర్మ చేయాలని ధర్మ శాస్త్ర వచనాలు చెబుతున్నాయి. అదికూడ బొడ్డుకోయుటకు ముందే జరగవలెనట. నాభిచ్ఛేధం తరువాత తండ్రికి జాతాశౌచం ప్రారంభమవుతుంది. కనుక అంతకుముందే జాతకకర్మ తండ్రి నిర్వహించాలని ధర్మ శాస్త్రాలు చెబుతున్నాయి. కనుక ఆడ శిశువుకైన మగశిశువుకైన జన్మించిన వెంటనే జాతకకర్మ చేసే ఈ పద్ధతిలో తిధి వార నక్షత్రాలతో గాని ముహూర్త బలంతో గాని సంబంధం లేదన్న మాట. ఏ కారణం చేతనైన అప్పుడు జాతకర్మ కుదరకపోతే ఆ తరువాత చేయవలసినప్పుడు మాత్రం తిధి వార నక్షత్రాదులను చూసి ముహూర్తం నిర్ణయించవలెను.

జాతకర్మలో బొడ్డుతాడు కోసే ముందు చేసే సంస్కారాలలో భాగంగా జరిపే తంతులు చాలా ఉన్నాయి. గర్భము నందు శిశువు చేయు గర్భ జల పాన దోషము తొలగుటకు ఈ సంస్కారము చేయుదురు.

## మేధాజనన

బలానికి, తెలివితేటలకు ప్రతీకలైన నెయ్యి, తేనెలను ఒక సన్నని బంగారుదారంతో శిశువు నోటికందిస్తారు. దీన్ని పిల్లల పట్ల తాము నెరవేర్చవలసిన మొట్టమొదటి బాధ్యతగా తల్లిదండ్రులు భావిస్తారు. హిందువులు పిల్లల తెలివితేటలకు ఎంత ప్రాధాన్యతనిస్తారో ఈ సంస్కారం ద్వారా మనకు తెలుస్తుంది.

ఈ సంస్కారంలో మొదట తండ్రి యవపు పిండి, బియ్యపు పిండి తరువాత బంగారముతో రుద్దబడిన తేనెను, నెయ్యిను అప్పుడే పుట్టిన బిడ్డ యొక్క నాలుకకు తాకించవలెను. ఈ సమయమున తండ్రి – "ఈ అన్నమే ప్రజ్ఞ, ఇదియే ఆయువు, ఇదియే అమృతము. ఇవన్నియు నీకు ప్రాప్తించును గాక. మిత్రావరుణులు, అశ్వినీదేవతలు, బృహస్పతి నీకు మేధనొసగు గాక" అన్న అర్థము గల మంత్రము పఠించును. భూమిపైకి వచ్చెడి తరుణము నందు మిక్కిలి కష్టము గలుగుట వలనను, మహా మాయా మోహము ఆవరించుటవలనను శిశువు స్మృతి కోల్పోవును. అట్టి స్మృతిని తిరిగి కలిగించుటకే ఈ మేధాశక్తిని కలిగించే ప్రక్రియ చేయబడును. మొత్తం మీద ఈ జాతకర్మ వలన ఉపపాతకములు (తల్లిదండ్రుల శరీరముల నుండి ఆపాదించిన దోషములు) నశించి తీరును అని చెపుతారు.

బిడ్డపుట్టిన 36 గంటల లోపున బిడ్డతండ్రి బిడ్డ ముఖారవిందమును చూచును. అంతట నాతడు స్నానముచేసి వచ్చి బిడ్డను వడిలో కూర్చుండ బెట్టుకొని జాతకర్మ మొనర్చును. అప్పడే అతడు శిశువు దీర్ఘాయువునకై యోగక్షేమములకై దానధర్మము లొనర్చును. ఈ సందర్భములో కొన్ని ఋగ్వేద మంత్రముల అతడు వల్లించును. ఆవిధముగా ఆ కాలపరిమితిలో అది జరుగనిచో పురుడు వెళ్లువరకు జరుగుటకు వీలులేదు. పురుడు మనదేశములో 10 రోజులు పట్టుదురు. 11వ రోజున బాలింత శుద్ధి స్నానమొనర్చును.

# 25.పురిటి స్నానము వేడుక

అమ్మాయి చేతికి పండు తాంబూలము, అందించి ఒక చిన్నసైజు స్టూలుకు నాలుగు వైపులా పసుపు ముద్దలు పెట్టాలి. స్టూలు పై అమ్మాయిని కూర్చుండ బెట్టాలి. ఒక కండువా లేక లుంగి ఎడమ భుజము మీదుగా...కుడిచేతి కిందకు రానిచ్చి ముడివేయుదురు. దీనిని కొాలు వస్త్రము అంటారు.

## పురిటిస్నాన విధానము

అమ్మాయికి నువ్వుల నూనె రాసి నలుగుపెట్టి తలంటి పోయాలి. పసుపు ముద్దలతో ఒళ్ళు తోమాలి. ఒక ముద్ద తరువాత ఒకటి, వేడినీళ్ళలో పసుపు, వేపాకు కలపాలి. మామూలు కాన్పు అయితే చిన్న తెపాళతో నీళ్ళు పొట్టమీదకు విసిరి పోస్తారు.

స్నానము అయిన తరువాత కొాలువస్త్రము పిండి, తెలుపు రంగు చీర కట్టించాలి. గిద్ద బియ్యము, పెసర పప్పు కలిపి అన్నము వండాలి. దీనిని పులగం అంటారు. ఒక పళ్ళెములో విస్తరాకు వేసి పులగము అన్నము మూడు చిన్న ఉల్లిపాయలు, నల్లకారము, బెల్లపుముక్క, పండు తాంబూలము ఆ విస్తరిలో పెట్టి ఆ ప్లేటును దొడ్లో పెట్టవలెను. బాలింత స్నానము అయిన తరువాత కొల్లువస్త్రము చాకు పట్టుకుని గ్లాసులో

మజ్జిగ పోసి అందులో వేపాకు మండ వేసి ధారగా వారు పోస్తూ సూర్య నారాయణ మూర్తి ఈ మజ్జిగ చుక్కలు తీసుకొని పాలచుక్క మాకివ్వు స్వామీ! ఏటా బాలింత ఏటా శూలింత అంటూ సూర్యభగవానునికి నమస్కారము చేయించవలెను. ఈ విస్తరిలో ఉంచిన అన్నం చాకలికి యివ్వవలెను.

బాబు లేక పాపకు స్నానము చేయించిన తరవాత వడ్లజల్లెడకాని, చాటలో కాని మెత్తని తెలుపుచీర వేసి పరుండపెట్టవలెను. పుణ్యాహ వచనము అయ్యేదాకా 13,15,17,19 రోజులలో నలుగుపెట్టి వరస స్నానము చేయించాలి. తలస్నానము అవసరములేదు. 21 రోజున నలుగుపెట్టి తలస్నానముచేసి పొంగలి వండాలి. దేవునికి దీపారాధనచేసి పొంగలి నైవేద్యము పెట్టి పూజచేయాలి. ఆ విధంగా చేసిన తరువాత పూర్తి పురుడు పోయినట్లు. నెలలోపల ఒకసారి బాబు లేక పాపని గుడికి తీసుకువెళ్ళి స్వామివారి దర్శనం చేయించాలి.

బిడ్డ స్నానము అయిన తరువాత తల్లి స్నానముచేసి సూర్యునకు నైవేద్యము పెట్టి నమస్కరించే దాక బాబును చూడరాదు. ప్రసవించిన తరువాత 3, 5, 9 రోజులలో ఏదో ఒకరోజు ఒక కాటన్‌చీర మామగారు కోడలుకు ఇవ్వవలెను. ఆ రోజు ఆ చీర కట్టుకొనవలెను. తరువాత ఈ చీరెను బాబుకు పక్క చీరగా వాడుకొనవచ్చును లేక బాలింతకట్టు కొనవచ్చును. మామగారు లేని వాళ్ళు భర్తచేతితో ఇవ్వవలెను.



## ఆరవరోజే కీలకం

బ్రహ్మదేవుడు 60 సంవత్సరములు ఆయుష్షు ఇవ్వగలను కాని ఆరవ రోజు నా చేతకాదు అంటాడు. ఐదవరోజు సాయంత్రం 5, 6 గంటల నుండి ఇలా అనుకొనవలెను. బ్రాహ్మణుడి కూతురు మాదిగవాని పెళ్ళాం ఎవరమ్మ ఏరుదాటి మా ఇంటికి రాకమ్మ అని. ఆరవ రోజు ఉదయం వరకు అనుకుంటూ ఉండాలి. ఆరవ రోజు మాత్రం బాబును ఏ కొంచెము సమయము కూడా ఒంటరిగా ఉంచరాదు.

హస్త, మృగ, అనూరాధ, రోహిణి, రేవతి, అశ్వని, ఉత్తర, ఉత్తరాషాఢ, ఉత్తరాభాద్ర, స్వాతి నక్షత్రాలు, ఆది,మంగళ, గురువారాలు మంచివి. స్నానం 11, 13, 15, 17, 19 రోజులలో చేయించాలి.

# 26.పిల్లల స్నానం తరువాత



స్నానం ముగించేటప్పుడు ఆ పాత్రలో అడుగున కొన్ని నీళ్ళు ఉంచి, చెంబులో కొన్ని నీళ్ళు తీసుకొని పిల్లల చుట్టూ మూడు సార్లు తిప్పుతూ ఈ క్రింద చెప్పినట్టు అంటారు.

**జోత పోత జోన్నారి పోత,**
**(బాబు/పాప పేరు చెప్పి)**
**చూసిన వాళ్ళంతా రోత రోత**

(అంటూ పిల్లల చేతిని దండం పెడుతున్నట్టు దగ్గరగా తీసుకొని వచ్చి) రాజరాజేశ్వరుడికి జేజ, తిరుపతి వెంకన్నకు జేజ, అలమేలు మంగమ్మకు జేజ, పద్మావతికి జేజ, ముక్కోటి దేవతలకు జేజ, ముక్కోటి దేవతలకు జేజ, ముక్కోటి దేవతలకు జేజ అనాలి.

లేదా ఈ క్రింద విధంగా అంటూ చేతిలో నీళ్ళు తీసుకొని పిల్లల చుట్టూ తిప్పుతూ అనాలి

**శ్రీరామ రక్షా నూరేళ్ళు ఆయుష్షు**

## నేల-బండ ఆట

ఈ ఆటను ఎంత మందయినా ఆడవచ్చును. ముఖ్యంగా 6 నుండి 13 వరకు వయసు గల బాల బాలికలు ఈ ఆటను ఆడతారు. మొదటగా ఒకరిని దొంగగా నిర్ణయిస్తారు. ఈ ఆట ఆడు ప్రదేశ మందు మట్టి ప్రదేశము (నేల), రాతి ప్రదేశము (బండ) ఉండవలెను. ముందుగా దొంగని నేల కావాలో బండ కావాలో కోరుకోమంటారు. ఉదాహరణకి దొంగ నేల కోరుకున్నచో, దొంగ నేల మీద, మిగిలిన వారందరు బండ మీద ఉంటారు. బండ మీద ఉన్నవారు నేల మీదకి వచ్చి "నీ నేలంతా కరిగిపోతంది.." అంటూ దొంగని ఆట పట్టిస్తూ ఉంటారు. దొంగ బండ మీదకి వెళ్లకుండా నేల మీదకి వచ్చిన వాళ్లని పట్టుకోవటానికి ప్రయత్నించవలెను. ఇదియే దొంగ యొక్క ముఖ్య లక్ష్యం. దొంగకి చిక్కిన వారు దొంగ స్థానమును భర్తీ చేస్తారు. ఈ ఆట చిన్న పిల్లలకు బాగా ఇష్టమైన ఆట.

# 27.దిష్టి తీయుటం

దిష్టి అంటే అదే పనిగా మనం (మన వస్తువు, లేదా ఆస్థి) ఇతరుల గమనికలో వుండటం అని చెప్పవచ్చు. తద్వారా వారు మన పట్ల ఈర్ష్య అసూయా భావాలతో లేదా ఆరాధనా భావం లేదా ప్రేమభావంతో భావోద్వేగాలకి గురయ్యి మనకు "ఇబ్బంది" కలుగజేసే అవకాశం ఉంటుంది అని భావం.

## పిల్లలకు దిష్టి తీయుటం

చాలా ఇళ్లల్లో ఇప్పటికీ చిన్న పిల్లలకు దిష్టి తీస్తుంటారు. అందులో పసి పిల్లలకు ఖచ్చితంగా రోజూ దిష్టి తీయాలంటున్నారు మన పెద్దవారు. అయితే, దిష్టి ఎలా పడితే అలా తీయకూడదనీ, దిష్టి తీసే విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని పెద్దలు చెబుతుంటారు. చిన్నారులకు దిష్టి తీసేటపుడు వారి వద్ద పొరుగింటి చిన్నపిల్లలు ఎవరూ ఉండకూడదు. అలాగే చిన్నపిల్లలు నిద్రపోతున్న సమయంలో వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ దిష్టి తీయకూడదని  కర్పూరంతో దిష్టి తీస్తే ఇంకా మేలుంటుందని పెద్దలు సూచిస్తున్నారు.

కంటి దృష్టి లోపాలు తొలగిపోవాలంటే.. బుగ్గపై కాటుక పెట్టాలని, అన్నం తినకుండా మారాం చేస్తే కంటి దృష్టి పడి వుంటుందని భావించి.. రాళ్ల ఉప్పుతో దిష్టి తీయాలని, ఆపై ఆ ఉప్పును నీళ్లలో కలిపేయాలి



అని అంటారు. ఐదేళ్లు దాటిన పిల్లలకు అన్నం వార్చి.. పసుపు, కుంకుమతో కలిపి వాటితో దిష్టి తీయాలి. ముఖ్యంగా కర్పూరంతో దిష్టి తీయాలి. అప్పుడప్పుడు పిల్లలు కింద పడితే.. కర్పూరాన్ని పళ్లెంలోకి తీసుకుని.. పిల్లలను మూడు సార్లు తిప్పి.. పక్కన తీసేయాలి. కర్పూరం కరిగేట్లు కంటి దృష్టి కూడా కరిగి పోతుందని.. విశ్వాసం. అదే విధంగా అర్థరాత్రుల్లోనూ, మిట్ట మధ్యాహ్నం సమయాల్లోనూ పిల్లలను బయట తిప్పకూడదు.

రాతి ఉప్పును ఒక చెంచాడు చొప్పున ఎడం చేతి గుప్పిటలో తీసుకుని ఇరుగు దిష్టి పొరుగు దిష్టి, తల్లి దిష్టి అన్నీ తుడిచిపెట్టుకుపోవాలని అనుకుంటూ బిడ్డ చుట్టూ ఎడమ నుంచి కుడికి కుడి నుంచి ఎడమకు మూడుసార్లు తిప్పాలి. చేతిలో ఉన్న ఉప్పును పక్కన ఒక ప్లేటులో పెట్టి పైవిధంగా మరో రెండుసార్లు చేసి నీటితో బిడ్డ కళ్లను తుడిచి దిష్టి తీసిన ఉప్పును ఎవ్వరూ తొక్కని చోట పడేయాలి.

## రేణుకాదేవి స్మరణ

ఇక దిష్టి తగిలిన వారికి ఉప్పు, మిరపకాయలు వంటివి తల మీదుగా చుట్టూ తిప్పడం అంటే, ఇతరుల నుంచి ప్రసరించబడిన విద్యుత్ కిరణాలను, వలయాన్ని సృష్టిస్తూ విశ్ఛిన్నం చేయడమన్నమాట. అలాంటి పరిస్థితుల్లో రేణుకాదేవిని స్మరించుకోవాలి. రేణుకాదేవి నామాలను స్మరించడం వలన ఆమె స్తోత్రాలు చదువుకోవడం మూలంగా దిష్టి ప్రభావం నుంచి వెంటనే బయటపడొచ్చు అని అంటారు.

# దిష్టి తగలకుండా ఉండాలంటే?

హారతులివ్వడం, గుమ్మడికాయలు పగులగొట్టడం, భోజనం చేసేటప్పుడు హఠాత్తుగా ఎవరైనా వస్తే వారిని కూడా భోజనానికి కూర్చోమని చెప్పడం, లేదా వారికి కనీసం ఏదైనా పండో, పానీయమో ఇవ్వడం, భోజనం వడ్డించుకున్న తర్వాత మొదటి ముద్ద తీసి కాకికి వేయడం లేదా భగవంతుని తల్చుకుని కన్నులకు అద్దుకుని తినడం, కర్పూరం బిళ్లను చుట్టూ తిప్పి దానిని వెలిగించటం, నుదుటన అగరుతో బొట్టు పెట్టడం, మొలతాడు కట్టడం, మెడలో ఆంజనేయస్వామి లేదా ఇతర దేవతా మూర్తుల ప్రతిమలను కట్టడం, కొత్త దుస్తులు ధరించబోయే ముందు అందులోంచి ఒక దారం పోగు తీసి నిప్పులో పడేయటం లేదా ఆ వస్త్రం మూల కాటుకతో చుక్క పెట్టటం, తినే ఆహార పదార్థాన్ని 7 సార్లు దిగదుడిచి దానిని కుక్కకు లేదా ఆవుకు తినిపించటం ఆంజనేయ స్వామిని ఉపాసించడం, ఈశ్వరారాధన లేదా వీరభద్రుడు, కాలభైరవుడు, దుర్గ, కాళి, గౌరి తదితర దేవతలను ఆరాధించడం, సంధ్యాసమయంలో దీపం పెట్టడం, అగరుబత్తులు వెలిగించడం సాంబ్రాణి ధూపం వేయడం కోడిగుడ్డును 7 సార్లు దిగదుడిచి 4 వీధుల కూడలిలో ఉంచి దానిపై నీరు పోయడం, మంత్రాలు రాసిన తాయెత్తును తీసుకొచ్చి దానిని పిల్లల జబ్బకు లేదా మెడలో కట్టటం లాంటి పనులు దిష్టి తగలకుండా చేస్తారు.

# 28.నామకరణం /బారసాల



బిడ్డ పుట్టిన తరువాత మొదటిసారిగా ఊయలలో వేసే కార్యక్రమాన్ని బారసాల లేదా నామకరణ డోలారోహణ లేదా నామకరణం అంటారు. దీని అసలు పేరు బాలసారె. అది వాడుకలోకి వచ్చేసరికి బారసాల అయింది. దీన్ని బిడ్డ పుట్టిన 21వ రోజున చేస్తారు. దీనిని ఆది శంకరాచార్యులు క్రీ.పూ 2000 లో ప్రారంభించాడు. దీనిని హిందూ సాంప్రదాయం ప్రకారం అమ్మాయి పుట్టింటి వాళ్ళు చేస్తారు. ఆయుషు, వర్చస్సు, వ్యవహారసిద్ధి కలుగుటకు ఈ నామకరణ సంస్కారాన్ని చేయుదురు.

**వామాఖిలస్య వ్యవహార హేతః శుభావహం సుభాగ్య హేతుః**
**నామ్నైవ కీర్తిం లభతే మనుష్యస్తతః ప్రశస్తంఖలు నామ కర్మః**

అనగా వ్యవహార హేతువు, శుభావహమైనది, కీర్తికారక మగు నామకర్మ ప్రశస్తమైనది. జాతకర్మ తరువాత, గణపతిపూజ, పుణ్యాహవాచనమైన తరువాత నామకరణ సంస్కారంను ప్రారంభిస్తారు.

## నామకరణము చేసే పద్ధతి

ఓ పళ్లెంలో బియ్యం పోసి, తండ్రిచే దక్షిణ దిశనుంచి ఉత్తరదిశకు మూడు గీతలు గీసి, ముందు శ్రీకారం రాయించి మొదటిగడిలో బిడ్డ పుట్టిన మాసము ప్రకారం వచ్చిన పేరును, రెండవ గడిలో నక్షత్రంను బట్టి వచ్చిన పేరు, మూడవ గడిలో వ్యావహారిక నామం రాపించి,



నామకరణ విధి మంత్రాల నడుమ **"అగ్నిరాయుష్మాన్... కరోమి"** అగ్ని సమిత్తులచే, చంద్రుడు ఓషధుల రసరూపమైన అమృతముచే, యజ్ఞము దక్షిణలచే, బ్రహ్మము బ్రాహ్మణులచే, దేవతలు అమృతముచే ఆయుర్దా యము కలవారైరి.

అటువంటి ఆయుర్ధాయ మంత్రంచే దీర్ఘాయుష్మం తునిగా ఆశీర్వ దిస్తూ అనే అర్ధముగల మంత్రాన్ని జపిస్తూ, శాస్త్రోక్తముగా పూజా, జప, హోమ, దానాదులుతో ఈ రెండు సంస్కారాలను శాస్త్రోక్తంగా వేద పురోహితులవారి ఆధ్వర్యమున నిర్వర్తిస్తారు.

పేర్లు వ్రాసేటప్పుడు మొదలు, చివర శ్రీకారము వ్రాయాలి. మాస నామమును పూజించిన అక్షతలను తల్లిదండ్రులు తీసికొని పిల్లవానిని ఆశీర్వదించిన తరువాత పురోహితుడు ఆశీర్వదించవలెను. ఈ విధంగానే నక్షత్ర నామమునకు కూడా చేయాలి. తరువాత దక్షణము వైపునకు వచ్చి కూర్చొండవలెను.

కుమారుని **"అంగాదంగాత్..."** అను మంత్రములచే అభిమంత్ర ణము చేయవలెను. శిరస్సును వాసన చూడవలెను. కుమారుని కుడి చెవిలో **'అగ్నిరాయుష్మాన్ ... కరోమి'** అను మంత్రమును చెప్పవలెను. తరువాత నివేదించిన పాలను బంగారముతో కుమారునికి త్రాగించుట ఆచారముగా వచ్చుచున్నది.

మగపిల్లవానికి చేసినట్లుగానే ఆడపిల్లకు కూడా చేసి, **'సర్వస్మాదాత్మన సమ్భూతాసి సాజీవ శరదశ్శతం'** అను మంత్రముచే శిరస్సును వాసన

చూచుట, ఎడమ చెవిని తాకుట చేయవలెను. మగబిడ్డ అయినచో "అగ్ని రాయుష్మాన్" మంత్రముతో కుడి చెవిని తాకుట చేయవలెను.

నామకరణ సంస్కారము తరువాత సంవత్సరము వరకు తల్లి దండ్రులు మాంసమును తినరాదని వరాహుడు మొదలైనవారు చెప్పిరి.

## పేరు పెట్టడానికి నాలుగు పద్ధతులు

మొదటిది జన్మనక్షత్రాన్ని బట్టి

రెండవది పుట్టిన నెల/రాశ్యధిపతిని బట్టి

మూడవది ఇలవేలుపును బట్టి

నాలుగవది అందరూ పిలిచే పేరును బట్టి

చివరి పద్ధతి కుటుంబ సంప్రదాయాన్ని బట్టి, విద్యాస్థాయిని బట్టి ఉంటుంది. ఐతే లేకలేక కలిగిన సంతానానికి, కుటుంబంలో చాలామంది పిల్లలు చనిపోయాక పుట్టినవారికి దుష్టశక్తుల్ని దూరంగా ఉంచడం కోసం విడ్డూరంగా ఉందే పేర్లను కూడా పెడతారు.

హిందూ సాంప్రదాయం ప్రకారం అమ్మాయి తల్లిదండ్రులు అల్లుడికి, కూతురికి, పుట్టిన బాబుకో లేక పాపకో బట్టలు పెట్టాలి. మన సాంప్ర దాయం ప్రకారం వచ్చిన వారికి పండు తాంబూలం, పెట్టదలచు కుంటే చుట్టాలకు భోజనము పెట్టవచ్చు. ఇదే రోజున ఉయ్యాలలో వేయటము, బావిలో చేద వేయటం అనే కార్యక్రమాలు చేస్తారు.

# 29.ముదిమనవల సంతానము అయితే

ఈ బారసాల నాల్గవ తరము వారిది అయితే శుభకార్యం పూర్తి అయిన తరువాత మనుమడు, మనుమని భార్య ఈ ఇద్దరు దంపతులు, తాతకు, నాన్నమ్మకు పాద పూజచేసి వారికి నూతన వస్త్రాలు పెట్టాలి.

ఆ వస్త్రములు కట్టుకుని ఆ దంపతులు ముదిమనవనికి బంగారు ఉగ్గుగిన్నెతో పాలు తాగించాలి. పుట్టిన బాబుతో తోటకూర గింజలు అతని చేతిలో ఉంచి మట్టిలో చల్లించాలి.

ఆ మట్టిని ఇంటికి తీసుకువెళ్ళి కుంపటిలో వేసిన తోటకూర వస్తుంది. ముది మనుమని ఎత్తుకుని వృద్ధ దంపతులు మూడు గుమ్మాలు దాటవలెను.

తోటకూర మొక్కలు మొలచి ఆకులు వచ్చిన తరువాత దానిని వండి ముదిమనవని చేతిమీదుగా పళ్ళెములో పెట్టించుకుని తినవలెను. నానమ్మ తాతయ్య ఇద్దరు ఉన్నా వీరిలో ఏ ఒక్కరు ఉన్నా కూడా ఈ శుభకార్యం వేడుకలు జరుపుకొనవచ్చును.

# 30.బావిలో చేద వేయుట



**కావలసినవి :** పసుపు, కుంకుమ మోదీ ముద్దలు, మూడు వెల్లుల్లి పాయలు, మూడు కప్పుల శనగలు, సాంబ్రాణీ కడ్డీలు, దీపారాధన వత్తులు, పత్తి, పూలు, దారము, ఆకులు, పండ్లు, వక్కలు, అగ్గిపెట్టె పత్తిగింజలు మొదలగు వస్తు సామాగ్రి ఒక పళ్ళెములో సర్దుకొనవలెను.

బావి వద్దకు వెళ్ళునపుడు బాలింతకు నడికట్టు, తలపై గుడ్డ, పొత్తిగుడ్డ ఉంచవలెను. బాలింత బావి వద్దకు వెళ్ళునప్పుడు దారిలో పత్తిగింజలు చల్లుతూ వెళ్ళవలెను. మూడు బిందెలకు బయటవైపు పసుపు రాసి

కుంకుమ బొట్లతో అలంకరించవలెను. మూడు పోగుల పసుపు దారముతో తమలపాకు మడిచి ముడివేసి దానిని తోరము వలె బిందెకు కట్టవలెను. ఒక బిందెలో కొద్దిగ మజ్జిగ 10, 15 పత్తి గింజలు, ఒక తమలపాకు వేయవలెను.

బావికి గుండ్రముగా పసుపురాసి ఐదు కుంకుమ బొట్లు పెట్టవలెను. మనకు అందుబాటులో బావిలేనిచో బోరింగుపంపు వద్ద, బావివద్ద మూడు రాళ్ళుకానీ, మూడు మట్టి ముద్దలు కానీ పెట్టి వాటిని పసుపు కుంకుమలతో అలంకరించి వాటిని గౌరీదేవిగా భావించి, పూజచేసి గౌరీదేవి పాటపాడాలి.

ఆ తరువాత నైవేద్యము పెట్టాలి. పూజ అయిన తరువాత బిందెలోని తమలపాకు పట్టుకుని మజ్జిగ చుక్కలు బావిలో విడుస్తూ "అమ్మా గంగాభవాని ఈ మజ్జిగచుక్కలు తీసుకొని పాలచుక్కలు మాకు ప్రసాదించు తల్లీ" అంటూ పత్తిగింజలు, తమలపాకు, బావిలో విడవాలి.

బావిలో బాలింత మూడు చేదలు నీళ్ళు తోడిన తరువాత పక్కవాళ్ళు నీళ్ళు తోడి, మూడు బిందెలు నింపవలెను. ముద్ద అందుకొను వారికి మోడి ముద్దలు మూడు, వెల్లుల్లిపాయలు మూడు, పండు, తాంబూలము, శనగలు కొంగులో పెట్టవలెను.

బిందెలో నీళ్ళు తాకి ముద్ద ఇచ్చిన వారి వీపుమీద "ఏటాబాలింత ఏటా శూలింత" అంటూ రెండు చేతులతో కొట్టవలెను. ముద్ద తీసుకొనిన వారు బాలింత వీపుమీద అలాగే కొట్టవలెను.

ఆ తరువాత బిందె చేతికి అందించవలెను. బిందెలు తీసుకొని ఇంటి లోపలకు వచ్చునపుడు వదిన, మరదళ్ళ వరసైన వారు గుమ్మము వద్ద ఆమెను ఆపి వాళ్ళ భర్తపేరు చెప్పించి లోపలకు పంపుట ఆచారము.

తరువాత బిందెలు పూజ మందిరము వద్ద పెట్టి స్వామివారికి నమస్కరించాలి. వెళ్ళునపుడు లోపలకు వచ్చిన గుమ్మములో కాకుండా వేరే గుమ్మము గుండ రావలెను. ఆ సమయంలో గర్భిణి ధరించిన స్త్రీలు ఉన్నచో వీరికి ఎదురు రాకూడదు.

మోడిముద్దలు...మోడిపుల్లలు వేయించి మిక్సీలో పౌడరుగా చేసి ఆ పిండిలో మినపపిండి, బెల్లము, నెయ్యి కలిపి ముద్దలుగా చేయాలి. మోడిపిండి 1, మినపపిండి, 2.బెల్లము, 3.డబ్బాలు. తరువాత ఊయలకు పూలతో అలంకరణ చేసి పట్టుచీరవేసి ఆకులు, వక్కలు, శనగలు, పండ్లు, తాంబూలం ఊయలలో నాలుగు వైపులా ఉంచవలెను.

బాబుని ఊయలలో తూర్పువైపు తల ఉంచి, పరుండపెట్టి హారతి ఇవ్వవలెను. జోలపాటలు, లాలిపాటలు పాడుతూ ఊయల ఊపవలెను.

21, 23, 25, 27, 29 దినములలో సోమ, బుధ గురువారములు, 2, 3, 7, 10, 13 తిథులు, పున, పుష్య, అనూ, శ్రవ, మృగ, హస్త, మూల తారలు మంచివి.

# 31.నిష్క్రమణ



నిష్క్రమణ అంటే బిడ్డను మొదటిసారిగా ఇంట్లోనుంచి బయటికి తీసుకురావడం. అప్పటివరకూ ఇంట్లోనే పెరిగిన బిడ్డ మొదటిసారిగా బయటి ప్రపంచంలో అడుగుపెడుతున్నప్పుడు ఆ బిడ్డను బలమైన ప్రకృతి శక్తుల నుంచి, అతీత శక్తుల బారి నుంచి కాపాడడానికి చాలా జాగ్రత్తలు (భౌతికమైనవి, ఆధ్యాత్మికమైనవి) తీసుకోవాలి. అందుకే ఈ సంస్కారం చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. కానీ వైదిక సాహిత్యంలో ఈ సంస్కారానికి విపులమైన ప్రస్తావన లేదు. బహుశా ఇది సాధారణ సంస్కారం కావచ్చును.

ఈ నిష్క్రమణ సంస్కారాన్ని శిశువు పుట్టిన పన్నెండవ రోజు నుంచి నాల్గవ మాసము వరకు చేయవచ్చునని భిన్న సాంప్రదాయములు ఉన్నవి. 12వ రోజునే ఈ నిష్క్రమణ సంస్కారాన్ని చేయాలని భవిష్యపురాణము, బృహస్పతి స్మృతి తెలుపుచున్నది. అంటే నామకరణము అయిన వెంటనే శిశుకు సూర్యుని దర్శనము చేయించవలెను. మరికొంతమంది మూడవ మాసములో సూర్యదర్శనము అని, నాల్గవ మాసములో చంద్రదర్శనము అని పేర్కొన్నారు. గృహ్య సూత్రములను అనుసరించి తల్లిదండ్రులు ఈ సంస్కారము చేయుటకు అర్హులు. కానీ ముహూర్త సంగ్రహము ప్రకారము మేనమామ ఈ సంస్కారము చేయవలెనని తెలపుచున్నది. విష్ణు ధర్మోత్తరము ఈ సంస్కారాన్ని పిల్లవానిని సాకే దాది చేయవలెనని తెల్పుచున్నది.

## చేయవలసిన విధానము

సూర్యరశ్మి పడు ప్రదేశమును ఆవుపేడచే అలికి స్వస్తిక్ ముద్ర వేసి దానిపై ధాన్యమును చల్లవలెను. కులదేవతల సమక్షములో వాద్య సంగీతములతో దేవతా పూజ చేయవలెను. అష్టదిక్పాలకులను, సూర్య చంద్ర వాసుదేవులను, ఆకాశమును స్తుతించుట, బ్రాహ్మణ భోజనము, శుభ సూచకమైన శ్లోకములను చదువుట, శంఖధ్వని, వైదిక మంత్రము లను చదువుచుండగా శిశువును తండ్రి బయటకు తీసుకు వచ్చి శకుంత సూక్తము (స్వస్తినః శకునే అస్తు.... ప్రతినస్సుమనాభవ)ను గాని లేదా "ఈ శిశువు ప్రమత్తుడైనను అప్రమత్తుడైనను, దినమైనను, రాత్రియైనను, ఇంద్ర పురోగాములైన దేవతలు వీనిని రక్షింతురుగాక" అను అర్థముగల శ్లోకమును చదువును. ఆ తరువాత శిశువును తీసుకొని దేవాలయమును

వెళ్ళి స్వామివారిని పూజించి, ఇంటికి తీసుకొని వచ్చి మేనమామ ఒడిలో కూర్చుండబెట్టవలెను. తరువాత బంధుమిత్రులు కానుకలిచ్చుట, ఆశీర్వచనములు చేయుట జరుగును.

బృహస్పతి ప్రకారము శిశును చక్కగా అలంకరించి, వాహనముపై ఉంచిగాని, మేనమామ ద్వారా కానీ బయటకు తీసుకు రావలెను. అప్పుడు మేళతాళములో బంధువులు ఆ శిశువువెంట ఉందురు. ఆవుపేడతో అలికిన సూర్యరశ్మి తగిలే ప్రాంతంలో ధాన్యము చల్లుదురు. **"త్ర్యంబకం యజామహే"** మొదలైన మృత సంజీవన మంత్రములను తండ్రి జపించును. తరువాత శివుని, వినాయకుని పూజించవలెను. పిల్లలకు తినుబండారములు పంచవలెను. ఈ సంస్కారమువలన శిశువు యొక్క లేత మనస్సుపై సృష్టియొక్క గొప్పతనము ముద్రపడునని భావన.

## చంద్రదర్శనము

శిశువునకు సూర్యదర్శనమువలెనే చంద్రుని కూడా చూపించవలెనని కొన్ని సంప్రదాయములు ఉన్నవి. తండ్రి పశ్చిమముగా తిరిగి నమస్కరించుచుండగా, భార్య దక్షిణ భాగమునకు వచ్చి కుమారుని వెల్లకిల త్రిప్పి ఉత్తరమువైపు శిశువు తల పెట్టి భర్తకు కుమారుని ఇవ్వవలెను. తరువాత ఆమె వెనుకగా వచ్చి ఉత్తరపు వైపున నిలబడి ఉండగా కొన్ని మంత్రములను చదివి పిల్లవానిని తల్లికి ఇచ్చి తండ్రి ఈ సంస్కారాన్ని పూర్తి చేయునని, ప్రతి శుక్లపక్షపు నెల పొడుపురోజున చేతిలో నీటిని తీసుకొని చంద్రుని పూజించవలెనని ఈ విధముగా ఒక సంవత్సరము చేయవలెనని అష్టాదశ కల్ప సూత్రము చెప్పుచున్నది.

# 32. అన్నప్రాశన



అన్నప్రాసన అంటే పుట్టిన శిశువుకు మొదటిసారి అన్నము తినిపించే కార్యక్రమం. ఇందుకు శిశువు జాతకచక్ర ఆధారంగా తారబలం చూసి ముహూర్తం నిర్ణయిస్తారు. ఇది హిందు సంప్రదాయంలో కనిపించే ఒక పెద్ద కుటుంబ పండుగ. ఈ సంస్కారం వలన శిశువుకు ఆయువు, ఆరోగ్యం, తేజస్సు వృద్ధి చెందుతాయి అని చెప్పబడుతుంది.

తొలిసారి అన్నం తింటున్న శిశువునకు జాతకచక్రం ఆధారంగా అనుభవజ్ఞులైన పండితుల దగ్గరకు వెళ్లి వారికి దక్షిణ తాంబూలాదులు

ఇచ్చి శుభమూహూర్తమును అడిగి తెలుసుకుని పండితుడు నిర్ణయించిన శుభమూహూర్తాన అన్నప్రాసన చేయడం బిడ్డకు శ్రేయస్సు, యశస్సులు కలుగుతాయి.

## అన్నప్రాశన కాలం

శిశువు వయసు 6 నుంచి 12 నెలలలోపు ఉండగా ఎప్పుడైననూ చేయవచ్చు. అయితే శుక్లపక్షంలో శుక్రుడు ఆకాశంలో పరిశుద్ధుడై ప్రకాశిస్తున్నప్పుడు అన్నప్రాశన చేయాలి. మగపిల్లలకు సరి నెలలలోనూ, ఆడ పిల్లలకు బేసి నెలలలోనూ చేయాలి. దీనిని పూర్ణాహ్వామందు మాత్రమే చేయాలి. లగ్న శుద్ధి, దశమ శుద్ది, వృషభ, మిధు, కటక, కన్య, ధనుస్సు, మీన రాసుల లగ్నములలో చేయాలి.

మదనరత్నము ప్రకారము అన్నప్రాశనము ఆరు, ఎనిమిది మాసము లందు మగ శిశువుకు; ఐదు, ఏడు మాసములందు ఆడబిడ్డలకు శుభమని తెల్పుచున్నది.

నారదుని ప్రకారము శిశువు పుట్టిన నాలుగు మాసములలో అన్న ప్రాశన సంస్కారము పూర్తిగా నిషేధము. 6వ మాసములన లేదా ఎనిమిదవ లేక తొమ్మిది లేక పది లేక పన్నెండ్రవ మాసమున చేయవచ్చును.

మరికొంత మంది అభిప్రాయములో శిశువునకు దంతములు వచ్చిన తరువాత అన్నప్రాశన చేయవచ్చునని, శుక్లపక్షము, ఉత్తరాయణము, పుష్య నక్షత్రము మంచివి అని, నవమి తిథి కూడదని చెప్పిరి.

పారస్కర గృహ్య సూత్రముల ప్రకారము శిశువుకు పెరుగు, నెయ్యి, మధువుతో పాటు మాంసము కూడా కలుపవలెని చెప్పినది.

దీని ప్రకారము "శిశువునకు వాక్ప్రవాహము కావలెను అనిన భారద్వాజపక్షి మాంసము, కోమలతకై చేపలను, దీర్ఘ జీవనము కొరకు కృశక పక్షి మాంసము లేక తేనెతో కలిపిన అన్నమును, తేజస్సు కొరకు ఆటి పక్షి మరియు తిత్తిరి మాంసమును, ఓజస్సు, తీక్షణబుద్ధి కావలెను అనిన నేతితో కూడిన అన్నమును, దృఢమైన దేహము కొరకు పెరుగు అన్నమును, అన్ని గుణములు కావలెను అనిన అన్ని పదార్ధములు సేవించ వలెను" అని పారస్కర గృహ్య సూత్రములు వివరించినది.

అన్నప్రాశన ఆరో నెల ఆరవ రోజున చేయటం ఆచారం. ఆ రోజు చేసేప్పుడు ముహూర్తం అన్వేషణతో పని లేదు అని ఒక పెద్ద వాదన సంఘంలో ఉంది. అది చాలా తప్పు మరికొందరి భావన.

ఆరవ నెల ఆరవ రోజు, అమావాస్య కానీ, మంగళవారం కానీ గ్రహణం కానీ వస్తే అన్నప్రాశన చేస్తామా? కేవలం మూఢమి పట్టింపు లేదు అన్నారు కానీ ముహూర్త పట్టింపు లేదు అనే వాదన చాలా దోష వాదన అని వీరి అభిప్రాయము.

అన్నప్రాసన ముహూర్త ప్రభావం శిశువు జీవితం, ఆరోగ్య విషయాల మీద ఆధారపడి ఉంటుంది. అందువలన తప్పకుండా మంచి ముహూర్తానికే అన్నప్రాశన చేయాలి.

# అన్నప్రాసన చేయు విధానం



ముందుగా గణపతి పూజ చేసి తర్వాత విష్ణు మూర్తిని, సూర్య, చంద్రులను అష్టదిక్పాల కులను, కుల దేవతను భూదేవిని పూజించి కార్య క్రమం ప్రారంభించాలి. ఈ కార్యక్రమం జరపడానికి శాస్త్రం సూచించిన నియమాలు పాటించాలి.

అన్నప్రాశన దైవ సన్నిధిలో చేయాలి. ముందుగా సత్యనారాయణ స్వామి వ్రతం జరిపి ఆ స్వామి సన్నిధిలో అన్నప్రాశన చేయాలి అని చెబుతారు. లేదా తమ కులాచారం ప్రకారం నడచుకోవాలి.

శుక్లపక్షమి రోజులలో అన్నప్రాశన ఉదయం పూట మాత్రమే చేయుట ఉత్తమం. శిశువునకు కొత్త బట్టలు తొడిగి మేనమామ, మేనత్త కాని తల్లిదండ్రులు కాని తూర్పు ముఖముగా చాప లేదా పీటలపై కూర్చోవాలి. శిశువును తల్లి లేదా మేనత్త ఒడిలో కూర్చోబెట్టుకోవాలి. బంగారము, వెండి, కంచు మొదలగు పాత్రలో ఏర్పాటు చేసుకున్న నెయ్యి, తేనె, పెరుగులను ముద్దగా తండ్రి లేక మేనమామ కుడిచేతిలో బంగారు ఉంగరాన్ని పట్టుకుని ఆ పాత్రలోని నెయ్యి, తేనె, పెరుగులను ఉంగరం సహాయంతో శిశువునకు తినిపించాలి. వసతి, స్థోమతలను బట్టి బంగారు లేక వెండి స్పూన్‌లను కూడ ఉపయోగించుకోవచ్చును. ఆ తర్వాతనే అన్నం తినిపించాలి. ఇలా మూడుసార్లు తినిపించిన తరువాత నాలుగోసారి చేతితో అన్నాన్ని తినిపించవలెను. ఆ తరువాత తల్లి, మేనమామ మిగతా కుటుంబ పెద్దలు అదే పద్ధతిలో చేయాలి.



## జీవికా పరీక్ష

అన్నప్రాశన సమయంలో దేవుని సన్నిధిలో బంగారు నగలు, డబ్బు, పుస్తకము, పెన్ను, కత్తి, పూలు, కలము, ఆయుధము, మొదలైన వస్తువులు పెట్టి శిశువును ఈ వస్తువులకు దగ్గరగా కూర్చోబెడతారు. అమర్చిన వస్తువులలో శిశువు మొదటిసారిగా ఏ వస్తువు తాకునో ఆ వస్తువుతో సంబంధమైన జీవనోపాధి ఆ శిశువుకు ఉంటుందని భావన చెందుట ఒక సాంప్రదాయంగా వస్తుంది.

## అన్నప్రాశన ఎక్కడ చేయాలి

అన్నప్రాశన కార్యక్రమం దేవుడి గుడిలో లేదా శిశువు యొక్క అమ్మమ్మ గృహములోకానీ చేయాలి.

# 33. 8-12వ నెలలలో వేడుకలు

ఈ వేడుకను తాతయ్య నాయనమ్మలు, ముద్దుల మనవడు (మనవరాలు) కోసం సంతోషంతో జరుపుకుంటారు. ఆ రోజు అందరిని పిలిచి తమ మనవడి అల్లరి చేష్టలను వారందరకు తెలియజేస్తూ, వారికి, వారితో వచ్చిన పిల్లలకు తినుబండారాలు ఆడుకునే వస్తువులు ఇచ్చి వారిని సంతోషపరుస్తారు. తరువాత విందుభోజనం ఏర్పాటు చేస్తారు.

| | | |
|---|---|---|
| 1. | 3వ నెలలో | ముద్దలు (లడ్లు) |
| 2. | నవ్వులకు | నువ్వుండలు |
| 3. | ఊ కొడితే | ఉగ్గుగిన్నెలు |
| 4. | కోరలు వస్తే | కొబ్బరి బొండాలు |
| 5. | బోర్లపడితే | బొబ్బట్లు |
| 6. | కేరింతలకు | కేకులు |
| 7. | అల్లరి చేస్తే | అటుకులు |
| 8. | కూర్చుంటే | కుర్చీలు (పిల్లలు ఆడుకునేవి) |
| 9. | చలాకిగా ఉంటే | చాక్లెట్లు |
| 10. | గడపలు దాటితే | గారెలు |
| 11. | దూకుడుకు | దువ్వెనలు |
| 12. | అడుగులకు | అరిసెలు |
| 13. | పలుకులకు | చిలుకలు (పంచదారవి) |
| 14. | మాటలకు | మణుగు బూరెలు |
| 15. | పరుగులకు | పాలకోవ |

# 34.పుట్టినరోజు వేడుక




**కావలసినవి :** ఈనాటి పరిస్థితులకు అనుకూలంగా, డ్రస్సు, కేకు, వెండి మైనపు వత్తి, వెండి చాకు, బంగారు వస్తువులు మొదలగు సామాగ్రిని సమకూర్చుకోవాలి. ముందుగా (పాప-బాబు) కుర్చీలో కూర్చుండపెట్టి, హారతి పట్టవలెను. తరువాత కేకు కటింగు చేయించాలి. అతిధులకు బొట్టుపెట్టి పండు, తాంబూలము, స్వీటు, హాటు, బహుమతి సామాను, కవరులో వేసి వేడుకకు వచ్చిన వారు వెళ్ళు సమయంలో వారికి ఇవ్వవలెను. స్తోమత కల్గినవారు విందు భోజనము గాని, టిఫినుకానీ ఏర్పాటు చేయవచ్చును. ముత్తయిదువులకు కాళ్ళకు పసుపురాసి పండు, తాంబూలము ఇవ్వవలెను.

ప్రథమ జన్మదిన వేడుకలతో తమ ముద్దుల మనవడు లేక మనవరాలు చేసిన అల్లర్లకు ఈ క్రింది వస్తువులను ఇచ్చి గౌరవిస్తారు.

| అచ్చట్లు | | ముచ్చట్లు |
|---|---|---|
| మనవరాలిగా పుట్టినందుకు | - | మరమరాలు |
| ముద్దుగా ఉన్నానని | - | ముద్దకోవా |

| | | |
|---|---|---|
| చిరునవ్వులకు | – | చిప్స్ |
| అల్లరి చేస్తున్నానని | – | చిల్లర |
| గోలచేస్తున్నానని | – | గోలీలు |
| దూకుడుకు | – | దువ్వెనలు |
| కేరింతలు కొడుచున్నానని | – | ఈలలు |
| కేకలకు | – | కేకులు |
| చలాకిగా ఉన్నందుకు | – | చాక్లెట్లు |
| బిజీగా ఉన్నందుకు | – | బిస్కెట్లు |
| పచ్చని రంగని | – | పచ్చని పండ్లు |
| అడుగులకు | – | అరిసెలు |
| పేచీలు పెడుచున్నాని | – | పెన్నులు |
| బొంగరంలా తిరుగుతున్నాని | – | బొంగరాలు |
| బుడిబుడి నడకలకు | – | బూరెలు |
| పారాడుచున్నానని | – | పాపిడి ముక్కలు |
| మారాం చేస్తున్నాని | – | మామిడిపండ్లు |
| ఆడుకుంటున్నాని | – | అటుకులు |
| సైగలు చేస్తున్నాని | – | సైకిలు |
| కూర్చుంటున్నాని | – | కుర్చీలు |
| కోరలు వచ్చాయని | – | కొబ్బరిబోండాలు |
| మాట్లాడుచున్నాని | – | మణుగు బూరెలు |
| గడపదాటుచున్నాని | – | గారెలు |

# 35.చూడాకరణ సంస్కారం/పుట్టు వెంట్రుకలు



చూడాకరణ సంస్కారము బిడ్డకు మూడవయేడు వచ్చిన తరువాత చేయుదురు. ఇందులో బిడ్డ యొక్క తల వెంట్రుకలు తీసివేయుట ప్రధాన క్రియ అనగా పుట్టువెంట్రుకలు తీయించడం. దీనినే చౌలము అని కూడా అంటారు.

శిశువునకు గర్భమునందు కలిగిన కేశములను తొలగించి చూడా కరణ చేసి దీనిద్వారా శిక్షయు, సంస్కారయోగ్యతయు కలిగింప బడును. కావున, బిడ్డకు అపాత్రతతా దోషము నిరాకరించబడును. వృద్ధి శ్రాద్ధము, హోమము జరిగిన పిమ్మట సూర్యుని ప్రార్థించుచు, "సూర్యుడు దేనితో

బృహస్పతికి కేశఖండనమొనర్చెనో, దేనితో వాయు దేవుడు ఇంద్రునకు కేశఖండనము చేసెనో, అట్టి బ్రహ్మరూపి యగు కత్తి ద్వారా నేను నీకు కేశఖండనము చేయుచున్నాను. నీకు ఆయుస్తేజోబలాభి వృద్ధులు కలుగుగాక!" అన్న అర్థము గల మంత్రములు పఠించబడును.

ఈ చూడాకరణమందు శిఖ మాత్రము ఉంచి మిగిలిన కేశములు తొలగించాలి. కేశములు బలమునకు మూలం. అవి పూర్తిగా తొలగించుట వలన మనిషి బలహీనుడగును. శిఖతో పురుషునకు బలము, వీర్యము, స్థైర్యము, ఆధ్యాత్మికోన్నతికి చెప్పనలవి కాని సంబంధము ఉన్నందు వలన ఈ శిఖధారణము హిందువుల జాతీయ చిహ్నముగా పరిగణించబడింది. చూడాకరణము ఈ జాతీయ చిహ్నమునకు మొదటి సన్నివేశమగును.

సుశ్రుతుడు, చరకుడు కూడా గుండు వల్ల దీర్ఘాయుష్షు, అందం చేకూరుతాయని పేర్కొన్నారు. తలనీలాలు దేవునికి లేదా దేవతకు అర్పించడం గురించి గృహ్యసూత్రాల్లో గానీ, స్మృతుల్లో గానీ లేనేలేదు! పూర్వకాలంలో కూడా కొన్ని సార్లు దేవాలయాల్లో తలనీలాలు అర్పించడం ఉన్నప్పటికీ అది కొన్ని ప్రత్యేక సందర్భాల్లోనే జరిగేది (లేకలేక కలిగిన పిల్లలు లేదా ఒకరిద్దరు పిల్లలు చనిపోయిన తర్వాత పుట్టిన పిల్లలకు). గృహ్యసూత్రాల ప్రకారం ఈ సంస్కారం మొదటి సంవత్సరం చివర్లో గానీ, మూడో ఏటగానీ చెయ్యాలి. తర్వాతి కాలాలోని సూత్రకర్తలు ఈ వయసును ఏడేళ్ళవరకు పొడిగించారు.

## చూడాకరణం అంటే ఏమిటి?

చూడాకరణం అంటే సిగజుట్టును సరి చేయటం అనుకోవచ్చు. ఇది ఉపనయన సంస్కారానికి ముందు చేయవలసిన సంస్కారం. ఈ సంస్కారం, మిగిలిన దాదాపు అన్ని సంస్కారాలలాగానే ఆరోగ్యపరమైన కారణాలతో ఆరంభం అయిందని పరిశీలకుల అభిప్రాయం.

బిడ్డ తలపైన పెరిగే జుట్టులో అనేక హానికరమైన క్రిములు చేరే ప్రమాదం ఉందనీ, వాటి వల్ల ఆరోగ్యం క్షీణించగలదని గుర్తించి, చూడాకరణ సంస్కారాన్ని ప్రవేశ పెట్టి ఉంటారు. అయితే, లోహయుగం ఆరంభం అయిన తొలినాళ్లలో, బిడ్డ తలమీద కత్తిని పెట్టటం అనేది తల్లిదండ్రులకు చెప్పలేనంత ఆందోళన కలిగించి ఉంటుంది.

తమ బిడ్డకు ఎలాంటి ప్రమాదమూ జరగరాదని కోరుతూ తల్లిదండ్రులు చేసే ప్రక్రియగా చూడాకరణ సంస్కారం క్రమంగా రూపు దిద్దుకుని ఉంటుంది. ఇదే ఇప్పుడు పుట్టు వెంట్రుకలు తీసే వేడుకగా మార్పు చెందిందనుకోవాలి.

## చూడాకరణం చేసే విధానము

ఆపస్తంభ సంస్కార దీపిక ప్రకారము ఈ సంస్కారము ఈ విధముగా చేయవలెను అని చెప్పుచున్నది. భూమిని శుద్ధిచేసి, ఐదు మూకుళ్ళకు తెల్లని దారమును చుట్టి మామిడి ఆకులతో అలంకరించి కొన్ని మంత్రము లతో సహా వాటి యందు మట్టిని పోసి నవధాన్యమును కంచుపాత్రలో


పోసి వాటిని ఆవుపాలతో అభిషేకించి, ఐదు మూకుళ్ళలో చల్లి దేవతలను ఆవాహన చేసి షోడశోపచారములచే పూజించవలెను.

నాందీ ముఖము, ఇడా వాచనము అనగా దేవతలను ఆహ్వానించ వలెను. తరువాత అగ్నిని రగిల్చి అగ్నికి పడమరగా బాలుని తూర్పు ముఖముగా కూర్చుండబెట్టి, మూడు తెల్లమచ్చలుగల ఏదుమల్లు, మూడు బిర్హిస్సు కట్టల కొసలు, మేడిపండ్ల కట్టతోను కలిపిన కట్టతో తూర్పు నుండి ప్రదక్షిణముగా జుట్టును తడుపుచు **"ఆప ఉందంతు..."** అను మంత్రములతో నాల్గు వైపులా మూడేసి దర్భలను అడ్డముగా ఉంచుకొని కేశ సంస్కారము చేయవలెను.

"ఆయువు, తేజస్సు కొరకై దీర్ఘకాలము సూర్యుని చూచుటకై నీరు ఈ పిల్లవాని శిరస్సును తడుపుగాక" అను అర్థమునిచ్చు నాల్గు మంత్రములతో ప్రతి మంత్రముతో ప్రతి దిక్కున కేశమును కత్తిరించ వలెను. కత్తిరించబడిన జుట్టును పేడ గురిగియందు ఉంచి నీటిని ముట్టుకొని **"ఉప్త్వాయ కేశాన్"** అను మంత్రముచే మేడిచెట్టు మొదటగాని, దర్భదుబ్బున కాని ఉంచవలెను. తరువాత పురోహితునకు గోదానము చేయవలెను.

ఈ చూడాకరణ సంస్కారము తరువాత ఒక సంతవ్సరము వరకు తల్లి పులుపు పదార్థమును తినరాదని, ఉప్పును వాదరాదని, కోపముతో తినరాదు అని వారాహ గృహ్య సూత్రము పేర్కొనుచున్నది.

# 36.తలమీద శిఖ



పుట్టు వెంట్రుకలు తీసే సమయంలో, తల మీద శిఖలను ఉంచటం పద్ధతిగా ఉంటోంది. తమ కుటుంబం ప్రవర అనుసారం మూడు శిఖలను కానీ, అయిదు శిఖలను కానీ ఉంచుతారు. వశిష్ఠ గోత్రానికి చెందిన వారు తల మధ్యలో ఒక శిఖను; అత్రి, కాశ్యప గోత్రాల వారు తలకు రెండు వైపులా రెండు శిఖలను; భృగు గోత్రానికి చెందిన వారు అసలు శిఖలు లేకుండా; ఆంగిరస గోత్రీకులు ఐదు శిఖలను ఉంచుకోవాలని శాస్త్రం. కానీ, ఇప్పుడు శిఖలను ఉంచుకునేవారు ఎవరైనా ఉంటే, వారు కేవలం ఒక శిఖనే ఉంచుకుంటున్నారు.

# 37.కర్ణవేధ



కర్ణవేధ అనగా చెవులు కుట్టించడం. ఐదేళ్ళలోపు చేయవలసిన సంస్కారం. కర్ణాభరణాలు ధరించడం మొదట్లో అందం కోసమే మొదలైనా తర్వాత ఆరోగ్యదృష్ట్యా దానికున్న ప్రాధాన్యతను బట్టి దానిని సంస్కారాల్లో చేర్చి ఉండవచ్చు.

రోగాదులనుండి రక్షణకై, భూషణముల కొరకు బాలకుని కర్ణములు కుట్టవలెను అని సుశ్రుతము పేర్కొనుచున్నది.

నిజమైన కర్ణవేధ అనగా గురువు శిష్యుని చెవిలో మంత్రోపదేశము చేయుటే. ఈ అర్థమే నిరుక్త మంత్రమునకు అర్థము.

చెవులు కుట్టించుటయను సంస్కారము దివ్యవర్చస్సు కలిగి, ఉత్తరోత్తర గురూపదేశ మన్త్రధారణ సిద్ధి కలుగుటకు, పితృదేవతల అనుగ్రహ నిమత్తము చేయవలసిన సంస్కారము.

## వివిధ శాస్త్రాలలో కర్ణవేధ

ఏ గృహ్యశాస్త్రాలలోనూ నేరుగా 'కర్ణవేధ' గురించిన ప్రస్తావన లేదు. పారస్కర సూత్రాలకు చెందిన పరిశిష్టంలో మాత్రం దీని గురించిన వివరణ ఉంది. అథర్వణ వేదంలోనూ దీని ప్రస్తావన ఉంది. బిడ్డ పుట్టిన 10వ రోజు, లేదా 12వ రోజు లేదా 16వ రోజున 'కర్ణవేధ' సంస్కారం జరపాలని బృహస్పతి అభిప్రాయం. అంత చిన్న వయసులోనే దీన్ని నిర్వహించడం వల్ల బిడ్డకు అంత బాధాకరంగా ఉండదని భావన. అయితే, బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటే, కర్ణవేధను బిడ్డకు ఆరు నెలలో కానీ, లేదా ఏడవ నెలలో కానీ చేస్తే మంచిదని శుశ్రుతుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఒక మంచి రోజున తల్లి ఒడిలో బిడ్డను తూర్పు దిక్కు వైపు చూస్తున్నట్టుగా కూర్చుండబెట్టి, ఆడుకునేందుకు బొమ్మలను ఇచ్చి, కొంచెం ఆడిస్తూ, ముందు కుడి చెవిని, తర్వాత ఎడమ చెవిని కుట్టాలి. చెవి కుట్టిన చోట నూనెతో తడిసిన పత్తిగుడ్డతో ఒత్తాలి అని శాస్త్రము తెలుపుచున్నది.



# చెవులు కుట్టునప్పుడు చేయవలసిన పూజ

చెవులు కుట్టునపుడు విష్ణు, రుద్ర, బ్రహ్మ, సూర్య చంద్ర, దిక్పాలకులకు, అశ్వినీ దేవతలకు, సరస్వతికి, గోవునకు, పూజ చేయవలెను. మగ శిశువునకు లక్కపూసి కుడి చెవిని ముందుగా కుట్టవలెను.

బంగారు సూదితో కుట్టుట శ్రేష్ఠము. శిశువునకు చెవులు కుట్టిన తరువాత దృష్టి దోషము తగులకుండా బొట్టుపెట్టవలెను. తరువాత దేవునిముందు ఉంచి నమస్కారము చేయించాలి.

కాత్యాయన సూత్రమునందు చెప్పబడిన ఈ సంస్కారము ఈ విధముగా ఉన్నది. ఒక శుభదినమున మధ్యాహ్నమునకు పూర్వము, పూర్వాభిముఖముగా శిశువును కూర్చొండబెట్టుకొని 'మేము మంగళ ప్రదమైన మాటలను విందుముగాక' అను అర్థమునిచ్చు మంత్రములు గానము చేసిన తరువాత కుడి చెవిని కుట్టవలెను. 'వక్ష్యంతి..' మొదలైన మంత్రములు చదివిన తరువాత ఎడమ చెవి కుట్టవలెను. బ్రాహ్మణ భోజనముతో సంస్కారము పూర్తి అగును.

క్రమముగా ఈ సంస్కారము వివిధాంగములతో సమృద్ధి చెందినది. 'సంస్కారము చేయువాడు విష్ణు, శివ, బ్రహ్మ, సూర్య, చంద్ర, దిక్పాలక, నాసత్యులు, సరస్వతి, బ్రాహ్మణుడు, గోవులు – వీరిని పూజించవలెను.

కుల గురువును అలంకరించి బ్రహ్మాసనముపై కూర్చొండపెట్టవలెను. తల్లి కుంకుమను శిశువు చెవులకు అద్దును. వైద్యుడు మగ శిశువైనచో కుడిచెవిని, ఆడ శిశువైనచో ఎడమ చెవిని ముందుగా కుట్టును. తరువాత

విద్వాంసులను, బంధువులను పూజింపవలెను’ అని విష్ణుధర్మోత్తరమున ఉన్నది. శర్కర, మధు, ఘృతములు ఆహూతులకు ఇవ్వవలెను.

బ్రాహ్మణులకు పైన చెప్పబడిన మూడు మధురములను ఇవ్వవలెను. బ్రాహ్మణాశీర్వచనముచే ఈ సంస్కారము పూర్తి అగును. బిడ్డ చెవులు కుట్టినప్పుడు ఏడ్చినచో తేనెను నాకించవలెనని కొన్ని గ్రంథములలో ఉన్నది.

## చెవులు కుట్టడానికి వాడే సూది

క్షత్రియులకు బంగారంతో,
బ్రాహ్మణ, వైశ్యులకు వెండితో,
శూద్రుడైనచో లోహమయమైన సూదితో నిర్వహించవలెనని
వీరమిత్రోదయమున ఉన్నది.

### దాడి

ఆడేవాళ్ళు ఇద్దరుంటారు. 9 నప్పులుంటాయి. ఒకరి తర్వాత ఒకరు, ఒక్కొక్కటి చొప్పున నప్పాలి. ఎవరివైనా మూడు నప్పులు, అడ్డంగా గాని, నిలువుగా గాని ఒకే వరుసలో వస్తే ఒక దాడి జరిగినట్లు. దాడి జరిపిన వాళ్ళు ఎదుటివారి నప్పులలోంచి ఒక నప్పును (దాడి జరగనిది మాత్రమే) తీసుకుంటారు. ఒకసారి దాడి జరిపిన నప్పుని, ప్రక్కకు జరిపి, దానితో మరల దాడి చెయ్య వచ్చును. ఇలా ఆడే ఇద్దరిలో ఎవరివో ఒకరి నప్పులు పూర్తయ్యేవరకు ఆడుకోవచ్చును. మూలలో బాణం గుర్తులున్న కోణాలలో వరసగా నప్పులు పెట్టడం దాడిగా ఒప్పుకోబడదు.

# 38.భోగిపండ్లు



సంక్రాంతి వస్తే పిల్లలకు భోగిపండ్లు పోసి.. మురిసిపోతుంటారు తల్లిదండ్రులు. ఇప్పుడైతే ఈ సంప్రదాయం తగ్గింది కానీ ఒకప్పుడు పిల్లలున్న ప్రతి ఇంట్లో భోగిపండ్ల దృశ్యాలు కనువిందు చేసేవి. అనాధి నుంచి వస్తున్న సంప్రదాయం ఇది.

## అరిష్టాలు, దిష్టివంటివి దరిచేరవు

భోగి పండుగ సాయంత్రం సాధారణంగా ఐదేళ్లలోపు పిల్లలపై భోగి

పండ్లను పోస్తారు. దీనివలన ఐదేళ్లలోపు పిల్లలపై ఉండే అరిష్టాలు, దిష్టి వంటివి తొలగిపోయి పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు రేగి పండ్లు సహకరిస్తాయని ఒక నమ్మకం.

ఐదేళ్ల వయసులో చిన్నపిల్లలకు బ్రహ్మరంధ్రం పలుచగా ఉంటుందని, రేఖ అరా కూడా పలుచగా ఉంటుందట. అయితే రేగిపండ్లలో రోగ నిరోధక శక్తిని పెంచే పోషక విలువలు ఎక్కువగా ఉంటాయి. అవి పోసిన సమయంలో రేగి పండ్ల నుంచి వచ్చే వాసన పిల్లల తలపైన బ్రహ్మ రంధ్రానికి శక్తి ఇస్తుందని, మేధస్సుకు శక్తి చేకూరుతుందని పెద్దల నమ్మకం.

## ముందుగా శ్రీకృష్ణునికి హారతి

పిల్లలను కుర్చీలో కూర్చోబెట్టి హారతి పడతారు. ముందుగా శ్రీకృష్ణునికి హారతి అద్దిన తరువాత పిల్లలకు అద్దుతారు. ముందుగా శ్రీకృష్ణునికి భోగిపండ్లు పోసిన తరువాతనే పిల్లలకు మూడుసార్లు కొద్దికొద్దిగా పోస్తారు. ఈవిధంగా అందరూ పోయవచ్చును. అలాగే ఈ సందర్భంగా తల్లులు పేరంటాన్ని ఏర్పాటు చేసి ఇరుగుపొరుగు మహిళలకు పసుపు కుంకుమలు దక్షిణ తాంబూలాలు అందిస్తారు.

## భోగిపండ్లు ఎలా కలుపుతారు?

చిల్లర, నానబెట్టిన శనగలు, బంతిపూల రేకులు, రేగిపండ్లు వీటన్నిటినీ కలుపుకోవాలి. సంక్రాంతి నాడు పోసిన భోగిపండ్లను పండుగ పండ్లు అంటారు.

## భోగిపండ్లు పోయటంలోని అంతరార్థం

విశేషమేమంటే రేగుపండ్లను జంతువులు తినవు. మనుషులే తింటారు. హిందూ సంస్కృతిలో రేగుపండ్లకున్న ప్రాశస్త్యాన్ని దృష్టిలో పెట్టుకునే.. పండగపూట పిల్లలకు చిల్లర నాణేలతో కలిపి భోగిపండ్లు పోస్తారు. ఆ సమయంలో తల మీద చిల్లర నిలబడితే 'భోగి' అవుతారని, రేగుపండ్లు మాత్రమే నిలబడితే 'యోగి' అవుతారన్నది ఒక విశ్వాసం.

## నారాయణుని ఆశీస్సులు

రేగి పండ్లను బదరీఫలం అని కూడా పిలుస్తారు. శివుణ్ని ప్రసన్నం చేసుకోవడానికి నరనారాయణులు బదరికావనంలో ఘోర తపస్సు చేశారట. ఆ సమయంలో దేవతలు వారి తలల మీద బదరీ ఫలాలని కురిపించారని చెబుతారు. ఆనాటి సంఘటనకు ప్రతీకగా పిల్లలను నారాయణుడిగా భావించి భోగిపండ్లను పోసే సంప్రదాయం వచ్చిందని ప్రతీతి.

## సూర్యుని ఆశీస్సులు

భోగి ముగిశాక సూర్యుడు దక్షిణం నుంచి ఉత్తరానికి మరలుతాడు. ఆ రోజే మకరరాశిలోకి ప్రవేశిస్తాడు. సంక్రాంతి సూర్యుడి పండుగ.. సూర్యుడి రంగులో ఉండే రేగిపండ్లను చిన్నపిల్లలపై పోస్తే సూర్యుడు ఆశీస్సులు దొరుకుతాయని ఒక నమ్మకం. కౌమర్యంలోకి అడుగు పెట్టడానికి ముందే అంటే.. 12 ఏళ్లలోపు చిన్నారుల తలపై భోగి పండ్లను పోయవచ్చు.

# 39. అక్షరాభ్యాసం



బిడ్డ మనసు తగినంతగా పరిపక్వత చెంది కొత్త విషయాలు నేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు మొదటగా చేయవలసినది అక్షరాలు నేర్పటం. ఈ సంస్కారాన్నే అక్షరారంభమనీ, అక్షరలేఖనమనీ, విద్యారంభమనీ అంటారు. సాధారణంగా ఈ సంస్కారాన్ని ఐదో ఏట చేస్తారు. విశ్వామిత్రుడు దీన్ని ఏడో ఏటివరకు పొడిగించాడు. కానీ కొందరు స్మృతికర్తలు చూడాకరణ అయిన వెంటనే చేయాలని నిర్దేశించారు.

# అక్షరాభ్యాసము ఎప్పుడు చేయాలి?

శిశువునకు 5వ సంవత్సరములో అక్షరాభ్యాసము చేయాలి. ఉత్తరాయణము-అనగా మాఘము, ఫాల్గుణము, చైత్రము, వైశాఖము, జ్యేష్ఠము అక్షరాభ్యాసము చేయుటకు మంచి నెలలు, సూర్యుడు కుంభరాశిలో నున్నప్పుడు చేయరాదు.

శుక్ల పక్షము మంచిది. కృష్ణ పక్షము, అమావాస్య, దానిముందు 3 తిథులు అనగా కృష్ణ పక్ష ద్వాదశి, త్రయోదశి, చతుర్ధశులు మరియు కృష్ణపక్షపాడ్యమి మంచివి కావు. అశ్విని, మృగశిర, పుష్యమి, పునర్వసు, ఆరుద్ర, ఆశ్లేష, హస్త, చిత్తా, స్వాతి, మూల, శ్రవణ, రేవతి నక్షత్రములు మేష, కర్కా, తుల, మఖ, మీన లగ్నములు; ఆది, సోమ, బుధ, గురు, శుక్రవారములు మంచివి. అనధ్యాయరహితమై అష్టమ శుద్ధి కల్గి ఉండవలెను.

# అక్షరాభ్యాస విధానము

అక్షరాభ్యాసము చేయు బాబు, లేక పాప చేత ముందుగా విఘ్నే శ్వరుని, లక్ష్మీ నారాయణులను, సరస్వతిని, భూదేవిని తన కులదేవత లను, గురువునీ, బ్రాహ్మణులని పూజించి, నమస్కరించి, వారందరికి 3 సార్లు ప్రదక్షిణము చేయించవలెను. తూర్పు ముఖముగా శిశువును కూర్చుండబెట్టి ముందుగా 'ఓం' కారమును వ్రాయించి, ఆ తరువాత అక్షరములు వ్రాయించవలెను. తరువాత గురువునకు నమస్కారము పెట్టించవలెను.

# అక్షరాభ్యాసానికి అనుకూలమైన పర్వదినాలు

పర్వదినాలు అక్షరాభ్యాసానికి అనువైనవి. ముఖ్యంగా విజయదశమీ, శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రం ఉన్న రోజు, శ్రీపంచమి వంటి పర్వ దినాలలో ఈ కార్యక్రమం చేయటంవల్ల ఆ దేవతల ఆశీస్సులూ అను గ్రహమూ లభించి, విద్యాభివృద్ధికి దోహదం కలిగిస్తుందని మన నమ్మకం.

సర్వసాధారణంగా అక్షరాభ్యాసం ఐదో ఏట చేస్తారు. ఆ వయస్సు వచ్చేసరికి విషయాన్ని గ్రహించి అర్థం చేసుకుని, మనస్సులో నిలుపుకొనే శక్తి విద్యార్థికి లభిస్తుంది.

ఈ కాలంలో దేశకాల పరిస్థితులను బట్టి మూడవయేటనే అక్షరా భ్యాసం చేస్తున్నారు. ఉదయం వేళ ఇంట్లోగానీ, దేవాలయంలో గానీ, పాఠశాలలోగానీ, పెద్దలు, గురువుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వ హించవచ్చు.



మన సంప్రదాయంలో విద్యాధిదేవతలు కొందరున్నారు. అక్షరాభ్యాసం నాడు ఆ దేవతలను పూజించి విద్యార్థిచేత అక్షరాలు దిద్దించటం సంప్రదాయం. సకల విఘ్నాలనూ తొలగించే వినాయకుణ్ణి, విద్యల దేవత అయిన సరస్వతీ దేవిని అర్చించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. దక్షిణామూర్తి, దత్తాత్రేయుడు, విష్వక్సేనుడు మొదలైనవారిని విద్యా దేవతలుగా పూజిస్తారు.

ఆ తరువాత **'ఓం నమః శివాయః సిద్ధం నమః'** అనే అక్షరాలను విద్యార్థిచేత దిద్దిస్తారు. విద్యాధి దేవత సరస్వతి అయినా, జ్ఞానస్వరూపుడు శివుడు కాబట్టి **'నమశ్శివాయ'** అక్షరాలు దిద్దడంతో అక్షరాభ్యాసం ప్రారంభమవుతుంది.అంతేగాక భాషకు వ్యాకరణం ఇచ్చినది పరమ శివుడు. కాబట్టి శివనామంతో అక్షరాన్ని ప్రారంభించాలి అని చెబుతారు.

విద్యార్థితో తొలి అక్షరాలను బియ్యంపై రాయించే ఆచారం కొన్ని చోట్ల ఉంది. ఆ చిన్నారికి ఎప్పుడూ ధనధాన్యాలు సమృద్ధిగా చేకూరాలని దీవించడమే ఇందులోని అంతరార్థంగా చెబుతారు.

సంప్రదాయ దుస్తులతో ముఖ్యంగా తెల్లని రంగు వస్త్రాలతో అమ్మ వారి దగ్గర అక్షరాభాస్యం చేసుకుంటే చాలు అమ్మ పరిపూర్ణ అనుగ్రహం కలుగుతుంది అని కొందరి భావన. పిల్లలతో **ఓం నమో సరస్వత్యేనమః** అని నామాన్ని లేదా **శారదా దేవ్యై నమః** అని పారాయణాన్ని చేయించి నచో విశేష ఫలితం ఉంటుంది అని పెద్దల భావన.

# 40.ఓణీలు-పంచెల వేడుక



ఈ వేడుక సాయంత్రం వేళ చేస్తే చాలా బాగుంటుంది. నిర్ణయించిన ముహూర్తం రోజున ఉదయం తలస్నానం చేయించి, ఉతికిన వస్త్రము ధరింపచేసి దగ్గరలో ఉన్న దేవాలయానికి వెళ్ళి, అభిషేకం చేయించి స్వామివారి ఆశీస్సులు పొందాలి.

## అవసరమైన వస్తువులు

స్వీటు, హాటు, పండు, ఆకులు, వక్క, బంగారపు వస్తువు, అతిథులకు పంచిపెట్టు సామాగ్రి మొదలగునవి. ముందుగా అమ్మాయిని అలంకరించి

పండు, తాంబూలం చేతిలో ఉంచి వేడుకకు ఏర్పాటుచేసిన వేదికపై ఉన్న కుర్చీలో కూర్చుండబెట్టవలెను. తరువాత ముత్తయిదువులు అక్షింతలు వేసి హారతి ఇవ్వవలెను.

తరువాత మేనమామ, అత్త కలిసి లంగా, ఓణి, జాకెట్టు, తాంబూలం ఇవన్నీ ఒక పళ్ళెంలో చేర్చి అమ్మాయి చేతిలో ఉంచి అక్షింతలతో ఆశీర్వదించాలి. ఆ తరువాత అమ్మాయి తల్లి, కుమార్తెను కుర్చీలో నుండి లేవదీసి, మేనమామ ఇచ్చిన నూతన వస్త్రములను ధరింపచేసి మరల అలంకరణ కుర్చీలో కూర్చుండబెట్టాలి.

తరువాత ఇద్దరు ముత్తైదువులు అమ్మాయి తలపై అక్షింతలు వేసి హారతి పాట పాడి హారతిని కళ్ళకు అద్ది పాపను ఆశీర్వదించాలి. ఈ వేడుక తిలకించడానికి వచ్చిన బంధుమిత్ర సపరివారం కూడా అక్షింతలు వేసి ఆశీర్వదిస్తారు చూసేవారికి ఈ వేడుక చాలా సరదాగా ఉంటుంది. ఈ వేడుకకు వచ్చిన అతిధులకు విందు భోజనం ఏర్పాటు చేయించాలి. తరువాత ఒక కవరులో స్వీటు, హాటు, తాంబూలము, పండు, సామాను వేసి ఇవ్వవలెను.

## పంచెలు

పంచె, కండువ, ప్యాంటు, షర్టు పైన తాంబూలము పెట్టి అల్లుని చేతికి యివ్వవలెను. అమ్మాయికి జరిపించిన విధంగానే అబ్బాయికి కూడా ఈ విధంగానే జరిపించాలి.

# 41.పుష్పవతి అయినప్పుడు పాటించే సంప్రదాయాలు



తూర్పు ముఖం వచ్చునట్లుగా కూర్చుండబెట్టే స్థలంలో నేలమీద గడ్డిపరచి దానిమీద తెలుపు రంగు దుప్పటి లేక చీర ఐదుగురు ముత్తైదువులు కలిసి పట్టుకుని వేయవలెను. ఆ తరువాత ఆ ఐదుగురు అమ్మాయి తలపై అక్షింతలు వేయవలెను. తెల్లని వస్త్రముపై నాలుగు వైపులా, మధ్యలో ఐదుచోట్ల నీటిలో నానబెట్టిన శనగలు, పండ్లు, తాంబూలము, ఎండు కొబ్బరి చిప్ప, చిమ్మిలి ముద్దపెట్టాలి, పక్కన ఒక చెక్కబొమ్మ పెట్టవలెను. ఆ బొమ్మకు వస్త్రము కట్టవలెను.

అమ్మాయి కాళ్ళకు పసుపురాసి పారాణి పెట్టాలి. ఓణీ వేసుకొనవలెను. ఐదుపోగుల దారానికి పసుపురాసి తమలపాకు తోరము తయారు చేసి ఒకటి రోలుకి, రోకలికి కట్టాలి, అమ్మాయికి తాంబూలము ఇవ్వవలెను. అమ్మాయిని కూర్చొనపెట్టి రోలులో ఐదు చిమ్మిలి ముద్దలు వేసి చిమ్మిలి తొక్కి హారతి పట్టవలెను. సమర్తపాట, మంగళహారతి పాటలు పాడవలెను. రోలులోని చిమ్మిలి ముందుగ మూడుసార్లు అమ్మాయి చేతిలో పెట్టి మిగిలినది సమర్తకాని పిల్లలకు పెట్టుదురు. బొట్టు, గంధము ముందుగా సమర్త పెండ్లి కూతురునకు ఇచ్చి ముత్తైదువులకు ఇచ్చెదరు.

మొదట మూడు రోజులు పులగము అన్నము, (బియ్యములో పెసర పప్పు కలిపి వండవలెను). ఒక మూకుడులో విస్తరాకు లేక వెండి గిన్నె ఉంచి ఆ అన్నము పెట్టెదరు. అన్నములోకి బెల్లము ముక్క లేక పంచదారతో తినవలెను. తరిగినవి తినరాదు. పుల్లలు తుంచుట చేయ కూడదు. అరటిపండు ఎవరైనా వలిచి ఇచ్చిన తినవలెను. ఉపన యనము సమయములో వాడిన మూకుడులో అన్నము పెట్టిన ఏదైనా దోషములు ఉన్న పోవును. వరుస స్నానము 4, 7, 9, 11 రోజులలో చేయించాలి.

4వ రోజు భోజములో అట్లు వడ్డించాలి. పాలరసము చేయాలి. వరస స్నానము 4 సార్లు తరువాత మామూలుగా బంతిలో భోజనము చేయవచ్చును. 4 రోజుల తరువాత కొబ్బరి పొడుము, అప్పడము, వడియముతోనే భోజనము పెట్టవలెను. తినలేనిచో పాలు, మజ్జిగ పలుచగ చేసి అన్నములో పోయవలెను.

దీపమున్న గదిలోనే కన్యను ఉంచాలి. సువాసినులకు శ్రీ గంధము, పుష్పములను, తమ్మూలములను లవణము, పెసలు మొదలగునవి ఇవ్వాలి. ప్రథమ రజస్వల అయిన వస్త్రముతోనే మూడు రోజులు ఉంచాలి. ఎవరిని తాకకుండా జాగ్రత్తగా, ప్రశాంతముగా, ఉండునట్లు చూడాలి. మూడు దినములు ఎవరిని తాకకూడదు. అభ్యంగనము, కాటుక, స్నానము, పగలు నిద్రించుట, అగ్నిముట్టుట, ప్రాసనము, సూర్యావలోకనము, భూమిపై గీతాలు గీయుట చేయుట చేయకూడదు. క్రింద పడుకోవాలి,

## తినకూడని పదార్థములు

వంకాయ, గోంగూర, తరిగినవి, అరిశె, జున్ను తినకూడదు. ఆవు పాలు, పెరుగు, మజ్జిగ, తాంబూలము, గంధమాల్యములు ఉపయోగించ రాదు. చిమ్మిలి ముద్దలు, వేరే ఏస్వీటు అయినా తినవచ్చును. సమర్త సమయమున చిమ్మిలి ఎంత పంచిన అంతమంచిది. ఏదైనా గుడిముందు వాళ్లకు చిమ్మిలి ముద్దలు పంచవచ్చును. కొందరి ఇంట తెలుపు డిజైను కొత్త చీర సమర్త పెండ్లికూతురుకు కట్టి మొదటి రోజు కూర్చొనపెట్టుదురు.

పదకొండవరోజున అమ్మాయికి గాజులు తొడిగించెదరు. ఆ రోజు బంధువులను పిలిచి భోజనములు పెట్టెదరు. అందరికి రెండు గాజులు కూడా పంచిపెట్టెదరు. నాలుగు సమర్తలు, కన్నెముట్లు మూడు అయిన దాకా ఊరు పొలిమేర దాటరాదు అని అంటారు.

# 42.సమర్త స్నానము



ఈ సమర్త స్నానమును ఎనిమిదవ రోజు రాత్రికి ఎనిమిది గంటలకు స్నానము చేయించవలెను. నువ్వుల నూనె వంటికి రాసి, నలుగుపెట్టి తలస్నానము చేయించాలి. అనంతరం ఐదు నిమిషముల తరువాత మరల తలస్నానము చేయించవలెను. దీనినే దొంగ స్నానము అందురు. 7,9,11 రోజులలో ఉదయమే ఇలా నలుగుపెట్టి స్నానము చేయించవలెను. 11వ రోజు పురోహితుడు వచ్చి పుణ్యవచనము చేయించెదరు.

2వ సమర్త 9వ రోజుతో, 3వ సమర్త 7వ రోజుతో, 4వ సమర్త 5వ రోజుతో, మూడు ముట్లు కన్నె ముట్లని 4వ రోజు దూరముగానే ఉంచి 5వ రోజు ఇంట్లోకి తెస్తారు.

# 43.కేశాంత

పదహారేళ్ళ వయసొచ్చాక మొట్టమొదటిసారి గడ్డం గీసుకోవడానికి (గీయించుకోవడానికి) సంబంధించినది ఈ సంస్కారం. యౌవనారంభ దశలోని చాపల్యాలకు లొంగకుండా మరింత జాగరూకులై మెలగవలసిన అవసరాన్ని, బ్రహ్మచర్యం యొక్క ప్రాధాన్యతను ఈ సంస్కారం గుర్తు చేస్తుంది. ఈ సంస్కారానికి సంబంధించిన తంతు దాదాపు చూడాకరణను పోలి ఉంటుంది. ఈ సంస్కారం జరిపేటప్పుడు చివర్లో విద్యార్థి తన గురువుకు ఒక ఆవును దానంగా ఇస్తాడు. అందుకే కేశాంతాన్ని గోదాన మని కూడా అంటారు.

ఈ సంస్కారం కూడా బ్రహ్మచారికి అతని యవ్వనారంభాన్ని, బాధ్య తలను తెలియజెప్పే సంస్కారంగానే భావించాలి. ఈ సంస్కారం అంతా దాదాపు చూడాకరణం పద్ధతిలోనే జరుగుతుంది. తేడా అంతా – చూడాకరణంలో తలమీద కేశాల ఖండనం జరిగితే, కేశాంతంలో మీసాలు, గెడ్డాలను తీసి వేయటం జరుగుతుంది.

ఈ సంస్కారాన్నే 'గోదానం' అనటం కూడా ఉంది. కేశాంతం తర్వాత, గురువుకు దక్షిణగా ఒక గోవును ఇవ్వటం వల్లనే దీనికే 'గోదానం' అనే పేరు వచ్చిందనాలి.

# 44.సమావర్తన



చదువు ముగించుకుని విద్యార్థి గురుకులాన్ని వదిలి వచ్చేటప్పుడు ఈ సంస్కారాన్ని నిర్వహిస్తారు. దీన్నే స్నాతకమని కూడా అంటారు. విద్యార్థి తాను అప్పటివరకు పాటించిన బ్రహ్మచర్యాశ్రమం యొక్క గొప్ప దనాన్ని గుర్తిస్తూ, యజ్ఞయాగాదులను ముగించేటప్పుడు చేసే అవభృత స్నానం చేస్తాడు. క్రమశిక్షణతో మెలగి విద్యార్జనలో ఉత్తీర్ణుడైన విద్యార్థిని విద్యాసాగరాన్ని ఈదిన స్నాతకుడు లేక నిష్ణాతుడుగా గుర్తించడం జరుగు తుంది. ఇప్పుడు కూడా విశ్వవిద్యాలయాలు ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టా ప్రదానం చేయడాన్ని స్నాతకోత్సవమనే అంటారు.

# గృహస్థ జీవితానికి సిద్ధంకావటం

సమావర్తనతో చదువు పూర్తి చేసుకుని ఇంటికి తిరిగిరావడం విద్యార్థి జీవితంలో అతి కీలకమైన ఘట్టం. స్నాతకుడు పెళ్ళి చేసుకుని గృహస్థ జీవితం గడపడానికైనా, తాను గడించిన వైదిక విజ్ఞానంతో భౌతిక మానసిక బంధాలకు దూరంగా జీవితం గడపడానికైనా సిద్ధంగా ఉంటాడు. మొదటి మార్గం పాటించేవాళ్ళను ఉపకుర్వనులని, రెండవ వర్గం వారిని నైష్ఠికులని అంటారు. ఏ మార్గం పాటించడానికైనా గురువు అనుమతి తప్పనిసరి. అప్పటివరకు విద్యార్థి దశలో గురువుతోనే ఉన్నా ఆయనకు రుసుమేమీ చెల్లించకుండానే ఆయన్ని సేవించుకుంటూ విద్యను పొందిన విద్యార్థి ఇంటికి తిరిగొచ్చేటప్పుడు మాత్రం తన స్తోమతుకు తగినట్లు గురుదక్షిణ సమర్పించుకుంటాడు. గురుదక్షిణగా ఏమీ ఇవ్వలేకపోయినా గురువు అనుమతి మాత్రం తప్పనిసరిగా తీసుకోవాలి.

## స్నాతకాలు మూడు రకాలు

1. విద్యాస్నాతకం, 2. వ్రతస్నాతకం, 3. ఉభయస్నాతకం.

గురుకులంలో విద్యను పూర్తి చేసుకుని, ఇంటికి తిరిగి వచ్చే వారికి చేసేది 'విద్యాస్నాతకం'. గురుకులంలో అన్ని వ్రతాలనూ పూర్తి చేసుకుని వచ్చే వారికి చేసేది 'వ్రతస్నాతకం' అనీ అంటున్నారు. గురుకులంలో విద్యనూ, వ్రతాలను రెంటినీ పూర్తి చేసుకుని, స్వగృహానికి తిరిగి వచ్చే వారికి చేసేది 'ఉభయస్నాతకం'.

# 45.మొలత్రాడు



హిందూ సాంప్రదాయం ప్రకారం అన్ని వయసుల మగవారు నడుము భాగంలో ఈ మొలతాడును ధరిస్తారు. మొలతాడును దారంతో తయారు చేస్తారు. కొందరు వెండి తోను, బంగారంతోను, ప్లాటినమ్‌తో కూడా ఈ మొలతాడును తయారు చేయించుకుని ధరిస్తారు.

మొలతాడు మార్చవలసినప్పుడు కొత్త దానిని ధరించిన తరువాత పాతదానిని తొలగిస్తారు. మొలత్రాడు ధరించడం హిందూ సాంప్రదాయంలో ఒక భాగం. యావత్ భారతదేశంలో ఈ సాంప్రదాయం ఉంది. చిన్నతనంలో బాలబాలికలె ఇద్దరికీ మొలత్రాడు కట్టిననూ, పెద్దవారైన తర్వాత స్త్రీలు మొలత్రాడు వాడరు. పురుషులు మాత్రం తప్పక వాడవలసిందే. పురుషుడి భార్య కాలం చేస్తే గానీ మొలత్రాడు తీయకూడదు అన్న నమ్మకం ఇప్పటికీ ఉంది.

మొలత్రాడులు ప్రాథమికంగా ఎరుపు/నలుపు రంగులలో లభిస్తాయి. నలుపు మంచిది కాదని కొందరి నమ్మకం. లుంగీ, పంచె, వదులుగా ఉన్న నిక్కర్లు, ప్యాంటులు, పైజామా, లంగోటి మొదలైన వాటిని బెల్టు ఉపయోగించకుండా బిగుతు చేసుకోవటానికి వాటిని మొలత్రాడు క్రిందకు అంటే నడుముకు, మొలత్రాడుకి మధ్య వస్త్రం వచ్చేలా కట్టుకొనే సౌలభ్యం ఈ మొలత్రాడువలన ఉంది. స్నాన సమయంలో నీటిని పీల్చటం వలన మొలత్రాడు మెత్తబడి, లేక ఉదర భాగం పెరిగి మరీ బిగుతుగా ఉండటం మూలాన కొంత కాలానికి అది తెగిపోతుంది. అప్పుడు మరల క్రొత్త మొలత్రాడు కొనాలి. సంపన్నులు వారి ఆర్థిక పరిస్థితులను బట్టి వెండి/బంగారు మొలత్రాడులని వాడటం కూడా ఉంది. చిన్ని కృష్ణుడిని వివరించే ఒక పద్యంలో బంగారు మొలత్రాడు అనే పదాలు వస్తాయి.

# 46.ముక్కుపుడక



ముక్కు పుడక లేదా ముక్కెర ఒక విధమైన ముక్కుకు ధరించే ఆభరణము. ముక్కుపుడక ధరించడం సంపంగిలాంటి ముక్కుకు కొత్త వింత అందాన్ని ఇస్తుంది. దీనిని ఎక్కువగా స్త్రీలు ధరిస్తారు. అనేక ప్రాంతాలలో ముక్కుపుడక పెళ్ళి అలంకారాలలోనే ఎక్కువగా కనిపిస్తుంది. ముక్కెరను తమిళంలో మూక్కుత్తి, హిందీలో నాత్ లేదా నాథురి, బీహారీలో లాంగ్ అని పిలుస్తారు.

## పురాణాలు

ముక్కుపుడక అంటే మహిళలకు ఎంత మక్కువో తెలియాలంటే పురాణాలలోని ఎన్నో ఉదాహరణలు ఇవ్వచ్చు. భామాకలాపంలో ఒకసారి

సత్యభామ చెలికత్తెను శ్రీకృష్ణుని వద్దకు రాయబారం కోసం వెళ్ళమంటుంది. ఎన్ని లంచాలు ఇస్తానన్నా, ఎన్ని నగలు ఇస్తానన్నా వెళ్లనంటుంది. విసిగిన సత్య చివరకు అసలు నీకేం కావాలో చెప్పవేం అని అడిగితే సత్యభామ ముక్కున ఉన్న ముక్కెర కావాలంటుంది. అది ఇవ్వగానే లంకెబిందెలు దొరికినంత సంతోషంతో శ్రీకృష్ణుని వద్దకు వెళ్ళి రాయబారం నడుపుతుంది.

హిందూ దేవతలు అందరికీ ముక్కెర తప్పకుండా ఉంటుంది. బెజవాడ కృష్ణానది పొంగి కనకదుర్గమ్మ ముక్కెరను తాకితే భూమి మీద ఎవ్వరూ మిగలరని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గారు కాలజ్ఞానంలో ముక్కెర గురించి ప్రస్తావిస్తారు.

## సాంప్రదాయం

అలంకారంగా స్థిరపడిన ముక్కెరను మేనమామ లేదా కాబోయే భర్త మాత్రమే బహూకరించడం అనేది ప్రాచీన కాలంనుంచీ వస్తున్న సాంప్రదాయం. బయటి వాళ్ళెవరైనా ఇవ్వజూపితే అది చాలా తప్పు. ఒకవేళ వాళ్ళనుంచి తీసుకున్నారు అంటే వాళ్ళు దేవదాసీలై ఉంటారు. ఎందుకంటే ఇది భర్త ప్రేమకు గుర్తు. అందుకే మగని ప్రేమకే గుర్తు మగువ ముక్కుపుడక అన్నాడో కవి. తాళిబొట్టు మాదిరిగానే వివాహసమయంలో ధరించిన ముక్కుపుడకను జీవితాంతం కొందరు తీయరు. అది ఉన్నంత కాలం భర్త క్షేమంగా ఉంటాడన్నది వారి నమ్మకం. అందుకే దీన్ని సౌభాగ్యానికి సంకేతంగా చెబుతారు. భార్య పెట్టుకున్న ముక్కుపుడక

బరువు, సైజు, డిజైన్ భర్త ఆర్థిక స్తోమతను తెలిపేవిగా ఉండేవి. రాజుల వంశానికి చెందిన మహిళల ఆభరణాల్లో ఒకటి నుండి 17 వరకు వివిధ రత్నాలు ఉన్న ముక్కుపుడకలు ఎన్నో ఉండేవి. పూర్వకాలంలో ఏడేళ్ళ వయసులోనే ముక్కు కుట్టించి బంగారుతీగ చుట్టించేవారు. పెరిగిన తర్వాత దాన్ని తీసి రాళ్ళు పొదిగిన పుడకలు పెట్టేవారు. ఎంత పేదవారైనా దీనిని మాత్రం బంగారంతోనే చేయించుకుంటారు.

దక్షిణ భారతదేశంలో దీన్ని ఎక్కువగా కుడివైపు పెడితే, ఉత్తరాదిన మాత్రం ఎడమవైపు పెడుతుంటారు. ఈ ప్రస్తుతకాలంలో కూడా పెద్ద ముత్యపు ముక్కెరను మరాఠీ మహిళలు చాలా ఇష్టంగా ధరిస్తారు. కొందరిలో ఇది దాదాపు గడ్డం వరకు వస్తుంది. ఇప్పటికీ కొందరు ఆదివాసులలో పెద్దవైన బులాకీలు వాడతారు.

## అధునిక ఫ్యాషన్

ఇప్పుడు పెళ్ళికాని అమ్మాయిలు కూడా ముక్కెరను ఇష్టంగా ధరిస్తు న్నారు. బంగారు పుడక నుంచి వజ్రపు ముక్కుపుడక వరకూ, రింగులు కూడా ధరించడం ఫ్యాషన్ గా మారింది. దానితో సెలబ్రిటీల నుండి సామాన్యుల వరకూ అందరూ దీనిని ఇష్టంగా ధరిస్తున్నారు. ప్రముఖ క్రీడాకారిణి సానియా మిర్జా దీనిని మార్చకుండా ధరిస్తుంది. ప్రపంచ సుందరి పోటీల్లో వజ్రపు ముక్కుపుడకతో ఐశ్వర్యా రాయ్ అందరినీ ముగ్ధుల్నిచేసింది.

# 47.పెళ్ళి చూపులు



హిందూ వివాహాల్లో పెళ్ళి చూపులు ఒక ప్రధానమైన ఘట్టం. కాబోయే వధువు వరుడు ఒకరినొకరు చూసుకునే తొలిఘట్టం.

ఇరువైపు బంధువులు కలుసుకొని, ఒకరి గురించి ఒకరు తెలుసుకునే సందర్భం ఇది. హిందు మత సాంప్రదాయం ప్రకారం పెళ్ళి అయ్యేంత వరకు అమ్మాయి తన మెట్టినిల్లు చూడకూడదని హిందువులు గాఢంగ

నమ్ముతారు, కనుక పెళ్ళిచూపులు అమ్మాయి వాళ్ళ ఇంటి వద్దే జరుగు తాయి. పెళ్ళి కొడుకు తరుపువారు ఐదుగురు అమ్మాయి వాళ్ళ ఇంటికి వస్తారు.

అమ్మాయిని తయారు చేసి అబ్బాయికి చూపిస్తారు. తరువాత ఇద్దరికి అమ్మాయికి అబ్బాయికి నచ్చితే పెద్దవారు కట్న, కానుకలు మాట్లా డతారు. వధూవరులు పరస్పరం నచ్చాక, ఇరువురి ముఖ్య బంధువులు వరుడి ఇంట్లో సమావేశమవుతారు.

పరస్పర సంప్రదాయాలు, కుటుంబ పద్ధతులు, ఆచార వ్యవహారాలు చర్చించుకుంటారు. వరకట్న నిషేధం లాంటివి అమల్లో వున్నప్పటికీ, సాంప్రదాయ బద్ధంగా, వధూవరుల తలిదండ్రులు కట్న కానుకలు, ఇచ్చి పుచ్చుకోవడాలు, లాంఛనాలు, ఆభరణాలు లాంటివి మాట్లాడుకున్న తరువాత, అన్నీ కుదిరాక, నిశ్చితార్థపు తేదీ నిర్ణయించుకుంటారు.

## పెండ్లి చూపులకు అనువైన రోజులు, నక్షత్రములు, తిథులు

సోమ, మంగళ వారములు కాకుండా; భరణి, కృత్తిక, ఆర్ధ, ఆశ్లేష, పుబ్బ, విశాఖ, జ్యేష్ఠ, పూర్వాషాఢ, పూర్వాభాద్ర నక్షత్రములు కాకుండా; చవితి, షష్ఠి, అష్టమి, ద్వాదశి, అమావాస్యలు కాకుండా; వర్జ్య దుర్ము హర్తములు లేకుండా, శుభగ్రహాల యందు పగటి సమయమున పెండ్లిచూపులు ఏర్పాటు చేయవలెను.

# 48.నిశ్చితార్థం



నిశ్చితార్థం అనగా వివాహ నిశ్చయం. వీలైనంత తక్కువ సమయంలో లేక నిర్ణిత కాల వ్యవధిలో వివాహం ద్వారా సంబంధాన్ని ఏర్పచుకుని ఏకమవడానికి చేసిన ప్రతిపాదనను వాగ్దానం ద్వారా నిశ్చయించుకోవడాన్ని నిశ్చితార్థం అంటారు. వైదిక మంత్రాల మధ్య వివాహ ప్రక్రియకు పెద్దల ఆశీస్సులు తీసుకోవడానికే ఈ కార్యక్రమం.

నిశ్చితార్థం జరిగిన తరువాత పెళ్ళి అయ్యేంత వరకు నిశ్చితార్థపు జంటలోని అబ్బాయిని పెళ్ళి కుమారుడు అని అమ్మాయిని పెళ్ళి కుమార్తె అని వ్యవహరి స్తారు. "మీ అమ్మాయిని మా అబ్బాయికి చేసుకుంటాము" అని అంగీకారము తెలిపి "ధ్రువంతే రాజా" అనే వేదమంత్రముల పఠనముతో వధువునకు నూతన వస్త్రములు, నగలు మొదలైనవి ఇచ్చి వధువుచే ధరింపచేసి, పూలు పండ్లు పళ్లెములో పెట్టి నుదుట కుంకుమ

అలంకరించి **"శీఘ్రమేవ వివాహ సిద్ధిరస్తు!"** అని అమ్మాయి చేతిలో పూలు పండ్లు పెట్టి ఆశీర్వదించాలి. బంధుమిత్రుల సమక్షంలో పెళ్లి ముహూర్తాన్ని లగ్న పత్రికగా వ్రాయించి, లగ్న పత్రికలు, తాంబూలాలు పరస్పరం ఇచ్చిపుచ్చుకొంటారు. తరువాత బంధుమిత్రులకు చందన తాంబూలముల నిచ్చి గౌరవించి వారి ఆశీర్వాదములు పొందవలెను. దీనినే నిశ్చయ తాంబూలమని, నిశ్చితార్థమని అంటారు. ఈ వేడుక ఒక అగ్రిమెంటు లాంటిదని భావించవచ్చును. నిశ్చితార్థం రోజున అమ్మాయి, అబ్బాయి ఉంగరాలు మార్చు కోవటంతో సగం పెళ్ళి జరిగినట్టుగానే భావిస్తారు. ఇరుపక్షాల వాళ్ళు మరిచి పోవడానికి ఆస్కారం లేకుండా, అరమరికలు లేకుండా, ఒక కాగితం మీద ఇచ్చి పుచ్చు కోవడాలకు సంబంధించిన వివరాలన్నీ రాసుకోవడం కూడా సంప్రదాయమే.

## నిశ్చితార్థమునకు ముహూర్తము

నిశ్చితార్థముకు పెండ్లితో సమానమయిన, సమాన బలమయిన ముహూర్తం చూడవలెను. కారణం నిశ్చితార్థంతోనే వధూవరుల బంధం ప్రారంభం అవుతుంది. అంతేకాకుండా జాతక ప్రభావాలు వారిరువురికీ ఒకరి ప్రభావం మరొకరిమీద ఈ మూహూర్తం నుండే ప్రారంభం అవుతాయి. వివాహమునకు సంబంధించిన తిథి వార నక్షత్ర లగ్నములు చూడవలెను. అయితే నిశ్చితార్థం రోజున గణపతి పూజ చేయవలెను. భోజనానంతరం పూజ పనికిరాదు. కావున ఉదయ సమయంలోనే నిశ్చితార్థం చేయవలెను అని చెబుతారు.

# 49.ముహూర్త నిశ్చయం



వధూవరుల తారా బలం-చంద్ర బలం చూసి ముహూర్తం నిశ్చయిస్తారు. పెళ్లినాటి ప్రమాణాలు భవిష్యత్‌లో దంపతులు తు.చ తప్పకుండా అమలు చేయాలంటే "ముహూర్త బలం" ముఖ్యమని హిందువుల నమ్మకం. నిశ్చితార్థంలో ప్రధానంగా విఘ్నేశ్వరుడి పూజ వుంటుంది. వివాహ ప్రక్రియ ఆసాంతం విఘ్నాలు లేకుండా చూడమని ఆయన్ను పూజించడం ఆనవాయితి. నిశ్చితార్థానికి ముందు బంధువుల సమక్షంలో

పరోక్షంలో వధూవరుల తల్లి-తండ్రుల మధ్య కుదిరిన ఇచ్చి-పుచ్చుకునే ప్రతి చిన్న అంశం ఒక కాగితం మీద రాసుకోవడం కూడా సాంప్రదాయంలో భాగమే. ఇదంతా "ఆచారం-పద్ధతి". పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతోంటే పెళ్ళి సరంజామా కొనడం అనేది ఇరు పక్షాల వారికి కూడా పెద్దపని. పట్టుచీరలు, బంగారు ఆభరణాలు, నూతన వస్తువులు.. .. ఎన్నో కొంటారు.

## ముహూర్త నిర్ణయం

ముహూర్తం చూసే ప్రక్రియలో ముఖ్యంగా ఈ క్రింది విషయాలు గమనించాల్సి ఉంటుంది.

1) తారా బలం, 2) చంద్ర బలం, 2) లగ్న బలం, 3) పంచక రహితం, 4) ఏకవింశతీ మహా దోషాలు.

వీటితో పాటు చివరిగా ఆయా క్రతువులకు పనికి వచ్చే తిథి, వార, నక్షత్రాలనే వాడామా లేదా అనే విషయం కూడా తప్పకుండా నిర్ధారించుకోవాలి. ఉదాహరణకు మనం అడిగి మరీ పెట్టించుకునే "ఆదివారం" గృహ ప్రవేశం, ఉపనయనం, వివాహం మొదలైనవాటికి తగిన వారంగా పేర్కొనబడలేదు. బుధ, గురు, శుక్రవారములు చాలా వరకు శుభకార్యము లకు మంచివిగా పెద్దలు తెలిపారు. అయితే వారము కన్నా తిథి, తిథికన్నా నక్షత్రము, నక్షత్రముకన్నా లగ్నమూ అత్యంత బలీయములు. కనుక నక్షత్ర, లగ్నములు అనుకూలముగా ఉన్నచో తిథివారములు మధ్యస్థముగా ఉన్ననూ స్వీకరిస్తుంటారు.

ఒక పని ముఖ్యంగా వైదికసంబంధమైన వివాహ గృహప్రవేశాది క్రతువులు చేయతలపెట్టినప్పుడు ఈ విషయాలు అన్నీ గమనించి శుద్ధపరచిన శుభముహూర్తములు గ్రహించాలి.

## చంద్ర బలం

ఒక ముహూర్తం నిర్ణయించేటప్పుడు పరిశీలించవలసిన ముఖ్యమైన విషయాలలో చంద్రబలం ఒకటి. ముహూర్త సమయానికి చంద్రుడు ఉన్న రాశిని బట్టి బలాన్ని నిర్ణయించాలి. ఎవరికొరకు ముహూర్తం చూస్తున్నామో వారి జన్మ రాశినుండి, ముహూర్తం నిర్ణయించదలచిన రోజున చంద్రుడు ఉన్న రాశివరకు లెక్కించాలి.

జన్మ రాశినుండి ముహూర్త సమయ చంద్రరాశి

శుక్ల పక్షంలో : 2-5-9

కృష్ణ పక్షంలో : 4-8-12

శుక్లపక్షం, కృష్ణ పక్షం రెండిటిలోనూ : 1,3,6,7,10,11

అయితే మంచిది.

అనగా శుక్లపక్షంలో చంద్రుడు 4-8-12 స్థానాలలో ఉంటే ఆ ముహూర్తానికి చంద్ర బలంలేనట్లే. మిగతా స్థానాలలో ఎక్కడున్నా మంచిదే. కృష్ణపక్షంలో చంద్రుడు 2-5-9 స్థానాలలో ఉంటే ఆ ముహూర్తానికి చంద్ర బలం లేనట్లే. మిగతా స్థానాలలో ఎక్కడున్నా మంచిదే.

# 50.లగ్న పత్రిక వివరణ



ఆరు అంగుళముల వెడల్పు పన్నెండు అంగుళముల పొడవు గల రాగిరేకుపై లగ్నపత్రికను వ్రాసి ఒక రాగి పాత్రలో గాని, మట్టి పాత్రలో గాని నీటిని నింపి దానిలో ఆ లగ్న పత్రికను ఉంచి ఆ లగ్న పత్రికను ఈ క్రింది విధంగా ప్రార్థించాలి.

**ముఖ్యం త్వమసియంత్రాణాం బ్రహ్మణా నిర్మితం పురా ।**
**భవ భావాయ దాంపత్యోః కాలసాధన కారణమ్ ॥**

ఓ యంత్ర రాజమా! నిన్ను పూర్వము బ్రహ్మదేవుడు నిర్మించెను. యంత్రములలో ప్రధానమైనదానవు. వారి అన్యోన్యతకు, దాంపత్య జీవన యాత్రలో ఒడుదుడుకులు లేకుండ సంతోషాలు, ఆయురారోగ్యాలు కలుగజేసే దానివిగా ఆ దంపతుల పరస్పర ప్రేమకు కారణమగుదువు గాక. కొంతకాలం క్రితం లగ్న వివరములను ఇంటిలో గోడకు పసుపు, కుంకుమల మిశ్రమముతో వ్రాయుట ఆచారముగా కూడా కనిపించుచున్నది.

# 51.అంకురారోపణము



సర్వశుభకార్యాలు ప్రారంభించుటకు ముందు ఆ కార్యాలు శుభప్రదంగా జరగాలని ఈ కార్యం చేస్తారు. వివాహానికి వారం రోజుల ముందు ఒక శుభ తిథిలో బాజా భజంత్రీలతో బ్రాహ్మణులు, ముత్తైయిదువలతో ఊరికి తూర్పు లేదా ఉత్తరదిశలకు వెళ్ళి అచ్చట నుండి మంచి పుట్టమట్టిని సేకరించి ఐదుమట్టి మూకుళ్ళలో ఆ మట్టిని వేసి నవధాన్యాలను పాలతో, నీటితో తడిపి, ఆ మట్టిలో వేసి ఆయా దేవతలను ఆహ్వానించి పూజించాలి. అవి వివాహసమయము నాటికి మొలకెత్తుతాయి. వివాహ సమయంలో వీటిని మండపమునందు ఉంచి వివాహము జరుపుదురు. వీటిని వివాహమైన తరువాత పదహారురోజుల పండుగ వరకు ఉంచి ఆ తరువాత వీటిని విసర్జిస్తారు.

# 52.పసుపు కొట్టుట



పెండ్లి పనులు మొదలు పెట్టుటకు మంచిరోజు చూసి పసుపు కొట్టవలెను. రోకలికి, రోలుకు, నాల్గువైపులా అరచేతి సైజులో పసుపు పూసి, ఐదు కుంకుమ బొట్లు పెట్టాలి. ఈ విధంగానే రోకలికి కూడా పసుపు పూసి, కుంకుమబొట్లు పెట్టాలి. తరువాత ఐదుపోగుల దారమునకు పసుపురాసి తమలపాకు తోరము ముడివేసి రెండింటికి

కట్టవలెను. ముందుగా ఐదుగురు ముత్తైదువులకు కాళ్ళకు పసుపు రాసి రోటిలో ఐదు పసుపు కొమ్ములు వేసి వారిచే పసుపు కొట్టించవలెను. ఈ పసుపు కొమ్ములు మెత్తగానూరి తలంబ్రాలు బియ్యములో కలపవలెను. ముత్తైదువులకు ముఖాన కుంకుమ బొట్టు పెట్టి పండు తాంబూలములు, వారికి ఇవ్వవలెను. ఈ సందర్భంగా తరువాత ఒక చాటలో బియ్యము పోసి ఐదుగురు ముత్తైదువులచే బాగు చేయించవలెను. పెండ్లి కూతురుకు కొత్త చీర కొనిపెట్టవలెను. తరువాత రోజు నుండి ఇంటికి రంగులు వేయించుట మొదలైన అన్ని పెండ్లి పనులు చేయవచ్చును.

# 53.పందిరి రాట

మంచి ముహూర్తం చూసి పెళ్లి పనులకు శ్రీకారం చుట్టడానికి పందిరిరాట వేస్తారు. ఈ సందర్భంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా పెళ్లి జరిపించమని విఘ్నేశ్వరుని పూజించి మండపంలో పెట్టిన బియ్యం మూట కట్టి పూజ మందిరంలో పెడతారు. నిర్విఘ్నంగా పెళ్లి పూర్తి అయిన తరువాత నూక చేసి ఉండ్రాళ్ళు పోసి విఘ్నేశ్వరునికి నివేదిస్తారు.

# 54.కళ్యాణ మండప (వేదిక) నిర్మాణము



శాస్త్రోక్తంగా వివాహ కళ్యాణ వేదికను నిర్మించాల్సిన విధానాన్ని ఈ విధంగా చెప్పారు.

అశ్వని, పునర్వసు, పుష్యమి, హస్త, చిత్త, స్వాతి, అనూరాధ, శ్రవణం, ధనిష్ఠ, శతభిషం ఈ నక్షత్రములయందునూ; ఆది, సోమ, బుధ, గురు, శని వారములలో యోగ్యమైన తిథియందును; పంచమి, నవమి స్థానములలో పాపగ్రహములు లేని శుభలగ్నం చూచి వివాహవేదిక, పందిళ్ళు వేయించవలెను.

కళ్యాణ వేదిక 4 మూరల పొడవు, 4 మూరలు వెడల్పున్నూ ఒక మూర ఎత్తు కలిగి ఉండవలెను. గృహమునకు ఈశాన్య భాగమున ఏర్పాటు చేయాలి. నాలుగు మూలల నాలుగు స్తంభములు ఉండవలెను. లేక వధువు యొక్క చేతి మూరలు అయిదు మూరల వెడల్పు ఏడు మూరల బారు, ఒక మూర ఎత్తు ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. సింహద్వారము నుండి బయటకు వచ్చునపుడు ఎడమ ప్రక్కగా నుండవలెను.

వివాహ మండప నిర్మాణము నాలుగు వైపులా చతురస్రముగా ఉండే విధంగా నిర్మించాలి. పెండ్లి కుమార్తె చేతిమూరలతో ఎనిమిది లేక పన్నెండు మూరలతో ఈ వివాహ మండపమును చతురస్రముగా నిర్మాణము గావించాలి అని చెప్పబడింది. వివాహ మండపమునకు నాల్గు వైపుల ద్వారములు, మెట్లు ఉండవలయునని, దానిని పలురకాల దేవతా చిత్రపటములతో పూలమాలతో ఆకర్షణీయంగా, అందంగా అలంకరించవలెనని వశిష్ట మహర్షి, నారద మహర్షి మొదలగువారు తెలియజేసిరి.

## పులివేషం



సర్కారు జిల్లాలలో దసరా పండుగకు, తెలంగాణాలో పీర్ల పండుగకు పులి వేషం కడతారు. ఇది తెలుగువారి వేడుక. డప్పు వాద్యానికి అను గుణంగా అడుగులు వేస్తూ, పులి ఇతర జంతువులను ఎలా ఒడుపుగా వేటాడుతుందో చక్కగా ప్రదర్శిస్తారు ఈ కళాకారులు.

# 55.పెండ్లి పెట్టె



మంచిరోజున జాకెటు ముక్క, పసుపు, కుంకుమ ఒక పెట్టెలో పెట్టెదరు. వక్కలు, ఖర్జూరాలు, అప్పగింతల బట్టలు, తలంబ్రాల బియ్యము, తలంబ్రాలు బట్టలు, వడిగట్టు బియ్యం, ఆడపడుచు బట్టలు, తలపాగ, పిల్ల మేనమామల బట్టలు, తాళిబొట్టు, బటువు, కంకణము, ఉత్తర జన్యములు, పెండ్లి కుమారునకు ఇచ్చు వెండి సామాను పెండ్లి కుమార్తెకు ఇచ్చు నగలు సర్దవలెను.

# 56.మంగళ సూత్రము తీసుకురావటము



మేళతాళాలతో కంసాలి వద్దకు వెళ్ళాలి. ఒక పళ్ళెములో జాకెటు ముక్క, పసుపు, కుంకుమ, ఎండు కొబ్బరిచిప్ప, ఆకులు, పండ్లు 6, కంసాలికి దక్షిణ ఇవ్వవలెను. ఆడవాళ్ళు, మగవాళ్ళు వెళ్ళవచ్చును. కంసాలి సూత్రమునకు పూజచేసి ఇచ్చును. పెండ్లిపెట్టెలో సర్దుకొన వలెను. మంగళ సూత్రము తెచ్చిన తరు వాత ఇంటిలో నిదురచేయరాదు. కావున పెండ్లి రోజుననే తీసుకురావలెను.

# 57.స్నాతకం/సమావర్తనము



స్నాతకోత్సవం వివాహ ఘట్టంలో మొదటి మెట్టు. పెళ్లి రోజుకు ఒకరోజు ముందర "స్నాతకం" అనే ముఖ్యమైన కార్యక్రమం జరుపుకోవడం ఆచారం. పెళ్ళి కుమారుడి ఇంటిలో గాని, కళ్యాణ మండపంలో గాని లేదా విడిదిలో గాని పురోహితులు స్నాతక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. విఘ్నేశ్వర పూజతో మొదలుపెట్టి, అన్ని ప్రాయశ్చిత్తాల కోసం, శరీర శుద్ధి కోసం బ్రాహ్మణులు వరుడితో గోత్ర ప్రవరలు చేయిస్తారు. స్నాతకం అనే ఈ "సంస్కారం", ప్రధానంగా, వరుడిని "బ్రహ్మచర్యం" నుండి "గృహస్థాశ్రమం" స్వీకరించడానికి సిద్ధంచేస్తున్న కార్యక్రమం. గురువు (ఇక్కడ పురోహితుడు) ఆదేశంతో–అంగీకారంతో "గృహస్థాశ్రమం"

స్వీకరించే ఏర్పాటిది. ఆ సమయంలో గురువు చేయాల్సిన హిత బోధ తైత్తిరీయోపనిషత్తులోని "సత్యాన్న..." అన్న ఒక శ్లోకరూపంలో వుంటుంది. "సత్యం విషయం లోను, ధర్మం విషయంలోను, తెలివితేటల విషయం లోను, పొరపాటు పడవద్దు" అన్న ఆదేశం అది. తల్లిని, తండ్రిని, అతిథిని దేవుడులా భావించాలని చెప్తారు. సమాజ శ్రేయస్సే ధ్యేయంగా జీవించమని, దానం చేసేటప్పుడు శ్రద్ధగా చేయమని, తాహతుకు మించి దానం చేయొద్దనీ–ఇంతకంటె ఎక్కువ దానం చేయలేకపోతున్నందుకు సిగ్గుపడుతున్నానని భావించమనీ బోధిస్తాడు పురోహితుడు. పెద్దవారి నుంచి ధర్మ సూక్ష్మాలను తెలుసుకొని–వారనుసరించిన మార్గాన్ని ఎంచు కోమని అంటూ, "వరుడికి శుభం కలుగుగాక" అని ఆశీర్వదించి గురువు వరుడిని గృహస్థాశ్రమానికి సిద్ధం చేస్తాడు.

హిందూ వివాహ సంప్రదాయ పద్ధతిలో భారతీయ ఆలోచనా విధానాన్ని తెలియచేస్తాడు పురోహితుడిక్కడ. స్నాతకానికి "సమా వర్తనం" అన్న పేరు కూడా ఉంది. సమా వర్తనమంటే, తిరిగి రావడమని అర్థం. విద్యాభ్యాసం పూర్తి చేసుకొని, గురువు హిత బోధతో పాదయాత్ర చేస్తూ తిరిగి రావడాన్నే సమావర్తనం అంటారు. స్నాతకం మంత్రపూర్వకంగా జరుగుతుంది. ఆ మంత్రాలకు చింతనలు రాలతాయి.

**అపోహిష్ఠామయోభువః తాన ఊర్జే దధాతవ!**
**మహేరణాయ చక్షసేః**

అంటే ఓ ఉదకవలులారా! మాకు మీరు సుఖాల్ని కలుగజేస్తారు. మాకు మీ దయవల్లే అన్నం దొరుకుతోంది. మీవల్ల వచ్చిన శక్తి ద్వారా

మేము గొప్ప జ్ఞానాన్ని పొందజాలుతున్నాము. ఇంకా సత్సంగాన్ని ప్రసాదించవలసిందని ఇలా ఇలా చాలా ఆకాంక్షలు స్నాతక శ్లోకాలలో ఉంటాయి. భవిష్యకాలం బాగా వుండాలనే కోరికలుంటాయి. ఆ కోరికల్లో దేశభక్తి పాలు కూడా వుంటుంది.

**సమాజంచ విరాజంచాభి శ్రీర్యాచనోగృహే!**

**లక్ష్యైరాష్ట్రస్య యాముఖే తయామాసగం స్నజామసి స్వాహా!**

అంటే నేను నివసించే ఇల్లూ దేశమూ సిరిసంపదలతో తులతూగాలి అని. ఈ స్నాతకం వరుని ఇంట్లోగాని, కల్యాణమండపంలో, విడిదిలోగాని పురోహితుని ఆధ్వర్యంలో జరగాలి.

అప్పుడు ఆ బ్రహ్మచారి 'సరే' అనిపించడానికి, అర్థించడానికి – వయస్సులో పెద్దవాడు గాబట్టి కన్యతండ్రి తన కుమారుని చేతగానీ, కన్యామణికి సోదరుని వరస అయిన బంధువు చేతగానీ, బట్టలూ, చెరకు రసమూ, పానకమూ ఇచ్చి బ్రతిమాలింపజేస్తాడు. ఇప్పుడు చెరకు రసం బదులుగా బెల్లాన్ని వాడడం జరుగుతోంది. ఈ చెరకు రసం ఎందుకు ఉపయోగిస్తారంటే – చెరకు మన్మథుని విల్లు – ఈ వింటి రసం సేవిస్తే మన్మథుడు ఆ బ్రహ్మచారి మనస్సుని గృహస్థాశ్రమం వైపు మళ్ళింప జేస్తాడని నమ్మకం.

చెరకు రసంతో తయారైంది బెల్లం కాబట్టి బెల్లం వాడటం పరిపాటి అయింది. పానకం వీర్యవృద్ధిని కలిగిస్తుంది. (అలాగని అతిగా సేవించ కూడదు) పానకంలో ఉపయోగించే 'మిరియాలు' శరీరంలో చాలా

రుగ్మతలని పోగొట్టి, పునస్సంధాన సమయంలో ఆరోగ్యవంతుణ్ణి చేస్తా యని పూర్వీకుల నమ్మకం! కాబట్టి కన్యాదాత వరుణ్ణి కన్యను చే(సి) కొమ్మని బ్రతిమాలడం, అతను సరే అనడంతో ప్రధమ ఘట్టం పూర్తవు తుంది. స్నాతకోత్సవంలో ఈ సంప్రదాయాన్ని జోడించి మొత్తం కార్యక్రమాన్ని స్నాతకంగా పరిగణిస్తున్నారు.

స్నాతకం అంటే, బ్రహ్మచారికి అనేక రొగాలకి ప్రాయశ్చిత్తం. సాధారణంగా వివాహం అయ్యేవరకు వరుడు అద్దం చూసుకోకూడదు. అలంకరించుకోకూడదు. అసభ్యకరమైనటువంటి పద జాలాలను వాడటం కాని, చూడటం కాని చేయకూడదు. అందమైన ఆడవారు కనిపించి నప్పుడు, వారిని చూడడం కాని, వారితో పరాచకాలాడటం కాని చేయ కూడదు. మరి అలాంటి బ్రహ్మచారి మరి ఇప్పుడు ఎవరు దొరుకుతారు. కాబట్టి, బ్రహ్మచారిగా ఉండి, తాను చేసిన దోషాలన్నింటికి ప్రాయశ్చిత్తం ఈ స్నాతకం. స్నాతకం, యజ్ఞోపవీతధారణ అర్హత ఉన్నవారు మటుకే చేసే క్రతువు ఉపనయనము. చిన్న వయసులో చేసి, అతడు ప్రతిరోజు సంధ్యావందనాది క్రియలు సక్రమంగా చేసినట్లు అయితేనే స్నాతకం, లేకపోతే అతనికి కూడా శమీవృక్ష దర్శనంతో (సంధ్యావందనాది అధికారం లేని ఇతర కులాలవారు చేసే ప్రాయశ్చిత్తం) సరి. పైగా, ఉపనయనం కూడా వివాహానికి ఒకటి రెండు రోజుల ముందు చేసుకునే ప్రబుద్ధులు ఉన్నారు. వారికి కూడా శమీవృక్ష దర్శనమే.

అలాగే, స్నాతకుడై ఉన్న వరుడు ఎన్నో ప్రమాణాలు చేస్తాడు. మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిధిదేవోభవ, నగ్నంగా

స్నానం చేయనని వ్యక్తి శరీరాన్ని నాభి నుండి తలవరకూ, నాభి నుండి పాదాలవరకూ, అడ్డంగా రెండు భాగాలుగా చేశారు. నాభి నుండి క్రిందకి ఉన్న శరీరాన్ని రాక్షస శరీరం అని, తల వరకు ఉన్న శరీరాన్ని దైవ శరీరం అని అంటారు. ఈ రెండు శరీరాలను విభజించడానికి మొలకు త్రాడు కడతారు. స్త్రీలకు వడ్డాణం పెడతారు. దైవ శరీరాన్ని, రాక్షస శరీరాన్ని విడగొట్టే ప్రదేశం. ఎప్పుడూ వస్త్రంతో కట్టబడాలి.

వర్షంలో తడవను అని, పరిగెత్తను అని, ఇప్పుడు వివాహానంతరం నా కోసం ఎదురు చూసే వారు ఉన్నారు, వారు నాకు అనారోగ్యం కలి గితే బాధ పడతారు అని, చెట్లు ఎక్కను అని, దిగుడు బావిలోకి దిగను అని, ఇలాంటి అనేకరకములైన ప్రమాణాలు చేసి వరుడు కళ్యాణవేదిక దగ్గిరకి బయలుదేరుతాడు.

వేడి నీళ్ళని చల్ల నీళ్ళలో పోసి, ఆ నీటితో అభ్యంగన స్నానం చేయించడమే ప్రధమంగా ఉంటుంది. వేడి నీటిలో చన్నీళ్ళను కలపడం వల్ల వైద్య శాస్త్ర రీత్యా (రొంప, జలుబు) అనే రోగాలు దరికి రావు. అలా కాకుండా నలుగుపిండిని రాసుకుని స్నానం చేస్తే అది దానికి ఉపశాంతి. మంగళస్నానం మన వారు ఆచరించేటప్పుడు తప్పకుండా నలుగుపిండి రుద్దుకోమనడం కూడా అందుకే. (పండుగలప్పుడు కూడా)

స్నానమయ్యాక అతడు తనకి, తన గురువుకీ, చెవులకి ధరించడానికి కుండలాల్ని, వస్త్రాలని, గొడుగుని, రెండు చెప్పుల జతని, నలుగుపిండిని, తలంటు నూనెని తలపై ధరించే తల పాగాను గురువుకి సమర్పించి, తానూ ధరించి, ఇంకా పైచదువులకి కాశీకి బయలుదేరుతాడు.

# 58.కాశీ యాత్ర



బాజా భజంత్రీల మధ్య వరుడు గొడుగు పట్టుకొని చేత్తో కర్ర పుచ్చుకొని కాళ్ళకు పాదు కలు ధరించి మెడలో పసుపు బట్టను వేసుకొని తాను సన్యాసం స్వీకరించేందుకు కాశీయాత్రకు పోతున్నానని బయలు దేరుతాడు. కాశీ యాత్ర ఘట్టం స్నాతకంలో చాలా సరదాగా జరిగే కార్యక్రమం. తన శేష జీవితం ఇక కాశీలో గడపాలని భావిస్తున్నానని, దానికి బంధు-మిత్రుల అనుజ్ఞ కావాలని వరుడు కోరతాడు. క్షణికా వేశంలో తీసుకున్న నిర్ణయం సరైందికాదని, గృహస్థాశ్రమం స్వీకరించి,

ధర్మ బద్ధంగా ఇంద్రియ సుఖాలను అనుభవించి, పరిపూర్ణమైన వైరాగ్యం కలిగిన తర్వాతనే భార్యా సమేతంగా వానప్రస్థాశ్రమంలో ప్రవేశించాల్సిందిగా పురోహితుడు (గురువు) హితవు పలుకుతాడు.

ఇక పెళ్ళి కూతురు వైపునుంచి వచ్చిన వారు (బావ మరిది–మేన మామ–తాత గారు లాంటి వారు) "బంగారు ఆభరణాలతో అలంకరించ బడిన వారి "అమ్మాయి" నిచ్చి వివాహం చేద్దామనుకుంటున్నామని, అగ్నిసాక్షిగా అమెను వివాహమాడమని, ముందుగా తమ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరించమని వరుడికి నచ్చచెప్పి, కాశీయాత్ర ఆలోచనను విరమింపచేసే ఘట్టం ఇది.

చాలా కోలాహలంగా పెళ్ళికి "తరలి పోయే ముందర" జరిగే సరదా కార్యక్రమం ఇది. ఇలా స్నాతకం వ్రతాన్ని పూర్తి చేసుకొని, వరుడి బంధు–మిత్రులందరు వధువు గృహానికి (వసతి గృహానికి) బయలుదేరుతారు. బయలుదేరే ముందు, మంగళ స్నానాలు చేయడం, అలంకరించుకోవడం, పల్లకి లాంటి వాహనాలు సిద్ధం చేసుకోవడం మామూలే. బయలుదేరే ముందర, శుభకార్యానికి బయలుదేరుతున్నామని, వెనక్కు పిలవడం – నిందించడం – దగ్గడం, తుమ్మడం లాంటివి లేకుండా వుండాలన్న అర్థం వచ్చే మంత్రాన్ని చదువుతారు. కొన్ని కులాల వారికి ఈ సంప్రదాయం లేదు. ఈ సమయంలో శకునాలన్నీ మంగళప్రదంగానే ఉండాలని అనేక శకున మంత్రాలు పఠిస్తాడు.

# 59.పెళ్ళికొడుకును-పెళ్ళికూతురును చేయడం



పెళ్ళికి ముందర ఒక మంచి రోజున గానీ, స్నాతకం-అంకు రార్పణల రోజున గానీ పెళ్ళికొడుకును-పెళ్ళికూతురును చేయడం ఆచారం. మంగళ స్నానాలతో ఆ ఉదయం కార్యక్రమం మొదలవుతుంది. వధూవరుల ఇళ్లలో, ఉదయం తెల-తెలవారుతుండగానే, మంగళ వాయిద్యాల మధ్య ఇంటి ముందర మామిడి ఆకులతో తోరణం కట్టే కార్యక్రమం ముందుగా జరుగుతుంది. ఇంటిముందు తాటాకు పందిరి వేయించి, దానిని రంగు రంగుకాగితాలతో అలంకరించాలి. తరువాత ఆ పందిరి కింద శుభ్రం చేసి కళ్ళాపితోగానీ, మంచినీటితో గాని తుడిచి దానిపై

బియ్యపు పిండితో అందమైన ముగ్గును వేసి పసుపు కుంకుమలతో అలంకరించాలి. దానిపైన రెండు పీటలు వేసి, ఆ పీటలపైన తెల్లని వస్త్రము వేసి అక్షతలు చల్లవలెను. తరువాత మేళ తాళాలతో గుమ్మానికి, పందిరికి మామిడి తోరణాలు కట్టాలి. హారతి పళ్ళెము అక్షతలు, కుందులు, నూనె, అగ్గిపెట్టి అన్ని సిద్ధముగా ఉండే విధంగా చూడాలి. అమ్మాయి కాళ్ళకు పసుపు పూసి, ఎడమ బుగ్గన చుక్క పెట్టి తాంబూలంలో ఆకులు, వక్కలు, అరటిపండ్లు అన్ని జంటగా ఉంచి, ఆమె చేతిలో పెట్టి తూర్పు ముఖంగా పీటపై కూర్చోబెట్టాలి. స్నానము చేయనవసరములేదు. వధువుకు, కన్యా దాత దంపతులకు, తోటి పెళ్ళి కూతురుకు (వధువు సొంత చెల్లెలు గాని, వరుసకు చెల్లెలు గాని), తెల్లవారక ముందే, ముత్తైదువలు బొట్టు పెట్టి, మాడుపై నూనె అద్ది, హారతిచ్చి, మంగళ స్నానాలకు సిద్ధం చేస్తారు. పెండ్లికూతురునకు ఎడమవైపున తోడు పెండ్లికూతురును కూర్చోబెట్టాలి. తరువాత బంధువుల చేత, ముత్తైదువల చేత హారతులు పాడించి వారిచేత ఆశీర్వాదాలు పొందాలి. అక్షింతలు వేసి హారతి కళ్ళకు అద్ది, ఇద్దరికి నూతన వస్త్రాలు పెట్టవలెను. మాడుకు, చేతులకు నెయ్యి రాసి, శనగ పిండిలో నీళ్ళు కలిపి పేస్టులా చేసి అది కూడా చేతులకు, ముఖానికి రాస్తారు. సరదాసరదాగా రోలుకు రోకలికి ఐదుపోగుల దారమునకు పసుపురాసి తమలపాకు లేక పసుపుకొమ్ము ముడివేసి రెండు తోరణములు కట్టెదరు. రోటిలో ఐదు పసుపుకొమ్ములు వేసి ఐదు మంది ముత్తైదువులుచే పసుపు కొట్టించవలెను. ఈ పసుపు

మెత్తగా కొట్టి తలంబ్రాల బియ్యములో కలుపవలెను. ఒక పీట మీద తడి టవలువేసి పసుపుతో గౌరమ్మను చేసి తమలపాకులో పెట్టి పీటమీద పెట్టాలి. తరువాత గౌరమ్మకు గొలుసు వేసి గౌరీపూజ చేయాలి. పూజ చేసిన తరువాత ఈ పీట మీద మినప పిండితోకానీ శనగ పిండితోకానీ ఐదు లేక తొమ్మిది మంది ముత్తైదువులచే వడియాలు పెట్టించాలి. తొమ్మిది లేక పదకొండుమంది ముత్తైదువులకు అమ్మాయిచేత గాజులు ఇప్పించాలి. అమ్మాయికి కుడిచేతికి 11 గాజులు, ఎడమచేతికి 10 గాజులు తొడిగించాలి. రెండు చేతులకు కలిపి 21 గాజులు ఉండాలి. తలస్నానం చేయించిన తరువాత నూతన వస్త్రాలు ధరించి కాళ్ళకు పారాణి, బుగ్గన చుక్క, తలలో పూలు, చేతిలో తాంబూలాలతో పీటలమీద కూర్చో బెట్టాలి. అలానే వరుడికి, తల్లి-తండ్రులకు, తోటి పెళ్ళికొడుకుకు (వరుడి సొంత తమ్ముడు గాని, వరుసకు తమ్ముడు గాని) కూడా జరుగుతుంది. పెళ్ళి కుమారుని చేయగానే ఆ పెళ్ళి కుమారునిలో సాక్షాత్తు నారాయణుడు ప్రవేశిస్తాడు. అందుకే పెళ్ళి కుమారునికి పెళ్ళికళ వచ్చింది అంటారు. అటువంటి సాక్షాత్తు విష్ణు స్వరూపుడైన పెళ్ళికుమారుడు చేసే ప్రతిపని లోనూ అతనికి సహాయడపడటానికి తోడు పెళ్ళికొడుకు పనికివస్తాడు అని చెబుతారు. ముందుగా అబ్బాయిని పెండ్లి కొడుకుగా చేసిన తరువాత అమ్మాయిని పెండ్లి కూతురుగా చేయుట మంచిది. ఈ విషయంలో కనీసము 10 నిమిషాలు అయినా తేడా పాటించాలి. మంగళస్నానం తర్వాత నూతన వస్త్రాలు ధరింపచేసి కల్యాణ తిలకం దిద్దుతారు. కాళ్లకు పసుపు రాసి, పారాణి అద్దుతారు.

# 60.వరపూజ (ఎదురుకోలు)

కాశీయాత్ర విరమించుకొని వరుడు కళ్యాణ మండపానికి వస్తుంటే కన్యాదాత మేళ తాళాలతో, పానకం బిందెలతో, కొత్త బట్టలతో ఎదురేగి స్వాగతం పలుకుతాడు. మగపెళ్ళి వారు విడిదికి చేరుకోగానే, అప్పటికే వారికొరకు ఎదురు చూస్తున్న ఆడ పెళ్ళి వారు, "ఎదురు కోలు" పలికే ఆచారం సరదాగా, సందడిగా జరుపుకునే మరో వేడుక. విడిదిలో ఏర్పాట్లన్నీ పూర్తి చేసి (సబ్బులు, పేస్టులు, బకెట్లు, తుండు గుడ్డలు, వేడి నీళ్ల లాంటివి) ముందు (హాలులో) భాగంలో పెద్ద తివాచీ లాంటిది పరిచి ఎదురు చూస్తుంటారు ఆడ పెళ్ళి వారు.

మేళ-తాళాలతో ఆహ్వా నించి కాబోయే అత్తగారు, మామగారు, వారి సమీప బంధువులు ఎదురు కోలలో భాగంగా, విడిదిలోకి ప్రవేశించే ముందర కాళ్లు కడుక్కోవడానికి మగ పెళ్ళి వారందరికీ నీళ్లిస్తారు. పెళ్ళికొడుకు ఆ పనిని బావమరిదితో చేయిస్తారు. ఈ కాళ్లు కడగడమనేది రెండు-మూడు పర్యాయాలు జరిపే వ్యవహారం.

పానకం వరునికి ఇచ్చి రుచి చూపించి తరువాత బంధువులందరికీ ఇస్తారు. ఆ తర్వాత అందరికీ కాఫీ-పలహారాలిచ్చి మర్యాదలు చేసి, స్నానాలు ముగించుకొని సిద్ధంగా వుంటే, భోజనాలకు తీసుకెళామంటారు. లేదా అక్కడే ఏర్పాటు చేస్తారు.

# 61.ముఖాలు కడిగించు వేడుక

ఈ వేడుక చూచేవారికి వేడుక జరిపించేవారికి చాలా సరదాగా ఉంటుంది. పెండ్లి కూతురు తల్లి, పెండ్లికొడుకు తల్లిని వారి బంధువులను ముందుగా కుర్చీలలో కూర్చుండబెట్టాలి. టూత్‌పేస్ట్, బ్రష్‌ను, పట్టుకొని, బ్రష్ వెనుకవైపు చూపుతూ వారి అందరి ముందు నడిచెదరు. అద్దము వెనక వైపు చూపుతూ దువ్వెన వెనుకవైపుకు పెట్టి దువ్వెదరు. ఈ విధంగా కుర్చీలలో కూర్చున్నవారిని ఆటపట్టించెదరు.

మరమరాల దండలు, కూరగాయలతో దండలు, చాక్లెటు కాగితముతో దండలు, కిరీటములు, వడ్డాణము, వంకీలు, టోపీలు, బంగారు కలరు పేపరుతో తయారుచేసినవి పెట్టి ఆట పట్టింతురు.

బిస్కట్లతో తయారు చేసిన చీర పెట్టెదరు, దోసకాయ చదరముగా గుంటచేసి నిమ్మచెక్కలో నూనె పోసి వెలిగించి, దోసకాయలో పెట్టి కుడిచేతితో దోసకాయ తొడిమ పట్టుకొని ఎడమచేతితో హారతి అద్దెదరు. లేనిచో బంగాళదుంప గుంటచేసి నూనెపోసి వత్తిపెట్టి ఎడమచేతితో హారతి ఇస్తారు.

ఒక ప్లేటు పట్టుకొని స్పూనుతో కొడుతూ శబ్దము చేయుదురు. వియ్యపురాలికి లడ్డు, అరిశెలు, అప్పడాలు, వడియాలు, మినపపిండి

ముద్ద, చీర, పసుపు కుంకుమ తాంబూలం అందజేస్తారు. ఈ వేడుకకు వచ్చినవారందరికి గుర్తుండేవిధంగా పంచిపెట్టు సామాను బహుమతిగా ఇస్తారు.

పెండ్లి కొడుకు తల్లి పెండ్లికూతురు తల్లిని వారి బంధువులను కుర్చీల్లో కూర్చుండ పెట్టి ఇదే విధముగా జరుపుదురు. స్నాతకము అయిన తరువాత ముఖాలు కడిగించి వివాహ వేదిక వద్దకు రమ్మని చెప్పెదరు. ఈ వేడుక ఆ సమయంలో కుదరనిచో వివాహము అయిన తరువాత ఇరువర్గాలవారు ఎదురెదురుగా కూర్చొని సరదాగా జరుపుకొందురు.

# 62.లాజహోమం

లాజ అంటే వరిపేలాలు. ఇది వధువు చేసే ఒక యజ్ఞం వంటిది. భర్త శాశ్వత ఆయువుతో విలసిల్లడానికి తాను దీర్ఘసుమంగళిగా ఉండ డానికి లాజహోమం చేస్తుంది. వధువు లాజల్ని హోమం చేస్తుంది కూడా. దీనివల్ల అగ్నిహోత్రుడి అనుగ్రహం కూడా కలుగుతుందని విశ్వాసం.

# 63.గౌరీ పూజ-వర పూజ



ఒక వైపు వధువు గౌరీ పూజ, మరో వైపు వరుడున్న విడిదిలో వర పూజకు సన్నాహాలు మొదలవుతాయి. హిందూ సంప్రదాయం ప్రకారం వధువుని "లక్ష్మి, పార్వతి, సరస్వతి"ల ఉమ్మడి రూపంగా భావిస్తారు. పచ్చదనంతో లోకాన్ని చైతన్యపరిచే ప్రకృతి ప్రతిరూపంగా వధువుని అలంకరిస్తారు.

ఇక వరుడిని త్రిమూర్తుల దివ్యస్వరూపంగా, విధాత చూపిన విజయోన్ముఖ పథంలో విజ్ఞతతో నడిచేందుకు సిద్ధమైన సిద్ధ పురుషుడుగా

భావిస్తారు. వధువుకు నలుగు స్నానం చేయించి, పెళ్ళి కూతురుగా అలంకరించి, కళ్యాణం బొట్టు దిద్ది, పాదాలకు పారాణిని పూసి, పూల జడ వేసి, నూతన వస్త్రాలను కట్టించి (పట్టు చీరె) "గౌరీ పూజ"కు తీసుకెళ్తారు.

గౌరీ పూజకు వధువుని సిద్ధం చేస్తూనే, వర పూజ కొరకు విడిదికి వెళ్తారు ఆడ పెళ్ళి వారు. కన్యా దాత మేళ తాళాలతో, పానకం బిందెలతో, కొత్త బట్టలతో వచ్చి మగ పెళ్ళి వారికి స్వాగతం పలికే వేడుక ఇది.

పానకం వరుడికి ఇచ్చి రుచి చూపించి తరువాత బంధువులందరికీ ఇస్తారు. వరపూజలో భాగంగా, ఆడ పెళ్ళి వారు-వారి వైపు బంధువులు వచ్చి, వివాహం చేసుకోవడానికి రమ్మని మగ పెళ్ళివారిని ఆహ్వానిస్తారు. వరపూజలోనే ఇరువైపువారు, ఒకరినొకరు లాంఛనంగా ఆహ్వానించు కోవడానికి "శుభలేఖలు" మార్చుకుంటారు.

వరపూజ కార్యక్రమం జరుగుతుండగానే, కన్యాదాత ఇంట్లో, వధువు గౌరీ పూజ సమాంతరంగా కొనసాగుతుంటుంది. మగ పెళ్ళివారందరు కన్యా దాత ఇంటికి చేరుకునే సమయానికి, వధువు గౌరీ పూజ ఇంకా కొనసాగుతూనే ఉంది. ఇది ఆచారం-సాంప్రదాయం.

## కీలుగుర్రం నృత్యం

గుర్రంలాగా తయారు చేసుకొని ఒకరు రెండు భుజాలకు తగిలించుకొని తప్పెట దరువుకు అనుగుణంగా గుర్రంలాగా అడుగులు వేయటం కీలుగుర్రం నృత్యం అంటారు.

# 64.గోత్రం-ప్రవర

గౌరీ పూజ జరిగే చోట ఒక్కసారి, లాంఛనంగా, ఇరు పక్షాల వారి గోత్రం–ప్రవర చెప్పే కార్యక్రమం, పురోహితుల చాతుర్యాన్ని బట్టి అత్యంత ఆసక్తికరంగా వినసొంపుగా వుంటుంది. "గోత్రం" అంటే వంశం, "ప్రవర" అంటే ఆ వంశం మూల పురుషుల సమాచారం. మీ అమ్మాయిని, మా అబ్బాయికి ఇచ్చి వివాహం జరిపించమని వరుడి తండ్రి, కన్యా దాతను కోరడమే ఈ వేడుక ముఖ్య ఉద్దేశం.

**"చతుస్సాగర పర్యంతం గో బ్రాహ్మ ణేభ్య శ్శుభం భవతు– త్రయార్షేయ ప్రవరాన్విత యజుర్వేదినే, తైత్తిరీయ శాఖాధ్యాయినే, ఆపస్తంబ సూత్రిణే, శర్మణో నప్త్రే, శర్మణ పౌత్రాయ, శర్మణ పుత్రాయ, .. శర్మణే వరాయ, భవదీయాం కన్యాం ప్రజాసహత్వ కర్మభ్యో వ్రణీమహే"**

(మూడు ఋషులున్న గోత్రం కలవాడూ, యజుర్వేదాన్ని అభ్య సించిన వాడూ, ఆ వేదం ప్రకారం తన ఇంటి కార్యక్రమాలను నడిపించే వాడూ, తైత్తరీయ శాఖను–ఆపస్తంబ సూత్రాన్ని అభ్యసించి అనుసరించే వాడూ, మునిమనుమడూ, మనుమడూ, పుత్రుడూ అయిన అనే వరుడికి మీ కూతురునిచ్చి వివాహం చేయమని అడగడానికి వచ్చాం" అని అడుగు తాడు. ఇలా వంశం వివరాలు చెప్పడం వల్ల కన్యాదాత చివరివరకూ ఆలోచించుకునే అవకాశం వుందింకా.

ఇవేవీ తెలియకపోతే (అందరి సమక్షంలో), ఫలానావారి పిల్లవాడిని చేసుకున్నాం-ఇప్పుడు అనుభవిస్తున్నాం అని భవిష్యత్‌లో అనవచ్చు. కన్యాదాత, వరుడి వివరాలు ముత్తాత తరం దగ్గర నుండి విన్న తర్వాత, ఆ సంబంధం తనకి ఇష్టమైతే, వెంటనే తన వధువు (కూతురు) వివరాలు కూడా చెప్పి అబ్బాయి తన కూతురుని చేసుకోమని అడుగుతాడు.

**వివాహ నిబంధనలు :** గౌతముడు మరియు ఆపస్తంబుడి ప్రకారము, సగోత్రీయుల మధ్య వివాహాలు కుదరవు, చేసుకోకూడదు. ఎందుకంటే ఒకే గోత్రములో పుట్టినవారు ఒకే ఇంటి వారవుతారు. కాబట్టి వారు అన్నా చెల్లెళ్ళో , అక్కా తమ్ముళ్ళో, తండ్రీ కూతుళ్ళో , తల్లీ కొడుకుల వరస కలవారో అవుతారు.

## కోతికొమ్మచ్చి

ఈ ఆటలో ముందుగా ఒకరిని దొంగగా ఎన్నుకుంటారు. మిగతా వారిలో ఎవరో ఒకరు ఒక కర్రను వృత్తాకారంలో గీచిన గీతలోనుండి విసురుతారు. ఇలా వృత్తాకారంలో గీచిన గీతను గిరి అని కూడా పిలుస్తారు. అలా విసిరిన కర్రను దొంగ తీసుకొచ్చి గిరిలో ఉంచుతాడు. ఆ తర్వాత మిగతా వారిలో ఎవరో ఒకరిని తాకడానికి ప్రయత్నిస్తాడు. వారు అతనికి దొరకకుండా చెట్లెక్కి దాగి ఉంటారు. దొంగ వారిలో ఎవరో ఒకరిని తాకగల్గితే అలా దొరికిన అతను తర్వాత దొంగ అవుతాడు. ఒక వేళ దొంగ ఒకరిని తాకే ప్రయత్నంలో ఉండగా ఎవరో ఒకరు గిరిలో ఉన్న కర్రను తొక్కినట్లయితే మరలా అతనే దొంగగా ఉంటాడు.

# 65.గంపలో వధువు




కొత్తగా అల్లిన వెదురు గంపకు పసుపు కుంకుమలతో అలంకరిస్తారు అందోల ధాన్యం, బియ్యం, పోసి గౌరి పూజ చేసిన వధువును ఆ గంపలో కూర్చోబెట్టి పెండ్లి మండపంలోకి తీసుకొస్తారు

ఆమె మేనమామలు ఇది తెలుగు వారి ఆచారం. వధువును వివాహ మాడే హక్కు మేనమామకు, లేదంటే ఆయన కొడుకుకు గానీ ఉండేది. ఆ మేనమామ సమ్మతితోనే వివాహం జరుగుతుందని అనడానికి గుర్తుగా

ఆయనే స్వయంగా వధువును తెచ్చి కన్యాదానం చేయిస్తాడు. ఆ సమయంలోనే మేనమామకు మగ పెండ్లివారు దుస్తులు (సారే) పెట్టి సత్కరిస్తారు.

కొబ్బరిబోండా మానసిక స్వచ్ఛతకు చిహ్నం. అలానే, అందులోని పీచులాగా, ఎల్లవేళలా ఇరువురు విడిపోకుండా, అల్లుకు పోయి జీవిస్తామని–సత్ సంతానం కలవారమవుతామని సంకేతం కూడా ఈ వేడుకలో వుందంటారు పెద్దలు. ఈ తంతును ప్రాలగంప అని కూడా అంటారు.

వివాహవేడుకలో పెళ్ళికొడుకును విష్ణుమూర్తిగాను, పెళ్ళికూతురును లక్ష్మీదేవి గాను భావిస్తారు. పెళ్ళికూతురు గౌరీపూజ చేసినతరువాత ఆమెను లక్ష్మీదేవిగా భావించి ఆమె మేనమామలు వెదురుబుట్టలో మోసు కువస్తారు. పూజ తరువాత లక్ష్మీదేవి నేలపై నడకూడదని భావించి అలా మోసుకువస్తారు.

ఇంకొక ప్రాచీన కారణం ప్రకారం పాతకాలంలో నేల గరుకుగా, రాళ్ళు గుచ్చుకునేలా ఉండడం వల్ల, పెళ్ళికూతురు గాయపడకుండా ఉండడానికి, గౌరి పూజ తరువాత ఆమెను అలా గంపలో తీసుకువస్తారని వ్యవహారంలో ఉంది.

# 66.కాళ్లు కడగడం



వివాహంలో కన్యాదానం ప్రధాన తంతు. పెళ్లిలో వరుడి కాళ్లు వధువు తండ్రి కడగడం సంప్రదాయంగా వస్తోంది. ఇలా పెళ్లికొడుకు కాళ్లు కడగడానికి ఓ కారణముంది. అసలీ తంతు ఎలా జరుపుతారంటే ముందుగా కళ్యాణ వేదికపై వరుణ్ణి పడమటి ముఖంగా కూర్చో బెడతారు. కన్యాదాత తూర్పుముఖంగా కూర్చుంటాడు.

వరుణ్ణి శ్రీమహావిష్ణు స్వరూ పునిగా భావించి కన్యాదాత పూజించి సత్కరిస్తాడు. నీటిని అభిమంత్రించి మొదట కుడికాలు, తరువాత ఎడమ కాలును మామ కడుగుతాడు. "కుడికాలుని మహేంద్రుని అంశగానూ,

ఎడమ పాదాన్ని ఇంద్రుని అంశగా భావిస్తున్నాను. నీ పాదాలను రక్షించే దేవతలను పూజించిన ఈ జలం నా శత్రువులను కాల్చివేస్తుంది' అని మామ చెప్పినట్లుగా ఉండే మంత్రాలను పురోహితులు చదువుతారు. కాళ్లు కడిగిన నీళ్లను కన్యాదాత దంపతులు కొద్దిగా శిరస్సుపై చల్లుకోవడం ఆచారం. అర్ఘ్యమిచ్చి, ఆచమనం చేయించిన తరువాత మధుపర్కం అందిస్తారు.

కన్యాదాతేమో వయసులో పెద్ద–వరుడేమో చిన్నవాడు. అయినా కాళ్లు కడిగే ప్రక్రియ వుందంటే దానికి సాంప్రదాయ బద్ధమైన అర్థం వుండి తీరాలి. కన్యాదాత వరుడి కాళ్ళు కడుగుతున్నప్పుడు ఆయన తేజస్సు తరిగి పోకుండా పురోహితుడు ఒక మంత్రాన్ని చెప్తాతాడు. "నాలోని తేజస్సు, శక్తి, కీర్తి, బలం సుస్థిరంగా వుండుగాక" అన్న అర్థం వచ్చే మంత్రం అది. అది కన్యాదాత ఉచ్చరిస్తూ, ఇచ్చిన "అర్ఘ్యాన్ని" (మంచి నీరు) స్వీకరిస్తాడు వరుడు.

కన్యాదాత వరుడి కాళ్ళు కడిగి నందువల్ల, చిన్నవాడైన వరుడు, తనలోని కాంతి తరిగిపోకుండా వుండేందుకు, ఆచమనం చేసి, దానికి తగ్గ మంత్రాన్ని చదివిస్తారు. ఆచమనం చేస్తూ, వరుడితో, "ఓ ఉదకములారా, మీరు నాకు గొప్ప కీర్తిని–పాడి పంటలను ఇచ్చి, అందరు ఇష్టపడేవాడిని చేసి, రక్షించండి" అని చెప్పి స్తారు. వధువుని గంపలోనే వుంచి మహా సంకల్పంతో ఆరంభించి, తర్వాత జరగాల్సిన వేడుక మొదలుపెట్టారు పురోహితులు. వధూవరులు సాక్షాత్తు "లక్ష్మి–నారాయణ స్వరూపులు"గా భావించుతారు కాబట్టి, ఆ విధంగానే "లక్ష్మి నారాయణుల

కల్యాణం" లా జరిపించుతారు. "మహా సంకల్పం" చెప్పడం, సృష్టి క్రమంతో మొదలుపెట్టి, పరమేశ్వరుడి శక్తి-సామర్థ్యాలు అనంతమని-అచింత్యాలని, ఆయన అనుగ్రహంతోనే యావత్ సృష్టి జరిగిందని కొన సాగింది. మానవుడి మేథస్సు ఊహించ నలవికాని పరిమాణంలో వున్న ఈ జగత్తు, పరమేశ్వరుడి ఆద్యంతాలు లేని రూపంలో ఒక అతి చిన్న దైందని పురోహితుడంటాడు.

అఖిలాండ బ్రహ్మాండంలో, అనేకానేక చిన్న-చిన్న గోళాలున్న ఖగోళంలోని అత్యంత సూక్ష్మమైన భూగోళంలో, భరత ఖండంలో, మారు మూలనున్న మాన వుడు, అణు పరిమాణంలో వున్న చిన్న భాగమని తెలియచేసే దే మహా సంకల్పం. ఇది చెప్పడం ద్వారా, పరమాత్మ స్వరూపాన్ని ఎరుక పరిచి, మానవుడి అహంకారాన్ని తగ్గించుకోమని, వినయ సంపదను పెంచుకోమని సూచించడం జరుగుతుంది.

వరుడి కాళ్లు కడగడానికి తెలుగు పెళ్లిళ్లలో చాలా ప్రత్యేకత ఉందనే చెప్పుకోవాలి. పెళ్లి మండపంలోకి అడుగు పెట్టే ముందు వరుడి కాళ్లను వధువు అన్నదమ్ములు కడగి వివాహ వేదికపైకి ఆహ్వానిస్తారు. తమ సోదరితో జీవితం పంచుకోబోతోన్న బావగారికి కాళ్లు కడగడానికి బావ మరుదులు ఎగబడతారు. ఇలా చేయడాన్ని వాళ్లు తప్పుగానూ, తక్కు వగానూ భావించరు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు, శ్రీమహాలక్ష్మిలకు కల్యాణం చేస్తున్నట్టుగా భావిస్తారు. ఎంతో పవిత్రమైన ఈ క్రతువును వధువు తల్లిదండ్రులు చాలా సంతోషంగా పూర్తి చేస్తారు.

# 67.మాంగల్య ధారణ



మన హిందూ సంప్రదాయంలో మాంగళ్య ధారణ అనేది ముఖ్యమైన ఘట్టం. వివాహం అయినప్పటి నుంచీ, మహిళలు "మంగళ సూత్రం" ధరించడం భారతీయ సంప్రదాయం–హిందువుల ఆచారం. ఈ ఆచారం ఈనాటిది కాదు. పెళ్ళినాడు వరుడు వధువుకు తాళికట్టే సాంప్రదాయం అనాదిగా వస్తున్నది. మంగళసూత్రం అనే శబ్దం సంస్కృతం నుండి పుట్టింది. సంస్కృతంలో 'మంగళ' అంటే శోభాయమానం అని, శుభప్రదం అనీ అర్థాలున్నాయి. సూత్రం అంటే తాడు ఆధారమైందని అని అర్థం. సాధారణంగా మంగళసూత్రాన్ని సన్నని పోగులు, దారాలు కలిపి దానికి

పసుపు రాసి తయారు చేస్తారు. ఇలా కలపబడిన తొమ్మిది లేదా పదకొండు దారాలతో (లేదా ఎవరెవరి ఆచారం ప్రకారం వారి పద్ధతిలో) తాళిని తయారు చేస్తారు.

రెండు పళ్లెములతో తెచ్చిన తలంబ్రాలపై మంగల సూత్రములుంచి వరుడు మాంగల్య దేవతను ఆహ్వానించి షోడశోపచారములతో మంగళ సూత్రమును పూజిస్తాడు. పెండ్లికి విచ్చేసిన బంధువులచే ముత్తైదువులచే మాంగళ్యాన్ని స్పృశింపజేసి, తరువాత వరుడు వధువునకు ఎదురుగా నిలబడి వధువు యొక్క మెడలో ఈ క్రింది మంత్రాన్ని చదువుతూ (మంగళ సూత్రధారణ) మూడు ముళ్ళు వేస్తాడు.

**"మాంగల్యం తంతునానేన మమ జీవన హేతునా,**
**కంఠే బధ్నామి సుభగే త్వం జీవ శరదశ్శతమ్"**

ఓ వధువా! నా జీవితానికి కారణమైన ఈ సూత్రంతో నేను నీ మెడలో మాంగల్యము అను ఈ బంధమును కట్టుచున్నాను. నా జీవితానికి, జీవన గమనానికి హేతువైన మంగళసూత్రాన్ని ధరించి నూరు సంవత్సరాల వరకు జీవించి ఇచ్చటనే ఉండాలని ఆకాంక్షించుచున్నాను. అని వరుడు మంగళ సూత్రధారణ చేస్తాడు. వివాహ బంధానికి చిహ్నం ఈ మంగళసూత్రం. మంగళ సూత్రానికి రెండు బంగారు బిళ్లలు వుండి, అవి హృదయ స్థానంలో వ్రేలాడుతూ వుంటాయి. హృదయ స్థానంలో జీవాత్మ పరమాత్మలని రెండు వుంటాయి. ఆ జీవాత్మ పరమాత్మలను తెలియ జేయడానికి యీ మంగళ సూత్రాలు ఒక సంకేతం అని అర్థం.

సమస్త శుభాలకు, మంగళ ప్రథమైన కర్మలకు నిలయమైంది కాబట్టి, దీనికి, మంగళ సూత్రం అని పేరొచ్చింది. మంగళ సూత్రాలకు గౌరీ దేవి అనుష్టాన దేవత. దీన్నే "శత మానములు" అని కూడా అంటారు.

బంగారంతో చేయబడ్డాయివి. రెండు సూత్రాలలో (శత మానములు) ఒకటి అత్తింటి వారు, ఇంకోటి పుట్టింటి వారు చేయించడం ఆచారం.

వరుడితో మంగళ సూత్రాన్ని, వధువు మెడలో ధారణ చేయించుతారు, పురోహితుడు మూడు ముళ్లు వేయమంటారు. మూడు ముళ్లంటే, మూడు లోకాలకు, త్రిమూర్తులకు, సత్వ-రజ-తమో గుణాలకు సంకేతం. చదివిన మంత్రానికీ అర్థముంది-"ఓ సుందరీ ! ఈ మంగళ సూత్రాన్ని, నీ మెడలో కడుతున్నాను. ఇది సౌభాగ్యాన్ని కలిగిస్తుంది. నా జీవితం దీనిపైనే ఆధారపడి వుంది. నీవు శతాయుర్ధాయం కలదానివిగా వుండు" అని. మంగళ సూత్ర ధారణ అవుతూనే వేద పండితులు ఆశీర్వదించుతారు. "శతమానం భవతి, శతాయుః పురుష !" అనే మంత్రాన్నీ చదువుతారు. అందుకే, వీటికి "శత మానములు" అని పేరొచ్చింది. తరువాత వివాహ మండపంలోని సభ్యులు అక్షతలను వధూవరుల శిరస్సులపై ఉంచుచూ **ఓం సౌభాగ్యమస్తు అని వధువును** ఆశీర్వదింస్తారు. **ఓం శుభం భవతు అని వరుని** ఆశీర్వదిస్తారు. స్త్రీకి పుట్టిల్లు-అత్త గారిల్లు రెండు కళ్ల లాంటివి. ఉభయ వంశాలకు మంచి కీర్తిని చేకూర్చి పెట్టగలను అని తెలియ చేసేందుకే రెండు సూత్రాలను మహర్షులు నిర్ణయించారని హిందువుల నమ్మకం. భర్త సుఖ దుఃఖాలు తనవేనని, ధర్మ మోక్షాలు-అర్థ కామాలు తన సంబంధం ద్వారా భర్తకు లభింప చేయనున్నానని, సంపదకు-సంతానానికి తనే కారణమవుతాననే విషయాలు ఎల్లవేళలా గుర్తుండే విధంగా ప్రవర్తించడానికి మంగళ సూత్రాలను వధువు ధరిస్తుందని హిందువుల నమ్మకం.

# 68.బ్రహ్మముడి



తలంబ్రాలు తంతు ముగిసిన తర్వాత, "బ్రహ్మముడి" వేడుక జరుగుతుంది. వధువు చీరె కొంగు అంచును, వరుడి ఉత్తరీయం అంచుకు కలిపి ముడివేస్తారు. బ్రాహ్మణుల ఆశీర్వచనాలను దంపతుల కొంగులలో ముడి వేయడం అనే భావన వుందిందులో. ఇకనుంచి, ఇరువురు కలిసి–మెలిసి అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని, "ఇంటి యజమానురాలు"గా అన్ని బాధ్యతలు స్వీకరించి, నీ ఇంటిని నువ్వే చక్కదిద్దు కోవడానికి రమ్మని, వేద మంత్రాల ద్వారా వధువుని కోరుతాడు వరుడు.

దీనినే బ్రహ్మగ్రంధి, కొంగులు ముడివెయ్యడం అని కూడా అంటారు. ఇద్దర్ని కలిపి క్రొత్త వ్యక్తిని సృష్టించడం. రెండు శరీరాలు, రెండు మనస్సులు ఏకత్వమవ్వడమన్నది ఇక్కడ చాటి చెప్పబడుతుంది.

కొంగుముడిలో నాణెం, పువ్వులు, దర్భలు, పసుపుకొమ్ములు, అక్షింతలు, కందపిలక, ఆకులు, వక్క వేస్తారు. వధూవరుల మీద అక్షింతలు వేస్తూ పురోహితుడు 'ధ్రువంతేరాజా వరుణో ధృవం దేవో బృహస్పతిహి, ధృవంత ఇంద్రశ్చ అగ్నిశ్చ రాష్ట్రంధారయతాం ధృవం' అని మంత్రం చదువుతాడు.

దాంపత్య సామ్రాజ్యాన్ని ధరించిన మీకు వరుణుడు, బృహస్పతి, ఇంద్రుడు, అగ్ని నిశ్చలత్వం కలుగచేయుదురుగాక అని అర్థం.

ఇంకొక రకంగా పై మంత్రాలకి 'పూషా' (దేవతలయందు శ్రేష్టుడైనటువంటివాడు) వెంటతీసుకుని వెళ్ళాలి. అశ్వినీ దేవతలు నీ చేతులు పట్టుకుని రథంపైన తీసుకుని రావాలి. ఇంటి ఇల్లాలిగా అన్నీ తీర్చిదిద్దడానికి నా ఇంటికి రా. ఒక యజమానురాలిగా గృహస్థ ధర్మాన్ని నిర్వహించు. ఇది కేవలం రెండు వస్త్రాలని కలపటం కాదు. ఇద్దరు వ్యక్తులను కలిపి క్రొంగొత్త ఆకారాన్ని సృష్టించడమే దీని లక్ష్యం.



నీది అని ఏమీ లేదు. ఎవరు సంపాదించినా దాని మీద అధికారం ఇద్దరికీ ఉంటుంది. ఆదాయం, ఖర్చు, ప్రణాళిక కలిపి ఉమ్మడిగా చెయ్యవలసిన పనులని భావం. దర్భగడ్డి ఎప్పటికి వాడని ప్రేమకి నిదర్శనం. దర్భగడ్డి తన జీవ లక్షణాన్ని కోల్పోదు. కాసిన్ని నీళ్ళు చల్లితే చాలు, మళ్ళీ పచ్చగా మారుతుంది. ఇలా వివాహ బంధం ఎప్పటికీ పచ్చగా ఉండాలని, జీవితాంతం వారి మధ్య ప్రేమాభిమానాలు, సహచర్యమూ సజీవంగా ఉండాలన్నది తాత్పర్యము.

భార్య చిటికిన వేలును భర్త చిటికిన వేలుతో పట్టుకోమని బ్రహ్మ ముడి వేస్తారు. ఇందులో ఉన్న పరమార్థాన్ని ఈ విధంగా చెబుతారు. భార్య భర్తల బంధంలో ఒకరిని ఒకరు విడిచి ఉండకూడదు. ప్రయాణమైన–పుణ్యక్షేత్రమైన–మోక్షమైన–వనవాసమైన భార్య భర్తలు కలిసి వెళ్ళాలి–ఉండాలి. భార్య భర్తలుగా మారటం అంటే రెండు శరీరాలు ఒకే ప్రాణంగా మనుగడ సాగించటం. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగిన ఎన్ని మనస్పర్ధలు ఉన్న వాళ్ళిద్దరి మధ్య ఒక చిన్న ముడి.., అంటే వీళ్ళ మధ్య ఇంకొకరు దూరటానికి వీలు లేని విధంగా ఉండాలని, అలా ఉంచుకోవాలని గోరంత స్థలము ఏర్పడినా ఆ అదును చూసుకొని మూడో వ్యక్తి స్థలము ఏర్పరచుకుంటారని– ఏమి జరిగినా భర్తతోనే జీవితం అనుకోవాలని స్త్రీకి–భార్యే సర్వస్వంగా భావించాలని భర్తకి చెప్పి బ్రహ్మ ముడి వేస్తారు–"అంటే రెండు శరీరాలను ఒక ప్రాణంగా మార్చటం

# 69.పాణిగ్రహణం



కొందరు పాణిగ్రహణమే వివాహంలో ముఖ్యమైనదని చెబుతారు. అందుకే వివాహానికి పాణిగ్రహణం పర్యాయపదమైనది. ఇంతకు పూర్వం వరుడు వధువు చేతిని పట్టుకొని అగ్నిహోత్రుని వద్దకు ఆమెను తీసుకొని వెళతాడు. కానీ ఇప్పుడు వధువు వరుని హస్తాన్ని పట్టుకొని జీవితాంతం అతన్ని అనుసరించి సంతానాన్ని, సౌభాగ్యాన్ని పొంది తన స్త్రీత్వాన్ని సార్థకం చేసుకుంటుంది.

వరుడు వధువు యొక్క తిరగవేసి ఉన్న కుడి అరచేతిని, తన బోర్లించిన కుడి అరచేతితో పట్టుకుంటాడు. ఇక్కడ ఒక విశేషం ఉంది. ఇద్దరూ కావాలంటే బ్రొటన వ్రేలు, మిగిలిన వ్రేళ్ళు కలిపి పట్టుకోవాలి. వధువు తన చేతిని అందుకుంటున్నప్పుడు వరుడు ఈ క్రింది మంత్రాన్ని చెప్పి ఆమెకు చేతిని అందించాలి.

గృభ్ణామి తే సుప్రజాస్త్వాయ హస్తం
మయా పత్యా జరదష్టిర్యథా సః ।
భగో అర్యమా సవితా పురన్ధి
ర్మహ్యం త్వాఽ దుర్గార్హపత్యాయ దేవాః॥

నా పెద్దల లాగానే నేను కూడా మంచి సంతానం కోసం నిన్ను పాణిగ్రహణం చేస్తున్నాను. భగుడు, అర్యముడు, సవిత అనే దేవతలు నా గృహస్త్రాశ్రమం కోసం నన్ను గృహిణిగా చేస్తున్నారు.

యఏతి ప్రదిశః సర్వా దిశః అనుపవమానః
హిరణ్యహస్త ఐరమ్మస్సత్వా మన్మనసం కృణోతు ॥

దశదిశలను మెరుపులతో సత్త్వశక్తితో, ప్రకాశంతో వ్యాపించే సరస్వతీ దేవి రూపాలు బంగారు చేతులతో నా ధ్యానంలో నిలబడాలి.

అప్పుడు వధువు ఈ విధమగా ప్రతిజ్ఞ చేయును. “ఆర్యపుత్ర ! సౌభాగ్యాభివృద్ధి నాశించి నేను నీ పాణిని గ్రహించుచున్నాను. పత్నినగు నాతో వార్ధక్యము వరకు ప్రసన్నతతో జీవింపుము. నేటి నుండి నన్ను, నీవు, నిన్ను నేను ద్వేషింపక ప్రేమతో వర్ధిల్లుదుముగాక. గృహమునందలి సమస్త కార్యములు, ఉత్తమ సంతానము, ఐశ్వర్యము, సౌఖ్యము అభివృద్ధి పొందుచుండుగాక. హే భద్రపురుష పరమాత్ముని కృపవలన నీవు నాకు లభించితివి. నీ హృదయము, ఆత్మ మనస్సులను ప్రియాచరణమగు నట్టి నీ కర్మలను నేను ధరించుచున్నాను. ఏకాగ్రచిత్తుడవై నీవు నా మాటలను వినవలసినది. నేటి నుండి పరమాత్మ నిన్ను నాకు ఒసగెను. నూరు సంవత్సరములు నాతో సుఖింపుము” తరువాత దంపతులు ఇద్దరు హోమగుండము చుట్టూ ప్రదక్షణ చేయుదురు.

# 70.వధువు కాళ్ళకి మట్టెలు



వధువుకి వరుడు పెళ్లి రోజున కాలి రెండవ వేలుకి మట్టెలు తొడగడం మన ఆనాదిగా వస్తున్న సంప్రదాయం. స్త్రీ ఆభరణాలు అన్నీ సామాన్యంగా యోగ శాస్త్రంలోనీ నాడులుకి సంభందించి ఉన్నాయి. స్త్రీలు చేతికి వేసుకొనే గాజులు, కాలి మట్టెలు రెండు కూడా సంతానా బివృద్ధికి, సుఖ ప్రసవం నాటికి అనుకులించే నాడులనూ సున్నితంగా నొక్కుతు ఉంటాయి. అందువల్ల మన పూర్వికులు వధువుకి కాళ్ళ మట్టెలు ఆపాదించారు. ఈ మట్టెలు వధువుకి వివాహిత అని చెప్పే మరో గుర్తు. వివాహతంతులో వధువు పాదాన్ని రోకలిపై ఉంచి వరుడు ఆమె కాలి వేలుకి మెట్టలు తొడుగుతారు. వీటినీ ఒక్కక్క ప్రాంతంలొ ఒక్కో రకంగా ధరింపచేయటం జరుగుతుంది.

# 71. ఉంగరాలు తీయడం



'ఉంగరాలు తీయడం' దీనినే 'ప్రధానాంగుళీయకం' అంటారు. మూతి చిన్నదిగా ఉండే బిందెలో పాలు, నీళ్లు కలిపి నిండా పోస్తారు. ఆ బిందెలో ఒకే ఒక్క బంగారపు ఉంగరాన్ని వేస్తారు. పురోహితుడు చెప్ప గానే వధూవరులిద్దరూ గభాల్న ఆ బిందెలోకి చేతిని తోసి నీళ్లలో పడిన ఉంగరాన్ని వెలికి తీయాలి. ఎవరి చేతికి చిక్కితే వారికి ఎదుటివారు ఆ ఉంగరాన్ని వేలికి తొడగాలి. చూడటానికి సరదాగా కన్పించే ఇది కేవలం అప్పటిదాకా పరిచయం లేని వదూవరులకు స్పర్శ తాలూకు సాన్నిహి త్యాన్ని తెలియ చేయడానికి ఉద్దేశించబడిన కార్యక్రమం. ఇక్కడా బంధుమిత్రుల కోలాహలం చోటుచేసుకుంటుంది. ఆ కాసేపు అది ఇరు పక్షాల వారి మధ్య ఒక నిజమైన పోటీలా జరుగుతుంది.

# 72. బొమ్మని అప్పగింత

పెండ్లి కొడుకు సోదరికి బొట్టుపెట్టి పసుపు, కుంకుమ, నూతన వస్త్రములు తాంబూలంతో కలిపి ఇవ్వవలెను. ఆ అమ్మాయి భర్తకు నూతన వస్త్రములు పెట్టాలి. ఇద్దరు కొత్తబట్టలు కట్టుకొనవలెను.

మీటరు మల్లు గుడ్డలో చెక్కబొమ్మను ఉంచి అటు చివర ఇటు చివర ఇద్దరు పట్టుకొని పెండ్లి కుమారునకు పెండ్లి కుమార్తెకు మధ్యలో ఉంచి ఊయల ఊపుచూ ఆ బొమ్మమీద వసంతము కొద్దిగా పోయాలి.

(నీళ్ళలో సున్నము, పసుపు కలిపితే ఎరుపు రంగుగా మారును) ఆ నీళ్ళు పెండ్లి కుమార్తె ప్రక్కన ఉన్న సోదరుని తొడమీద పదే విధంగా చేయాలి. ఆ సోదరునికి పెండ్లి కుమారుని వారు నూతన వస్త్రాలు ఇచ్చి సత్కరించాలి. అవి ఇచ్చునప్పుడు ఆడపడుచు పట్టెనిస్తావా-పాడి ఆవును ఇస్తావా అని అడగాలి.

అప్పుడు కొత్త దంపతులు పట్టెని ఇస్తాను, పాడి ఆవును ఇస్తాను అని చెప్పి చెక్క బొమ్మను వారికి అందిస్తారు. (స్థోమత కలిగిన వారు దీనితోపాటు వెండి బొమ్మను కూడా ఇస్తారు). తరువాత నూతన దంపతులచేత పేర్లు చెప్పిస్తారు.

# 73.అప్పగింతలు



భజంత్రీలు అప్పగింతల పాట పాడుతుంటే, పెళ్ళి పీటపై వధువును మధ్యలో కూర్చుండ బెట్టి, పాలలో చేతిని ముంచిన తర్వాత అప్పగింతల తంతు జరుగుతుంది. అప్పగించిన పెద్దలందరికీ బట్టలు పెట్టే తంతుం టుంది. వధువు రెండు చేతులను పాలలో ముంచి వరుని చేతిలో పెట్టి అప్పగించాలి. అప్పగించుతూ: "అష్టవర్షాభవేత్ కన్యా, పుత్రవత్ పాలితా మయా, ఇదానీం తవ దాస్యామి, దత్తా స్నేహేన పాలయా" అంటాడు కన్యాదాత. అంటే, "పుత్రుడితో సమానంగా పెంచిన ఎనిమిది సంవత్స రాల వయసున్న ఈ కన్యను నీకిస్తున్నాను. నీవు ఈమెను ప్రేమాభి మానాలతో కాపాడు." అని దాని అర్థం. అదే మంత్రం చదువుతుంటే, అదే అర్థం వచ్చేలా, అత్తమామలు వరుడి ప్రక్కన కూర్చుని వుంటే,

వారికి కూడా వధువు రెండు చేతులు పాలలో ముంచి వారి చేతులో అద్ది, "మీ పుత్రికవలె కాపాడాలి" అని అప్పగిస్తారు. అమ్మాయి చీర చెంగులో పసుపు కుంకుమలు పెట్టి అమ్మాయి చేతిని అబ్బాయి చేతిలో పెట్టాలి. ఇద్దరిని ఎదురు ఎదురు కుర్చీలలో కూర్చుండబెట్టి గులాం చల్లించాలి.

ఈ అప్పగింతలు చేసేవారికి, చూసే వారిలో చాలామందికి కంట తడిపెట్టిస్తుందనడంలో అతిశయోక్తి కాదు. ఇన్నాళ్లుగా పెంచి పోషించిన కూతురు తమను విడిచి అత్త వారింటికి వెళుతుందని ఆమెను వదలి వుండాలే అనే బాధ కన్నవారికి కలగడం సహజం. అప్పగింతల కార్య క్రమం అనంతరం, పెళ్ళికూతురును లోపటికి తీసుకునిపోయి, పెరుగు అన్నం పెట్టి, దేవుడికి దండం పెట్టించి, బయట ఇంటి సింహద్వారం దగ్గర తల్లి కడుపుపై మజ్జిగతో అద్దించి, గడపకు చేతులతో కొట్టించుతారు. ఇవన్నీ అయ్యాక విడిది గృహ ప్రవేశానికి పంపుతారు. ఇక అంతటితో కన్యా దాత ఇంటినుంచి ముందు జరగాల్సిన వేడుక, విడిదికి–అక్కడి నుంచి పెళ్ళికొడుకు ఇంటికి మారుతుంది.

హిందూ వివాహం ఆధునిక అర్థంలో చెప్పుకునే సామాజిక వ్యవస్థ మాత్రమే కాదు. మతపరంగా కూడా ఎంతో పవిత్రమైన వ్యవస్థ. పెళ్ళ యాక భార్యాభర్తల మధ్య కనిపించని మూడో అనుసంధాన కర్త కూడా ఉంటుంది. అదే దాంపత్య ధర్మం అనే బాధ్యత. అందుకే పెళ్ళి అనేది విడదీయరాని బంధం. దంపతుల మధ్య ఏమైనా పొరపొచ్చాలు వచ్చినా ఆ ధర్మమే వారిని ఒకటిగా కలిపి ఉంచుతుంది.

# 74.ధృవనక్షత్రం



నూతన వధూవరులకు ఆకాశములో సంచరించు ఉత్తర ధ్రువ నక్షత్రాన్ని చూపుతారు. పగటి ముహూర్తానికి సూర్యదర్శనం, రాత్రి ముహూర్తానికి ధ్రువనక్షత్ర దర్శనం వైదికంగా జరుగుతాయి.

ఆకాశంలో ధ్రువ నక్షత్రం ప్రముఖమైనది. స్థిరత్వానికి, శాశ్వత త్వానికి ధ్రువనక్షత్రం ఒక సంకేతం.

**మం. ధ్రువక్షితి ధ్రువయోనిః ధ్రువమసి ధ్రువస్థితం**

**త్వం నక్షత్రాణాం మేధ్యసి సమాపాహి పృతన్యతః**

**అర్థము :** ఓ ధ్రువనక్షత్రమా! నీవు నాశనము లేని స్థిర నివాసము కల దానవు. ఇతర నక్షత్రాలు కూడ స్థిరత్వాన్ని పొందుటకు మార్గదర్శకు రాలివైతివి. నీ చుట్టూ నక్షత్రాలు నిన్ను ఆధారం చేసుకొని తిరుగుచున్నవి గదా! అట్లే నా పతి ఇంటియందు నేను కూడ స్థిరముగా ఉందును. కనుక నాకు ఆ స్థిరత్వమును ఇమ్ము.

# 75.అరుంధతి నక్షత్ర దర్శనము



అరుంధతీ నక్షత్రం కనిపించేది రాత్రి పూట మాత్రమే. సప్తఋషి మండలం చివర వశిష్టుడి వెనకగా కొంచం చిన్నగా కనిపిస్తుంది అరుంధతీ నక్షత్రం.సప్తఋషుల భార్యలలో వశిష్టుని భార్య అరుంధతి మొదటిది. ఆరుగురు కృత్తికలు ఆరుగురు భార్యలు మీతోపాటు వారు కూడా కీర్తిని పొందినారు. అట్లే నాపతితో కీర్తి పొందు స్థిరత్వమును నాకు ఇమ్ము. అని కోరుకుంటారు. ఈ విధంగా మన భారతీయ వివాహ వ్యవస్థను పఠించిన ప్రతి మంత్రానికీ అర్థాన్ని గ్రహించి, ఆ అర్థాన్ని జీవితంలో ఆచరిస్తే సంసారం సుఖంగా సాగుతుంది. మంత్రాల ద్వారా చేసుకున్న వాగ్దానాలు, పంచుకున్న నమ్మకాలను జీవితాంతం ఒకరి కోసం ఒకరు నిలుపుకోవటమే సంసా

రంలోని పరమార్ధం! అదే వివాహబంధం. అరుంధతీ నక్షత్రం వివాహం జరిగిన రాత్రి వధూవరులను ఇంటి బయట తూర్పు లేదా ఉత్తరానికి తీసుకువెళ్లి మొదట ధృవ నక్షత్రాన్ని, తర్వాత అరుంధతీ నక్షత్రాన్నీ చూపిస్తారు. ధృవనక్షత్రంలా వారు నిశ్చలమైన మనస్తత్త్వాలతో స్థిరంగా ఉండాలని, వధువు అరుంధతిలా మహా పతివ్రత కావాలనే ఆకాంక్ష ఇందులో కలదు.

# 76.పేరంటాలు పెట్టడం

పెళ్లి జరిగే రోజున ప్రత్యేకంగా పేరంటాలను పిలిచి వధువుతో లేదా వరుడితో కలిపి కూర్చోబెట్టి భోజనం వడ్డిస్తారు. ఇది కూడా చాలా ముఖ్యమైనదే. వివాహం కోసం ఏర్పాటు చేసిన విందుతో పోలిస్తే ఇది ప్రత్యేకంగా ఉంటుంది.

అరిసెలు, సున్నుండలు, జంతికలు ఇలా కొన్ని రకాల పిండివంటలు వండి వారికి వడ్డిస్తారు. వడ్డన పెళ్లి కూతురు లేదా పెళ్లి కొడుకు చేతుల మీదుగానే జరుగుతుంది. తినడం పూర్తయిన తర్వాత ఎంగిలి ఆకులను వధువు లేదా వరుడు ఎత్తుతారు. ఇలా చేస్తే పెద్దల ఆశీస్సులు లభిస్తాయని నమ్ముతారు. ఆ తర్వాత పేరంటాలకు తాంబూలం అందిస్తారు.

# 77.మంగళసూత్రం



మంగళసూత్రం లేదా మాంగళ్యం హిందూ సాంప్రదాయంలో పెళ్ళి జరిగిన స్త్రీలు మెడలో ధరించే గొలుసు లాంటి వస్తువు. దీనిలో తాళి లేదా తాళిబొట్టు, కొన్ని నల్ల పూసలు మొదలైనవి గుచ్చుకుంటారు.

హిందూ వివాహ తంతులో మాంగల్యధారణే అతి ప్రధానమైనది. మాంగల్యానికే మంగళసూత్రం, తాళి, తాళిబొట్టు, పుస్తె, శతమానం అనే పేర్లతోబాటూ వివిధ రూపాలు కూడా ఉన్నాయి. మానవులకు మనువాడటం ఎంత ముఖ్యమో, మనువాడటానికి మంగళసూత్రం అంతే ముఖ్యం.

## తాళికట్టే సంప్రదాయం

వివాహ సమయం నుండి స్త్రీలు మంగళ సూత్రం ధరించడం భారతీయ సంప్రదాయం. ఈ ఆచారం ఈనాటిది కాదు. పెళ్ళినాడు వరుడు

వధువుకు తాళికట్టే సాంప్రదాయం ఆరో శతాబ్దంలోనే ఆరంభ మయింది. మంగళ సూత్రం అనే శబ్దం సంస్కృతం నుండి పుట్టింది.

సంస్కృతంలో 'మంగళ' అంటే శోభాయమానం, శుభప్రదం అనే అర్థాలు ఉన్నాయి. సూత్రం అంటే తాడు, ఆధారమైనది అని అర్థాలు ఉన్నాయి. సాధారణంగా మంగళసూత్రాన్ని 108 సన్నని పోగులు, దారాలు కలిపి దానికి పసుపు రాసి తయారు చేస్తారు.

ఇలా కలపబడిన తొమ్మిది లేదా పదకొండు కలిపి కూడా కొందరు తాళిని తయారు చేస్తారు. మంగళ సూత్రధారణ జరుగునపుడు ఈ మంత్రమును పఠిస్తారు.

**"మాంగల్యం తంతునానేనా మమజీవన హేతునా! కంఠే భద్నామి సుభగే త్వం జీవ శరదాం శతం!! "**

## మంగళసూత్రాలపై దేవతా ప్రతిమలు

దేవుడి ప్రతిమలను అస్సలు మంగళ సూత్రాలపై వేసుకోకూడదట. ముఖ్యంగా లక్ష్మీదేవి ప్రతిమ ఉన్న మంగళసూత్రాన్ని అస్సలు వేసుకో కూడదట. ఒకవేళ వేసుకుంటే సిరిసంపదలు పోయి కష్టాలు ప్రారంభ మవడం మొదలవుతుందట. కాబట్టి మంగళసూత్రాన్ని ప్లెయిన్‌గా వేసుకోవడం మంచిదట.

## మంగళసూత్రం - భర్త ఆయుష్షు

మంగళ సూత్రము భార్యా భర్తల శాశ్వత బంధానికి గుర్తు. అది వైవాహిక జీవితాన్ని సమస్త కీడులనుండి తొలగిస్తుందని హిందువుల

నమ్మకం. శక్తి స్వరూపిణి అయిన స్త్రీ మెడలో మంగళ సూత్రము ఉన్నంత వరకూ భర్తకు ఆయుషు ఉంటుందని హిందువులు నమ్ముతారు. అందుకే హిందూ స్త్రీ మంగళ సూత్రము ధరిస్తుంది. వివాహిత మెడలో మంగళ సూత్రము లేదంటే భర్త చనిపోయినట్లుగా భావించవచ్చును.

## పసుపు కుంకుమలతో పూజ

ప్రతి శుక్రవారం, మంగళవారం అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ చేసి ఆ పసుపుని మంగళసూత్రాలకు పూజ సమయంలో పెట్టుకోవాలి. ఇలా చేస్తే ఐదోతనాన్ని ఇచ్చే పార్వతి దేవి కటాక్షిస్తుంది అని చెబుతారు. మంగళసూత్రాలకు పిన్నీసులు, ఏ ఇతర లోహాలకు చెందిన వస్తువులు పెట్టకూడదు. మంగళసూత్రం ఎప్పుడు హృదయం కింద వరకు ఉండాలి అంటే వక్షస్థలం పూర్తిగా దాటి కిందకి ఉండాలి.



# శక్తి, ధైర్యసాహసాలు

పెళ్లికోసం సమకూర్చుకున్న, ఇచ్చిపుచ్చుకున్న ఇతర వస్తువులు, ఆభరణాలు అన్నీ రూపాంతరం చెందినా చివరి వరకూ వెంట ఉండేది తాళిబొట్టు మాత్రమే. మంగళసూత్రం ధరించడం వలన స్త్రీకి ఎక్కడలేని శక్తి, ఎక్కడైనా పోరాడగలను, నెగ్గగలను అనే ధైర్యసాహసాలు కలుగుతాయట. మంగళసూత్రాలలో పసుపుతాడును వాడుతారు. వరుడు మూడు ముళ్ళు వేసిన తర్వాత ఒక్కో ముడికి కుంకుమను అద్దుతారు. మంగళ సూత్రాలను బంగారువి చేయించుకున్నా, మధ్యలో తాడు మాత్రం పసుపు తాడునే వాడాలి. ఇతర ఏ లోహాలతో తయారుచేసినవి వాడకూడదు. పసుపు కుంకుమలలో సర్వమంగళాదేవి ఉంటుందట.

# పగడం, నలుపు పూసలు

మంగళసూత్రాలకి ఎప్పుడు ఎరుపు (పగడం) నలుపు పూసలు ఉండాలి. పొరపాటున మంగళసూత్రం పెరిగితే (తెగిపోతే) వెంటనే 5 వరసల దారం తీసుకుని దానికి ఒత్తుగా పసుపు రాసి పసుపు కొమ్ము తీసుకుని దానిని ఆడపడుచు చేత కాని భర్త చేత కాని వేయించుకోవాలి. ఇంకా ఎవరు లేకపోతే తమకు తామే మెడలో వేసుకోవాలి. మంచి రోజు చూసి ఉదయం 9 గంటల లోపు మళ్లీ మంగళసూత్రాన్ని (బంగారు తాళిని) వేసుకోవాలి. ఇవన్నీ భార్య పాటిస్తే భర్త ఆయుష్షు బలంగా ఉంటుంది. వందేళ్లు సుఖంగా జీవిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి.

# 78. ఒడిబియ్యం



మన సమాజంలో వాడుకలో ఉన్న సంప్రదాయాలు, ఆచారాల్లో కుటుంబ బంధాలు, బాధ్యతలు, ఆప్యాయతలు, అనుభూతులు నిండి ఉంటాయి. ఆ కోవలోదే ఈ ఒడిబియ్యం.

ఒడి నించరమ్మ తడవదేల పుడమి జాతకు
కడువడిగ మీరలెల్ల గూడి పడతి సీతకు
మామిడి జామ మంచి పనస తొనలు ద్రాక్షయు
భామామణికి మీరలిపుడు ప్రేమ తోడను
పచ్చి పసుపు కుంకుమ బియ్యము హెచ్చు దువ్వెనల్
మెచ్చునట్టి బొమ్మలును మచ్చెకంటికిన్

అంటూ ఇంటి ఆడపడుచును సీతగా భావించి ఒడినింపుతారు పుట్టింటివాళ్లు. ఆ నింపటం కూడా ఆలస్యం చేయకుండా, వేగంగా వచ్చి ముత్తయిదువులు అందరూ కలిసి నింపాలట! మామిడి, జామ, పనస తొనలు, ద్రాక్షపళ్లు మొదలైన వాటితో ప్రేమతో పచ్చి పసుపు, కుంకుమ, బియ్యం, దువ్వెనలు, గాజులు, బొమ్మలు మచ్చెకంటికి ఒళ్లో వేయాలట. ఇదీ స్థూలంగా తెలుగింటి ఆడపడుచుల 'ఒడిబియ్యం' కార్య క్రమం. ఒడినింపేటప్పుడు సందర్భానికి తగిన పాటలు పాడుతూ వేడుక జరుపుకుంటారు.

పెళ్లయిన తరువాత బేసి సంఖ్య సంవత్సరాల్లో (3, 5..) 'ఒడిబియ్యం' నిర్వహిస్తారు. అమ్మాయిని ఆడ పిల్లగా భావించి పెండ్లి చేసి పంపడంతోనే బాధ్యత తీరిపోయిందని చేతులు దులిపేసుకోరు. ఆ ఇంటి ఆచారాన్ని బట్టి ఓ మంచిరోజు కూతుర్ని, అల్లుణ్ని, బంధువులను పిలిచి ఈ వేడుకను నిర్వహిస్తారు. అమ్మాయి తల్లిదండ్రులు, తోడబుట్టినవారు అంతా కలిసి ఆనందోత్సాహాలతో జరిపే వేడుకే ఈ ఒడిబియ్యం.



ఇంటి ఆడపడుచును లక్ష్మిగా భావిస్తారు. వేరే ఇంటికి కోడలిగా వెళ్లినా అమ్మాయి పుట్టినింటి సుఖసంతోషాలను కోరుకుంటుంది. కష్ట సుఖాల్లో పుట్టింటిని గుర్తు చేసుకుంటుంది. అలాంటిది ఆ అమ్మాయి ఆనందంగా ఉంటేనే పుట్టినింటికీ, మెట్టినింటికీ సౌభాగ్యం కలుగుతుంది కదా! అందుకే చీర, పసుపు, కుంకుమ, గాజులు, బియ్యం వంటివి 'ఒడిబియ్యం'లో భాగం చేశారు. అంతేకాదు అయిదు రకాల పండ్లు, మిఠాయిలు కూడా పెట్టి ఒడినింపుతారు. ఇవన్నీ అయిదుగురు ముత్తయిదువులతో చేయిస్తారు. కార్యక్రమం చివరగా అమ్మాయిని కూర్చోబెట్టి హారతి ఇస్తారు.

ఆ అమ్మాయి అత్తవారింటికి వెళ్లిన తరువాత సారెలోనివి కొన్నింటిని చుట్టుపక్కల వారితో పంచుకోవడం, లేదా వారిని పిలిచి తాంబూలంగా ఇవ్వటం చేస్తారు. ఓ మంచిరోజు చూసుకొని చుట్టాలను, స్నేహితులను, పొరుగువారిని పిలిచి ఒడిలోని బియ్యం వండటాన్ని వేడుకగా చేసుకుంటారు. వచ్చినవాళ్లకు విందుచేసి, బట్టలుపెట్టి మర్యాద చేస్తారు.

ఇందులో పుట్టింటి నుంచి తెచ్చుకున్న ఆనందాన్ని పదిమందితో పంచుకోవడమే ప్రధాన ఉద్దేశం. ఇలా చేయడంవల్ల ఆ రెండు కుటుంబాలే కాకుండా వచ్చిన బంధు మిత్రాదులతోనూ సంబంధాలు మరింత బలపడతాయి. ఈ విధంగా తరతరాలుగా వస్తోన్న సంప్రదాయాలవల్లే మన కుటుంబ వ్యవస్థ పటిష్ఠంగా నిలిచింది.

# 79. బొట్టు



ముఖాన బొట్టు లేదా తిలకం పెట్టుకోవడం ఒక హిందూ సంప్రదాయం. హిందూమతంలో మాత్రమే బొట్టుపెట్టుకొనే ఆచారముంది. ప్రపంచంలో ఏ ఇతర మతాలలోనూ ఈ ఆచారం కన్పించుట లేదు. బ్రహ్మదేవుడు నుదుట వ్రాసినగీత తప్పింప ఎవరికీ శక్యం కాదు. కాని ఎవ్వరు ముఖాన బొట్టు పెట్టుకుంటారో వారు బ్రహ్మరాసిన రాతను కూడా చెరిపి మంచిరాత వ్రాసుకుంటారనే నమ్మకం కొందరిలో ఉంది.

## ఐదోతనానికి బొట్టు చిహ్నం

హిందువుల సంప్రదాయం ప్రకారం మహిళలు, ముఖ్యంగా పెళ్లైన ముత్తైదులు తిలకం తప్పనిసరిగా పెట్టుకోవాలి. ఐదోతనానికి బొట్టు

చిహ్నం కాబట్టి పెళ్లైన ముత్తైదువులు ఎల్లవేళలా బొట్టు పెట్టుకోవాలి. బొట్టు లేని ముఖం అందవిహీనంగా కనిపించడమే కాదు.. శుభ కార్యాలు చేయటానికి అర్హత లేదని హిందూ సంప్రదాయం చెబుతోంది. మహిళలు ఉదయాన్నే స్నానం చేయగానే ముందుగా బొట్టు పెట్టుకుని పూజ చేయాలని పెద్దలు చెబుతుంటారు.

## బొట్టుకు వివిధ ప్రయోగాలు

తెలుగు భాషలో బొట్టు పదానికి వివిధ ప్రయోగాలున్నాయి. బొట్టు అనగా బిందువు (A drop) లేదా శరీరం మీద పెట్టుకొనే చుక్క. నిలువు బొట్టు వైష్ణవానికి చిహ్నం అయితే అడ్డబొట్టు శైవానికి చిహ్నంగా భావిస్తారు. తాళిబొట్టు వివాహానికి గుర్తుగా స్త్రీలు మెడలో ధరించేది. బొట్టు కట్టు అనగా వివాహంలో తాళిబొట్టు కట్టడం లేదా వివాహం చేసుకోవడం. బొట్టుదారం అనగా మంగళసూత్రం అనే అర్థాలున్నాయి.

## భక్తికి, ముక్తికి సోపానం బొట్టు

నుదుటి యందు సూర్య కిరణాలు సోకరాదు, ఇది ఆరోగ్య సూత్రం. మనలోని జీవాత్మ జ్యోతి స్వరూపుడిగా మధ్యమంలోని ఆజ్ఞాచక్రంలో సుషుప్త దశలో హృదయస్థానంలో అనగా అనాహత చక్రంలో ఉంటాడు. ఈ బొట్టు (తిలకం) ధరించడం వలన మనిషి భక్తి, ముక్తి కలిగి నిజాయితీగా ఉండడానికి ఉపయోగపడుతుంది. అంతే కాదు నుదుటి పైన బొట్టు ధరించిన వారిని చూస్తే ఎదుటి వారిలోనూ పవిత్ర భావనను కలుగ చేస్తుంది, బొట్టు ధరించిన వ్యక్తి గౌరవాన్ని కూడా పొందుతారు.

## దైవానికి చిహ్నం బొట్టు

హిందు సాంప్రదాయ ప్రకారంగ బొట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉన్నది, ఇది దైవ చిహ్నముగా గుర్తించబడుతుంది. మన దేహంలోని ప్రతి ఒక్క శరీర అవయవానికి ఒక్కొక్క అధిదేవతలు ఉన్నారు. నుదుటకు బ్రహ్మ దేవుడు అధిదేవత. నుదురు బ్రహ్మస్థానం. కనుక బ్రహ్మస్థానమైన నుదుట తిలకం (బొట్టు) పెట్టుకుంటారు.

## మంగళకరం.. శుభకరం

సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధికే శరణ్యే త్ర్యంబకే గౌరి నారాయణీ నమోస్తుతే అని జగన్మాతను స్మరించుకుంటూ నుదుటన బొట్టు పెట్టుకుంటే మంగళకరం.. శుభకరం.

## ఒక్కొక్క వర్ణానికి ఒక్కోవిధమైన బొట్టు

పూర్వకాలంలో కాలములో చతుర్వర్ణాలవారు అయిన బ్రాహ్మణ క్షత్రియ, వైశ్య, శూద్రులు వేరు వేరు చిహ్నాలను ధరించేవారు.

పౌరోహిత్యము లేక శాస్త్ర సంబంధమైన వృత్తిని కలిగిన బ్రాహ్మణులు పవిత్రతకు చిహ్నంగా **తెల్లని చందనాన్ని** ధరించేవారు.

క్షత్రియ వంశానికి చెందిన క్షత్రియులు వారు తన వీరత్వానికి చిహ్నంగా **ఎర్రని కుంకుమను** నుదటన ధరించే వారు.

వర్తక వ్యాపారాల ద్వారా సంపదను పెంపొందించుకునే వైశ్యులు అభివృద్ధికి చిహ్నంగా **పసుపు పచ్చని కేసరిని** ధరించేవారు.

శూద్రజాతికి చెందిన వారు నల్లని భస్మాన్ని లేక కస్తూరిని ధరించేవారు. విష్ణు ఉపాసకులు యు(U) ఆకారముగా చందన తిలకాన్ని, శైవ ఉపాసకులు భస్మ త్రిపుణ్డ్రాన్ని, దేవి(అమ్మవారి) భక్తులు ఎర్రని కుంకుమ బొట్టును ధరించేవారు.

## ఆహ్వానానికి ముందు బొట్టు

బొట్టు పెట్టటం మర్యాదకి గుర్తింపు. అందుకే ఎవరినైనా ఆహ్వానించడానికి ముందుగా బొట్టు పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ముత్తైదువులు ఇంటికి వచ్చినప్పుడు వాళ్లకు బొట్టు పెట్టి గౌరవించడమూ హిందూ సంప్రదాయం.

## ఏ వేలితో ఏం ప్రయోజనం ?

బొట్టు పెట్టుకునేటప్పుడు ఒక్కొక్కరు ఒక్కొక్కటి చెబుతుంటారు. కొందరు మధ్య వేలు మంచిదని.. మరికొందరు ఉంగరపు వేలు మంచిదని. అయితే ఉంగరపు వేలుతో బొట్టు పెట్టుకుంటే శాంతి.. మధ్య వేలితే పెట్టు కుంటే ఆయువు పెరుగుతుంది. బొటనవేలితో పెట్టుకుంటే పుష్టి కలుగుతుంది. చూపుడు వేలితో పెట్టుకుంటే ముక్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి.

## స్త్రీలకే కాదు పురుషులకు కూడా

ధర్మాన్ని పాటిస్తూ.. భగవంతుని నమ్ముతున్నారనడానికి బొట్టు ప్రతీకగా చెప్పవచ్చు. కాబట్టి కుంకుమ పెట్టుకోవడం స్త్రీలకే పరిమితం కాలేదు. పురుషులు కూడా పెట్టుకుంటే సంప్రదాయం పాటిస్తున్నారని తెలియజేస్తుంది.

# 80. శంఖుస్థాపన



భూమికి మూడు రకముల దోషములు ఉంటాయి. స్పర్శాదోష, దృష్టి దోషం, శాల్యా దోషం స్పర్శాదోషం అనగా ముట్టుకుంటే వచ్చే కొన్ని రకముల క్రిమి కీటకముల వల్ల వచ్చే దోషము. దృష్టి దోషం అనగా పరుల నరదృష్టి వల్ల వచ్చే దోషము. మృత్యు దోషము లేదా శాల్యా దోషము అనగా మరణించిన శరీరము యొక్క అవశేషాలు ఉన్నా, చనిపోయిన

చోటుగా ఉన్న ఆ చోట దేవతావాహనం జరగదు. కాబట్టి అటువంటి చోట పవిత్రతను పెంచడానికి శంఖువును స్థాపిస్తారు దానిని భూమి పూజ లేదా వాస్తు పూజ అంటారు. కాబట్టి ఆ చోట పవిత్ర తను పెంచడం మళ్లీ పంచభూతాలతో నిర్మితమైనా శరీరం లాంటి ఒక నిర్మాణాన్ని నిర్మిస్తున్నాను కాబట్టి దానిలో ప్రాథమికమైన ప్రాణాన్ని నిలిపే ప్రక్రియను భూమి పూజ లేదా శంకుస్థాపన లేదా వాస్తు పూజ అని అంటారు.

## ఏ భాగంలో శంకుస్థాపన చేయాలి?

ఇంటి పొడవును తొమ్మిది భాగాలుగా చేయాలి. ఇందులో పాదాల నుంచి మూడు భాగాలు విడిచిపెట్టాలి. మిగిలిన మూడు భాగాలలో వాస్తు పురుషుడి పాదాలున్న దిశ రెండు భాగాలు వదలాలి. మిగిలిన భాగమే వాస్తు పురుషుడి నాభి స్థానం.

ఈ నాభి స్థానంలో తవ్వి నవధాన్యాలతో శంఖువును స్థాపించాలి. ముందు శంఖువును ధాన్యరాశిపై వుంచి వాస్తుపూజ చేశాక శంఖుస్థాపన చేయాలి. గంధపు చెక్కతో కానీ, మారేడు, అత్తి, మద్ది, వేప, చంద్ర కొయ్యతో గానీ శంఖువును తయారుచేస్తారు.

## పూజ చేసే విధానము

ముందుగా యజమాని లేదా భూమి ఉన్న వ్యక్తి వారి పేరున యోగ్య మైనది మంచి ముహూర్తము చూసుకోవాలి. తరువాత పురోహితుడు సహాయంతో పూజ ఏర్పాట్లు చేసుకోవాలి. మొదటి పూజ గణపతి పూజ



ఆటంకములు విఘ్నములు తొలిగి ఇల్లు సుభిక్షంగా ఉండాలని చేసే పూజ. రెండవది పుణ్యాహవాచనము అన్ని రకముల మాలిన్యములు తొలగించి పవిత్రతను కలిగించే పూజగా పుణ్యాహవచనంని చేస్తారు. మూడవది సూర్యుడు మొదలైన తొమ్మిది మంది గ్రహములను పూజిస్తారు. దీనివల్ల గ్రహదోషములు పోతాయి. నాలుగవది వాస్తుపూజ శంఖుపూజ చెక్కతో చేయబడినటువంటి శంఖానికి జనపనార చుట్టి రత్నముల చేత పొదిగి షోడశోపచారములు చేత పూజిస్తారు.

ఈ శంఖాన్ని తీసుకొని కట్టడానికి ఈశాన్య భాగంలో భూమిలోపల స్థాపన చేసి పూజించి పూడ్చి వేస్తారు. దీనినే వాస్తు పూజ, భూమి పూజ అనే పేర్లతో పిలుస్తారు. శంఖుస్థాపన సమయంలో మనం ఉపయోగించే పూజా ద్రవ్యాలు, నవధాన్యాలు వగైరా గృహం లోపలకు వచ్చే విధంగా చూడాలి. అంటే ఆ తీసిన గుంత మధ్యలో లేదా ఇంకొంచెం లోపలకు ఉండే విధంగా పాతి పెట్టాలి. గృహారంభం ఈశాన్యంలోనే చెయ్యాలని, వేరే చోట్ల చెయ్యకూడదం మంచిది కాదని వాస్తు శాస్త్రం చెబుతోంది.

## శంకుస్థాపనకు శుభగ్రహాల బలం ఏ విధంగా ఉండాలి?

శంకుస్థాపన లగ్నానికి శుభగ్రహాల బలం ఎంతగా కలిగినప్పటికీ సూర్యుడు- అంగారకుడు, శని తృతీయ- షష్టమ- ఏకాదశ స్థానా

లలోగానీ, ఉచ్ఛ-మూల త్రికోణ- స్వక్షేత్రాలలో గాని ఉండాలి. లగ్నానికి 4-8 స్థానాలలో ఏ గ్రహాలు ఉండరాదు.

గురుబలం ఉన్న ముహూర్తాల్లో గృహప్రవేశం, శంకుస్థాపన చేసిన సర్వదా పురోభివృద్ధి కానవస్తుంది. వైశాఖమాసంలో శుభదాయకమని, జ్యేష్టమాసంలో సామాన్యంగా ఉంటుంది.

ఆషాఢమాసంలో హానికరమనీ, శ్రావణమాసంలో ధనాభివృద్ధి చేకూరుతుందని, భాద్రపదమాసంలో దరిద్రమనీ, ఆశ్వీయుజంలో గౌరవం చేకూరుతుందనీ, కార్తీకంలో ఆర్థికాభివృద్ధి, ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందనీ, మార్గశిరంలో ధనప్రాప్తి కలుగుతుందనీ, పుష్యమాసంలో అశాంతి అని, మాఘ, ఫల్గుణ మాసాల్లో సంకల్పసిద్ధి చేకూరుతుందని ముహూర్త శాస్త్రం చెపుతుంది.

## శంఖుస్థాపనకు ఏ సమయం మంచిది?

శంఖుస్థాపనకు మొదటి ఝాము ప్రశస్తం. రెండు ఝాము- మూడో ఝామున కూడా శంకు స్థాపనం చేయవచ్చు. కానీ, నాల్గవ ఝామున మాత్రం చేయరాదు. ఇల్లు కట్టుకునే ముందుగా శంఖుస్థాపన చేయడం వలన దోషాలు చాలావరకు తొలగి శుభ పరిణామాలు జరుగుతాయి.

శుక్రమౌఢ్యమి, గురుమౌఢ్యమిలో శంకుస్థాపన, గృహప్రవేశాలు చేయరాదు. పుష్య, ఆషాఢ, భాద్రపద మాసాలలో శంఖుస్థాపన గాని, గృహప్రవేశం కాని చేసిన హానికరం.

# 81. గృహప్రవేశము



ఒక పళ్ళెములో పసుపు, కుంకుమ, నవ ధాన్యములు, ఉప్పు, పెరుగు, కందిపప్పు, కవ్వము, నిమ్మకాయలు, చాకు, కుడుములు, కొబ్బరికాయలు 12, పురోహితుని జాబితా ప్రకారము ఆడవారు పూజ పళ్ళెము, మగవారు సీతారాములు, లక్ష్మీదేవి పటములు పట్టుకొని గృహప్రవేశం చేయాలి.

**కుడుములు :** బియ్యం పిండి ఒక డబ్బా, ఉప్పు, పశ్చిశనగపప్పు గుప్పెడు. నీళ్ళు వేడి నీరుపోసి కలిపి ఇడ్లి పళ్ళెములలో వండవలెను. ఒక డబ్బా పిండికి పది కుడుములు వచ్చును.

గృహప్రవేశము అయిన తరువాత కుడుముల టిఫిను మూత తీయ వలెను. కుడుము ఆవిరి ఇంట్లోకి రావలెను. ముందుగా బ్రాహ్మణుడు వేదమంత్రాలతో గుమ్మడికాయ మెల్లాలో కొట్టిస్తారు.

తరువాత ప్రతి గుమ్మం ముందు కొబ్బరికాయ కొట్టించి, నిమ్మకాయ కోసి గుమ్మానికి రెండువైపులా పెట్టిస్తారు. మనతోపాటు ఆవును, దూడను తెచ్చి ఇంట్లో అన్ని గదుల్లో తిప్పి, తీసుకు వెళతారు. పూజవద్ద పీటల మీదకు, ఆకులు ఒకకట్ట, వక్కలు 100 గ్రా., ఎండు ఖర్జూరము 250 గ్రా., పసుపు కొమ్ములు 250 గ్రా., అరటిపండ్లు 12, కొబ్బరికాయలు 2, బియ్యము 2 1/2 కేజీ, పీటలమీద తుండు, కట్టుబడి సామాను పెట్టి బ్రాహ్మణుడు పూజ చేస్తాడు.

పుట్టింటి వాళ్ళు కట్నాలు తీసుకురావాలి. పొంగలి గిన్నె పుట్టింటి వారు ఇవ్వవలెను. ఇత్తడి గిన్నె, గరిట, మూత, పొంగలిగిన్నె, పాతగుడ్డ, మసిగుడ్డ కావలెను. ఇంటి ఆడవాళ్ళుకాని, ఆడపడుచు కాని పెట్టవచ్చును. గిన్నెకు పసుపురాసి బొట్టుపెట్టి పాలు పొంగించాలి. పాలు పొంగించిన తరువాత పొంగలి వండాలి.

ఆ సందర్భంగా ఆడపడుచును పీటలపైన కూర్చుండబెట్టి, బొట్టుపెట్టి తాంబూలంతో పాటు బంగారము కాని దక్షిణకాని ఇవ్వవలెను. వాస్తు పూజ అయినాక పొంగలి, కుడుములు అల్లపుచెట్నీ పెట్టి అందరికి ఇవ్వ వలెను. గుమ్మడికాయకు కళ్యాణం బొట్టు పెట్టవలెను. శ్రీసత్యన్నారాయణస్వామి వ్రతముచేసి అందరికి భోజనము ఏర్పాటు చేసుకొనవలెను.

# 82. అద్దె ఇల్లు - గృహప్రవేశం



**కావలసినవి :** సీతారాముల పటము, లక్ష్మి, వినాయకుడు పటము, పసుపు, కుంకుమ, అక్షింతలు, కర్పూరము, వత్తులు, పత్తి, నూనె, కుంది, గంట, హారతి ఇచ్చునది, ఆకులు, వక్కప్యాకెట్టు, పూలమాల, విడిపూలు, నిమ్మకాయలు, చాకు, గిన్నె, గరిట, పళ్ళెము, కొబ్బరికాయలు 2, పొయ్యి,

మసిగుడ్డ, పాతగుడ్డ, బియ్యము, బెల్లము, జీడిపప్పు, నెయ్యి, యాలుకులు, ఉప్పు, పెరుగు, కందిపప్పు, కవ్వము, మంచినీళ్ళు, దిండ్లు, దుప్పట్లు, కట్టుకొను వస్త్రములు, చాపలు

భర్త రాముని పటము, భార్య పేపరు ప్లేట్లు, గ్లాసులు, మంచినీరు, పసుపు, కుంకుమ, అక్షింతలు, పెరుగు, కవ్వము, ఉప్పు ఒక ప్లేటులో ఉంచి పట్టుకోవాలి.

పురోహితుడు సూచించిన సమయమునకు మొదటి గుమ్మము వద్ద కొబ్బరికాయలు కొట్టి, నిమ్మకాయ రెండు చెక్కలుగా కోసి, గుమ్మము మీద పసుపు, కుంకుమ, అక్షింతలు చల్లి, నిమ్మ చెక్కలకు కుంకుమ అద్ది గుమ్మమునకు రెండువైపులా పెట్టవలెను.

తరువాత ఒక గిన్నెను పసుపు కుంకుమలతో అలంకరించి, పాలుపోసి వాటిని పొంగేవరకు మరగించాలి. తూర్పు ఈశాన్యములో శుభ్రపరచి అలంకరించి దేవుని పటము పెట్టి పూజచేసుకొనవలెను.

పొంగలి నైవేద్యము పెట్టవలెను. పిలిచిన అతిథులకు కాళ్ళకు పసుపు రాసి, నుదుట కుంకుమ బొట్టు పెట్టి, పండు తాంబూలము ఇవ్వవలెను. పెరుగు, ఉప్పు, కవ్వము ఆ ఇంట్లో ఉంచవలెను.

3/4 డబ్బా, 3 గిద్దలు, 3 గుప్పిడులు, అవసరమును బట్టి పొంగలి చేయాలి. అతిథులకు వసతిని బట్టి భోజన సదుపాయాలు చేసుకోవాలి.

# 83. భోగిమంటలు



భోగిపండుగనాడు తెల్లవారుజామున ప్రతి ఇంటిముందు భోగి మంటలు వేస్తారు. అందులో ముందుగానే తయారు చేసుకున్న భోగి పిడకలు (గొబ్బెమ్మలు) పనికిరాని వస్తువులు అన్ని వేస్తారు. పాతను తగులపెట్టి కొత్తను ఆహ్వానిస్తున్నట్టు ఈ భోగిమంటలకు అర్థముగా చెబుతారు. కొన్ని ఊర్లలో ఊరు మొత్తానికి ఒకే చోట ఈ భోగిమంట వేస్తారు. చాలా వరకు ప్రతి వీధి చివర ఆ వీధివారు భోగిమంట వేసు కొంటారు. ఈ ఆచారం చాలా ప్రాంతాలలో ఇప్పటికి కొనసాగుతుంది.

# 84.సంకురుమయ్య



సంక్రాంతి నెలలో సంకురుమయ్య అనే దేవదూత భూమి మీద పర్యటిస్తారు అని ప్రతీతి. ఈ సంకురుమయ్య ప్రతి సంవత్సరం ఒక్కొక్క వాహనం పై వస్తాడు అని పంచాంగకర్తలు భావిస్తారు. ఈ సంకురుమయ్య ఆగమన ఆధారంగా ఆ సంవత్సర ఫలితాలను గణిస్తారు. ఉదాహరణకి ఎద్దు వాహనం పై వస్తే ఆ ఏడాది పంటలు బాగా పండుతాయి అని, అగ్ని మీద వస్తే అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయి అని, నర వాహనంపై వస్తే నరులకి అనగా మానవులకి కొద్దిపాటి అరాచకాలు సంభవిస్తాయని ఫలితాలు ఇలా ఇలా ... గణిస్తారు.

# 85.బొమ్మలకొలువు



ఆంధ్రదేశంలో ఈ బొమ్మల కొలువు దసరా తొమ్మిది రోజులు, సంక్రాంతి మూడు రోజులు ఆడపిల్లలు ఉన్న కుటుంబాల వాళ్ళు తప్పకుండా పెడతారు. ఇంటి ఆచారాన్ని బట్టి, ఆనవాయితీని బట్టి కొందరు దసరాకు పెడతారు. మరికొందరు సంక్రాంతికి ఈ కొలువు పెడతారు. బొమ్మలు పెట్టడం, బొమ్మలు నిలపడం, బొమ్మలు ఎత్తడం, అనే వ్యవహారం ప్రాంతీయ భేదాన్ని బట్టి ప్రయోగిస్తూ ఉంటారు.

దసరా నవరాత్రులలో పది రోజులు (9 రాత్రులు) ఈ సరదా బొమ్మల కొలువు పండగ జరుపుకుంటారు. దుర్గాదేవి రాక్షస విజయానికి గుర్తుగా ఈ పండగ జరుగుతుంది. దీని అలంకరణకు తొమ్మిది మెట్లుంటాయి. వారి కళాదృష్టి, ఆర్థిక స్తోమత, సౌకర్యాలను బట్టి వాళ్ళు ఈ మెట్లపై రకరకాల బొమ్మలను అమరుస్తారు.

## బొమ్మల కొలువు పెట్టే ఆచారం ఎలా ఏర్పడింది?

భాద్రపద మాసంలో చివరి పదిహేను రోజులకు, అంటే పౌర్ణమి వెళ్ళిన పాడ్యమి మొదలు అమావాస్య వరకు గల రోజులకు మహాలయ పక్షమని పేరు. దీనికే యుద్ధ పక్షమని, పితృ పక్షమని కూడా పేర్లు ఉన్నాయి. పక్షం అంటే పదిహేను రోజులు. ఈ పదిహేను రోజులు పితృ దేవతలకు పూజ చేస్తారు కాబట్టి పితృ పక్షమన్నారు. ఈ పదిహేను రోజులలో, ఎప్పుడో ఒకప్పుడు దేవతలకూ రాక్షసులకూ పెద్ద యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో క్రమంగా దేవతలు ఓడిపోయారు. అలా ఓడిపోయిన వారు రాక్షసుల ధాటికి తట్టుకోలేక, యుద్ధభూమి నుండి దూరంగా పారిపోయి అరణ్యాల్లో ఆశ్రమాలు నిర్మించుకుని జీవించ సాగారు. తమను ఈ అపజయ పరాభవం నుండి గట్టెక్కించమనీ, ఈ ఆపద నుండి కాపాడమనీ తమ ఇష్టదైవాలను ప్రార్థించారు. కొందరు దుర్గను, కొందరు సరస్వతిని, కొందరు లక్ష్మిని, మరి కొందరు ఆయుధ దేవతలను ఉపాసించారు. అలా కొన్ని సంవత్సరాలు నిష్ఠతో ఆ పూజలు సాగాయి. ఒక విజయదశమినాడు జగన్మాత ప్రసన్నురాలై పురుషులకు

విల్లంబులు, వివిధ రకాల ఆయుధ విశేషాలూ ఇచ్చింది. వారి వారి స్త్రీలకు రంగులతో అలంకరించిన దేవతా విగ్రహాలను ఇచ్చింది. పురుషులందరూ దేవి ప్రసన్నం కావడంతో ఉత్సాహభరితులై, సాహసోపేతులై రాక్షసుల మీదకి యుద్ధానికి వెళ్ళారు. వారు యుద్ధానికి వెళ్ళిన ముహూర్తం ఉత్తరాషాఢ, శ్రవణానక్షత్రాల నడిమి కాలం. దీనికే అభిజిత్ లగ్నమని పేరు.

పురుషులందరూ యుద్ధసన్నద్ధులై వెళ్ళగా, స్త్రీలు తమకిచ్చిన విగ్రహాలను ఒకచోట నిలిపి పూజించారు. ఆ విధంగా స్త్రీలు ఆ దేవతలను పూజించిన పుణ్యశక్తి తోడు కావడంతో దేవతలు జయాన్ని సాధించారు. అందువల్ల ఆ దశమి విజయదశమిగా ప్రసిద్ధి పొందింది.

ఆనాడు ఆ స్త్రీలు తమకు లభించిన దేవతావిగ్రహాలను ఒకచోట కొలువుగా పెట్టి పూజించిన – బొమ్మల కొలువే – దసరాకు బొమ్మలను కొలువుగా పెట్టే ఆచారంగా పరిణమించింది. తరతరాల నుండీ నేటిదాకా ఈ సంప్రదాయం కొనసాగుతూనే ఉంది.

## బొమ్మలను అలంకరించే విధానం

పైమెట్లపై దేవుళ్ళ బొమ్మలను ఉంచుతారు. అమ్మవారి బొమ్మలు కూడా వుంచే ఈచోటుని సత్వగుణానికి ప్రతీకగా నిర్వచిస్తారు. కింద వున్న మెట్లపై ప్రాపంచిక జీవితానికి సంబంధించిన బొమ్మలు వుంచుతారు. అవి తామస గుణాన్ని ప్రతిబింబిస్తాయని అంటారు. మధ్య భాగములో క్షత్రియధర్మాన్ని తెలుపుతూ ఉండే రాజు, రాణి, యుద్ధవీరుల వంటి బొమ్మల నుంచుతారు. ఇక అన్నిటికన్నా పై మెట్టు మీదవుంచే

కలశం దేవీ కరుణకు సూచనగా భావిస్తారు. ఈ మూడు గుణాలను అధిగమించిన వారికి దేవీ కటాక్షము లభ్యమవుతుందని అంటారు. ఇదీ బొమ్మలకొలువు తత్వము. మెట్లపై తెల్లని వస్త్రము పరచి ఆ పై బొమ్మలను అమర్చుతారు. ప్రాంతీయ భేదాలవలన బొమ్మలను అమ ర్చుడంలో కొన్ని భేదాలు కనిపిస్తాయి.

## తొమ్మిది రోజులు నిర్వహించే పూజా విశేషాలు

దీప ధూప నైవేద్యాలతో ప్రతిరోజూ లలితా సహస్రనామాలు, లక్ష్మీ అష్టోత్తరం చదివి పూజలు చేస్తారు. రోజూ ఒక కన్యకి (చిన్నఅమ్మాయి), ఒక సువాసినికి భోజనము పెట్టి తాంబూలం, అలంకరణ వస్తువులు, బట్టలు ఇస్తారు. ఇలా దసరా తొమ్మిది రోజులు చేస్తారు. ప్రతి రోజూ సాయంత్రము పేరంటానికి ముత్తైదువులను, పిల్లలను పిలిచి, అందరికీ పసుపు – కుంకుమ, తాంబూలము, దక్షిణ ఇస్తే తమకు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, అమ్మవారి అనుగ్రహం కలుగుతుందని నమ్ముతారు. ఆ సమయములో మగువలంతా ఇచ్చుపుచ్చుకొనే కుంకుమ ఇల్లాలి సౌభా గ్యానికి చిహ్నము. అష్టగంధము, పసుపు ఆరోగ్యానికి చిహ్నాలు. మహిషా సురుణ్ణి చంపేందుకు దేవి కొంతకాలము సూది మొన మీద తపస్సు చేసిందంటారు. అందుకని బొమ్మల కొలువు ఉన్నన్ని రోజులు సూదిలో దారము పెట్టి ఏపని చెయ్యరు. ఈ బొమ్మల కొలువు ప్రతి సంవత్సరము చేస్తారు. కొన్ని ప్రాంతాలలో సంక్రాంతికి బొమ్మల కొలువు పెడతారు. బొమ్మలు అమర్చే పద్ధతి మాత్రం ఇదే. బొమ్మల కొలువు పెట్టడం మొదలు

పెట్టాక సంవత్సరానికో మెట్టు చొప్పున తొమ్మిది మెట్ల వరకు పెంచుతూ వెళతారు. ప్రతీ సంవత్సరము తప్పనిసరిగా ఓ క్రొత్త బొమ్మ కొనడం సంప్రదాయం. ప్రస్తుతం ప్లాస్టిక్ బొమ్మలు, బార్బీ బొమ్మలు కూడా చోటు చేసుకున్నాయి కానీ ఒకప్పుడు మట్టి బొమ్మలు, పింగాణీ బొమ్మలు మాత్రమే ఉండేవి.

## బొమ్మల కొలువులో అలరారే బొమ్మలు

దేవుని బొమ్మలైన వినాయకుడు, రాముడు, కృష్ణుడు, లక్ష్మి, సరస్వతి, పార్వతి, స్వాతంత్ర్య సమరయోధుల బొమ్మలు, పెళ్ళితంతు బొమ్మలు, హాస్యబొమ్మలు మొదలగునవి ఈ బొమ్మల కొలువలో అమర్చుతారు. దేవుళ్ళ బొమ్మలతో పాటు బొమ్మల కొలువులో తప్పకుండా పెట్టే బొమ్మలు కొన్ని ఉంటాయి. అవి పంచాంగం బ్రాహ్మడు, పెద్ద ముత్తైదువ, పచారీ కొట్టు కోమటి, అతని భార్య, తల్లీ పిల్ల, ఆవూ దూడ వంటివి. ఇవి కాక వివిధ జంతువుల బొమ్మలు, పక్షుల బొమ్మలు, పండ్లు, చెట్ల బొమ్మలు – ఇలా వారి వారి దగ్గరున్న బొమ్మలన్నీ ఆ కొలువులో పెడతారు. కాల క్రమంలో దేశనాయకుల బొమ్మలు, పురాతన కట్టడాల బొమ్మలు, ప్రయాణ సాధనాలు, వాహనాల బొమ్మల వంటివి కొలువులో చోటు చేసుకున్నాయి.

ఏడాది పొడుగునా అల్మారాలలో దాగిన రంగురంగుల దేవతల బొమ్మలు, జంతువుల బొమ్మలు, దొరబొమ్మలు, దేశభక్తుల బొమ్మలు, కొన్ని ప్రాంతాల్లో సంక్రాంతికి, మరి కొన్నిచోట్ల దసరాకి ప్రత్యక్షమై



ధూప, దీప, నైవేద్యాలు అందుకుంటూ కొలువు తీరుతాయి. బొమ్మల కొలువులు చిన్న పిల్లలతో పెట్టించి చుట్టుపక్కల నివసించే ఇల్లాండ్రను పిలిచి రాజూ-రాణీ, లేదా పెళ్ళికొడుకు పెళ్ళికూతురు బొమ్మలకు పెళ్ళి చేయడమో లేదా పేరంటం చేయడమో చేసి వచ్చిన ఇల్లాళ్ళకు వాయిన మిచ్చి పంపే ఆచారం నేటికి కూడా కొన్నిచోట్ల కనబడుతూనే ఉంది.

## దేవాలయాల్లో కూడా బొమ్మల కొలువు

దసరాకి బొమ్మల కొలువు పెట్టడం తమిళదేశంలో అధికంగా వ్యాప్తిలో ఉంది. ఇళ్ళలోనే కాకుండా నవరాత్రులలో దేవాలయాలలో కూడా బొమ్మల కొలువులు పెడతారు. మధుర మీనాక్షి దేవాలయంలో ప్రతీ ఏటా నవరాత్రులకు పెట్టే బొమ్మల కొలువులో వివిధ దేవీమూర్తులు

కనిపిస్తాయి. ఆలయాలలో కూడా జరిపించడాన్ని బట్టి బొమ్మల కొలువు ఏనాటినుండో వస్తున్న సంప్రదాయంగా భావించవలసి వస్తుంది.

## సంక్రాంతి - సంకురమయ్య

ప్రతి సంక్రాంతికీ కాలపురుషుడు సంక్రాంతి పురుషుడిగా సంక్రమణ పుణ్యకాలంలో భూలోకానికి దిగివచ్చి భూలోక వాసులనందరినీ పరిపాలిస్తాడు. ప్రతి సంవత్సరం, అతని వాహనం, అతని పరివారం మారిపోతూ ఉంటాయి. ఈ వివరాలన్నీ పంచాంగం చెప్తుంది. ఆ సంక్రాంతి పురుషుణ్ణే సంకురమయ్య అంటారు. అతడే ఈ చరాచర జగత్తునూ నడిపిస్తూ ఉంటాడు. ఆయనను స్వాగతిస్తూ, అతని గౌరవార్థం సంక్రాంతికి బొమ్మల కొలువు పెడతారు. మనమంతా కాలపురుషుని దృష్టిలో బొమ్మలమే. ఈ బొమ్మలను రక్షించే భారం నీదే సుమా, అని సంకురమయ్యకు విన్నపం చేసేందుకే ఈ బొమ్మల కొలువు అని చెప్పుకుంటారు. ఆ విధంగా సంక్రాంతికి పెట్టే బొమ్మల కొలువులో ప్రధాన దైవం సంకురమయ్య. పసుపు వినాయకుడిని పూజించాక, పసుపుతో పెద్ద ముద్ద చేసి బొట్టు పెట్టి సంకురమయ్యగా సంభావించి, ఆహ్వానం పలికి, పూజిస్తారు. ఆ తరువాత తక్కిన బొమ్మలు పెడతారు.

## సంక్రాంతి బొమ్మల కొలువులో ఉండే బొమ్మలు

ముఖ్యంగా సంతానభాగ్యం కోసం, పాడిపంటల కోసం, సుఖమయ కుటుంబజీవనం కోసం సంక్రాంతిలో బొమ్మల కొలువు పెడతారు. వినాయకుడితో, కుమారస్వామితో ఉన్న శివపార్వతుల బొమ్మ తప్పకుండా

పెడతారు. పిల్లవాడిని ఎత్తుకున్న తల్లిబొమ్మ కూడా తప్పకుండా పెడతారు. మిగతా విషయాలలో దసరా బొమ్మల కొలువు పద్ధతినే పాటిస్తారు. భోగినాడు పెట్టి, కనుమ రోజున కొలువు ఎత్తేస్తారు. అలా మూడు రోజులే ఉంటుంది ఈ కొలువు. సంక్రాంతి రోజు ప్రసాదాలతో పాటు పసుపు కుంకుమలు, తాంబూలం, ముత్తైదువలకు తప్పనిసరిగా ఇస్తారు. ధనుర్మాసం నడిపించిన గోదాదేవి బొమ్మను కూడా తాంబూలంలో ఇస్తారు.

సంకురమయ్య బొమ్మలు కుమ్మరి వారు ప్రత్యేకంగా చేసి మోతుబరి రైతులకు బహుమానంగా ఇచ్చేవారనీ, వీధుల్లోకి తెచ్చి మిగతా బొమ్మలతో పాటుగా అమ్మేవారనీ, ప్రస్తుతం ఆ బొమ్మల తయారీ కానీ, అమ్మకం కానీ, జాడ కానీ లేదని కొందరు ప్రముఖులు తెలుపుతున్నారు.

## బొమ్మలపెట్టె తెరవడం ఓ సంబరం

బొమ్మలన్నీ పెట్టెల్లో పాత పట్టుగుడ్డలు (బొమ్మ పొత్తికలు) చుట్టి దాచడం ఒక పని, ఒక కళ. బొమ్మలకు ప్రత్యేకం చెక్కపెట్టెలు ఉండి, బొమ్మల పెట్టెలు ఆడపిల్లలకు బొమ్మలతో సహా సారె పెట్టే ఆచారం ఉండేది. బొమ్మల కొలువు పెట్టేందుకు బొమ్మల పెట్టె తెరవడం ఒక సంబరం. పెట్టెకు పెద్దవాళ్ళు, మగవాళ్ళు – తండ్రి, పినతండ్రి – పూజ చేసి, హారతి ఇచ్చి, ధూపం వేసి, అమ్మలగన్న అమ్మ పద్యం పిల్లలతో పాడించి జయ జయధ్వానాలతో పెట్టె మూత తీయడం, పిల్లలు ఆనందంతో కేరింతలు కొట్టడం అదో అపురూపమైన వేడుక. ఇలాంటి వేడుకలెన్నో ఇప్పుడు కేవలం తెలుగువారికి జ్ఞాపకాలుగానే మిగిలి పోయాయి.

# 86. గొబ్బెమ్మలు



ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాల్లోనూ సంక్రాంతి సమయంలో ప్రతి ఇంటి ముందూ ఆడ పిల్లలు రక రకాలుగా రంగ వల్లులను తీర్చి దిద్ది వాటిమీద ఈ గొబ్బెమ్మలను ఉంచుతారు. వాటిని పసుపు, కుంకుమ లతో పూలతో అలంకరిస్తారు. వీటిని గొబ్బెమ్మలని, గురుగులను గొబ్బియ్యల్లనీ ఆయా ప్రాంతాలలో రకరకాల పేర్లతో పిలుస్తారు.

సంక్రాంతి సమయంలో బజారులన్నీ గొబ్బెమ్మలతో కళకళలాడుతూ వుంటాయి. సంక్రాంతి పండుగ వస్తోందంటే ఆడ పిల్లలకి ఎక్కడ లేని

ఆనందం. పంట పొలాలనుండి పంటలు ఇంటికి వచ్చి ధాన్య రాసులతో ఇళ్ళు కళకళ లాడుతూ ఉంటాయి. పంట లక్ష్మిని ఇంటికి తెచ్చుకున్న రైతు బిడ్డలు ఆనందోత్సాహాలతో ఈ పండగను జరుపుకుంటారు. ముద్దు లొలికే ముగ్గులతో ఇళ్ళనన్నిటినీ శోభాయ మానంగా తీర్చి దిద్దుతారు.

## గొబ్బి గౌరి వ్రతం

కొన్ని ప్రాంతాలలో గొబ్బి గౌరి వ్రతం చేస్తారు. వివిధ కోర్కెలు తీర్చమని పాటలు పాడుతూ నృత్యం చేస్తారు. శ్రీ కృష్ణుని చుట్టూ చేరి గోపెమ్మలు ఆడినట్లు.. ఆ గొబ్బెమ్మల చుట్టూ చేరి కన్నెపిల్లలు ఆడటం సంక్రాంతి సంప్రదాయం. ఈ గొబ్బెల చుట్టూ ఆడేటప్పుడు అద్భుతమైన పాటలను కూడా పాడుకుంటూ ఉంటారు అమ్మాయిలు.



సుబ్బీ గొబ్బెమ్మా సుఖములియ్యవే
చామంతి పువ్వంటి చెల్లెల్నియ్యవే
మొగిలి పువ్వంటి మొగుణ్ణియ్యవే

అంటూ చక్కని కుటుంబసౌఖ్యాన్ని, ఉన్నతమైన జీవితాన్ని ప్రసాదించమని గొబ్బిదేవతను వేడుకొంటారు.

## తల్లిగొబ్బి, పిల్లగొబ్బి

గొబ్బి అంటే గోపికాదేవి. తల్లిగొబ్బి, పిల్లగొబ్బి అని రెండు రకాలు. తల్లిగొబ్బికి అయిదు గొబ్బెమ్మలు, పిల్ల గొబ్బికి మూడు గొబ్బెమ్మలు ఉంచుతారు. పెద్ద వయసు స్త్రీలు ముగ్గులు పెడుతుంటే చిన్న వయసు ఆడపిల్లలు ఆవు పేడతో చేసి పెట్టే గొబ్బెమ్మలు కృష్ణుని భక్తురాళ్ళైన గోపికలకు సంకేతం. ఈ ముద్దల తలమీద కనుపించే రంగుల పూల రేకులు, పసుపు కుంకుమలు ఆ గోపికలందరూ భర్తలు జీవించియున్న పుణ్య స్త్రీలకు సంకేతం. ఆ గోపికా స్త్రీల రూపాలకు సంకేతమే గోపీ+బొమ్మలు= గొబ్బెమ్మలు. మధ్య ఉండే పెద్ద గొబ్బెమ్మ గోదాదేవికి సంకేతం. సంక్రాంతి రోజులలో వీటి చుట్టూ తిరుగుతూ పాటలు పడుతూ నృత్యం చేసే బాలికలంతా కృష్ణ భక్తి తమకూ కలగాలని ప్రార్థిస్తుంటారు. దీనిని సందే గొబ్బెమ్మ అంటారు.

## ఆవుపేడతో గొబ్బెమ్మలు

ఆడపిల్లలు ఆవు పేడను తీసుకు వచ్చి వాటిని గుండ్రంగా చేసి గొబ్బెమ్మను తయారు చేస్తారు. పై భాగాన గురుగు చేసి అందులో

గుమ్మడి పువ్వులను గుచ్చుతారు. వాటిని తీసుకు వెళ్ళి ముగ్గుల మధ్య వరుస క్రమంలో సుందరంగా అమర్చుతారు. వాటికి నైవేద్యంగా పండ్లను ఉంచుతారు. తరువాత రంగు రంగుల దుస్తులు ధరించిన ఆడపిల్లలు, అనందంగా అందరూ వలయాకారంగా నిలిచి, చప్పట్లు చరుస్తూ పాట పాడుతూ, పాటకు తగినట్లు అడుగులు వేస్తూ, పాట గమనాన్ని బట్టి వేగాన్ని పెంచుతూ గొబ్బి పాటలను వీనుల విందుగా పాడుతూ, తమ భక్తి శ్రద్ధలను వెల్లడిస్తారు. ఇలా ప్రతి ఇంటి ముందూ గొబ్బి పాటలు పాడుతూ ఉంటే, బజారంతా శోభాయమానంగా ఉంటుంది. అన్నమయ్య లాంటి వాగ్గేయకారులందరూ గొబ్బి పదాలను రచించారంటే వాటి ప్రాముఖ్యాన్ని మనం గమనించవచ్చును

**గొబ్బియళ్ళో, గొబ్బి యని పాడారమ్మ**
**కంచి వరద రాజునే గొబ్బియళ్ళో**
**గొబ్బియ్యళ్ళో అంచు లంచుల అరుగుల మీద**
**పంచవన్నె ముగ్గులే గొబ్బియళ్ళో..**

అంటూ సాగే పాటల్లో శ్రీ కృష్ణ లీలలకు సంబంధించిన పాటలు అనేకం ఉన్నాయి. ఈ పాటలకూ గొబ్బెమ్మలకు ఈనాడు అంత ప్రాముఖ్యత లేక పోయినా ఆనాడు అవి ప్రజలను ఎంతగానో అలరించాయి. ఆ నాటి గొబ్బి ఆట పాటల్లో, నృత్యాలలో నాటి ఆడ పిల్లలు ఓలలాడారు అనటంలో అతిశయోక్తి లేదు.

# 87.ముగ్గులు



తూర్పు తెలతెలవారుతుండగా, పొగమంచు ఇంకా విచ్చిపోకముందే ముంగిట రకరకాల ముగ్గులు వరిపిండితోనూ, సున్నపు పిండితోనూ వేసి వాటి మధ్య బంతిపూలు తురిమిన గొబ్బిళ్లు పెట్టే ఆడపిల్లలు తెలుగు పల్లెటూళ్ల ధనుర్మాస శోభకు వన్నెలు చేకూరుస్తారు. ముగ్గు కేవలం సంస్కృతి సంప్రదాయాలలో భాగం మాత్రమే కాదు. దీని వెనుక శాస్త్రీయాంశము కూడా ఉంది. ముగ్గు లేదా రంగవల్లి అనేది ఇంటి వాకిలి, ఇంటి లోపలా అందంగా అలంకరించు ప్రాచీన కాలం నుండి వస్తున్న భారతీయ సాంప్రదాయం. దీన్ని ఉత్తర భారతదేశంలో రంగోలి అని పిలుస్తారు. ముగ్గులను ముగ్గు పిండితో వేస్తారు. ఇంటి ముందు పేడ నీటితో కళ్ళాపి జల్లి తడిగా ఉండగానే ఈ పిండితో ముగ్గులు వేస్తారు. ఇవి ఎక్కువగా స్త్రీలు వేస్తారు. గచ్చులు వేసిన ఇంటి వెలుపలి, లోపలి భాగాలలో ముగ్గు రాళ్ళనుగాని సుద్ద ముక్కలను గాని తడిపి వేస్తారు.

## మామూలు ముగ్గులు

మామూలు పిండితో, పేడతో కళ్ళాపి చల్లిన నేలపై పెట్టేవి. ఇవి ప్రతిరోజూ పొద్దున్నే ఆలవాటుగా పెడతారు. సాంప్రదాయాన్ని అనుసరించి ముంగిట్లో మహాలక్ష్మి నడయాడునన్న నమ్మకంతో వేసే ముగ్గులు ఇవి.

## రంగుల ముగ్గులు

కొన్ని విశేష సందర్భాలలో రంగులను ఉపయోగించి వేయు ముగ్గులు. పోటీలకు, కొత్త సంవత్సరంలో ముగ్గులను తీర్చి దిద్దేందుకు, ఇంట్లో శుభకార్యాలకు ఇలాంటి రంగుల ముగ్గులు వేస్తుంటారు. కొన్ని ముగ్గులలో పక్షులు, జంతువులు, పువ్వులు మొదలైనవి కూడా కనిపిస్తాయి.




## పండుగ ముగ్గులు



సాధారణంగా ముగ్గులతోనే పండుగలకు కళ వస్తుంటుంది. సంక్రాంతి సందర్భంలో పెట్టే ముగ్గులు దీనికి ఉదాహరణ. కార్తీకమాసం మొదలుకొని సంక్రాంతి పూర్తి అయ్యేంత వరకూ ముగ్గులతో ముంగిళ్ళను ఊరంతా నింపుతూ ఉంటారు. సంక్రాతి ముగ్గులను బంతి పూల రేకుల తోను, గొబ్బెమ్మలతోను అలంకరిస్తారు.

## చుక్కల ముగ్గులు



ముగ్గు పెట్టడానికి ముందు చుక్కలను పెట్టి, ఆ చుక్కలను కలుపుతూ పెట్టే ముగ్గులు. చుక్కల సంఖ్యని బట్టి ఆ ముగ్గులను వివరిస్తారు, ఉదాహరణకి 21 చుక్కల ముగ్గు, చుక్క విడిచి చుక్క ముగ్గు మొదలైన పేర్లతో వీటిని పిలుస్తారు.

## రథం ముగ్గు

సంక్రాంతి సందర్భంగా ఇంటి ముందు వేసే రంగుల ముగ్గులు వేసే పరంపరలో చివరి రోజున రథం ముగ్గును వేస్తారు. ఆ రథం



ముగ్గుకు ఒక గీతను ముగ్గు తోనే కలుపుతూ పక్కింటి వారి ఇంటి ముందున్న రథం ముగ్గుకు కలుపుతారు. ఆ పక్క వారు కూడా తమ రథం ముగ్గుని తమపక్క వారి దానితో కలుపుతారు. సంక్రాంతి ముగ్గులకు ఇదే చివరి రోజు, ఆ తర్వాత వేసే వన్ని సాధారణ ముగ్గులే.

సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీలు పల్లెల్లోను, పట్టణలలోను సాధారణంగా నిర్వహిస్తారు.

ఇంటి ముందు కళ్ళాపు చల్లి దాని పై ముగ్గు వేస్తే వీటిలో నున్న జీవ రసాయనాలు క్రిమి కీటకాలని వెలుపలి నుండి ఇంటిలోనికి రాకుండా నిరోధిస్తాయి. వివిధ రకాల సూక్ష్మక్రిముల ద్వారా ప్రబలే రోగాలని ఇవి నిరోధిస్తాయి. ఇంటి లోగిళ్ళకి ముగ్గులు అలంకారం కూడా తెచ్చిపెడతాయి. కాంక్రీటు అడవులు నిర్మించబడుతున్న ఆధునిక యుగంలో, ఇరుకైన అపార్టుమెంట్ల సంస్కృతి పెరగటంతో ముగ్గులు నగరాలలో అక్కడక్కడా కనిపించిననూ కళ్ళాపు మాత్రం దాదాపు తెలుగువారి ముంగిళ్ళనుండి కనుమరుగైనది.

# 88.హరిదాసులు



"శ్రీరమా రమణ గోవిందోహరి! శ్రీజానకీ రమణ గోవిందోహరి!" అంటూ హరినామ సంకీర్తన చేస్తూ ఇంటింటికి తిరుగుతూ భిక్ష వేసిన గృహస్థులను రామార్పణం, కృష్ణార్పణం, భగవతార్పణం అంటూ దీవిస్తుంటారు హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం నుంచి మకరసంక్రమణ రోజు వరకు వైష్ణవ భక్తిగీతాలను ఆలపిస్తూ పల్లెలు, పట్టణాల్లో ఇంటింటికీ వెళ్లే ఈ హరిదాసులనే మాలదాసులు, మాలదాసర్లు అనీ పిలుస్తారు.

## నెల రోజులు నిష్ఠతో

హరిదాసులు ధనుర్మాస ప్రారంభం నుంచి మకర సంక్రమణ వరకు వేకువజామునే లేచి తలంటుస్నానం చేస్తారు. నొసట తిరుమణి, తిరు చూర్ణం, పట్టెనామాలు ధరించి కొత్త బట్టలు ధరిస్తారు. తెల్లపంచె/ కాషాయ పంచె, చొక్కా/ అంగి, నడుముకు గుడ్డ, కాలికి అందెలు కట్టుకుని.. మెడలో పూలదండ, తలపై కలశం (అక్షయపాత్ర), కుడిభుజంపై తంబుర, ఎడమచేతిలో చిటికెలు ధరించి హరినామ సంకీర్తన చేస్తూ ఇంటింటికీ తిరుగుతారు. మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు అలా తిరిగి ఇంటికి వచ్చేస్తారు. స్నానం చేసి పూజా కార్యక్రమాలు ముగించాకే ఆహారం తీసుకుంటారు. ఈ నెల రోజులు వీళ్లు చాలా నిష్ఠగా ఉంటారు.

నేలపడక, ఒంటిపూట భోజనం చేస్తారు. తర్వాత రోజుల్లో వీళ్లు వీధి నాటకాలను ప్రదర్శిస్తారు. కొందరు బుర్రకథలు గానం చేస్తారు. ఈ మూడు ఆచా రాలూ వీళ్లకి వంశపారంపర్యంగా వస్తున్నాయి.

## ధనుర్మాసంలో వైష్ణవ గీతాలను గానం

మాలదాసులుగా, హరిదాసులుగా వ్యవహారంలో ఉన్న వీళ్లు మాలల్లో ఒక తెగవారు. మాలలకు వివాహాది శుభకార్యాలు, అపరకర్మలు నిర్వహిస్తూ భజన కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. వీళ్లు వివాహ వ్యవస్థలో మేనరికానికి ప్రాధాన్యమిస్తారు. మేనరికం లేనప్పుడు బయట వధువును వెతుకుతారు. ప్రాచీన కాలం నుంచి వస్తున్న 'ఓలి' సంప్రదాయం వీళ్లలోనూ ఉంది. ఇది కన్యాశుల్కం లాంటిది. మాలదాసులు అపరకర్మ



కాండలను రాత్రుల్లోనే నిర్వహిస్తారు. రామానుజకూటంలోని అందరూ ఇలాగే చేస్తారు. చనిపోయిన వారిని శ్మశానం వరకూ చేతుల మీదనే తీసుకెళ్లి ఖననం చేస్తారు. పాడెలాంటిది కట్టరు. కార్తీకమాసంలో వచ్చే శుద్ధ ద్వాదశిని వీరు 'మంగళ కైశికి ద్వాదశి'గా వ్యవహరిస్తారు. ఉత్సవాలు నిర్వహిస్తారు. ధనుర్మాసంలో వైష్ణవ గీతాలను గానం చేస్తారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో వీళ్ల జీవనోపాధి ఒడుదొడుకులకు లోనవుతోంది. వీరి ప్రదర్శనా కళలకు కూడా ఆదరణ లేకపోవడంతో ఈ హరిదాసులకు జీవనభృతి కష్టంగా ఉంది. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో చాలామంది ఈ వృత్తిని మానేస్తున్నారు. హరిదాసులకు తమ వృత్తిపై నమ్మకం కలిగించాల్సిందీ.. వారినీ, వారి ప్రదర్శన కళలనూ అక్కున చేర్చుకోవాల్సిందీ, హరిదాసుల సంప్రదాయాన్ని కొనసాగించుటకు ఊతమివ్వాల్సింది మనమే.

# 89. తప్పెటగుళ్ళు



శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలలో యాదవ కులానికి చెందినవారు చేసే నృత్యాన్ని తప్పెటగుళ్ళు అంటారు. ఎదురు రొమ్ముపై ధరించిన రేకు తప్పెటలను వాయిస్తూ వీరు ముఖ్యంగా శ్రీకృష్ణగాథలను గానం చేస్తారు. వీరు ఎదురురొమ్ముపై తప్పెట గుళ్ళను కాళ్ళకు చేతులకు చిరు మువ్వలను దరించి అందరూ ఒకే పద్ధతిలో కదులుతూ గానం చేస్తుంటారు.

కళింగాంధ్ర జిల్లాల్లో ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ పట్నం ప్రాంతాల్లో కోనారులు, యాదవులు, గొల్లలుగా వ్యవహారంలో

ఉన్న సామాజికవర్గానికి చెందినవారంతా గ్రామాల్లో ఎక్కువగా ఈనాటికీ మేకలు, గొర్రెల మందలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పొద్దంతా గొర్రెలను, మేకలను పొలాలలోను, అడవులలోనూ మేపుతారు. రాత్రిపూట మందలవద్ద కాపలా కాస్తుంటారు. వీరు ఒంటరితనాన్ని మరచిపోవడానికి వీరి నోట నుంచి అనేక రకాలైన పాటలు వస్తుంటాయి. కుటుంబాలకు దూరంగా, రాత్రిపూట మందకాపలా సమయంలో వీరు ఈ తప్పెటగుళ్లు పాట, గొల్లచెరువు తదితర పాటలను, కాటమరాజు కథలను పాడుతుంటారు.

## సిక్కోలు నేపథ్యంలో

తప్పెటగుళ్లు కళారూపం నాలుగు వందల సంవత్సరాల కిందట శ్రీకాకుళం ప్రాంతంలోనే మొదలైందని చెబుతున్నారు. ఈ జిల్లాలో గొల్ల శాఖకు చెందినవారు ఈ కళావిర్భావానికి మూలం అని అంటారు. ఇది ఒకనాటి శ్రీకాకుళం జిల్లాలో పుట్టినా ఇప్పుడు విజయనగరం, విశాఖ పట్నం, తూర్పు గోదావరి జిల్లాల వరకూ విస్తరించింది. ఈ కళారూపం పుట్టడం వెనుక కొన్ని కథలు ఇప్పటికీ ప్రచారంలో ఉన్నాయి. యాదవు లకు గోపాలుడే కులదైవం. అతను మృతిచెందినప్పుడు వీరంతా గుండెలపై కొట్టుకుని శోకించారట. అలా ఇది మొదలైందని ఒక కథ. క్రీస్తుశకం 12వ శతాబ్దంలో యాదవరాజైన కాటమరాజుకు నెల్లూరు సిద్ధిరాజుకు మధ్య యుద్ధం జరిగినప్పుడు ఆలమందలను కాపాడు కోవడానికి వారంతా డప్పులు, తాళాలతో గుండెలపై కొట్టుకున్నారని, అదే కళారూపమైందని మరోకథ ప్రచారంలో ఉంది.

## కథాంశం శ్రీకాకుళంలో జన్మించినదే

తప్పెటగుళ్ళ ప్రదర్శనలో కథాంశాలు ఎన్నున్నా అందులో కీలకమైనది మాత్రం శ్రీకాకుళంలో పుట్టిందే. రామాయణం, మహాభారతం, భాగవత ఘట్టాలను ఈ కళాకారులు గేయరూపకాలుగా అల్లుతుంటారు. 19వ శతాబ్దానికి చెందిన శ్రీకాకుళం నివాసి బలివాడ నారాయణ రాసిన తొలి తప్పెటగుళ్ళ కథా గేయం 'శ్రీకృష్ణ' ఇప్పటికీ చాలా ప్రచారంలో ఉంది. అయితే ఈ కళాకారుల నోటిద్వారా మౌఖిక సాహిత్యంలో మాండలికాలు, గ్రామీణ యాస, భాషలతో కూడిన పదాలే వస్తాయి. చెంచులక్ష్మి, సారంగధర, తూర్పు భాగవతం దరువులు, లక్ష్మణమూర్ఛ, తేలుపాట, గాజులోడిపాట, మందులోడిపాట, చుట్టపాట, పాలు, చల్లలమ్మడం వంటి స్థానిక ఇతివృత్తాల ఆధారంగా పాటలు పాడతారు. ఒక చరణం ఆలాపించి దానిని అనేక తాళ వరుసలతో పాడి దరువులు వేసి నృత్యం చేస్తారు. సుమారు కొన్ని గంటలు పాటు రెండు మూడు చరణాలను సాగదీసి పాడతారు.

## పల్లెప్రజల పోషణలో

జానపదాన్ని జనమే కాపాడుకుంటారన్నదానికి తప్పెటగుళ్ళ నిలువెత్తు నిదర్శనం. గ్రామీణ ప్రజల పోషణలోనే ఈ కళ తన ఉనికిని కాపాడు కుంటూ వస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏటా జరిగే గ్రామదేవతల సంబరాలు, జాతర్లలోనూ పండుగ దినాల్లోనూ ఈ కళారూపాన్ని ప్రదర్శించడం తప్పనిసరి. ఇది లేకుంటే సందడే ఉండదు. అదే ఈ



జానపద సంగీత నాట్య దృశ్య రూపకం ప్రత్యేకత. రేకుతో గుండ్రంగా తయారు చేసిన తప్పెట లాంటి ఒక వాయిద్య పరికరాన్ని గుండెలపై కట్టుకుని రెండు చేతులతోనూ వివిధ గతులలో ఉద్ధృతంగా వాయిస్తూ, కాళ్ళకు గజ్జెలు కట్టి ఒకే విధమైన రంగుల నిక్కర్లను తొడిగి, వాటికి, కాళ్లకు గజ్జెల గుత్తులు కట్టి, కేకలతో, వివిధ భంగిమలతో కేరింతలు కొడుతూ, ఆనందంతో వలయాకారంగా తిరుగుతూ లయబద్ధమైన పదగతులతోఅందరూ వంగుతూ, లేస్తూ, గెంతుతూ, సుదీర్ఘ రాగాలతో ఆలాపిస్తూ ప్రేక్షకులను రంజింప చేస్తారు.

## గురువే బృందనాయకుడు

తప్పెటగుళ్ల బృందానికి గురువే నాయకుడుగా ఉంటాడు. ప్రదర్శ నంతా నాయకుని ఆట, మాట ప్రకారమే జరుగుతుంది. కొంత మందికి

పొడవైన జుట్టుంటుంది. మరికొంత మంది గోచీలను కూడా కట్టు కుంటారు. నాటి యాదవుల వేషధారణని కూడా ఈ కళారూపంలో ప్రదర్శిస్తారు. లయబద్ధంగా నత్యం చేసే ఈ బృందాలలో పదిహేను నుంచి ఇరవై మంది వరకూ ఉంటారు. తాళం, లయ తప్పకుండా, క్రమం తప్పకుండా వలయాకారంలో తిరుగుతూ వీరు చేసే నృత్యం చేస్తారు. ఇందులో గురువు కేవలం తప్పెట గుళ్ళతో నృత్యం చెయ్యడం మాత్రమే కాకుండా రామాయణం, భారతం, బొబ్బిలి యుద్ధం తదితర కథలను చెపుతూ మధ్య మధ్య 'రంధరంధరా మా స్వామి జన్నయ్య' వంటి కొన్ని కీర్తనలు పాడుతూ వీటిని తిలకించేవారిని తమ కళాప్రతిభతో ఆశ్చర్యంలో ముంచెత్తుతారు.

## విచిత్ర విన్యాసాలు

ఈ ప్రదర్శనల్లో రకరకాల గేయాలను పాడుతూ సన్నివేశాల కనుగుణమైన అభినయాలను ప్రదర్శిస్తూ వారి ప్రతిభను కనపర్చే విన్యాసాలు చేస్తారు. వివిధ భంగిమల్లో తప్పెట్లు వాయించడమే కాకుండా, ఒకరి మీద మరొకరు ఎక్కి ఒకని సహాయంతో రెండు వైపులా ఇద్దరు వేలాడుతూ తప్పెటలు వాయించడం రెండు జట్లుగా విడిపోయి తప్పెట గుళ్లు వాయిస్తూ వారి ప్రతిభను ప్రదర్శించడం, ఒక కుండ పైన ఒకరు నిలబడి అతని పైన మరొకరు నిలబడి తప్పెటగుళ్లు వాయిస్తారు. ఈ విన్యాసాలలో పైకెగిరి అమాంతంగా కింద పడడం, మోకాళ్ళ మీద కూర్చుని విన్యాసంగా గుళ్లు వాయించడం వంటి విన్యాసాలు అకట్టు కుంటుంటాయి.



## ప్రతిభా విశేషాల ప్రదర్శన

తప్పెటగుళ్లు ప్రదర్శన స్థాయి పెరిగేకొద్దీ జట్టులో వారు ఒక్కొక్కరు తమ ప్రతిభా విశేషాలను ప్రదర్శిస్తారు. ఒకరిని మించి మరొకరు దరువులు వేసి వాటికి అనుగుణంగా ఆడతారు. వాయిద్య వరుసలను గమకాలను వినిపిస్తారు. కూచిపూడి నత్యంలో నెత్తిన చెంబూ కాళ్ళ కింద పళ్ళెమూ ఉంచే విధంగానే వీరు కూడా నీరు నింపిన మట్టి కుండ అంచులపై ఒకరు నిలబడితే, అతనిపై మరొక వాద్య కారుడు తప్పెటలను వాయిస్తూనే నీరు నిండిన కుండను నెత్తిన పెట్టుకుని నీరు తొణక కుండా, ఒక పక్క తప్పెట వాయిస్తూ నీరు తొణికి పోతాయేమో అనే బెరుకు లేకుండా నృత్యం చేస్తూ వుంటే చుట్టూ చేరిన జన సందోహం తమని తాము మర్చిపోయి చప్పట్ల వర్షాన్ని కురిపిస్తుంటారు. ఇలా ఈ కళా ప్రదర్శన నాలుగైదు గంటలు సాగుతుంది.

## పతాక స్థాయిగా మానవ పిరమిడ్

ప్రదర్శన పతాకస్థాయికి చేరుకునేటప్పటికి సర్కస్ ఫీట్లు లాంటివి చేస్తారు. నత్యం చేస్తూనే, లయ తప్పకుండా, వలయాకారం తప్పకుండా చిందులు తొక్కుతూనే ఒక ప్రక్క తప్పెట్లు వాయిస్తూనే నెమ్మదిగా ఒకరిపై మరొకరు ఎక్కుతూ అంచెలంచెలుగా గోపురం ఆకారంలో నిలిచి చివరన మరో వ్యక్తి నిలబడి తప్పెట్లు వాయిస్తాడు.

మానవ పిరమిడ్‌లా కన్పించే ఈ గోపురాకార దృశ్యం ఎంతో అద్భుతంగా ఉంటుంది. పై వారి బరువంతా దిగువనున్నవారు భరిస్తూ వుంటే పక్కనున్న కొద్దిమంది లయ తప్పకుండా పాటలు పాడుతూనే ఉంటారు. చివరికి ఒక్కొక్కరుగా దిగుతారు. మొగ్గలు వేస్తారు.

ఒక వ్యక్తి కింద వెల్లకిలా పడుకొని దరువులు వేస్తూ కాళ్ళను భూమికి తాకిస్తూ చుట్టు తిరుగుతాడు. కుండపై నిలబడి నృత్యం చేస్తారు. రెండు, మూడు చెంబులను నీటితో తలపై పెట్టుకొని అవి పడిపోకుండా కూడా నృత్యం చేస్తారు.

## అడుగడుగునా అభినయ విన్యాసాలు

తప్పెటగుళ్లు ప్రదర్శనలను జాతర్లలోనే ఎక్కువగా నిర్వహిస్తారు. ఈ ప్రదర్శనంతా రాత్రివేళల్లోనే ఉంటుంది. ఇది అడుగడుగునా అభినయ విన్యాసంతో తొణికిసలాడుతుంటుంది.

పాటకు తగిన తాళం, తాళానికి తగిన లయ, లయకు తగిన నృత్యం నోటితో పాట, ముఖంలో ఉత్సాహ ఉద్రేకాలతో కూడిన సాత్విక చలనం

ప్రస్ఫుటంగా కళాకారుల్లో కన్పిస్తాయి. తప్పెటగుళ్ళ ప్రదర్శన ఇచ్చే గ్రామంలో ముందుగానే అక్కడి పెద్దల నుంచి కొంత నగదుతో కొంచెం బెల్లం బయానాగా తీసుకుని, ఏ తేదీన ప్రదర్శించాలో నిర్ణయించుకుంటారు.

## ఏకాగ్రతతోనే కళాసాధన

శ్రామిక జీవనాన్ని సాగించుకుంటూనే ఏకాగ్రతతో కళాసాధన చేస్తుంటారు. పగటి వేళల్లో తమ వృత్తిని నిర్వర్తించుకుంటూ రాత్రి పూట ప్రదర్శనలు ఇస్తారు. అలాగే రాత్రి పూటే శిక్షణ కూడా పొందుతారు. చాలామంది కళాకారులు తమ పిల్లలకు చిన్నతనం నుంచే ఈ విద్యలో శిక్షణ ఇస్తున్నారు.

ఈ కళారూపం జాతీయ ఉత్సవాల్లోనూ, విదేశాల్లోనూ ప్రదర్శిత మౌతోంది. జాతీయ స్థాయిలో కూడా తన ఉనికిని చాటుకుంటోంది. ఉత్తరాంధ్రలో వందకు పైనే తప్పెటగుళ్ళ కళాకారుల బృందాలు ఈ కళారూపానికి తమ ప్రతిభని ఆవిష్కరిస్తూ ప్రదర్శిస్తున్నాయి.

## కనకతప్పెట్లు

డప్పుల వాయిద్యాన్నే రాయలసీమలో కనక తప్పెట్లు అంటారు. వీటిని సాధారణంగా జాతరలకు, వివాహాలకు, చాటింపులకు ఉపయో గిస్తూ ఉంటారు. డప్పులతో గుండ్రంగా తిరుగుతూ పాటలు పాడుతూ వివిధ వరుసలలో లయగా వాయిస్తూ లయబద్ధంగా నృత్యం చేస్తారు.

# 90. కొమ్మునృత్యం



కొమ్మునృత్యం గోదావరి తీర ప్రాంతాలలో నివసించే గిరిజనుల సంప్రదాయ నృత్యం. ఈ నృత్యం ప్రదర్శించే కోయలు వారి భాషలో ఈ నృత్యాన్ని పెరియకోక్ ఆట అని అని అంటారు. కోయ భాషలో పెరియకోక్ అంటే దున్నపోతు కొమ్ములు అని అర్థం. దున్నపోతు కొమ్ములు ధరించి, దున్నలు కుమ్ముకునే రీతిలో నృత్యం చేస్తారు కాబట్టి ఈ నృత్యం కొమ్ము నృత్యంగా వ్యవహరింపబడుతున్నది. వీరు ఉపయోగించే వాద్యం "డోలు కొయ్య". చైత్రమాసంలో భూదేవి పండుగను ఘనంగా చేసుకుంటారు కోయలు. ఆ పండుగ సమయంలో పురుషులు అడవులలోకి వేటకి వెళ్ళడం పరిపాటి. వేట ముగించుకుని విజయవంతంగా ఇంటికి చేరుకున్న సందర్భంగా కోయలు దున్నపోతు కొమ్ములు, నెమలి ఈకల గుత్తిని పొదిగిన బుట్టను తలకు అలంకరించుకుని రంగు రంగుల బట్టలు వేసుకుని ఆయా సంప్రదాయ వాద్యాల్ని వాయిస్తూ చేసే నృత్యమే ఈ కొమ్ము నృత్యం. ఇది తెలుగువారి సంప్రదాయ నృత్యాలలో ఒక భాగమైంది.

# 91.జముకుల కథలు



పూర్వపు రోజులలో గ్రామ దేవతల కొలుపులు చేసేటప్పుడు బవనీలు అనబడేవారు అతి బీభత్సంగా జముకు అనే వాద్యాన్ని గుండెలదిరేలా మ్రోగించేవారు. కల్లు, సారాయి లాంటి మత్తు పదార్థాల్ని సేవించి కణకణలాడే కళ్ళతో శక్తి ముందు చిందులు తొక్కుతూ గొర్రెలను, మేకలను గావు పట్టేవారు. గావు పట్టడం అంటే బలి పశువును నోటితో మెడకొరికి చంపడం అని అర్థం. ఆ పైన నెత్తురు గ్రోలి, దాని ప్రేగులు ధరించి,

దొబ్బలు నోటకరిచి, జముకులను వాయిస్తూ వీధుల వెంట తిరిగేవారు. ఇప్పుడు ఆ సంప్రదాయం పోయింది. కాలక్రమేణా ఈ వాద్యం ఆధారంగా కాటం రాజు మొదలైన కథా గీతికల్ని ఆలపించడం, ఆ కథలు జముకుల కథలుగా ప్రసిద్ధి చెందడం జరిగింది.

## జముకు వాద్యం ఎలా ఉంటుంది?

కుంచం ఆకారంలో ఉన్న ఒక డొక్కుకు ఒక ప్రక్క కప్ప చర్మంతో మూస్తారు. ఆ చర్మానికి మధ్య చిన్న రంధ్రం చేసి ఒక నరాన్ని దారం చివర ముడివేసి అందులోకి దూర్చి ఆ నరానికి చిన్న కర్ర ముక్క కడతారు. ఆ కర్రకు నివర మువ్వలు కడతారు. కర్రతో దారాన్ని బిగుతుగా లాగి వదులుతుంటే ఒకరకమైన ధ్వని వస్తుంది. వీరు ఉపయోగించే సాధనం జముకు. దీనిని ఉపయోగించి చెప్పే కథజముకల కథ, దీనినే శ్రీకాకుళం జిల్లాలో కొన్ని ప్రాంతాలలో బోనెల కుండ అని కూడా అంటారు. దీనిని రబ్బరు, కర్ర, రేకు, కంచు, ఇత్తడితో కూడా తయారుచేస్తారు.

ఉత్తరాంధ్రలో హరిజన (మాల-మాదిగ) కులానికి చెందిన వారు కొద్దిపాటి అక్షరజ్ఞానంతో పాడుతూ ఎన్నో తరాల నుండి ఈ కళను జీవింప జేస్తున్నారు. కాని నేటి కాలానికి ఈ కళ ఇంచుమించు కను మరుగయ్యే స్థితికి చేరుకుంది. శ్రీకాకుళం జిల్లాలో నేటి జముకుల కథ పూర్వ నామం బుడికి, లేక బుణికి పాట అనీ, బోనుల పాట అనీ టమకటమా అనీ, బుడబుక్కల పాటనీ నామాంతరాలని కొందరు ప్రముఖులు ఉదహరించారు. బుడికి వాయిద్యాన్నే బోను అని కూడా

అంటారు. అందుకే అది బోనుల పాట అయింది. బుడికి చేసే శబ్దం బుడుక్కు, బుడుక్కు కాబట్టి బుడబుక్కల పాట అని కూడా అంటారు. మొత్తంమీద ఇది వాద్య ప్రధానమైన కళా రూపం.

## రంగస్థలము అవసరం లేదు

జముకుల కథా ప్రదర్శనానికి ఏ విధమైన రంగస్థలమూ అవసరం లేదు. గ్రామం మధ్యలో చిన్న పందిరి వేసి, రెండు దీపాలను పెడితే సరిపోతుంది. ప్రదర్శన కారులు ముగ్గురు. అందులో మధ్య వ్యక్తి కథకుడు, వంత దారుల్లో ఒకరు హాస్యానికి, రెండవారు వ్యాఖ్యానానికి, వేషధారణలో కథకుడు నల్ల కోటు, తెల్లకట్టు పంచ, తల గుడ్డ చుట్టి చక్కగా నృత్యం చేస్తూ కలియ దిరుగుతాడు. స్త్రీ పాత్రలు కథా విధానంలో వచ్చినప్పుడు అక్షరాలా స్త్రీ అభినయాన్నే కథకుడు చేస్తూ వుంటాడు. వంత దారులు రెండు జముకలను శ్రావ్యంగా వాయిస్తూ వుంటారు.

ప్రతి కథలోనూ, కథకుడు సుమారు ఇరవై బాణీల్లో పాటలు పాడు తాడు. పాటకూ, పాటకూ మధ్య కాథాగమనాన్ని రాగయుక్త మైన వచనంలో రాగ రంజితంగా చదువుతాడు. ప్రతి పాటకూ బాణీ మారుతూ వుంటుండి. వాద్య నృత్యగాన సమ్మేళనంతో కథ హృద్యమంగా నడుస్తుంది. ఒక్కొక్క సందర్భంలో వంతదారులు కథలో వచ్చే పాత్రలుగా మారి పోతాడు. ఉదాహరణకు కథకుడు సుభద్రగా నటిస్తే వంత పాటకాళ్ళు ఒకడు అర్జునుడుగానూ మరొకడు మన్మథుడుగానూ, మారిపోతాడు. జముకుల కథా ప్రదర్శనలో ఇలా ఒక విచిత్రమైన డ్రామా నడుస్తుంది.

# 92.బొడ్రాయి



చాలవరకు పల్లెల్లో గ్రామానికి సంబంధించిన ప్రధాన ద్వారం ఉంటుంది. దానిని ఊరి వాకిలి (జనవ్యవహారంలో -ఉరాకిలి), చావిడి, గ్రామ ప్రవేశ ద్వారం మొదలగు పేర్లతో పిలుస్తారు. ఈ చావిడిలోనే మధ్యలో, నేలలో బొడ్రాయిని ఉంచుతారు. బొడ్రాయికి సంబంధించిన సంస్కృతి- సంప్రదాయాలలో ప్రాంతీయ వైవిధ్యం కనిపిస్తుంది. కొన్ని గ్రామాలలో ఊరి బయట కట్టకట్టి కూడ ఉంచుతారు. చావిడిలో బొడ్రాయిని ఉంచిన గ్రామాలలో, ఊరి బయట లింగమయ్య పేరుతో మరో రాయిని ప్రతిష్ఠించి కట్ట కట్టి పూజిస్తారు.

## ఊరుదాటి వెళ్ళేటప్పుడు

వివాహాల సందర్భాలలో ఆడపిల్ల ఊరు దాటి వెళ్ళేటప్పుడు గానీ, బయటి ఆడపిల్లలు ఆ ఊరికి కొత్త కోడళ్ళుగా అడుగుపెట్టేటప్పుడు

గానీ, గ్రామ ప్రవేశద్వారంలో ఉండే బొడ్రాయిని పూజించి గ్రామం విడిచి వెళ్ళడం గానీ, గ్రామంలోకి అడుగుపెట్టటం గానీ చేస్తారు. ఈ సందర్భంలో బొడ్రాయి దగ్గర పూజారులుగా గ్రామానికి సంబంధించిన బోయలు గానీ, తలారి (తలవరి/గ్రామ సేవకులుగా) పని చేసేవారు కాని ఉంటారు. అలాగే గ్రామ దేవరలకు (ఈదమ్మ, సవారమ్మ, పెద్దమ్మ మొ.) కొలుపులు చేసే సందర్భంలో ఉరాకిలిలోని ఈ బొడ్రాయి ముందే జంతువులను (దేవరపోతులను) బలి ఇవ్వటం సంప్రదాయం. చివరికి ఎవరైనా ఊర్లో చనిపోయినా, శవాన్ని సైతం ఉరాకిలిలోని ఈ బొడ్రాయి మార్గం గుండా ఊరు దాటించాల్సిందే.

## కాలగమనంలో మార్పులు

ఇప్పుడు గ్రామాలు విస్తరించడం వలన, భిన్న మతాలు ప్రవేశించడం వలన ఈ సంస్కారాలలో కొద్దిగా మార్పులు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు చావిడిలో, నేల నుండి ఎద్దుల బండి పరం తాకే ఎత్తులో (సుమారు మోకాలు ఎత్తు వరకు ఉండే విధంగా) బొడ్రాయిని ఉంచేవారు. కాలక్రమంలో రోడ్ల అభివృద్ధి కార్యక్రమాల వలన కేవలం చిన్న రాళ్ళుగా మాత్రమే కనిపిస్తున్నాయి. బొడ్రాయి పూర్తిగా నేలలో కనిపించకుండా మునిగిపోయినప్పుడు తిరిగి పునఃస్థాపన చేస్తూ ఉంటారు. ఆ సందర్భంలో గ్రామాలలో పెద్ద ఎత్తున ఉత్సవాలు కూడా నిర్వహిస్తారు.

# 93.కాశీ కథలు చెప్పే కాశీ కావడి



కాషాయ వస్త్రాలను ధరించిన వ్యక్తి కాశీ కావడి అంటూ ఒక కావడిని భుజాన వేసుకుని రెండు ప్రక్కలా పసుపు రంగు బట్టతో మూత గట్టిన బిందెలు గానీ రెండు బుట్టలను గానీ కావడి బద్దకు కట్టి, కావడిలో కాశీ విశ్వనాథుని విగ్రహాలను ఉంచి, వాటిని పసుపు కుంకాలతోనూ, పుష్పాలతోనూ అలంకరించుతాడు.

## కాశీ కావడి ఎలా ఉంటుంది?

ఆ కావడి కొమ్ముకు మూడు గజాల చిత్ర పటాన్ని, ఒక ప్రక్క కావడి కొమ్ముకు తగిలించి, కాశీ విశ్వనాథుని సందర్శనాన్ని గురించి, వారు ప్రయాణించే దీర్ఘ ప్రయాణంలో దర్శించే క్షేత్రాలను గురించీ, కాశీ యాత్ర చేయాలంటే ఎంత కష్టమో ఈ కథ ద్వారా వినిపిస్తాడు. యాత్రికులు బయలు దేరిన దగ్గర నుంచీ, కాశీకి పోయే దారిలో, అడవుల్ని గురించి, ప్రకృతి వర్ణన గురించీ, క్రూర మృగాల ఆర్భాటాలూ, నదీ ప్రవాహాలూ, సత్రాలూ, దొంగల దోపిళ్ళూ, మజిలీలూ, ఇతర యాత్రా స్థలాలూ,

పర్వతాలలో ప్రయాణం, చివరికి కాశీ విశ్వనాథుని సందర్శనం. ఈ మధ్యలో వచ్చే బాధల్ని గురించీ, క్రూర మృగాల బారినుండి తప్పుకోవడం గురించీ, వరుస క్రమంలో కథను నడుపుతూ ఆ కథా సంవిధానంలో అన్ని రసాలనూ చిత్రిస్తూ, చివరికి అన్ని కష్టాలనూ అధిగమించి, కాశీ విశ్వేశ్వరాలయానికి చేరి ముక్తి పొందడంగా దీనిని జీవితానికి అన్వయించి, మనం స్వర్గానికి చేరుకోవడం ఎంత కష్టమో, ఈ కష్టాలను ఉదాహరణగా చెపుతాడు. కథకుడు ద్విపద నడకలో కథను బహు సుందరంగా నడుపుతాడు.

## ప్రజల మధ్యలో పగటి వినోదం

ముఖ్యంగా ఈ కాశీ కావడి చిత్ర కథా విధానం, పగటి పూట ప్రజల మధ్యనే జరుగుతుంది. ఎక్కువగా ఉదయపు సమయాల్లోనే జరుగుతుంది. కథా కాలం కనీసం అరగంట సేపు ఉంటుంది. కాశీ కావడి, కాశీ కావడి అంటూ గంటలు మ్రోగించుకుంటూ నడి బజారులో కావడి దించి, కథకుడు కథను ప్రారంభిస్తాడు. పిల్లా జల్లా ముందుగా వస్తారు. తరువాత పెద్దవాళ్ళు ఆ తరువాత స్త్రీలూ అందరూ కావడి చుట్టూ మూగుతారు. ఆ రోజుల్లో కాశీ క్షేత్రాన్ని సందర్శించడమంటే విదేశాలకు వెళ్ళి తిరిగి వచ్చినట్లే. ధనవంతులు తప్ప ఆ క్షేత్రాన్ని ఇతరులు దర్శించలేక పోయేవారు. ఈ చిత్ర కథాకథనంద్వారా, వారు కాశీ క్షేత్రాన్ని చూసినట్లే అనుభూతి చెందేవారు. కథ విని అందరూ రస సిద్ధిని పొందేవారు. ఆధ్యాత్మిక చింతనతో, తృప్తిపొంది ఎవరికి తోచిన

పారితోషికాలను వారు ముట్ట చెప్పేవారు. ఈ విధంగా కథకుని ఒడి నిండి మరో వీధికి బయలుదేరేవాడు. వీరి బొమ్మలన్నీ చీరల మీద వరుసగా చిత్రించబడి అతి సుందరంగా ఉంటాయి. అవి బందరు కలంకారీ బొమ్మల రంగుల్లో ఉంటాయి. బొమ్మల ద్వారా కథ చెప్పడం వల్ల చదువు రాని వయోజను లందరికీ ఈ కథా విధానం సుబోధకంగా ఉండేది. వీరు కేవలం కాశీ మహత్తునే కాక ఆయా రాజుల మతాల వారి దేవతల గురించి దేవుళ్ళను గురించీ కూడా కథలు చెపుతారు. ఆ నాడు ఈ చిత్ర కథా విధాన్నాన్ని కాశీ కావడి ద్వారా చెప్పేవారు. ఎంతో భక్తి శ్రద్ధలతో చెప్పేవారు. వినే వారు కూడా అలాగే వినే వారు. అయితే రాను రాను ఈ కళారూపం భక్తినీ, ముక్తినీ ప్రబోధించే కంటే భుక్తికే ప్రాధాన్యమిచ్చి యాచక వృత్తిలో దించేశారు.

## తెలుగువారి వస్త్రధారణ

ఆడవాళ్ల చీరకట్టు, మగవాళ్ల పంచకట్టు, ఊరికి మాటకట్టు - ఇది మన పూర్వీకుల సంస్కృతి గుట్టు అని నానుడి. పూర్వం ఆడపిల్లలు గౌను, పరికిణీ-జాకెట్, యువతులు లంగావోణీలు, మహిళలు పెళ్లయ్యాక చీరలు ధరించేవారు. అదే మగ పిల్లలయితే లాగు-చొక్కా, నిక్కర్లు, కాస్త పెద్దయ్యాక అడ్డపంచ, ఆ తర్వాత గోచీ పోసి కట్టే పంచకట్టు, ధోతీకట్టు ఉండేది. అయితే పాశ్చాత్య సంస్కృతులు పరిచయమయ్యాక ఈ వస్త్రధారణలో బోలెడు మార్పులు చోటుచేసుకున్నాయి.

# 94.లంబాడీల నృత్యం



వరినాట్లు, కోతలు, ఇంకా ఇతర వ్యవసాయ పనుల్లో ఉండే బంజారాలు చేసే నృత్యాన్నే లంబాడీ నృత్యం అంటారు.

లంబాడీలు, సుగాలీలు, బంజారాలు అని వివిధ నామాలతో పిలువ బడే ఆదిమ జాతివారు నాగరిక సమాజానికి దగ్గరగా పల్లెలలో, పట్ట ణాలలో నివసిస్తున్నా తమ కట్టు, బొట్టు, మాట, పాట, ఆట, ఆచార వ్యవహారాలను సంస్కృతిని వందలాది ఏళ్ళుగా నిలుపుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా లంబాడీ మహిళల రంగురంగుల దుస్తులు, రకరకాల ఆభరణాలు చూడముచ్చటగా ఉంటాయి. వీరు తండాలుగా జీవిస్తారు. పెళ్ళిళ్ళలో, జాతరలలో, వీరి సాంప్రదాయక సామూహిక

నృత్యం నేత్రపర్వంగా ఉంటుంది. తెలంగాణలో పెండ్లిళ్లు, తీజ్, హోలీ ఉత్సవాల సందర్భంగా ఈ నృత్యాన్ని లంబాడీలు ప్రదర్శిస్తారు ఆదిలాబాదు, రంగారెడ్డి, మహబూబ్ నగర్ ప్రాంతాలలో వీరి నృత్యాలను చూసే అవకాశం ఉంది. లంబాడి నృత్యం తెలంగాణ గిరిజన నృత్యం.

## ఎనిమిది నుండి పది వరకు నృత్యరీతులు

లంబాడీల సాంస్కృతిక జీవితంలో లంబాడీ నృత్యాలు లేదా లంబాడీ డ్యాన్సులు చాల విశేషమైనయి. లంబాడీ డ్యాన్సులు దాదాపు ఎనిమిది నుండి పది రకాలుగా ఉంటాయి. వీటి సంఖ్యా మరియు పేర్లు ఆయా ప్రదేశాలను బట్టి మారుతాయి. ప్రతి నృత్యానికి తనదైన పేరు ఉంటుంది. ప్రతి నృత్యానికి తనదైన శైలి ఉంటుంది.

'పీరేరో నాచ్(పీరీల నృత్యం/డ్యాన్స్), లల్లాయిరో నాచ్ (లల్లాయి నృత్యం/డ్యాన్స్), డపడియారో నాచ్ (డపడియా నృత్యం/డ్యాన్స్), సాపేరో నాచ్ (నాగిని నృత్యం/డ్యాన్స్), మోరేరో నాచ్ (నెమలి నృత్యం/డ్యాన్స్), ఘోడేరో నాచ్ (గుఱ్ఱపు నృత్యం/డ్యాన్స్), ఝుమ్మరీరో నాచ్ (ఝుమ్మరి నృత్యం/డ్యాన్స్), సర్కేరో నాచ్ (బ్రేకు డ్యాన్స్ )' అని రకరకాల నృత్యాలు ఉంటాయి.

## లాంగ్ బాడీస్ లంబాడీలు అయిందా?

లంబాడిలు శారీకంగా భారీ మనుసులు. దృఢమైన శరీరం కలిగి ఎత్తుగా ఉంటారు, వారిని చుసిన బ్రిటిష్ ప్రభుత్వం "long bodies" అని పేరు పెటింది. దీని నుండి లంబాడి అనే పేరు వచ్చింది అంటారు.

లంబాది తెలంగాణలో సెమీ సంచార జీవితాన్ని గడిపే లంబాడి తెగకు సంబంధించినది. లంబాడి తెగ రాష్ట్రమంతటా నివసిస్తుంది. వీటిని బంజారాస్ లేదా సుగాలిస్ అని పిలుస్తారు. సమృద్ధిగా పంట లేదా మంచి విత్తనాల కాలాన్ని ఆనందించడానికి నృత్యకారులు ఈ నృత్యం చేస్తారు. వారు ఇత్తడి చీలమండలు, గాజులు, అలంకరించిన నగలు, గాజు పూసలలో తమను తాము అలంకరించుకుంటారు. ఒక రైతు రోజువారీ కృత్యాలు అంటే పంట మొదలైన వాటిని కోయడం, నాటడం, విత్తడం మొదలైనవి లంబాడి నృత్యంలో ప్రాతినిధ్యం వహిస్తాయి. దసరా, దీపావళి, హోలీ వంటి పండుగలలో ఈ గిరిజన ప్రజలు ఒక ఇంటి నుండి మరొక ఇంటికి నృత్యాన్ని అభినయిస్తూ భిక్ష స్వీకరిస్తారు.

## లంబాడీ నృత్య విశేషాలు

లంబాడి నృత్యకారులు అద్దాలతో అలంకరించబడిన పొడవాటి రంగురంగుల స్కర్టులు, చేతులు కప్పే తెల్లటి పెద్ద ఎముక కంకణాలు ధరించి అందమైన దుస్తులు ధరిస్తారు. నృత్య రూపం గురించి ఒక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఇది మహిళలకు సంబంధించినది. ప్రాంతీయ నృత్యకారుల నృత్యం సున్నితంగా మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. వీరు తెలుగు, కన్నడ, లేదా మరాఠీలలో మాట్లాడతారు. వీరి నృత్యాలలో లయ, సమన్వయం ముఖ్యంగా పేర్కొనవచ్చు. లంబాడీ నృత్య సంప్రదాయం ముఖ్యంగా రాజస్థాన్ నుండి ప్రారంభమైందని చెప్పవచ్చు.

# 95.దింసా నృత్యం



అరకు లోయలో ప్రసిద్ధమైన నృత్యాలలో దింసా నృత్యం ఒకటి. వృద్ధులు, యువకులు, పేదలు, ధనికులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల వారు దింసా నృత్యంలో పాల్గొంటారు. కష్టజీవులైన గిరిజనులకు ఇటువంటి కార్యక్రమాలు అంతులేని ఆనందాన్నిస్తాయి. దింసా నృత్యం అందరిని అలరించడమే కాక, గ్రామీణ ప్రజల మధ్య సుహృద్భావాన్ని పెంపొందిస్తుంది.

# దింసా నృత్యాన్ని ఎప్పుడు ప్రదర్శిస్తారు?

దింసా నృత్యాన్ని చైత్ర పర్వంలోనూ, వివాహ సమయంలోనూ, పండుగ పర్వదినాలలోను ప్రదర్శిస్తారు. దింసా నృత్యంలో విలక్షణమైన సంగీత వాయిద్యాలున్నాయి.

'తుండి', 'మోరి', 'కిరిడి', తుడుము, డప్పు మొదలైన సాంప్రదాయ వాయిద్యాల సహకారంతో లయబద్ధంగా ఈ నృత్యం సాగుతుంది. ఈ నృత్యంలో కళాకారుల్ని ఉత్తేజపర్చడానికి మధ్య మధ్య.. జోడు కొమ్ము బూరలను కూడా ఊదుతారు, స్త్రీ పురుషలందరూ సాంప్రదాయకమైన ఆభరణాలు ధరించి, రంగురంగుల దుస్తులను అలంకరించుకుని, నృత్యానికి హాజరువాతారు.

దింసా నృత్యంలో ఎనిమిది నకాలున్నాయి. అవి. 1. బోడె దింసా 2. గుండేరి దింసా 3. పోతార్ తాలం 4. బాగ్ దింసా 5. నాటికారి 6. కుందా దింసా 7. బాయా దింసా అనే నృత్యాలు ఉన్నాయి.

వీటితో పాటు కొందులు ప్రదర్శించే 'మయూరి నృత్యం' బోదోమరలు ప్రదర్శించే 'డుడుగా నృత్యం' భగత్‌లు ప్రదర్శించే 'పెండ్లి నృత్యం', గడభలు ప్రదర్శించే 'కంగారి నాట్యం', కోయవారు ప్రదర్శించే కొమ్ము నృత్యం, మరియు సవరలు ప్రదర్శించే అందెళ రవ్వ నృత్యం వంటి మొదలగు నృత్యాలను ప్రదర్శిస్తూ వీరు ఆనందోత్సాహాలతో మునిగిపోతారు.

# 96.గుస్సాడీ నృత్యం



ఆదిలాబాదు జిల్లాలో గోండులకు దీపావళి పెద్ద పండుగ. పౌర్ణమి నాడు ప్రారంభించి నరకచతుర్దశి వరకు గోండులు ఆటపాటలతో కాలక్షేపం చేస్తారు. ఈ గుస్సాడి నృత్యం గిరిజన (గోండులు) తెగల సాంప్రదాయ నృత్యం. ఆదిలాబాద్ జిల్లాలోని రాజగోండులు ఈ నృత్యాన్ని ప్రదర్శిస్తారు. వీరు సమూహాలుగా చేరి నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఈ సమూహాలను దండారి సమూహాలు అంటారు. ఇందులోని చిన్నచిన్న సమూహాలను గుస్సాడీ అంటారు. వీరు నెమలి ఈకలు పొదిగిన, జింక కొమ్ములున్న తలపాగా, కృత్రిమ మీసాలు, గడ్డాలు, మేక చర్మాన్ని

ధరిస్తారు. కాషాయ పసుపు వస్త్రాలను ధరిస్తారు. కాళ్ళకు, నడుముకు గజ్జెలు కట్టుకుంటారు. చేతిలో దండాన్ని ధరిస్తారు. ఒంటిపై విభూతి, పూలదండలతో ఆకర్షణీయంగా అలంకరించుకుంటారు. ఈ నృత్యంలో ఉపయోగించే వాయిద్యాలు డప్పు, తుడుము, పిప్రి, కొలికమ్మ. నృత్యం అయిపోయిన తర్వాత వీరి కాళ్లు కడిగి గౌరవాన్ని వ్యక్తం చేయడం ఈ నృత్యంలోని ప్రత్యేకత. మరో ప్రత్యేకత ఏమంటే పురుషులు మాత్రమే గుస్సాడి నృత్యం చేస్తారు.

## గుస్సాడి నృత్యాన్ని ఎప్పుడు ప్రదర్శిస్తారు

గుస్సాడి పండుగ దీపావళి పండుగకు 1 వారం లేదా 10 రోజుల ముందు ప్రారంభమవుతుంది. ప్రారంభ రోజును "భోగి" అని పిలుస్తారు. ముగింపు రోజును "కోలబోడి" అని పిలుస్తారు.



గుస్సాడీలు రంగురంగుల దుస్తులను ధరించి ఆభరణాలతో అలంకరించుకుంటారు. వారు బృందాలతో పాడుతూ, నృత్యాలు చేస్తూ పొరుగు గ్రామాలకు వెళతారు.

ఇటువంటి బృందాలను "దండారి" అంటారు. ప్రతి బృందంలో నలభై మందికి పైగా సభ్యులు ఉంటారు. 'గుసాడి' దండారిలో ఒక భాగం. డప్పు, తుడుము, వెట్టే, డోల్కి, పెప్రే, కాలికోంలు వారి సంగీత వాయిద్యాలు.

## విచిత్రమైన గుస్సాడీ అలంకరణ

గుస్సాడీ అలంకరణ విచిత్రంగా ఉంటుంది. మొత్తం శరీరమంత బూడిద, లేతసున్నం పూసుకొని ఒక చిన్న నిక్కరు మాత్రమే ధరిస్తారు. మొహానికి సున్నం లేదా మసిపూసుకొని ఎడమ భుజంపై మేక లేదా జింక చర్మాన్ని ధరిస్తారు.

చేతిలో రోకలి ఉంటుంది. గుస్సాడీ నృత్యం చేసే వారిని దేవతలు ఆవహిస్తారని వారి నమ్మకం. గుస్సాడీ నృత్యకారులు అప్పుడప్పుడు తమ మంత్రశక్తులను కూడా ప్రదర్శిస్తారని గోండులు నమ్ముతారు.

కాగితం కింద మంటపెట్టి కాగితం కాలకుండా కాగితంపై జొన్నలు పోసి వాటిని పేలాలుగా మార్చడం, గాజు ముక్కలను కరకర నమలడం వంటివి చేస్తుంటారు.

# 97.గరగ నృత్యం



ప్రాచీన జానపద నృత్యాలలో ఒక ప్రత్యేక శైలిని సంతరించుకున్న నృత్యం గరగ నృత్యం. గరగలు అనే అమ్మవారి రూపాలతో ఉన్న వాటిని తలపై మోస్తూ చేసే నృత్యాలనే గరగ నృత్యాలు అంటారు. దీన్నే ఘట నృత్యం అని కూడా అంటారు. దీని ప్రాముఖ్యం ఆంధ్ర దేశంలో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో హెచ్చుగా కనిపిస్తుంది.

## గరగ ఎలా ఉంటుంది?

గరగ శిల్పాన్ని శివపార్వతుల కలయికగా, అర్ధనారీశ్వర స్వరూపంగా వర్ణిస్తారు. గుండ్రంగా ఉన్న పై భాగంలో చిన్న పళ్ళెం (తబుకు) ఉంటుంది. దానిపై గోపురం ఆకారంలో ఉండే రేకును బిగిస్తారు. ఇది పానవట్టాన్ని పోలి ఉంటుంది. దానికి రక్షణగా పైభాగంలో సర్ప ఆకారంలో ఆదిశేషువును అమర్చుతారు.

అమ్మ విగ్రహాన్ని అలంకరించి నట్లుగానే, చీర, గాజులు, పసుపు కుంకుమలతో ఈ గరగలను కూడా అలంకరించి, ఒక పూజ్యభావాన్ని కలిగింప చేస్తారు. గర్భగుడిలోని అమ్మవారి మూల విరాట్టుకు ప్రతి రూపంగా ఈ గరగలను మాత్రమే బయటకు తెచ్చి తీర్థ జాతరలలో వినియోగించడం, ఈ గరగ దర్శనంతో అమ్మవారి దర్శన భాగ్యం కలిగినట్లు భావించడం ఒక నిత్య సత్యమైంది.

## గరగనృత్యాన్ని ఎలా చేస్తారు

నెత్తిపైన కుండ వుంచుకుని ప్రారంభమయ్యే ఈ నృత్యం, నాగరికత కనుగుణంగా కొన్ని మార్పులకు లోనైంది. ఈ గరగలనేవి లోహ నిర్మితమై, వాటిపై ఆదిశేషువు ఆదిగాగల చెక్కడపు బొమ్మలతో అలరారుతూ వుంటాయి. గరగ ఆకారం ఒక పూర్ణకుంభం మాదిరిగా వుంటుంది.

ఈ గరగలను గ్రామ దేవతలని వివిధ పేర్లతో పిలువబడే అమ్మవారి గుళ్ళలో పదిలపర్చబడి అమ్మ వారితో పాటు పూజార్హమై, జాతర సమయాలలో నెలకు ముందు నుండే గర్భగుడి నుండి బయటకు



తీసుకవచ్చి ఆసాదులనబడేవారు ధూప సేవతో నెత్తిపై పెట్టుకుని డప్పుల వాయిద్యంతో లయ బద్ధంగా నృత్యం చేస్తూ, అవేశ పూరితంగా కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లుమని మ్రోగుతుండగా అమ్మవారిని తన్మయత్వం చేస్తూ, చూపరులకు ఉత్సాహాన్ని కలిగిస్తూ, తెల్లవార్లూ ఈ నృత్య కార్యక్రమాన్ని అత్యంత నిష్టతో నిర్వహించటం ఒక విశేషం.

ఆ తరువాత అమ్మవారి విగ్రహం దగ్గరకు గరగలను గర్భడుడికి చేర్చుతారు. మరికొన్ని చోట్ల ఈ గరగ నృత్యం చేసే ఆసాది వారి నిష్టకు నిదర్శనమా అన్నట్లు కణకణ మండే చింత నిప్పులపై నడుస్తూ నాట్య మాడటం కూడా గమనించవలసిన విశేషం.

## ఆసాదులు అంటే ఎవరు?

గరగ నృత్యాన్ని వృత్తిగా స్వీకరించి, ఈ నృత్యానికే అంకితమైన వారిని ఆసాదులంటారు. గర్భగుడి నుండి బయటకు తీసుకు వచ్చిన

గరగలు ఆసాదుల శిరములనలంకరించి లయబద్ధమైన డప్పుల వాయిద్యాల మధ్య తాళాని కనుగుణ్యమైన నృత్యంతో పురవీధులలో ఊరేగుతూ తమతమ ప్రదేశాలకు రాగానే ఆసాదుల కాళ్ళకు బిందెడు నీళ్ళ అభిషేకంతో, ఫలపుష్పాలతో పాటు, చీరలూ గాజులూ, పసుపు కుంకుమలను సమర్పించుకుని అమ్మవారి సేవకు భక్తులు అంకితమౌతారు.

## వివిధ పేర్లతో గరగ నృత్యం

ఆంధ్ర దేశంలోనూ, రాయలసీమలోనూ, తెలంగాణాలోనూ, కర్నాటకలోనూ కరగ అనే పేరుతోనూ, తమిళంలో కరగం అనే పేరు తోనూ, ఇతర ఆంధ్ర ప్రాంతాలలో గరికె, గరిక, గరిగ, గరిగె అనే పేర్లతోనూ ఈ నృత్యం ప్రచారంలో వుంది. ఈ గరగ నృత్యాన్ని నృత్యకారులెంత నేర్పుగా ప్రదర్శిస్తారో ఆ నేర్పుకు తగిన లయబద్ధ వాద్య సహకారం డప్పులు వాయించే వారు అందిస్తూ వుంటారు.

ఈ రెండు సమిష్టి కలయికలతోనూ ఈ గరగ నృత్యం ఎంతగానో శోభిల్లుతుంది. ఈ గరగలను సేవించడం ద్వారా అమ్మవారిని సేవించినట్లే భావింప బడుతుంది. గరిక అంటే కుండ అని అర్థం. ద్రౌపది తన వివాహ సమయంలో అనందావేశంతో ప్రక్కనున్న కలశాన్ని నెత్తిన పెట్టుకుని చిందులు వేసిందనీ, ఆ విధంగా అది పవిత్రం పొందిందనీ కొందరు ప్రముఖులు పేర్కొన్నారు. ఈ గరగ నృత్యాన్ని తమిళనాడులో స్త్రీలు కూడా చేస్తారు.

# 98.దండారి నృత్యం



గోండులు పండుగలు, శుభకార్యాలు, ఇతర ఉత్సవాల సందర్భంగా నృత్యాలకు అధిక ప్రాధాన్యతనిస్తారు. దీపావళి పండగంటే వీరికి మహా ప్రీతి. ఈ పండగ సందర్భంగా వీరు పలు రకాల నృత్యాలను అభినయిస్తుంటారు. గుస్సాడీ, దండారి, దింసా తదితర సాంప్రదాయ నృత్యాలు చేస్తారు. ఈ నృత్యాలన్నింటిలోకి దండారి నృత్యం ప్రధానమైంది.

ఈ నృత్యాన్ని దీపావళి పండగకు వారం రోజుల ముందు చేస్తారు. అప్పటికి వర్షాకాలం ముగుస్తుంది. పచ్చని చెట్లు, పచ్చదనం మధ్య ఈ నృత్యాలను ప్రదర్శిస్తారు.

నృత్యం చేసే వారికి వయస్సుతో పట్టింపు ఉండదు. ఒకరి భుజాల మీద ఇంకొకరు చేతులు వేసి పాటకు లయబద్ధంగా అడుగులు వేస్తూ చేసే దండారి నృత్యం ఇంపుగా ఉంటుంది. పాటలన్నీ గోండి భాషలోనే ఉన్నప్పటికికి ఆ భాషా రాని వారికి కూడా వినసొంపుగా ఉంటుంది. అడవిలో ఒంటరిగా ఉన్న గిరిజన కన్నెను యువకుడు ఆటపట్టించే సంఘటనను గమేలా పాటగా పడతారు. అడవిలో లభించే నెమలి ఈకలు, పశువుల కొమ్ములు, సహజమైన రంగులతో నృత్యకారులు అలంకరించు కుంటారు.

## గ్రామాంతరంలో ప్రదర్శన

దండారి పండుగను తమ గ్రామంలో జరుపుకోవడమే కాకుండా చుట్టు పక్కల గ్రామాలతో సంబంధాలు పెంచుకోవడానికి ఆ గ్రామాలకు అతిథులుగా వెళ్లి అక్కడ తమ నృత్యాలను ప్రదర్శిస్తారు. అనంతరం దేవతలను ప్రార్థించి తమ గ్రామాలు, వ్యవసాయ భూములు, కుటుంబ సభ్యులు చల్లగా ఉండాలని కోరుకుంటారు.

### కలాపం

నృత్య–సంగీత ప్రధాన పాత్రలతో నడిచే నాటకీయతతో కూడిన కళా రూపాన్ని కలాపం అని సాధారణంగా అంటారు. భామాకలాపం, గొల్లకలాపం ఈ ప్రక్రియలో పేరొందిన కళారూపాలు. కథ అంతగా లేకపోయినా, అభినయం, నృత్యం, పాట, సంగీతంతో సమ్మోహన పరిచే నాటక కళారూపం.

# 99. పేరిణి నృత్యం



పేరిణి నృత్యం లేదా పేరిణి శివతాండవం తెలుగు వారి ఒక ప్రాచీన నృత్యం. దీన్నే "యోధుల నృత్యం" అని కూడా వ్యవహరిస్తారు. పూర్వ కాలంలో యోధులు యుద్ధరంగానికి వెళ్ళబోయే ముందు పరమ శివుడి ముందు ఈ నాట్యాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రదర్శించేవారు. ఓరుగల్లును దాదాపు రెండు శతాబ్దాల పాటు పాలించిన కాకతీయుల హయాంలో ఈ కళ బాగా పరిఢవిల్లింది. కాకతీయుల శకం ముగియగానే ఈ కళ దాదాపుగా కనుమరుగైపోయింది. మళ్ళీ ఆంధ్ర నాట్య పితా మహులుగా పిలవబడే ఆచార్య నటరాజ రామకృష్ణ కృషితో మళ్ళీ వెలుగులోకి వచ్చింది.

## పేరిణి నృత్యం రెండు విధాలు

పేరిణి తాండవం రెండు విధాలు. ఒకటి పురుషుల చేతా, రెండవది స్త్రీల చేతా చేయబడుతుంది. పురుషులు చేసే నృత్యాన్ని 'పేరిణి తాండవ' మని, మహిళలు చేసే నృత్యాన్ని 'పేరిణి లాస్యం' పేరిట ప్రదర్శిస్తారు. పురుషుని యొక్క పురుషత్వాన్ని లోకానికి తెలియచేస్తూ ప్రదర్శించే నర్తనమే పేరిణి శివ తాండవం. ఇది వీరులు చేసిన వీర నాట్యం.

కాకతీయుల కాలంలో ఆరాధనా నృత్యాలు బహుళ ప్రచారంలో వుండేవి. ఇవన్నీ శివపరంగా, పశుపతి సంప్రదాయానికి అనువుగా వుండేవి. నాటి పశుపతులు, సంగీత నృత్యాలతో శివుని పూజించేవారు. అవి కాలానుగుణ్యంగా ఉదయమూ, మధ్యాహ్నమూ, రాత్రి సమయం లోనూ ప్రదర్శింపబడేవి. ఇవి మూల విరాట్టుకు ఎదురుగా వున్న నాట్య వేదికలలో ప్రదర్శింపబడేవి.

## నృత్య ప్రదర్శనలో శివుని ఆవాహనం

పేరిణి నృత్యం చేసే ప్రతివ్యక్తీ శివుణ్ణి తనలో ఆవహించుకున్నట్టు భావించి, ఆవేశంతో నృత్యం చేస్తాడు. మేళవింపు విధాన పేరణికి అతి ముఖ్యమైనది. ఓ పరమశివా? నాలో శక్తిని ప్రవేశింపజేసి, నా శరీరాన్ని పవిత్ర మొనరించి, నా శరీరం ద్వారా నీ పవిత్ర నృత్యాన్ని లోకానికి ప్రసాదించు అని ఈ నర్తనాన్ని ప్రారంభిస్తారు.

# 100. డప్పు నృత్యం



పల్లెల్లో ప్రముఖమైన ప్రచార సాధనం డప్పు. అది ఏ ఉత్సవానికైనా పల్లెల్లో విశేషంగా ఉపయోగపడే వాద్యం. ఉద్రేకాన్ని, ఉత్తేజాన్ని కలిగించే డప్పు వాద్యానికి అనుగుణంగా అడుగులు వేస్తూ చేసే నృత్యం డప్పు నృత్యం. ఈ నృత్యం ముందు మెల్లగా ప్రారంభమై రాను రాను పద విన్యాసంతో పాటు వాద్యం కూడా ఉద్ధృతమై, ఉత్తేజం కలిగిస్తుంది. ఆంధ్రదేశంలోని అన్ని పల్లె ప్రాంతాలలోను డప్పు ఉనికి మనకు కనిపిస్తుంది, వినిపిస్తుంది.

## డప్పు వాయిద్యానికి అనేక పేర్లు

డప్పు దీనిని కొన్ని ప్రాంతాలలో పలక అని కూడ అంటారు. డక్కి లాంటి ఆకారమె కలిగి వుంటుంది. కాని పెద్దది. రెండడుగులు వ్యాసం కలిగి వుంటుండి. దీనిని ఎక్కువగా దండోరా వేయడానికి పల్లెల్లో దీనిని గతంలో ఎక్కువగా వాడేవారు.

అదేవిదంగా చావు వంటి కార్యాలకు వాడుతారు. ఈ వాయిద్యాన్ని మాదిగలు వాయించుతారు. ఆధునిక భారతీయ వాయిద్యాల్లో డప్పు చాలా ముఖ్యమైనది. డప్పుకు చాలా పేర్లు ఉన్నాయి. కొయ్య, తప్పెట, కనక తప్పెట, టికోరా అనేవి ప్రధానమైన పేర్లు.

చిత్తూరు జిల్లాలో దీన్ని పలక అంటారు. వీటిల్లో తప్పెట, డప్పు, పలక, కొయ్య అనే పేర్లు పెద్ద డప్పును సూచిస్తాయి. రెండో రకం డప్పు పరిమాణంలో చిన్నది. అందులో కనక తప్పెట మధ్యస్థంగా ఉంటుంది. టకోరా మరీ చిన్నది.

## డప్పును ఎక్కడెక్కడ ఉపయోగిస్తారు?

డప్పు చిర్రను డప్పు పుల్ల, లేక పలక పుల్ల అంటారు. దీన్నే చిటిక పుల్ల అంటారు. డప్పువాయిద్యాన్ని అరుంధతీయులే వాయిస్తారు. డప్పును పెండ్లిళ్లలోను, ఉత్సవాల్లోను వాడతారు. రాజకీయపార్టీల ఊరేగింపుల్లో అదే ప్రధాన ఆకర్షణయింది. చాలామంది ఇంట్లో ఎవరైనా మరణించి నప్పుడు డప్పుల మోత మధ్య స్మశానవాటికకు తీసుకువెళతారు. డప్పును వేడి చేస్తే బాగా మోగుతాయి. జాతర్ల సమయంలో, బైరాగి, బండవేషం,



తోటి వేషం, దొరవేషం, మాతంగి వేషం వేస్తున్నప్పుడు డప్పులు ఉండాల్సిందే. అట్లాగే గరగలు, బుట్టబొమ్మలు, మరగాళ్ళు, ఎలుగుబంటి, పులి వేషం వేసేటప్పుడు కూడా డప్పు మోగాల్సిందే. గ్రామ పోలి చేసేటప్పుడు బలి అనేది ప్రధానం. ఈ బలి సందర్భంలోనూ డప్పును మోగిస్తారు.

## డప్పు దరువులు

డప్పుకు సంబంధించి 30 దరువులున్నాయి. వీటినే దెబ్బలని కూడా అంటారు. జాతర దరువు, దేవుని ఊరేగింపు దరువు, పరుశురాము దరువు, కొలుపుల దరువు, దండోరా, చిటికెల దరువు, గడి ఆటల దరువు, గంగమ్మ దరువు, దున్నపోతు దరువు, చావు దరువు... ఇట్లా రకరకాల దరువులుంటాయి.

డప్పు నేర్పే ప్రత్యేక గురువులుండరు. తరాలవారీగా సంప్రదాయంగా ఈ విద్య తరువాతి తరాలకు అందుతూ వస్తోంది.

# 101.కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్యం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక భారతీయ నాట్యం. ఇది కృష్ణా జిల్లాకు చెందిన కూచిపూడి (మొవ్వ మండలం) గ్రామంలో ఆవిర్భవించింది. 2వ శతాబ్దంలో ఈ ప్రాంతము లోని బ్రాహ్మణులు ఈ శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించటంతో దీనికి ఈ పేరు వచ్చింది. ఇది దక్షిణ భారతదేశం అంతటా పేరుగాంచింది.

## కూచిపూడి ఆరాధకులుగా శాతవాహనులు

3000 ఏళ్ళ క్రితం భరతముని ఈ నాట్యానికి సంబంధించిన వివిధ అంశాలని వివరించాడు. ఒక పద్యం ద్వారా అప్పట్లో నాలుగు విధములైన

నృత్యం ఉన్నట్లు గోచరిస్తూ ఉంది. వీటిలో దక్షిణ భారతానికి చెందిన దక్షిణాత్య కూచిపూడికి పూర్వ విధానమని తెలుస్తున్నది. 2వ శతాబ్దంలో శాతవాహనులు ఈ కళకు గొప్ప ఆరాధకులుగా ప్రసిద్ధి గాంచారు.

దశాబ్దాలుగా ఈ నాట్య ప్రదర్శనలు వైష్ణవారాధనకే అంకితమైనాయి. అందుకే ఈ రూపాన్ని భాగవత మేళ నాటకం అంటారు.

అప్పట్లో అత్యంత పవిత్ర దేవాలయమైన ఆంధ్ర విష్ణు దేవాలయం ఆవరణలో లభ్యమైన శాసనాల ప్రకారం దాదాపుగా మూడు వందల మంది దేవదాసీలు రాజమర్యాదలు అందుకునేవారు.

ఇక్కడ లభ్యమైన శిల్పాలు కూడా ఆ నృత్య కళాకారిణుల దైవపూజగా భావించే అపురూప భంగిమలను దాచిపెట్టినట్లు కనిపిస్తాయి. చాలాకాలం వరకు కూచిపూడి నృత్యం దేవాలయాలలోనే ప్రదర్శింపబడేది.

సాంప్రదాయం ప్రకారం, పూర్వం బ్రాహ్మణ కులానికి చెందిన మగవారే కూచిపూడి నృత్యాన్ని చేసేవారు. అందుకే వీరిని కూచిపూడి భాగవతులు అంటారు.

15వ శతాబ్దంలో సిద్ధేంద్ర యోగి, కూచిపూడి నాట్యంలో స్త్రీలు కూడా నాట్యం చేయ డానికి అనుగుణంగా, కొన్ని మార్పులు చేసి, దానిని పరిపుష్టం గావించాడు.

అతని అనుచరులైన బ్రాహ్మణులు కూచిపూడిలో స్థిరపడి ఈ నాట్యాన్ని అభ్యసించటంతో ఆ ఊరి పేరే ఈ నాట్యానికి కూడా సిద్ధించింది.



## ధారవుతో ప్రారంభమయ్యే కూచిపూడి ప్రదర్శన

కూచిపూడి నృత్యప్రదర్శన గణేశ స్తుతి, సరస్వతీ స్తుతి, లక్ష్మీస్తుతి, పరాశక్తి స్తోత్రాలతో మొదలవుతుంది. ఆ పై ఒక్కొక్క పాత్ర వేదికను అలంకరించి ధారవు (ఒక చిన్న సంగీత, నాట్య రూపం) తో స్వీయ పరిచయం చేసుకొంటారు. దీని తర్వాత కథ మొదలౌతుంది. ప్రక్కన ఒక గాయకుడు, కర్ణాటక సంగీతశైలిలో కీర్తనలను పాడతాడు. దీనినే నట్టువాంగం అంటారు. ఇందులో మృదంగం, వయొలిన్, వేణువు, తంబూరా వంటి వాద్యపరికరాలను ఉపయోగిస్తారు.

## బూరుగుతో ఆభరణాలు

చురుగ్గా లయబద్ధంగా కదిలే పాదాలు, శిల్పసదృశమైన దేహ భంగిమలు, హస్తాలు, కళ్ళతో చేసే కదలికలు, ముఖంలో చూపించే భావాలు, ముఖాభినయంతో కూచిపూడి నృత్య కళాకారులు సాత్వికాభి నయం, భావాభినయం చేయడంలో ఉద్దండులు. నృత్యకారులు నృత్య సమయంలో ధరించే ఆభరణాలు తేలికగా ఉండే బూరుగు అనబడు చెక్కతో చేస్తారు.

## కూచిపూడికి, భరతనాట్యానికి దగ్గర పోలికలు

కూచిపూడి భరత నాట్యానికి దగ్గరగా ఉంటుంది. ఒకే పాత్రగల నృత్యాల గాత్రాలలో జాతిస్వరం, తిల్లానాలు ఉంటాయి. అదే నృత్యం అయితే భక్తుడు దైవంలో ఐక్యమయ్యే కాంక్షను తెలియజేసే సాహిత్యం ఉంటుంది. శైలిలో భరతనాట్యంతో పోల్చినపుడు గల భేదాలతో బాటు కూచిపూడికి ప్రత్యేక నాట్యరీతులు ఉన్నాయి.

అనాది కాలం నుండి కూచిపూడి నృత్య శైలి ప్రామాణిక గ్రంథాలైన అభినయ దర్పణ, నందికేశ్వర భరతర్ణవల పై ఆధారితం. ఈ శైలిని నట్టువ మాల, నాట్య మాలగా విభజించారు.

## నట్టువ మాల రెండు రకాలు

**పూజా నృత్యం:** గుడిలో బలిపీఠం పై ప్రదర్శించేది.

**కాళికా నృత్యం:** కళ్యాణ మండపంలో ప్రదర్శించేది.

# నాట్య మాల మూడు రకాలు

కూచిపూడికి పునాది అయిన నాట్య మాల పురుష సమూహం చేసే నృత్య రూపకం. ఇందులో స్త్రీ పాత్రలు కూడా పురుషులే అభినయిస్తారు. ఇది మూడు రకాలు

**సాంప్రదాయిక నృత్యం :** దేవతలకై ఉద్దేశింపబడ్డది.

**కాళికా నృత్యం :** మేధావులకై ఉద్దేశింపబడ్డది.

**సాధారణ నృత్యం :** భాగవతం అను రకం.

తరంగానికి చేసే గాత్రాన్ని కృష్ణ భగవానుని జీవిత ఘట్టాలని క్రోడీకరించే కృష్ణ లీలా తరంగిణి అంటారు.

# భామాకలాపం

భామాకలాపంలో గర్విష్టి సత్యభామ, కృష్ణ భగవానుని పాత్రలుంటాయి. సత్యభామ పాత్ర ప్రేమలోని వివిధ పార్శ్వాలని అభినయిస్తుంది. కృష్ణుడికి దూరమైన సమయంలో విరహవేదనని అనుభవిస్తూ, తాము కలసి ఉన్నప్పుడు ఎంత సంతోషంగా ఉన్నామో గుర్తు తెచ్చుకొంటూ అతని గూర్చి కాంక్షిస్తుంది. కృష్ణునికి రాయబారం పంపటంతో ఇద్దరూ కలసి కథని సుఖాంతం చేస్తారు.

# కృష్ణశబ్దం

కృష్ణ శబ్దంలో ఒక గోపిక కృష్ణుణ్ని కలవటానికి ఆహ్వానిస్తుంది. ఈ పాత్రలో ఒక స్త్రీ పురుషుణ్ణి ముగ్ధుణ్ణి చేసే ప్రయత్నంలోని హావభావాలని ఆద్యంతము ప్రదర్శిస్తుంది.

# 102.దేవదాసి నృత్యం



ఆంధ్ర దేశంలో దేవదాసీలు, భాగవతులూ నృత్య కళను పోషించి అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. దేవదాసీల నృత్యకళ, భాగవతుల నృత్య కళ అని అది వేరు వేరుగా అభివృద్ధి పొందింది. దేవదాసీలు దేవాలయాల నృత్యమండపాలలో, దేవుని సన్నిధానంలో శైవ, వైష్ణవ సంప్రదాయాల ననుసరించి అరాధన నృత్యాలూ, అష్టదిక్పాలక నృత్యాలు, కేశికా ప్రదర్శనలూ, కలాపాలూ మొదలైన నృత్యాలను ప్రదర్శించేవారు.



# కచ్చేరీ నృత్యకళ

ఒకే నర్తకి ఏకథాటిగా నృత్యం చేయడం కచ్చేరీ నృత్యకళ యొక్క ప్రత్యేకత. రాజాస్థానలలో అభివృద్ధి చెందిన ఈ కళ దేవదాసీలచే ఆరాదింపబడి ఆంధ్ర దేశంలో కచ్చేరీ కళగా రూపొందింది. ఆంధ్ర దేశంలో అభివృద్ధి పొందిన కూచిపూడి నాట్యానికి, దీనికీ ఏ విధమైన సంబంధమూ లేదు. ఈ కళను బొబ్బిలి, విజయనగరం, కార్వేటి నగరం, వెంకటగిరి, కాళహస్తి మొదలైన సంస్థానాధిపతులు పోషించారు.

ఆనాటి నాట్య శాస్త్రకారులు నృత్యాన్ని, నృత్తాన్ని, అభినయాలను మేళవించి ఒక నృత్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ఒక నృత్యకళగా కచ్చేరీ నృత్యకళను ప్రచారంలోకి తీసుకవచ్చారు. దేవదాసీలు క్షేత్రయ్య పద సాహిత్యానికి నృత్యాభినయాలను రూపకల్పన చేసి ఈ కచ్చేరీ నృత్య కళను ప్రదర్శించే వారు. ఆస్థానాల పోషణ తగ్గిన అనంతరం, దేవదాసీలు కేవలం ఉదర పోషణార్థం దీనిని ఉపయోగించారు. సాత్విక ప్రధానమైన ఈ నృత్యకళ ఈ నాడు ఆంధ్రదేశంలో అక్కడక్కడ వృద్ధ దేవదాసీల సొత్తుగా వుందని నటరాజ రామకృష్ణగారు తెలియజేస్తున్నారు.

# నట్టువ మేళాలు

కచ్చేరీ నృత్యకళనుంచి ఉద్భవించినవే నట్టువ మేళలు. కచ్చేరీ నృత్య కళ కేవలం రాజ్యాశ్రమమైనది. ఈ నట్టువ మేళాలు అఖిలాంధ్ర ప్రజానీకానికి పరిచయమైనవి. ఇది వీధి కళారూపమని చెప్పవచ్చు. వివాహాది వూరేగింపుల్లోను, మేజువాణీలలోనూ, గొప్ప గొప్ప తిరునాళ్ళలోను, దేవుని కళ్యాణ ఉత్సవాలలోనూ ఇవి ప్రదర్శింపబడేవి.

పండితులనే కాక పామరుల్ని కూడా రంజింప జేయగల కళారూపమిది. మొరటు హాస్యపు పాటలతో కూడా ప్రేక్షకులను రంజింప చేయడం కద్దు. కచ్చేరీ నృత్య కళకూ, నట్టువ మేళాలకూ అవినాభావన సంబంధముంది.

ఈ రెండు కళలనూ ఆరాధించిన వారు ఎక్కువ మంది దేవదాసీలే. కచ్చేరీ ఆట దేవాలయాల్లో జరిగేటప్పుడు వీరు మేళ ప్రాప్తితో ప్రారంభించి, పుష్పాం జలి, పేరణి, గీతం, శబ్దం, లసాం, జతి, వర్ణం, పదం, జావళి, తిల్లాన లేక దరువుతో ముగిస్తారు.

శబ్దం, సలాం, జతుల్లో ఆంతరింగిక ప్రధానమైన ముద్రలు విశేషంగా ప్రదర్శించే నృత్యాన్ని ప్రదర్శిస్తారు. ఆ తరువాత వర్ణంలో నృత్త నృత్యాలు సమంగా పోషించి సాత్వికాభినయ ప్రాముఖ్యంతో, జావళీలలో ప్రదర్శించి తిల్లాన నృత్యంతో ప్రదర్శనం ముగిస్తారని నటరాజ రామకృష్ణగారు వివరించారు.

# 103.వీరనాట్యము



ఆంధ్రదేశంలో వీరశైవం విరివిగా ప్రచారములోనున్న కాలములో ఆలయములందు దేవదాసీల నృత్యారాధనయే కాక శివభక్తుల తాండవ పద్ధతికిచెంది వీరావేశము కలిగించు నాట్యము కూడ చేసేవారు. వీరరస ప్రధానమైన రచనలను, ఖడ్గములను చదువుతూ వీరొక చేత ఖడ్గమును, మరొక చేత డాలును ధరించి నృత్యమాడేవారు. దీనినే వీరనాట్యము అని అంటారు. ఈ నాట్యము యుద్ధ నాట్యములను పోలి ఉంటుంది.

## వీరుల కొలుపు

ముఖ్యముగా పల్నాటి యుద్ధమున వీరస్వర్గ మలంకరించిన ఆంధ్ర యోధుల సంస్మరణార్థము ఈ వీరుల కొలుపు ప్రారంభమైనది. ఇందులో ప్రదర్శింపబడే ఆరాధనా నృత్యములు కూడా తాండవ పద్ధతికి చెందినట్టివే. కార్యమపూడి, మాచెర్ల, గురజాల మున్నగు చోట్ల పల్నాటి తాలుకాలోని ఈ వీరుల కొలుపులు ఈనాటికీ ప్రతి ఏటా జరుగుతూనే ఉన్నాయి.

# 104.యక్షగానం




మన ప్రాచీన కళారూపాల్లో అతి ప్రాచీనమైంది యక్షగానం. ఆంధ్ర, తమిళ, కర్ణాటక రాష్ట్రాలలో అతి విస్తారంగా వ్యాప్తిలోకి వచ్చింది. యక్షగానం నృత్య, నాటక, సంగీత, వేష, భాష, అలంకారాల కలబోత. ఇది కర్ణాటక రాష్ట్రంలోని అతి ప్రాముఖ్యమైన శాస్త్రీయ కళ.

## యక్షగాన ప్రదర్శన ప్రదేశాలు

యక్షగాన పరిణామ చరిత్ర అతి విచిత్రమైనది. రచనలో, ప్రదర్శనలో, తరతరాలకు మార్పు చెందుతూ వచ్చింది. మొదట యాత్రా స్థలాలు,

కామందుల లోగిళ్ళు తదుపరి పల్లెపట్టుల రచ్చసావిడి, రాచదేవిడీలు యక్షగాన ప్రదర్శనలకు అనువైన స్థానములైనవి. వర్తమానంలో అప్పటికప్పుడు ఏ వూరి మొగనో, ఏ కోవెల వాకిటనో, ఏ సంపన్న గృహస్థు ఇంటి ముందటనో, తాటాతూటముగా నిర్మింపబడిన కమ్మల పందిరి కింద, కళ్ళాపి జల్లిన కటికనేలయే దాని రంగస్థలము.

## యక్షగాన కథలుగా పురాణగాథలు

యక్షగాన ప్రదర్శన సాయంత్రం వేళలలో మొదలవుతుంది. ఊరికి తెలియజెప్పడానికి ఆటకు మొదలు దాదాపు రెండు గంటల పాటు డప్పు కొడతారు. నటులందరూ మెరిసే దుస్తులు, రంగులు పూసిన ముఖములు, తలపై సవరం ధరించి ఉంటారు. ఈ ప్రదర్శనలు ఎక్కువగా పురాణగాథలను వివరిస్తుంటాయి. కథకుడు కథ చెబుతుండగా, వెనుక సంగీతం వినబడుతుంటుంది. వర్ణనలకు అనుగుణంగా నటీ–నటులు నృత్య ప్రదర్శనలు చేస్తుంటారు. నటులకు సంభాషణ అతి స్వల్పంగా ఉంటుంది. ఇలా దాదాపు మరుసటి రోజు సూర్యోదయం వరకూ యక్షగానం సాగుతుంది. ఎన్నో యేళ్ళుగా కేలికె, ఆట, బయలాట, దశావతార మొదలగు వివిధ పేర్లతో ప్రదర్శించబడే ఈ కళకు 200 యేళ్ళ క్రితం యక్షగానమనే శాస్త్రీయ నామం ఇవ్వబడింది.

## ఉపాఖ్యానము

యక్షగానములో ఏదైనా ఒక కథను ఎంచుకొని దాన్ని జనాలకు

గాన, అభినయ, నృత్య రూపాలలో ప్రదర్శిస్తారు. ఇలా ఎంచుకొన్న కథను ఉపాఖ్యానమని పిలుస్తారు. కన్నడలో ప్రసంగ అందురు. ఉదాహరణకు మహాభారతములో భీముడు, దుర్యోధనుని మధ్య గదాయుద్ధకథను ఎంచుకొన్నచో దానిని "గదాయుద్ధ ఉపాఖ్యానము" (కన్నడలో గదాయుద్ధ ప్రసంగ) అంటారు. పౌరాణిక ఉపాఖ్యాలనే ఎంచుకున్నా, యక్షగానమందు ఉపాఖ్యానం/ఉపకథ/కథనము పౌరాణికమే అవ్వాలనే నియమము లేదు. అది ఐతిహాసికము లేక సామాజికము కూడా కావొచ్చు.

## పాత్రధారులు

ఉపాఖ్యానంలో వచ్చు కథకు అనుగుణంగా అభినయించు, నర్తించు నటులను/నర్తకులను పాత్రధారులు అంటారు. ఉపాఖ్యానంలోని కథాను సారం నాయకుడు, దుష్టనాయకుడు, హాస్యగాళ్ళు, స్త్రీపాత్రలు ఇత్యాదులను ఆయా పాత్రల కనుగుణంగా ఎన్నుకొనెదరు. నృత్యం, అభినయం/నటన, మనస్సుకు హత్తుకొనే చతుర సంభాషణలతో కథాంశమును ప్రేక్షకుల/ వీక్షకుల మనస్సుల్లో హత్తుకు పొయ్యేలా చేసే గురురత బాధ్యత పాత్రధారులదే.

## ప్రతిపాత్రా తననుగూర్చి తానే చెప్పకుంటుంది

యక్షగాన ప్రదర్శనంలో వున్న విశేషమేమంటే మన వీధి భాగవతాలలో వచ్చే పాత్రధారులు ఎవరి పాత్రను వారు ప్రదర్శిస్తారు. యక్షగానంలో ఈ మాదిరి కాక, ప్రదర్శనంలో వచ్చే ప్రతి పాత్రా తన్ను గూర్చి తాను చెప్పుకోవడంతో వుంటుంది. ఇదే యక్షగాన ప్రదర్శన స్వరూపం. ఉదాహరణకు: "రాజు వెడలే యమధర్మ రాజు సభకు" అని తన్ను గూర్చి తాను చెప్పుకుంటాడు.

## భాగవతారు పాత్రే ముఖ్యమైనది

యక్షగానప్రదర్శనలో భాగవతారు పాత్ర అత్యంత ముఖ్యమైనది. ఒకవిధంగా ఈ గాన ప్రక్రియకు నిర్దేకుడు వంటివాడు. కథనమును భాగవతారు పాట/గానం రూపంలో శ్రావ్యంగా పాడుతాడు. ఇలాపాడు గాయకుని భాగవతారు అంటారు. భాగవతారు ఆలపించు పాటకు అను గుణంగా ఇతర పాత్రధారులందరు నృత్యరూపంలో మూకాభినయం చేయుదురు. పాటకు అనుగుణంగా చేయు నృత్యంలో పాటలోని అర్ధమునకు తగినట్లుగా పాత్రధారులు భావాభినయం చెయ్యడం అత్యంత కీలకం.

## నేపథ్య సంగీతం

యక్షగానంలో నేపథ్యమును హిమ్మేళ (సంగీతవాద్యం) అంటారు. అనగా యక్షగాన ప్రదర్శన జరుగు సమయంలో ప్రక్కనుండి అవసరమైన మేరకు సంగీత సహకారం అందించే వాద్యబృందం.

ఈ వాద్యబృందంలో డప్పు, మద్దెల, మృదంగము, జాఘంట మొదలగు సంగీతవాద్య పరికరాలను ఉపయోగిస్తారు. వీటిని నృత్య సమయంలో, భావవతారుపాడే సమయంలో, ప్రాసంగికులు మాట్లాడేట ప్పుడు సందర్భోచితంగా వాయిస్తూ యక్షగానప్రదర్శనను రక్తికట్టించెదరు.

అందువలన యక్షగానం ప్రదర్శన ఫలప్రదం కావాలన్నచో పాత్ర ధారుల అభినయం, భాగవతారు గానమాధుర్యం ఎంతముఖ్యమో నేపథ్య సంగీతం కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా భాగవతారు గాత్రానికి ప్రాణం ఈ నేపథ్యవాద్యం.

## బయలాట

యక్షగానాన్ని ప్రదర్శించుటలో అనేకరీతులు, పద్ధతులు ఉన్నప్పటికి, బయలాట(వీధిభాగోతం)అత్యంత జనప్రియమైనది.

బయలాట అనగా వస్త్రాలంకరణ, వేషాలంకరణ కావించుకొని వేదిక భూమిపై ఆడే ప్రదర్శన. పండుగ, సంబారాల సమయాలలో ఊరు బయలు (బహిరంగ స్థలం)లో రాత్రి అంతయు జరిగే ప్రదర్శన కావటం వలన దీనికి బయ లాట అనే పేరు రూఢి అయ్యింది. ప్రజలు మాములుగా 'ఆట' అని వ్యవరిస్తారు.

## యక్షగానాల్లో హాస్యమే ఎక్కువ

యక్షగానాల్లో హాస్యం అతి విస్తారంగా కనిపిస్తుంది. యక్షగానంలోని కటకం వాడు...సింగి సింగడు, సుంకర కొండడు మొదలైన సాంప్రదాయక పాత్రలు ఈ నాటికీ ప్రజా హృదయాల్లో నిలిచిపోయాయి.

కొన్ని యక్షగానాల్లో ఎఱుకలు గొల్లలు మొదలైన వారి జాతి చరిత్ర, వారి సాంఘికాచారాలు, వారి వాలకాలు, మాటల తీరు వృత్తి ధర్మాలు, కట్టు బొట్టులతో సహా తరగతుల వారీగా ప్రజా జీవిత వివరాలన్నీ తెలుస్తాయి. శృంగార హాస్య రసాలు అందరికీ బోధపడే భాషలో వున్నాయి. రాజులకూ ప్రజలకూ ఆదర్శ పాత్రమైనాయి ఆనాటి యక్షగానాలు.

# 105.బుట్టబొమ్మలు



బుట్టబొమ్మలు ఆంధ్ర ప్రాంతములో పెళ్ళి ఊరేగింపులలోనూ దేవుని కళ్యాణ ఉత్సవ సమయాల్లోనూ, పెద్ద పెద్ద తిరునాళ్లలోనూ, జాతర్లలోనూ వినోదము కొరకు ప్రదర్శింపబడుతూ ఉండేయి. బుట్టబొమ్మలు ప్రజా సమూహాల మధ్య ఎత్తుగా ఉండి అందరికీ కనిపించే తీరులో అందర్నీ ఆకర్షిస్తూ ఉంటాయి.

బుట్టబొమ్మలు ఎత్తుగా ఉండి నడుము భాగము నుండి క్రిందికి దిగేకొద్దీ లోపల కాళీగా మారుతూ పెద్దగా బుట్ట ఆకారంలో మారుతుంది. అందువలననే వీటిని బుట్టబొమ్మలంటారు.

బొమ్మల పై భాగమంతా బొమ్మ ఆకారంగా ఉండి లోపలి భాగం డొల్లగా ఉండి బొమ్మ యొక్క కళ్ళభాగంలోనూ, నోటి దగ్గరా రంధ్రాలుంటాయి. ఆటగాడు ఈ లోపలి భాగంలో దూరి, తలను దూర్చి నృత్యంచేస్తే కేవలం బొమ్మే అభినయించినట్లుంటుంది.

బుట్ట బొమ్మలు ఎవరితోనూ మాట్లాడవు. ప్రజల మధ్య తిరుగుతూ వినోద పరుస్తాయి. బుట్టబొమ్మలలో పలురకాలు ఉంటాయి.

# రకరకాల బొమ్మలు

ఈ బొమ్మల్ని పురుషులే ఆడిస్తారు. ఈ బొమ్మల్లో భార్యాభర్తలు, వారి ప్రేమ కలాపాలు, వారి ప్రేమను భగ్నం చేసే దుష్టపాత్ర, స్త్రీ బొమ్మతో కామకేళీ విలాసాలు, ఇది చూచిన భర్త వెంటబడి దుష్టపాత్రను తరమడం తరువాత భార్య వెంటబడే పాత్ర, స్త్రీ పాత్ర క్షమించమని వేడుకోవడం ... ఇలా బొమ్మల ప్రదర్శన సాగుతుంది. ఈ ప్రదర్శనానికి కూడా డప్పుల వాయిద్యముంటుంది. బొమ్మను ధరించిన పాత్రధారి కాళ్ళకు గజ్జెలు కట్టుకొని అడుగులు వేస్తుంటాడు.

# గుర్రం బొమ్మ

గుర్రాల ముఖాలు చేసి, వానికి మేదర తడికతో శరీరాన్ని తయారుచేసి అలంకరించి ఒక మనిషి పాదాలకు రెండు మూడడుగుల పొడవు కర్రలు కట్టుకొని గుర్రం మెడవద్ద ఉన్న కన్నంలోంచి మొత్త వరకు పైకి వచ్చి గుర్రం మీద కూర్చొనికళ్ళెంపట్టుకు తోలుతున్నట్లు కనిపిస్తూ కింద గుర్రం నడుస్తున్నట్లు కట్టుకున్న కర్రలతో లయకు అనుగుణంగా నడుస్తాడు. ఇది చూడముచ్చటగా ఉంటుంది.

బుట్టబొమ్మల్లో పాములవాడి బొమ్మ కూడా ఉంటుంది. నాగస్వరం ఊదుతూ, నృత్యం చేస్తూ ఉంటుంది. ఒక్కొక్కసారి ఈ బొమ్మలు నాలుగైదు కూడా ఉంటాయి. ఈ బొమ్మలో శింగి, సింగడు వంటి హాస్యపాత్రలు కూడా ఉంటాయి. బొమ్మలను అతి సహజంగా జీవకళ ఉట్టిపడేలా రంగు రంగులలో చిత్రిస్తారు. ఇందులో కళాకారుడి ప్రతిభ కొట్టవచ్చినట్లు కనిపిస్తుంది.

# బుట్టబొమ్మల తయారీలో వివిధ పద్ధతులు

**మొదటి రకం :** వెదురు బద్దలను సన్నగా చీల్చి వాటిని మధ్యలోనూ లోపలి భాగంలోనూ తగిన ఖాళీ వదిలి బొమ్మలకు అనువైన ఆకారాలుగా మార్చుకొంటారు. దానిపై దళసరి బట్టను చుట్టి సూదితో దగ్గరగా తగిన బిగువుతో కుడతారు. తరువాత ఆబట్టపై చింత గింజలపొడి, ఉడకబెట్టిన పిండిలాంటి గంజి మిశ్రమంగా చేసి గుడ్డపై పూస్తూ పోతారు. అలా నాలుగైదుసార్లురాసి కావలసిన మందంవచ్చాక ఎండలో పెట్టి దానిపై ఉడ్ ప్రైమరీ అనబడు పెయింటును పూస్తారు. తరువాత ఆయిలు పెయింట్లతో అందముగా అలంకరించి ప్రదర్శనకు సిద్ధము చేస్తారు.

**రెండవరకం :** తలభాగమును షాపులలో కొని దానికి మిగిలిన ఆకారాన్ని సన్నటి ఇనుప ఊచలను కావలసిన ఆకారంలో వంచి దానిపై ఈనెలతో అల్లిక చేస్తారు. అలా అల్లుతూ కావలసిన బొమ్మ ఆకారం తయారు చేస్తారు. దానిపై దలసరిబట్టను వేసి తరువాత మిగిలినదంతా మొదటి రకంగానే చేస్తారు.

**మూడవ రకం :** ఇది నూతనంగా కొంచెం ఎక్కువ పెట్టుబడి కలిగినది. రబ్బరును కావలసిన ఆకారములో కత్తిరించి కొన్నిచోట్ల ప్లాస్టిక్ విని యోగించి పూర్తి చేస్తారు. తరువాత బొమ్మకు పెయింట్ల అవసరం లేకుండా మామూలు బట్టలు జుట్టు మొదలయినవి అతికిస్తారు. ఈ విధానంలో తయారైన బొమ్మలు సహజంగా ఉండి చూపరులకు ఆనందాన్ని కలిగిస్తాయి.

# 106.గంగిరెద్దులాట



గంగిరెద్దులాటలు అనునది ఒక జానపద కళారూపం. ఇది ప్రాచీన మైనది. ధనుర్మాసం వస్తూనే తెలుగునాట గంగిరెద్దులు ప్రత్యక్షమవుతాయి.

## గంగిరెద్దుల ఆటకు మూలం

పూర్వం గజాసురుడనే రాక్షసుడు శివుని కటాక్షం కోసం ఘోరమైన తపస్సు చేశాడట. శివుడు ప్రత్యక్షమై ఏమి కావాలని వరమడిగాడట. అందుకు గజాసురుడు మీరు నా గర్భంలో ప్రవేశించి, పూజలందుకో మంటాడట. అందుకు శివుడు అంగీకరించి అతని గర్భంలో ప్రవేశిస్తాడు.

అంతర్ధానమైన పతి దేవుని జాడ తెలియక పార్వతీ దేవి దుఃఖించి గజాసురుని గర్భంలో ఉన్నట్లు తెలుసుకుని పతిని విముక్తిని చేయమని విష్ణుమూర్తిని వేడుకుంటుంది.

అప్పుడు విష్ణువు గంగి రెద్దుల మేళాన్ని రూపకల్పన చేశాడట. నంది కేశ్వరుణ్ణి గంగిరెద్దుగా అలంకరించి బ్రహ్మాది దేవతలతో వివిధ వాయిద్యాలైన డోలు, సన్నాయి, బూర, సుత్తి లను ధరింప చేసి, తాను మేళానికి నాయకత్వం వహించి... గజాసురుని చెవుల బడి తన సమక్షంలో ఆ ఆటను ప్రదర్శించమని కోరుతాడట. అందుకోసమే ఎదురు చూచిన విష్ణుమూర్తి అద్భుతంగా ఆటను నిర్వహిస్తాడట.

గజాసురుడు ఆనంద భరితుడై ఏం కావాలో కోరుకోమంటాడట. తన పాచిక పారిందనుకున్న హరి... ఇది శివుని వాహనమైన నంది తన స్వామికి దూరమై విలపిస్తూ ఉంది. ఆ స్వామిని నంది కడకు చేరనియ్యి అని కోరతాడట. ఆలోచనలో పడ్డ గజాసురుడు, ఇతను అసుర సంహారియైన చక్రధారి అనీ, ఇక తనకు మృత్యువు తప్పదనీ తెలుసుకున్న గజాసురుడు శివుని ప్రార్థించి, తన శిరస్సును త్రిలోక పూజ్యంగా చేయమని వరమడిగి, నందీశ్వరునికి ఎదురుగా నిలుస్తాడట.

అంతలో విష్ణుమూర్తి నందిని ప్రేరేపించగా, కొమ్ములతో గజాసురుణ్ణి కుమ్మగా గజాసురుని గర్భం నుండి శివుడు బయట పడతాడట. ఆడిన మాట తప్పని గజాసురుని శిరస్సు అన్ని లోకాల్లో పూజ లందుకుంటుం దనీ, అతని చర్మాన్ని తాను ధరిస్తాననీ చెప్పి శివుడు గజాసురునికి శివైక్యాన్ని ప్రసాదిస్తాడట. ఆ గంగిరెద్దులను లోకంలో తిప్పుకొమ్మని

గంగిరెద్దుల వారికి గంగిరెద్దులతో పాటు వాయిద్యాలు కూడా యివ్వడం జరుగుతుంది. (గంగ యొక్క ఎద్దు గంగిరెద్దు) అప్పటి నుండి గంగిరెద్దులను తిప్పుకొని బ్రతుకు తున్నట్లు పెద్దలు చెప్తారు.

## గంగిరెద్దులవారు పాడేపాటలు

వీరు ప్రాంతీయ బాణీలలో జానపద పాటలు పాడుతారు. సన్యాసమ్మ పాట, రాములవారి పాట, ఈశ్వరమ్మ పాట, గంగరాజు పాట, వీర గున్నమ్మ పాట (మందస ప్రాంతంలో), మాలవారి మంగమ్మ మొదలగు పాటలు బాణీకట్టి పాడతారు. సినిమా పాటలు కూడా పాడతారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా గంగిరెద్దుల వారున్నారు. అయినా వీరంతా తెలుగువారే. మహారాష్ట్రలో వీరిని నందివాలా అంటారు.

## గంగిరెద్దులవారి జీవనశైలి

గంగిరెద్దుల మేళాల వారు, రెండు మూడు కుటుంబాలు కలిసి అయిదారు అందమైన బలిసిన గంగిరెద్దులతో దండుగా బయలు దేరి ఆంధ్ర దేశంలో ఆ మూల నుంచి ఈ మూల వరకూ మకాంలు వేస్తూ జీవ యాత్రలు చేసే వారు. ఒకప్పుడు రాజులూ జమీందారులూ వారి వారి ప్రాంగణాలలో గంగి రెద్దులాటను ఏర్పాటు చేసుకుని వినోదించే వారు. గంగిరెద్దుల వారు ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా ఉన్నారు. అయితే వారిలో ఎక్కువ మంది తెలుగు భాషనే మాట్లాడుతారు. వీరికి ఒక వూరనేది లేదు. సంచార జీవులైన వీరు పర్వ దినాలలోనూ, ముఖ్యంగా రైతులకు పంటలన్నీ చేతికి వచ్చి పని పాటలు లేని

సమయాల్లోనూ, సంక్రాంతి పండుగ దినాలలోనూ ఊర్ల వెంట బయలు దేరుతారు. గతంలో గంగిరెద్దుల కులస్థులలో మగవారు గంగిరెద్దు పట్టుకొని ఊరంతా తిరిగితే ఆడవారు గ్రామాలలో కరక్కాయలు, దగ్గుమందులు, గిలకలు అమ్మేవారు. నేడు ఆ పరిస్థితులు మారటంతో ఆడవారు ఫ్యాన్సీ సామానులైన బొట్లు, కాటుకలు, తిలకాలు, అద్దాలు, పైనలు (దువ్వెనలు) ఊరూరా అమ్ముకుని వస్తున్నారు

ఆధునికత సంతరించక ముందు ప్రజలు గంగిరెద్దుల వారిని ఆదరించి బట్టలు, భత్యం, డబ్బులు యిచ్చి చనిపోయిన తాత తండ్రుల పేరు మీద పొగిడించేవారు. గ్రామాలలో వివిధ ప్రదేశాలలో గంగిరెద్దు విన్యాసాలు చేయించేవారు.

## గంగిరెద్దుల అలంకరణ

వీరు గంగిరెద్దుల్ని స్వంత బిడ్డల్లా చూస్తారు. వాటిని ఎన్నో రకాలుగా అలంకారిస్తారు. మూపురం వద్ద నుండి తోక వరకూ ఎంతో అందంగా రంగు రంగులతో కుట్టిన బొంతను కప్పుతారు. రింగులతో కొమ్ములను అలంకరిస్తారు. కొమ్ము చివర ధగధగ మెరిసే ఇత్తడి గొట్టాలను తొడిగి చివరన రంగు రంగుల ఊలు దారాల కుచ్చులను కట్టతారు. వీటినే కుప్పెలు అని అంటారు. మూతికి తోలుతో కుట్టబడిన మూజంబరంను కడతారు. నొసటి భాగాన అందమైన తోలు కుచ్చులను కడతారు. అందమైన గవ్వలను కూడా కడతారు. మూపురాన్ని రంగు పంచెతో అలంకరించి ఒక దండను దిగ వేస్తారు. పొట్ట చుట్టూ తగరపు పువ్వులతో

కుట్టిన తోలు బెల్టును, గవ్వల హారాన్ని కడతారు. కాళ్ళకు గజ్జెలు కడతారు. ఇంటి యజమానులు చీరలు, దుప్పట్లు వంటి బట్టలను ఇస్తారు. వాటిని ఆ గంగిరెద్దు వీపు మీద వేస్తుంటారు. అప్పుడు చూడాలి ఆ బసవన్నల అందం. సాక్షాత్తూ నందికేశ్వరుని పోలి వుంటుంది.

## గంగిరెద్దులవారి వేషం

గంగి రెద్దుల వారి హంగులు, శ్రుతి సన్నాయి బూర, డోలు, చేతిలో కంచుతో చేయబడిన చిన్న చేగంట, వేషధారణలో నెత్తికి రంగుల తలగుడ్డ మూతిమీద కోర మీసాలు, చెవులకు కమ్మల జోడు, వారు వీరు ఇచ్చిన పాత కోటు, భుజంమీద కండువా, చేతికి వెండి మురుగులు, నుదురున పంగనామంతో సైకిల్ పంచ కట్టు కట్టి ఆకర్షణీయంగా తయారౌతారు. గంగిరెద్దుల వారికి ప్రతి వూరిలోనూ మధ్యనున్న పెద్ద బజారే వారికి రంగస్థలం. ముందుగా గ్రామంలో ప్రవేశించి, గ్రామ పెద్దల నాశ్రయించి వారి అనుమతితో ప్రదర్శనం ఏర్పాటు చేసుకుంటారు. వారి వాయిద్యాలాతో రణగొణ ధ్వనులు చేసి ప్రజలను రప్పిస్తారు.

ఎద్దుల్ని బాగా అలంకరించి, కొన్ని విన్యాసాలు సాధన చేయించి ఆటను ఆడిస్తారు. రెండు ఎద్దులు రామలక్ష్మణుల్లాగా, ఒక ఆవు సీతలాగా ఒక్కొక్కరు ఉండి ఆడిస్తారు. గంగిరెద్దులాటలు మేళం, డోలు, గరుడ స్థంభం ఉంటాయి. మనిషిపై ఎద్దును ఎక్కించుకోవడం, మనిషి చెప్పినట్లు ఎద్దు ఆటలాడడం ప్రత్యేకం. చివరకు సీతారాముల పెళ్ళి జరగడం (ఎద్దు–ఆవు) ఆట ముగుస్తుంది.

# 107.ఎడ్ల పందెములు



ఎడ్ల పందెములు బలప్రదర్శనకు సంబంధించిన ఒక క్రీడ. బండీ చకాలు తిరగకుండా వానిని తొట్టికి కట్టేసి ఎడ్లుకట్టి లాగిస్తారు. ఏ బండి ముందు గమ్యం చేరితే ఆ ఎడ్ల జత నెగ్గినట్టు. ఈ పని కొన్ని చోట్ల ఇసుకలో కూడా చేయిస్తారు. కొన్ని చోట్ల బండిలో బరువు బస్తాలు కూడా వేస్తారు. కొన్నిచోట్ల ఎద్దుల జతకు పెద్ద పెద్ద రాళ్ళను కట్టి వాటిచేత ఈ రాళ్ళను లాగిస్తారు. ఈ విధమైన ఎడ్లపోటీలు ప్రముఖ పర్వదినాలలో, తిరునాళ్ళలో జరుపుతారు. గెలిచిన ఎడ్లజతకు బహుమతి ప్రదానం కూడా ఉంటుంది. ఎడ్ల పందాలు కూడా తెలుగువారి వినోద సంప్రదాయాలలో ఒక భాగమై పోయింది.

# 108. పొట్టేలు పందెములు



గొర్రె పొట్టేళ్ళకి కోడి పుంజుల్లాగే పౌరుషం ఎక్కువ. అవి ఢీకొనడం మొదలు పెడితే తల నుంచి రక్తం ఏరులై పారినా లెక్కచేయవు. పందెం రాయుళ్ళు పొటేళ్ళకు ఢీకొనటంలో ముందుగా తర్ఫీదు ఇస్తారు. మొదట పొట్టేలు తలకు దగ్గరగా అర చేయి పెట్టి తాకిస్తూ క్రమంగా దూరంగా నిలిచి "డుర్ చిప్" అని అరచేయి చూపిస్తారు. అది పరుగు పరుగున వచ్చి అరచేయిని ఢీకొంటుంది.

ఆ తరువాత చేయి బదులు చెక్కను పెట్టి గట్టి దెబ్బకు అలవాటు చేస్తారు. వానిని బలంగా మేపి పండుగకు పందాలలోకి దింపుతారు. పందాలలో పొట్టేళ్ళు ఒకదాని తలనొకటి ఢీకొంటూ వీరోచితంగా పోరాడతాయి. పొట్లేళ్ళ పందెం అంటే చూడ్డానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి చూసి వినోదిస్తారు. ఇలా పొట్టేళ్ళ పందాలు మన వినోద సంప్రదాయాలలో ఒకప్పుడు భాగంగా ఉండేవి.

# 109.కోడి పందెములు



సంప్రదాయమో వ్యసనమో కానీ కోడిపందేలనూ సంక్రాంతి పండగనూ వీడదీసి చూడలేము. మన పల్లె సంస్కృతితో ఇంతగా పెన వేసుకుపోయిన ఈ సంప్రదాయానికి వందలు కాదు... వేల ఏళ్ల చరిత్ర ఉంది.

పల్నాటి యుద్ధంలో కోడి పందేల పాత్రను మర్చిపోలేం. బ్రహ్మనాయుడి 'చిట్టిమల్లు', నాగమ్మ 'సివంగి'ల పోరే చరిత్ర గతిని మార్చిన యుద్ధానికి కాహళమైంది! కోడిపుంజుకు పర్యాయమే 'కాహళం'.

15వ శతాబ్దపు సామాజిక పరిస్థితులకు అద్దంపట్టే కావ్యం అయ్యలరాజు నారాయణకవి 'హంసవింశతి'. అప్పట్లో కోడిపందేలు ఎలా జరిగేవో ఇందులో స్పష్టంగా వివరించాడు కవి. పందెంరాయుళ్లు కాషాయపు రంగు వస్త్రాలు ధరించి, చంకలో కోళ్లు పెట్టుకుని గరువు (బరి ప్రదేశం) దగ్గరికి చేరారు. దారాలు, నీళ్లముంతలు, కోళ్లకు గాయలైతే నయం చేయడానికి మూలికలు, ఆకుపసర్లు, కత్తుల పొది (కోడికత్తులను భద్రపరిచే గుడ్డ సంచి) వెంట తెచ్చుకున్నారు. కోడిపుంజును యుద్ధానికి సన్నద్ధం చేస్తూ, దాని కాళ్లకు గుడ్డలు చుట్టారు. కత్తులు కట్టారు. రెండు వర్గాల వాళ్లూ తమ పుంజులను పొదివి పట్టుకుని, ఎదురెదురుగా నిల్చున్నారు. అంతే! ఆ పుంజులు కయ్యానికి ముక్కులుదువ్వాయి! .. ఈ విధంగా సాగుతుంది అయ్యలరాజు వర్ణన. కాషాయరంగు వస్త్రాలు తప్పితే ఇప్పటికీ బరుల దగ్గర ఇదే వాతావరణం కనిపిస్తుంది. పుంజు స్వభావం, పౌరుషాలను బట్టి 'గరుడ, రణభేరి, కార్చిచ్చు, రాతిబొమ్మ, రామబాణం, మిత్తిరాహుత్తి, పిడుగు, హంవీరుడు, గండకత్తెర, జెట్టి, భైరవుడు, భేతాళుడు, సుడిగాలి' అంటూ తదితర పేర్లతో వాటిని పిలుచుకుంటూ ఉంటారు.

ఇంత చరిత్ర ఉన్న కోడిపందేలు సంక్రాంతితో ఎలా ముడిపడ్డాయి? పంటలు చేతికొచ్చే కాలం కాబట్టి కాసులకు కొదవుండదు. పందేలకు వెరపుండదు. ఇదే ప్రధాన కారణం కావచ్చు. అదే సాంప్రదాయంగా పరిణమించి ఉండవచ్చు. అటు ఎద్దులకు పూజ చేసి, ఇటు పుంజుల ప్రాణాలతో ఆడుకోవడం మన సంస్కృతిలోని చీకటివెలుగులకు ప్రతీకా అనుకోవచ్చు.

# 110.పాములాళ్ళు



పాములవాళ్ళలో మగవాళ్ళు పెద్ద పాగా చుట్టుకొని, పాములబుట్ట నెత్తిన పెట్టుకొని, నోటితో ఆనబకాయబుర్రతో చేసిన బూర నాగస్వరం ఊదుతూ ప్రతి గుమ్మం దగ్గరా బుట్ట దింపి, మూత తెరచి పామునాడిస్తుంటే అందరూ వినోదంగా చూసి బియ్యం మొదలైన వాటిని వేస్తారు. అలా ఆడించేటప్పుడు పాము అప్పుడప్పుడు నాలుకబయట పెట్టి బుస్సుమంటుంది. అతను ఒక వేరు ముక్క వేళ్ళతో పట్టుకొని దాని మూతిమీద పెట్టగానే అది చప్పగా చల్లబడి తలదించేసుకుంటుంది. ఆది తెల్ల విసరని చెబుతాడు. అలాంటివి తన దగ్గర ఇంకా ఉన్నాయని తీసి చూపించి, రెండేసి దోసిళ్ళ బియ్యానికి ఒక్కో వేరుముక్కచొప్పున అమ్ముకుంటారు. ఆ అమ్మేవి మామూలుపుల్ల ముక్కలే. అతని చేతిలో దికూడా పచ్చి వస ముక్కట. దాని వాసనకి తాచుపాము రోషంపోయి నీరస పడిపోతుందట. ఇదీ గమ్మతు. ఈ విధంగా పాముల వాళ్ళు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైపోయారు.

# 111. కోయవాళ్ళు



కోయస్త్రీలు పండగలలో మామూలుగా ఆడుకోడానికి వస్తారు. కాని మామూలు రోజుల్లో వీళ్ళు "జన్ను, పావుదార, రొయ్యిపిత, గోరోజనం, చెవిలో పోటు, కంటిలో పోటు, నడుమపోటు, మందులున్నాయి. మందులు" అంటూ వీధులంట తిరుగుతుంటారు. గృహిణులు వారి దగ్గర గచ్చాకు పుచ్చాకు మందులు బియ్యం పోసి కొంటుంటారు.

# 112.నాగోబా జాతర



సర్పజాతిని పూజించడమే ఈ జాతర ప్రత్యేకత. ఆదిమ గిరిజనుల్లో మేస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా గోండుల దేవత. నాగోబా దేవాలయం ఆదిలాబాద్‌కు 40 కిలోమీటర్ల దూరంలో ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ దగ్గర కెస్లాపూర్ గ్రామంలో ఉంది. కెస్లాపూర్‌లో జరిగే ఈ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించింది. కెస్లాపూర్ జనాభా 400కు మించదు. కాని పండగనాడు లక్షలాది మందితో అది జనా

రణ్యంగా మారుతుంది. జనవరి 25 నుంచి 29 వరకు నాలుగు రోజులపాటు గిరిజనులు ఈ పండుగ జరుపుకుంటారు. యేటా పుష్య మాసము అమావాస్య రోజున జాతర ప్రారంభమవుతుంది. నాగోబాను కొలిస్తే పంటలు బాగా పండుతాయని, శాంతి విరాజిల్లుతుందని, రోగాలు మటు మాయమ వుతాయని గిరిజనుల నమ్మకం.

## నాగోబా చరిత్ర

నాగోబా చరిత్రను గోండు గిరిజనులు రకరకాలుగా చెప్పుకుంటారు. పూర్వం మేస్రం కుటుంబానికి చెందిన నాగాయిమోతి రాణికి నాగేంద్రుడు కలలో కనిపించి సర్పం రూపంలో ఆమె గర్భాన జన్మిస్తానని చెప్పాడని, ఆ కల నిజమైందని గోండుల నమ్మకం. సర్పరూపంలోని నాగేంద్రునికి తల్లి అంటే రాణి తన తమ్ముడి కూతురు గౌరీతో వివాహం జరిపించింది. అత్త ఆజ్ఞ మేరకు గౌరీ భర్తను బుట్టలో పెట్టుకొని గోదావరికి ప్రయాణం కాగా, ఒకచోట పాము ఉడుం రూపంలో కనిపించగా ఆ ఊరు ఉడుంపూరైంది. ఆ తరువాత గౌరి ధర్మపురి వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వెళ్లగా ఆమెను చూసి నాగేంద్రుడు మనిషి రూపంలోకి మారాడని, అయితే పేరు ప్రతిష్ఠలు కావాలో.. సంప్రదాయం కావాలో.. తేల్చు కోమనగా గౌరి సంప్రదాయాలను లెక్కచేయక పోవడంతో తిరిగి పాముగా మారాడని కథ. ఆ తరువాత ఉడుంపూర్ నుంచి గరిమెల వరకు అతనికోసం వెతికిన గౌరి గోదావరిలోనే సత్యవసి గుండంలో కలిసిపోయిందని, నాగేంద్రుడు ఆమె వెంట ఉంచిన ఎద్దు రాయిగా

మారిందని భక్తుల విశ్వాసం. ఆ తరువాత పెళ్ళి అయిన ప్రతి జంటకు నాగేంద్రుడి సన్నిధిలో పరిచయం చేయాలని (పేథికొరి యాక్) చెప్పి నాగేంద్రుడు కెస్లాపూర్ గుట్టల్లోకి వెళ్లిపోయాడని చెప్తుంటారు. అదే కెస్లాపూర్ గ్రామంగా మారిపోయింది. నాగేంద్రుడు వెళ్లిన గుట్ట వద్ద నాగోబా దేవాలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా పుష్యమాసం అమావాస్య రోజున నాగేంద్రుడు ప్రత్యక్షమవుతాడని గిరిజనుల నమ్మకం. నాగోబా దేవతకు పూజలు మేస్రం వంశీయులే నిర్వహిస్తారు. మేస్రం వంశం కింద 22 తెగలు వస్తాయి. ఏడుగురు దేవతలను కొలిచే వారంతా మేస్రం వంశీయుల కిందికి వస్తారు. మడావి, మర్సకోల, పుర్క, మేస్రం, వెడ్మ, పంద్రా, పుర్వెత ఇంటి పేర్లు గలవారంతా మేస్రం వంశంలోకి వస్తారు.

## నాగోబా జాతర విశేషాలు

పుష్యమాసంలో వచ్చే పౌర్ణమినాడు మేస్రం వంశీయులు 20 మంది గిరిజనులు వెంటరాగా కొత్త కుండలతో కడెం మండలంలోని గొడిసిర్యాల పరిసర ప్రాంతాల్లో ప్రవహిస్తున్న గోదావరి జలాన్ని తీసుకువచ్చేందుకు బయలుదేరుతారు. దీంతో జాతర ప్రారంభమైనట్టే. ఆ జలాన్ని తీసుకు రావడానికి కెస్లాపూర్ నుంచి గోదావరి దాకా కాలినడకన 80 కిలోమీటర్లు వెళ్తారు. కెస్లాపూర్ చేరుకొని జాతర ప్రాంగణంలోని గిరిజనులు చెప్పుకునే ప్రాశస్త్యంగల మర్రి చెట్టు కింద విడిదిచేసి అమావాస్యరోజు రాత్రి నాగోబాకు కొత్త కుండల్లో గోదావరి నుంచి తెచ్చిన నీళ్లతో అభిషేకం చేస్తారు. తరువాతే క్షీరాభిషేకం చేసి గిరిజన ఆచారాల మేరకు పూజలు నిర్వహిస్తారు.



3 సంవత్సరాల కొకసారి పూజారిని మార్చడం ఆనవాయితీ. జాతరకు వచ్చే మేస్రం వంశీయులు వేలాది మంది ఉన్నా వారు వంట చేసుకునేది మాత్రం 22 పొయ్యిల మీదే. ఈ పొయ్యిలు ఎక్కడపడితే అక్కడ పెట్టడానికి వీల్లేదు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రహరీ గోడలోపల, గోడకు చుట్టూ దీపాలు వెలిగించేందుకు ప్రత్యేక అరలు (దుగుడు) ఉన్నాయి. ఆ దీపాల కాంతుల వెలుగులో 22 పొయ్యిల్లో మేస్రం వంశీయుల వంతుల వారిగా వంటలు చేసుకుంటారు. మిగితా జాతుల వారు ఎక్కడైనా వంట చేసుకోవచ్చు.

## జాతరలోని దర్బార్ ప్రత్యేకతలు

జాతర సందర్భంగా ఏర్పాటయ్యే దర్బార్‌కు ఒక ప్రత్యేకత, చరిత్ర ఉన్నాయి. 63 ఏడేళ్ల క్రితం మారుమూల గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు

లేవు. నాగరికులంటేనే ఆదివాసులు పరుగెత్తేవారు. గిరిజనుల వద్దకు అధికారులెవరు వెళ్లేవారు కాదు. అప్పుడే భూమి కోసం.. విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి కొమురం భీం మరణించిన సంఘటన జరిగింది. ఈ సంఘటనతో ఉలిక్కిపడ్డ నిజాం ప్రభువులు గిరిజన ప్రాంతాల పరిస్థితులు, గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేసేందుకు ప్రముఖ మానవ పరిణామ శాస్త్రవేత్త ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్‌ను ఆదిలాబాద్ జిల్లాకు పంపారు. ఆయన దృష్టి జాతరపై పడింది. కొండలు, కోనలు దాటి వచ్చే గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జాతరలో దర్బార్ ఏర్పాటు చేయాలని అనుకున్నాడాయన. దీన్ని ప్రొఫెసర్ హైమన్‌డార్ఫ్ 1946లో మొదట నిర్వహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు. జాతర చివరి రోజున జరిగే ఈ దర్బార్‌కు గిరిజన పెద్దలు, తెగల నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతూ ఉంటారు. నాగోబా పూజల అనంతరం నాగోబా ఆలయ ఆవరణలో ఉన్న పుట్టను మట్టితో మెత్తడంలో మేస్రం వంశీయుల అల్లుళ్లకు పెద్దపీట వేస్తారు. అల్లుళ్లు మట్టిని కాళ్లతో తొక్కి మెత్తగా చేస్తే కూతుళ్లు ఆ మట్టితో పుట్టను మెత్తి (అలికి) మొక్కులు తీర్చుకుంటారు. అల్లుళ్లు మట్టిని తొక్కినందుకు వారికి ప్రత్యేక నజరానా అందజేయడం సంప్రదాయం. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుండే నుంచే కాక మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు హాజరై మొక్కులు తీర్చుకుంటారు.

# 113.సమ్మక్క, సారలమ్మ జాతర




ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ పండుగగా మేడారం జాతరకు ప్రసిద్ధి. రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుక సమయంలో వరంగల్ జిల్లా తాడ్వాయి మండలంలోని ఆ కుగ్రామం ఇసుకేస్తే రాలనంత జనం, వారు విడిదికి ఏర్పాటు చేసుకున్న శిబిరాలు, శివసత్తుల పూనకాలతో కోలాహలంగా ఉంటుంది. గద్దెలపై కొలువుదీరే సమ్మక్క, సారలమ్మను దర్శించుకునేందుకు మన రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌ల నుంచి కూడా గిరిజనులు తరలివస్తారు. ఇది అడవిబిడ్డల పండుగే అయినా ఇటీవలి కాలంలో ఇతరులూ పెద్ద ఎత్తున జాతరను సందర్శిస్తున్నారు. మొక్కులు తీర్చుకుంటున్నారు.

## విభిన్న కథనాలు

సమ్మక్క, సారలమ్మల పుట్టుక, వారు దేవతలుగా వెలసిన వైనంపై విభిన్న కథనాలు ప్రచారంలో ఉన్నాయి. గిరిజన పూజారులు, పెద్దలు చెప్పేదాని ప్రకారం... 12వ శతాబ్దంలో(కాకతీయుల కాలం) ఇక్కడి గిరిజనులు స్వతంత్రంగా జీవించేవారు.

మేడారానికి సుమారు 15 కి.మీ. దూరంలో ఉండే బయ్యక్కపేట ఆదివాసీలు (చందా వంశీయులు) ఎప్పటిలాగే ఒకరోజు అడవిలోకి వెళ్లి ఎల్లేరు గడ్డలు సేకరిస్తున్నప్పుడు... క్రూరమృగాల మధ్యలో ఉన్న ఒక పసిపాప కనపడింది. ఆ చిన్నారిని జంతువులు సైతం ఏమీ చేయకపోవటాన్ని చూసి ఆశ్చర్యచకితులయ్యారు గిరిజనులు. ఆ పాపను తమ గూడేనికి తెచ్చుకున్నారు.

మాఘపౌర్ణమినాడు తనకు సమ్మక్క అని పేరుపెట్టి పెంచుకోసాగారు. సమ్మక్క వచ్చినప్పటి నుంచి వారికి అన్నీ శుభాలే చేకూరాయి. సమ్మక్క యుక్తవయసులోకి వచ్చింది. అయితే... అన్నేళ్లలో ఒకసారి కూడా ఆమె ఆహారాన్ని తీసుకుంటుండగా ఎవరూ చూడలేదు. అనుమానం వచ్చిన గిరిజనులు ఏం జరుగుతుందో కనిపెట్టాలనుకున్నారు.

ఓ రోజు రాత్రి సమ్మక్క పెద్దపులిగా మారి జంతువులను తిని ఆకలి తీర్చుకోవడాన్ని చూసి వారు భీతిల్లారు. దీన్ని తాము తట్టుకోలేమని, గ్రామం విడిచి వెళ్లిపోవాలని సమ్మక్కను కోరారు. వారి కోరికను మన్నిస్తూ సమ్మక్క సమీపంలోని గుట్టపైకి వెళ్లి మాయమైంది.

## బయ్యక్కపేట జాతర

వాస్తవానికి 'మేడారం' జాతర మొదట్లో బయ్యక్కపేటలో జరిగేది. ప్రతి రెండేళ్లకు ఒకసారి గుట్టపైకి వెళ్లి కుంకుమభరిణె రూపంలో ఉన్న శక్తిస్వరూపిణి అయిన సమ్మక్కను గ్రామంలోని గద్దెల వద్దకు తీసుకొచ్చే వారు. ఈ జాతరకు పరిసర గిరిజన గ్రామాల నుంచి ప్రజలు తరలి వచ్చేవారు. అయితే, జాతరకు వచ్చేజనాలకు వసతులు కల్పించడం బయ్యక్కపేట గ్రామస్థులకు తలకుమించిన భారమైపోయింది. మేడారం నుంచి వచ్చి పూజలు నిర్వహించడం గిరిజన పూజారులకూ కష్టంగా మారింది. తాము జాతరను జరపలేమని, ఇకపై మేడారం పరిసరాల్లోనే దాన్ని నిర్వహించాలని బయ్యక్కపేట గిరిజనులు చెప్పేశారు. ఫలితంగా 1935కి పూర్వమే మేడారంలోని సిద్ధబోయిన వంశస్థులకు ఆ జాతర నిర్వహణ అవకాశం వచ్చింది.

అయితే, ఇప్పటికీ బయ్యక్కపేటలోని గద్దెల దగ్గర చందా వంశస్థులు పూజలు చేస్తారు. అక్కడ సమ్మక్క గద్దె మాత్రమే కనపడుతుంది. మేడారంలో సమ్మక్కతోపాటు సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజుల గద్దెలుకూడా ఉంటాయి. జంపన్న వాగులో స్నానాలుచేసి వనదేవతలను దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయన్నది గిరిజనుల నమ్మకం.

## ఈ వనదేవతలు నిరాకారులు

వనదేవతలైన సమ్మక్క, సారలమ్మలకు రూపాలుండవు. 2 మీటర్ల వ్యాసార్థంతో నిర్మించిన గద్దెల మధ్యలో గుంజ (కర్ర) పాతి ఉంటుంది. 'వనం' తెచ్చి గద్దెలపై చేర్చడంతో జాతర ప్రారంభం అవుతుంది. వనం

అంటే కంకబొంగు (వెదురు కర్ర). అడవిలో బండరాయిపై మొలిచే వెదురును మాఘపౌర్ణమికి ముందురోజు బుధవారం తెల్లవారుజామున వనంగా తెస్తారు. అప్పటికే గిరిజన పూజారుల కుటుంబాల స్త్రీలు నిష్ఠతో ఉండి గద్దెలను శుభ్రంచేస్తారు. ముగ్గులుపెట్టి సుందరంగా అలంకరిస్తారు. ఆ తరువాత పూజా కార్యక్రమమంతా మగవారే నిర్వహిస్తారు. ముగ్గురు ముత్తైదువలు, ఇద్దరు పెద్దమనుషులు- మొత్తం ఐదుగురు అడవిలోకి వెళ్లి 'గడ్డి'ని కోసుకొస్తారు. ఇదే మండమెలిగే పండుగ.

## మాంసం... మద్యం... బంగారం

సమ్మక్క, సారలమ్మలను సంతృప్తిపర్చేందుకు బలి ఇవ్వడం, మద్యాన్ని ఆరగింపు చేయడం ఆచారం. ఇలా బలి ఇచ్చిన మాంసాన్ని ఆరగిస్తూ, మద్యాన్ని సేవిస్తూ జాతర రోజులను గడుపుతారు భక్తులు. జాతరలో అతిముఖ్యమైనది 'బంగారం సమర్పణ'. బెల్లాన్నే బంగారమంటారిక్కడ. కోరికలు తీర్చమంటూ కొందరు... గతంలో కోరిన కోరికలు తీరడంతో మరికొందరు... నిలువెత్తు బంగారాన్ని మొక్కులుగా అమ్మవార్లకు సమర్పించుకుంటారు. దీంతో గద్దెలు బెల్లంతో నిండిపోతాయి. భక్తులు ఒడిబియ్యం, చీరెలు, సారెలను పెడతారు.

జాతర సమయంలో మేడారంలో ప్రసవించాలని చాలా మంది భక్తులు మొక్కుకుంటారు. నిండు చూలాలుగా ఉన్నవారు ఇక్కడికి ప్రసవం కోసం వస్తుంటారు. మగపిల్లవాడు పుడితే సమ్మయ్య, సారయ్య అని, ఆడపిల్ల పుడితే సమ్మక్క, సారమ్మ అని పేర్లు పెట్టుకుంటారు.

# 114.బతుకమ్మ పండుగ



ఆశ్వయుజ మాసంలో 9 రోజులపాటు జరుపుకునే బతుకమ్మ పండుగ సాధారణంగా అక్టోబరులో వస్తుంది. అప్పటికి వర్షాలు తగ్గుతాయి. పంటకోతలు దాదాపుగా పూర్తయ్యే సమయం. అంటే వ్యవసాయ పనుల హడావుడీ తగ్గుతుంది.

చెరువులు, కుంటలు నిండుకుండలను తలపిస్తాయి. అంతటా పచ్చదనం పరచుకుని ఉంటుంది. తెలంగాణ మెట్ట ప్రాంతం. ఎక్కడ చూసినా తంగేడు, గునుగు, బంతి, గన్నేరు పూలు విస్తారంగా పూసి ఉంటాయి. పెరళ్లలో గుమ్మడి, ఆనప, నేతిబీర పాదులనుంచి పాకి ఉంటాయి. మొత్తానికి గ్రామాలన్నీ తీర్చిదిద్దినట్లుగా ఉంటాయి.

ఈ పండుగలో బతుకమ్మకు పూజతోపాటు ఆటాపాటా మిళితమై ఉంటాయి. నామ–రూప భేదాలతో కొంచెం అటు ఇటుగా ఈ పండుగ భారతదేశమంతటా కనిపిస్తుంది. గర్బా, దాండియా, తీజ్, ఓనం, అట్లతద్ది, బొడ్డెమ్మ తదితర రూపాల్లో ఉంటుంది. బతుకమ్మ పండుగ చెరువులు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఉంటుంది.

బతుకమ్మ మొదట గ్రామదేవత. గ్రామీణులు సృష్టించిన అమ్మదేవత. తర్వాత శైవం ఆమెకు శివుని సతిస్థానం ఇచ్చి గౌరమ్మని చేసింది. ఆ తర్వాత వచ్చిన వైష్ణవం సాక్షాత్తూ లక్ష్మీదేవే బతకమ్మ అని ప్రస్తుతించి ప్రచారంలో పెట్టింది.

ఈ పండుగకు నీటికి ఉన్న సంబంధం ఏంటంటే? తంగేడు, గునుగు, పసుపుముద్ద, తమలపాకులు చెరువునీటిని శుద్ధిచేయడమే కాకుండా, అవి కుళ్లి నీటి అడుగుకుపోయి చెరువు మట్టిని సారవంతం చేస్తాయి. వేసవిలో ఈ మట్టిని రైతులు పొలాల్లో వేయడం వల్ల పొలాలు సారవంతం అవుతాయి. ఇది ప్రతి ఏడూ జరిగే ప్రక్రియ. అందుకే ఇది చెరువుల పండగ. ఇది నూరు శాతం మహిళల పండుగ. అచ్చమైన అస్తిత్వ పండుగ. ఇలా ఊరి వారందరికీ బతుకును ఇచ్చే అమ్మ బతుకమ్మ.

## అలంకరణ ఓ కళ

మొదట తాంబాళం లేదా తబుకుపై గుమ్మడి ఆకులు పరుస్తారు. వాటికింద నూలు దారాలను రెండు వరుసల్లో ప్లస్ ఆకారంలో వేస్తారు. గోపురాకారంలో పేర్చిన బతుకమ్మ పూలు జారిపోకుండా ఈ దారాలను



ఆధారంగా కడతారు. బతుకమ్మను పేర్చడానికి గుమ్మడి ఆకు, తంగేడు, గునుగుపూలు తప్పనిసరిగా ఉండాలి. మొదటి వరుసలో తంగేడు పూలను పెడతారు. మధ్యలో తుంచిన పూల కాడలు, ఆకులను వేస్తారు.

సాధారణంగా ప్రతి రెండో వరుసా తంగేడు పూలదే ఉంటుంది. గునుగు పూల చివరలు చిదిమేసి పది-పన్నెండు పూలను ఒక కట్టగా కట్టి, కొన్ని వరుసల్ని పేరుస్తారు. గునుగు పూలు అరతెలుపు రంగులో ఉంటాయి. అందుకని వీటిని ఆకుపచ్చ, గులాబీ, నీలిరంగులో ముంచి వర్ణరంజితం చేస్తారు. ఇలా ఒక వరుస తంగేడు, ఇంకో వరుస గునుగు పూలను మూడు, నాలుగు వరుసల్లో గోపురాకారంలో పేరుస్తారు. ఆ తర్వాత లభ్యతను బట్టి బంతి, చేమంతి, గన్నేరు పూలను పేరుస్తారు. పైన తమలపాకుల్లో త్రిభుజాకారంలో పసుపు ముద్దకు కుంకుమ, పసుపుబొట్లు పెడతారు. అగరువత్తులు అంటించి బతుకమ్మకు అలంకరణ పూర్తిచేస్తారు. అందుకే "పసుపులో పుట్టిన గౌరమ్మ/పసుపులో పెరిగిన గౌరమ్మ/పసుపులో వసంతమాడేవా..." అంటూ పాడతారు.

ఇలా అలంకరించిన బతుకమ్మను ఇంటి వాకిట్లోకి తీసుకొస్తారు. మొదట ఎవరి ఇళ్ల వద్ద వాళ్లు ఆడాక ఆ ఊరిలో ఉండే గుడి వద్దకు చేరతారు. అక్కడ డప్పులు, కొమ్ము వాయిద్యాలు గంభీరంగా నినదిస్తుంటే చప్పట్లతో అంతా కోలాహలంగా ఉంటుంది. ఇక అక్కడి నుంచి స్త్రీలంతా ఆ ఊరి చెరువుకు బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి తరలివెళ్తారు. తమ వెంట ఎవరికి వీలైన సద్దులను (ఫలహారాలను) వారు తీసుకెళ్తారు. అందుకే మహర్నవమి నాటి బతుకమ్మను సద్దుల బతుకమ్మ అంటారు.

సాధారణంగా మలీద, సున్నుండలు, సర్వపిండి, పోలెలు, తియ్య టప్పాలు, పులిహోర, అటుకులు, పేలాలు, నానబెట్టిన పెసలు, శనగలు, అరిసెల వంటివి సద్దులుగా తీసుకెళ్తారు.

ఇంకొందరేమో మొదటిరోజున వాయనంగా ఆకువక్కలు, తులసి దళాలు ఇచ్చుకుంటారు. రెండో రోజున పప్పు బెల్లాలు, మూడో రోజున ఉడికించిన బెల్లం శనగపప్పు (పూర్ణం), నాలుగో రోజున పాలల్లో నాన బెట్టిన బెల్లం బియ్యం, ఐదో రోజున అట్లు, ఆరో రోజున అరిసెలు, ఏడో రోజున బజ్జీలు, ఎనిమిదో రోజున నువ్వులు బెల్లం కలిపిన చిమ్మిలి (వెన్నముద్దలు), తొమ్మిదో రోజున పెద్ద బతుకమ్మ లేదా సద్దుల బతుకమ్మ కాబట్టి పులిహోరా, చిత్రాన్నం లేదా ప్రధానవంటకాన్ని నైవేద్యంగా చేస్తారు. మనిషికి ప్రకృతికి ఉన్న సంబంధం మనం జరుపుకునే పండుగల్లో వ్యక్త మవుతుంటుంది. ఇలాంటి పండుగలు తర తరాలకు ప్రవహిస్తూ మన తెలుగు సంప్రదాయాల ఔన్నత్యాన్ని తెలియజేస్తాయి. అలాంటిదే బతుకమ్మ పండుగ.

# 115.రొట్టెల పండుగ, నెల్లూరు



మొహరం పర్వదినాల్లో హిందూ ముస్లిములు కలిసి నెల్లూరు చెరువు బారా షహీద్ దర్గా వద్ద వివిధ కోర్కెలు కోరుతూ, నెరవేరిన కోర్కెల కోసం మొక్కులు తీర్చుకుంటూ రొట్టెలు ఇస్తూ పుచ్చుకుంటూ జరుపుకునే ఈ పండుగను రొట్టెల పండుగ అంటారు. ఈ రొట్టెల పండుగలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. మూడు రోజుల పాటు జరిగే రొట్టెల పండుగలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి వేలాది భక్తులు పాల్గొంటారు. నెల్లూరులోని బారా షాహీద్ దర్గా వద్ద జరిగే వార్షిక కార్యక్రమాన్ని 12 మంది అమరవీరుల పండుగగా పాటిస్తారు.

## రొట్టెల పండుగ ఎలా మొదలైంది?

ఆర్కాటు నవాబు కోరిక నెరవేరడంతో మరుసటి ఏడాది దర్గాకు వచ్చి కృతజ్ఞత తెలియజేస్తూ, స్వర్ణల చెరువులో రొట్టె విడిచినట్లు ఒక కథనం. ఆ సంఘటనానంతరమే రొట్టెలపండుగ మొదలైందని పెద్దలు చెపుతుంటారు. 1930లలో ఈ రొట్టెల పండుగ మొదలై క్రమం తప్ప కుండా జరుగుతూ, స్థానిక పత్రికలలో నమోదు అయివున్నట్లు తెలుస్తుంది.

## రొట్టెలను ఎలా సమర్పిస్తారు?

ఇంటిలో తయారు చేసుకొచ్చిన చపాతీలు రొట్టెలు చెరువులోని నీళల్లో దిగి తలపై ముసుగువేసుకొని మార్పిడి చేసుకుంటారు భక్తులు. ఆరోగ్యం గురించి మొక్కు కొంటే ఫలితం కనిపిస్తే మరుసటి ఏడాది ఆరోగ్య రొట్టె కావాల్సిన వారికి పంచి మొక్కు చెల్లిస్తారు. ఇలాగే విద్యా రొట్టె, పెళ్ళి రొట్టె, సౌభాగ్య రొట్టె, సంతాన రొట్టె, వీసా రొట్టె, అభివృద్ధి రొట్టె,



సమైక్యాంధ్ర రొట్టె. ఇలా ఎన్నోరకాల రొట్టెలు ఇచ్చి పుచ్చుకుంటారు. వివిధ కోర్కెలకు సంబంధించి స్వీకరించుకున్న రొట్టెలకు బదులుగా తిరిగి మరుసటి సంవత్సరం ఒకటికి రెండు రొట్టెల చొప్పున ఈ స్వర్ణాల చెరువు వద్ద భక్తులకు పంచుతారు. మిగిలిన వాటిని ఈ చెరువులో వదిలేస్తారు. ఇది ఫలానా కోర్కెకు సంబంధించిన రొట్టె అని సులభంగా గుర్తించేందుకు బ్యానర్లు ఏర్పాటు చేస్తారు.

## గంధమహోత్సవం

మత సామరస్యానికి ప్రతీకగా జరిగే ఈ రొట్టెల పండుగలో రొట్టెలు మార్పిడి చేసుకొన్నభక్తులు జిల్లాలోని కసుమూరు, అనుమసముద్రం పేటలలోని దర్గాలను కూడా సందర్శిస్తారు. చెరువు వద్ద వున్న బోటు షికారు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. రొట్టెల పండుగ జరిగే సమయంలోనే బారా షహీద్ దర్గాలో గంధ మహోత్సవం జరుగుతుంది.

## రొట్టెల పండుగను ప్రారంభించిన ఆర్కాటు నవాబు

ఆర్కాటు నవాబుల కాలంలో నెల్లూరు చెరువు వద్ద రజకులు బట్టలు ఉతికేవారు. ఈ సందర్భంలో రజకులైన భార్యాభర్తలు చెరువులో బట్టలు ఉతుకుతుండగా పొద్దు పోవడంతో అక్కడే నిద్రపోయారు.

రజకుని భార్యకు అక్కడ సమాధులైన బారాషహీద్‌లు కలలోకి వచ్చి ఆర్కాటు నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతుంది, సమాధుల ప్రక్కనున్న మట్టిని తీసుకెళ్ళి ఆమె నుదిటిపై రాస్తే కోలుకుంటుందని

చెప్పారు. ఉదయాన్నే భార్యభర్తలిద్దరు గ్రామంలోకి వెళుతుండగా ఆర్కాటు నవాబు భార్య అనారోగ్యంతో బాధపడుతుంది ఆమెకు సరైన వైద్యం చేసినవారికి విలువైన బహుమతి అందజేస్తామని దండోరా వేయిస్తుంటారు.

ఈ విషయాన్ని తెలుసుకున్న రజకుడు తన భార్యకు కలలో వచ్చిన విషయాన్ని నవాబు ఆస్థానంలో వున్న వారికి వివరిస్తారు. దీంతో రాజు తన అను చరులను నెల్లూరు చెరువు వద్దకు పంపి అక్కడి మట్టిని తెప్పించుకుని రాజు భార్య నుదుటిపై పూస్తారు. వెంటనే ఆమె ఆరోగ్యం కుదుట పడుతుంది.

దీంతో ఆ రాజుకు పట్టలేనంత సంతోషంతో తన భార్యతో కలసి నెల్లూరు చెరువు సమీపంలోని సమాధుల వద్దకు వచ్చి బారా షహీదులకు ప్రార్థనలు చేసి, తమ వెంట తెచ్చుకున్న రొట్టెల్లో కొన్నింటిని అక్కడి వారికి పంచుతారు. అలా అప్పటి నుండి ఈ రోజు వరకు ఆ ఆనవాయితీ ప్రకారం రొట్టెల మార్పు జరుగుతోంది. కోర్కెలు తీరిన వారు రొట్టెలను తీసుకుని దర్గా వద్ద చెరువులో తడిపి మరొకరికి ఇవ్వడం, కోర్కెలు కోరుకునే వారు వాటిని తీసుకోవడం అప్పటి నుంచి ఆచారంగా వస్తున్నది. ఇలా ఆ విధంగా రొట్టెలు మార్పు చేసుకోవడం అది రొట్టెల పండుగగా మారింది. అప్పట్లో ఈ పండుగను మొహరం నెలలోఒక్కరోజు మాత్రమే జరుపుకునేవారు. తరువాత జనం రద్దీ ఎక్కువగా ఉండటం వలన ఈ ఉత్సవాన్ని నాలుగు రోజులు జరుపుతున్నారు.

# 116.ప్రభలు



ప్రభల సంస్కృతి గుంటూరు జిల్లా, ముఖ్యంగా పల్నాడు ప్రాంతంలో కనిపించే ఒక గొప్ప తెలుగువారి సంస్కృతి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహా శివరాత్రినాడు గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ, క్వారీ బాలకోటేశ్వరస్వామి, సత్రశాల ప్రాంతాలలో ఈ ప్రభల సంస్కృతి కనిపిస్తుంది.

## ప్రభ అంటే ఏమిటి?

ప్రభ అనేది దేవుని ఊరేగింపుకు పల్లకీ లేనిచోట్ల ఉపయోగించే అరపలాంటి నిర్మాణము. చిన్న చిన్న దేవాలయములలో రెండు కర్రలపై నలుగురు పట్టుకొనేలా ఒక అరపను చేసి దానిపై దేవుని విగ్రహము లేదా బొమ్మను పెట్టి వెనుక దేవాలయము మాదిరి ఒక కట్టడాన్ని తేలికపాటి గడకర్రలతో రంగుల కాగితాలతో తయారుచేసి దానిపై దేవుని ఊరేగించేవారు.

అది రానురానూ అంతటా వ్యాపించి తెలుగు వారి సంప్రదాయంగా మారింది. ఎంత ఎత్తు ప్రభ అయితే అంత గొప్ప. కోటప్పకొండ తిరణాలకి వందలాది రంగు రంగుల ప్రభలు విచ్చేసి శోభ చేకూర్చుతాయి. ఇక్కడ ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రభకు బహుమతిని కూడా అందచేస్తారు.

## ప్రభల నిర్మాణం వెనుక ఐతిహ్యం

కోటప్పకొండ సమీపంలోని కొండ కావూరు గ్రామానికి చెందిన ఆనందవల్లి అనే గొల్లభామ పరమశివ భక్తురాలు. ఆమె ప్రతిరోజు కొండపై చేరుకొని పాత కోటయ్యస్వామికి పూజలు చేసేది.

ఒకనాడు తాను వయోభారంతో కొండ ఎక్కలేక పోతున్నాను స్వామిని వేడుకోగా స్వామి ప్రత్యక్షమై ముందు నీవు వెనుజూడకుండా కిందకు నడువు నీ వెనుక నేను వస్తానని చెప్పాడు. గొల్లభామ కిందకు దిగుతూ స్వామి వెనుక వస్తున్నారో లేదో అని వెనుదిరిగి చూడటంతో స్వామి

శిలగా మారాడు. దీంతో గొల్లభామ తిరిగి ఆ స్వామిని వేడుకోగా ఎప్పుడైతే నా కొండకు కోటీనొక్క ప్రభలు వస్తే అప్పుడు కొండదిగి కిందకు వస్తానిని చెప్పాడు. దీంతో ప్రతి సంవత్సరం శివరాత్రినాడు కోటప్పకొండకు సమీపంలోని అన్ని గ్రామాలవారు ప్రభలు, విద్యుత్ ప్రభలు కట్టుకుని కోటప్పకొండకు వస్తారు.

గుంటూరు జిల్లా నరసరావుపేట తాలూకాలోని కోటప్పకొండ ప్రసిద్ధమైన శైవక్షేత్రం. మహాశివరాత్రికి చాలా పెద్ద ఎత్తున తిరునాళ్లు జరుగుతాయి.

లక్షలాది భక్తులు ఆనాడు అక్కడ ఉత్సవాలకు హాజరవు తారు. ముఖ్యంగా చూడవలసింది ప్రభల ప్రదర్శన. వందలాదిగా ప్రభలు ఆ ఉత్సవాలలో పాల్గొంటాయి. అవికాక ఇంకా కోలాటం, వీరంగం,



హరికథలు మొదలైనవి ఉంటాయి. తల నీలాల మొక్కుబడులకు కూడా ఈ క్షేత్రం ప్రసిద్ధి. శివరాత్రికి రుద్రాభిషేకం, సహస్రనామార్చనలు జరుగుతాయి. ఇక్కడి శివుడిని కోటేశ్వరుడు, త్రికోటేశ్వరస్వామి అంటారు. ఆ పేరే తెలుగులో కోటప్ప అయింది.

బయలు దేరిన ప్రభల బండ్లు ఆయా గ్రామాల గుండా ప్రయాణించేటప్పుడు గ్రామస్థులు ఎదురు వచ్చి స్త్రీలు కడవలతో వార పోయగా, పురుషులు కత్తి చేత బట్టి, దండకాలను చదువుతారు.

ఇలా చదివేవారు జంగాలు, ఆరాధ్య బ్రాహ్మణులు. శైవులు, వీర శైవులు పలు సందర్భాలలో దక్షయజ్ఞ దండకం చదివినట్లె ఇక్కడా చదువుతారు. ఇలా చదివేటప్పుడు ఖడ్గధారులు ప్రభ ముందు నిలబడి వెనకకూ ముందుకు నడుస్తూ ఎగిరెగిరి గంతులు వేస్తూ పరవళ్ళు త్రొక్కుతూ వుంటే పక్క నున్న వాళ్ళు బుంజ వాయిద్యాన్ని తప్పెట వాయిద్యాన్ని వాయిస్తూ, కొమ్ము బూరగాలనూ, కాహశాలనూ ఊది దండకం చదువరిని ఉత్తేజ పరుస్తారు.

కోటప్పకొండ ప్రాంతంలోనే కాకుండా పల్నాడు ప్రాంతంలోని ఇతర గ్రామాల్లో జరిగే తిరునాళ్లలో కూడా ప్రభల సంస్కృతి కనపడుతుంది. కోటప్పకొండ తరహాలో ప్రభలను ప్రదర్శనగా కొండలకు తరలించం అనేది ఇతర ప్రాంతాల్లో కనిపించదు. ఇక్కడ తిరునాళ్లు జరిగే ప్రదేశంలోనే ప్రభలు కడతారు.

# 117.కోటప్పకొండ ప్రభల సంస్కృతి



ఇది గుంటూరు జిల్లా, ముఖ్యంగా నరసరావుపేట, పల్నాడు ప్రాంతంలో కనిపించే ఒక గొప్పసంస్కృతి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహా శివరాత్రినాడు గుంటూరు జిల్లాలోని కోటప్పకొండ, క్వారీ బాలకోటేశ్వర స్వామి, సత్రశాల ప్రాంతాలలో ఈ ప్రభల సంస్కృతి కనిపిస్తుంది.

కోటప్పకొండ గుంటూరు జిల్లా, నర్సరావుపేటకు 10 కి.మీ. దూరం ఉంది. ఇది ప్రముఖ శైవ క్షేత్రం. కొండపై త్రికూటాద్రి కోటయ్యస్వామి కొలువై ఉన్నాడు.



ప్రతి ఏడాది మహా శివరాత్రి పర్వదినాన రాష్ట్రం నలుమూలలు నుంచి భక్తులు కొండకు తరలివస్తారు. శివరాత్రి నాడు కోటప్పకొండకు 30 కి.మీ దూరంలో ఉన్న అన్ని గ్రామాల వారు ప్రభలు కట్టుకొని కొండకు వెళ్లటం ఇక్కడి సంస్కృతిలో భాగం. కోటప్ప కొండ శివరాత్రి తిరునాళ్ళలో ప్రభలే ప్రత్యేక ఆకర్షణ. ఈ ప్రభల వైభవాన్ని చూడాలే కాని వర్ణించలేం. విద్యుత్ ప్రభల ధగదగ కాంతుల నడుమ రాత్రి సమయంలో కోటయ్య స్వామి కొలువైన కోటప్పకొండ మెరిసి పోతుంది. గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లపై కొండకు వస్తారు. కొందరు భక్తులు ప్రభలు వెంట బండ్లు కట్టుకుని స్వామివారిని దర్శించటానికి కొండకు వెళతారు.

# 118. తెప్పోత్సవాలు



తెప్పపై ఉత్సవాన్ని జరుపుకోవడాన్ని తెప్పోత్సవం అంటారు. ప్రసిద్ధి చెందిన హిందూ దేవాలయాలలో పుష్కరిణిలో గాని లేదా దగ్గరలోనున్న కాలువలు, నదులు, చెరువులలో దేవతా విగ్రహాలను ఊరేగిస్తారు. ఉత్సవ విగ్రహాలను వివిధ దివ్యాభరణాలు, రంగురంగుల పుష్పమాలికలతో ముస్తాబుచేసి వేద పండితుల మంత్రోచ్ఛాటనలు, భక్తుల జయ జయ ధ్వానాలు, మేళతాళాల మధ్య దేవస్థానం నుండి స్వామి వారి జలవిహార ప్రదేశం వరకు ఉత్సవంగా తీసుకుస్తారు. అనంతరం మామిడితోరణాలు, పూలతోరణాలు, అరటి పిలకలు, వివిధ రంగుల పతాకాలతో ముస్తాబు చేసిన తెప్పపై ఉత్సవ విగ్రహాలను ఉంచుతారు. అనంతరం తెప్పలో స్వామికి వివిధ ఉపచారాలు, నివేదనలు, హారతులతో దేవస్థానం ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో వేదోక్తంగా, శాస్త్రోక్తంగా తెప్పోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.

# తిరుమలలో తెప్పోత్సవం

తిరుమలలోని వేంకటేశ్వర స్వామివారి పుష్కరణిలో ప్రతి ఏటా వైభవంగా ఐదు రోజుల పాటు తెప్పోత్సవం జరుగుతుంది. ఇది ప్రతి యేటా చైత్రమాసంలో ఫాల్గుణ పౌర్ణమి నాడు జరిగే ఉత్సవం. తిరుమల శ్రీవారికి ఏటా ఫాల్గుణ మాసంలో పౌర్ణమికి ముందు తెప్పోత్సవాలు నిర్వహించే ఆనవాయితీ నేటికీ కొనసాగుతోంది. వీటిని ఫాల్గుణ శుక్ల ఏకాదశి నుంచి ప్రారంభమై పౌర్ణమినాడు ముగిసేలా ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. తెప్ప అంటే ఓడ. ఓడలో ఆశీనులైన శ్రీవారిని కోనేటిలో విహారింపజేయడాన్నే తెప్పోత్సవం అంటారు. తెప్పోత్స వాలను తమిళంలో తిరుపల్లి ఓడై తిరునాళ్ అని, తెలుగులో తెప్ప తిరునాళ్లు అని అంటారు.

ఐదు రోజులు జరిగే ఈకార్యక్రమంలో మొదటి రోజు సీతారాములతో పాటు లక్ష్మణుడుని కూడా పూజిస్తారు. రెండవ రోజు శ్రీకృష్ణుడు, రుక్మిణి పూజిస్తారు. మూడు, నాలుగు, ఐదు రోజులు పూజలు త్రయోదశితో మొదలయ్యి పౌర్ణమితో ముగుస్తాయి. ఈ మూడు రోజుల్లో ఉత్సవ విగ్రమైన మలయప్ప స్వామితో పాటు శ్రీదేవి, భూదేవి పూజింపబడతారు. ఈ ఉత్సవ మూర్తుల్ని అద్భుతంగా అలంకరించి పుష్కరిణి పై ఉన్న ప్రత్యేక తెప్పలపై ఉంచి పూజిస్తారు.

## తెప్పోత్సవం ఎలా జరుగుతుంది?

ముందుగా ఉత్సవ మూర్తులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో వైభవంగా ఊరేగించి శ్రీవారి పుష్కరిణి వద్దకు వేంపు చేస్తారు. అనంతరం


అందంగా అలంకరించిన తెప్పపై స్వామివారు ఆశీనులై పుష్కరిణిలో మూడు చుట్లు విహరిస్తారు. మూడో రోజు శ్రీభూసమేతంగా సర్వాలంకార భూషితుడై పురవీధుల్లో ఊరేగిన అనంతరం కోనేటిలో తెప్పపై ఆశీనులై మూడుసార్లు విహరిస్తూ స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారు. నాలుగో రోజు ఐదుసార్లు, చివరి రోజు ఏడుసార్లు తెప్పపై పుష్కరిణిలో విహరిస్తారు. ఈ తెప్పోత్సవం రోజులలో స్వామివారు విశేషంగా కటాక్షిస్తారని భక్తుల విశ్వాసం.

## బెజవాడలో కనకదుర్గమ్మవారికి జరిగే తెప్పోత్సవం



విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో, విజయదశమి సందర్భంగా నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి. ఆఖరి రోజున కృష్ణా నదిలో తెప్పోత్సవం జరుగుతుంది. హంస ఆకారంలో తెప్పను రమణీయంగా అలంకరిస్తారు. దానిలో అమ్మవారిని ఉంచి నదిలో ఊరేగిస్తారు. ఒడ్డును చేరిన వేలాది భక్తులకు అది కన్నుల పండుగే అవుతుంది.

# 119. సేవ



ఇత్తడి రేకులతో చేసిన పెద్దపెద్ద తాళములను చేత ధరించి సింహాచల నృసింహస్వామిని కీర్తిస్తూ నెమలి కుంచెను చేతిలో పట్టుకొని నాయకుడు నామం చెబుతుంటే అందరూ కలిసి పాడుతూ వలయాకారంగా తిరుగుతూ చేసే నృత్యం సేవ. దీనినే సింహాద్రి అప్పన్న సేవ అంటారు.

**హరిహరీ నారాయణాది నారాయణో**

**కరుణించి మమ్మేలు కమలలోచనుడా**

అనునది ఈ సేవలో చెప్పబడే నామం పద్ధతిలోనిదే.

# 120.రుంజ వాయిద్యము



విశ్వ బ్రాహ్మణులకు (విశ్వకర్మ బ్రాహ్మణులు) గోత్రాలను, వంశ నామాలను పొగడి విశ్వకర్మ పురాణం చెప్పేవారే రుంజలు. వారు కథ చెబుతూ వాయించే వాయిద్యమే రుంజ. చర్మ వాయిద్యాలలో చాలా పెద్దది రుంజ.

దీని శబ్దం కూడా రెండు, మూడు కిలోమీటర్ల వరకు వినిపిస్తుంది. వృత్తి గాయకుల వాయిద్యాలలో ఇంత పెద్దది మరొకటిలేదు. రుంజకారుడు మోయలేని బరువుగానే దీనిని మోస్తుంటారు. తరం నుంచి తరానికి ఈ వాద్యకళ కొనసాగుతూ వస్తున్నది. 32 రకాలుగా దీన్ని వాయించ వచ్చునట. రుంజ అనే ఈ చర్మ వాద్యం శైవ సంప్రదాయానికి చెందినది.

# రుంజ కథ చెప్పే విధానం

రుంజ కథకులు గ్రామానిని వెళ్ళినపుడు ఊరిలో పెద్ద ఆచారి అంటే మను బ్రహ్మ సంతతి వారు ఇంటికి వెళ్ళి లేక ఆ ఊరిలో మొదటిగా వచ్చి స్థిరపడిన ఆచారి ఇంటికి వెళ్ళి కథ చెబుతారు. కొన్ని సందర్భాలలో గ్రామంలోని విశ్వబ్రాహ్మణులు అందరికీ కలిపి ఒక చోట కథ చెప్పడం, కొన్ని సందర్భాలలో పెద్ద ఆచారి ఇంట్లో కథ చెబితే మిగతావారు అక్కడకు చేరుకొని కథ విని పారితోషికాలు ఇస్తారు. ఉంజ కథకుడు కథను ప్రారంభించే ముందు ఏ ఇంటి ముందు కథ చెబుతాడో ఆ గృహస్థుని గోత్రం చెప్పి అతని వంశం చెప్పి అతని కుటుంబం ఇంకా వృద్ధి కావాలని దీవించి తర్వాత విశ్వబ్రాహ్మణుల వంశగమనాన్ని, పంచ బ్రహ్మల జన్మ ప్రకారాలను వివరిస్తాడు. ఆ తర్వాతే ఏ కథ అయినా చెబుతారు.

# రుంజ వాయిద్యం - రుంజలు

రుంజ వాయిద్యం పట్టుకున్నప్పుడే వీరిని రుంజలు అంటారు. కాని కులం రీత్యా వీరు బేడ జంగాల కులానికి చెందినవారు. పనసలు, కోమటి పనసలు కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లా, తెలంగాణా జిల్లాలలో ఉన్నారు. ఈ రుంజ కళాకారులు ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాలలో విశ్వ బ్రాహ్మణుల ఇంటికి వెళ్తారు. ఎక్కడకు వెళ్ళినా ఒక సంస్కృత శ్లోకం చదివి తెలుగులో కథ చెబుతారు. సాధారణంగా ఈ కథ చెప్పేవారు ముగ్గురు ఉంటారు. ఒకరు కథ చెబితే, ఒకరు వాయిద్యం వాయిస్తే ఇంకొకరు వంతగా ఉంటారు.

## రుంజలు చెప్పే కథలు

విశ్వకర్మ పుట్టుక, పంచ బ్రహ్మల పుట్టుక, దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం, రుంజల పుట్టుక, వీరబ్రహ్మం గారి చరిత్రను రుంజలు చెబుతారు. విశ్వబ్రాహ్మణులలోని సానగ (కమ్మరాచారి), సనాతన (వడ్రపుపని), అభవనస (కంచరపుపని), ప్రత్నస (శిల్పాచారి), సువర్ణస (బంగారపు ఆచారి) గోత్రాల వారి ఇంటికి వెళ్తారు.

## రుంజవాయిద్యం ఎలా ఉంటుంది?

రుంజ వాయిద్యాన్ని బలమైన కర్రపుల్లలతో వాయిస్తారు. రుంజను ఏటవాలుగా ముందుకు వంచి కదలకుండా మోకాళ్ళతో అదిమిపెట్టి, చేతులతో త్రాళ్ళను లాగి శ్రుతిచేసి, తాళం ప్రకారం వరుసలతో ఉధృతంగా వాయిస్తారు. రుంజ మీద వీరణం, డప్పువాయిద్యం, తాషా, సప్తతాళాలు వాయిస్తారు.

## పార్వతీదేవి కళ్యాణంలో రుంజ వాయిద్యం

రౌంజ కాసురుడనే రాక్షసుడను సంహరించి వాడి శరీర భాగాలతో చేసిన వాయిద్యం కావున దీనిని రుంజం అనే పేరు వచ్చింది అంటారు. ఈ రుంజ వాయిద్యం తోనే పార్వతీ దేవి కళ్యాణం రంగ రంగ వైభోగంగా దేవతలందరూ కలిసి చేశారనీ విశ్వకర్మ పురాణంలో వివరింపబడింది.

# 121. కోలాటం



కోలాటం ఒక రకమైన సాంప్రదాయక సామూహిక ఆట. కోల, ఆట అనే రెండు పదాల కలయిక వల్ల కోలాటం ఏర్పడింది. కోల అంటే కర్రపుల్ల అని అర్ధమనీ, ఆట అంటే క్రీడ, నాట్యం అనే అర్ధాలుండడంతో కోలాటం అంటే కర్రతో ఆడే ఆట అనే అర్ధంగా భావించవచ్చు.

## కోలాటం ఆడే విధానం

కోలాటం అనేది బృందగానంతో కూడిన లలితమైన బృందనృత్యం. ఇందులో ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది రెండు చేతులతోను కర్రముక్కలు పట్టుకొని పదం పాడుతూ గుండ్రంగా తిరుగుతూ లయాను గుణంగా అడుగులు వేస్తూ ఒకరి చేతికర్ర ముక్కలను వేరొకరి చేతికర్ర

ముక్కలకు తగిలిస్తూ ఆడతారు. సాధారణంగా వీటిని తిరుణాళ్ళ సమయం లోనూ, ఉత్సవాలలోనూ పిల్లలు, పెద్దలు, స్త్రీలు ఎక్కువగా ప్రదర్శి స్తుంటారు దీనిని స్త్రీపురుష బృందాలు కూడా చేస్తుంటారు. ఇది సాధారణంగా ఉత్సవ సందర్భంలో చేస్తుంటారు. తిరుపతి బ్రహ్మోత్స వాలలో కూడా కోలాటబృందాలు పాల్గొంటూ ఉంటాయి. బృందంలోని వారు రెండుచేతులలో రెండు కర్రలను పట్టుకుంటూ పాటలకు అను గుణంగా అడుగులు వేస్తూ కర్రలను కలుపుతూ విడదీస్తూ ఎదుటి వారితో చేరి కర్రలతో కలిపి తాళం వేస్తూ నృత్యం సాగిస్తారు. బృందానికి ఒక నాయకుడు ఉంటాడు. పాటలుగా మాత్రం భక్తిగీతాలను ఆలాపిస్తుం టారు. ఒకే విధమైన దుస్తులను వేసుకుని నృత్యం చేస్తే ఇది మరింత సుందరంగా ఉంటుంది. ఇది తెలుగు ప్రజల ప్రత్యేకతలలో ఒకటి.

## కోపులు

కోపు అంటే నాట్యం, నాటకం, తీర్పు, నాట్యగతి విభేదం, ఆట, నాట్యగతి విశేషం అనే అర్థాలున్నాయి. కోలాటంలో అనేకమైన గతి భేదాలనే కోపులంటారు. ఈ కోపులకు పాటలోని మొదటి చరణాన్ని బట్టీ, గతికి తగ్గ భావంతోనూ, పురాణ పురుషులైన కృష్ణ, రామ మొదలైనవారి పేర్లతో పేర్లు పెడతారు. ప్రాంతాలను బట్టి కోపుల పేర్లూ మారుతూ వుంటాయి. పలనాటి సీమలో ప్రార్థ కోపు, ఉద్ది తిరుగుడు కోపు, వరగత్తెర కోపు, కృష్ణ కోపు, చెలియ కోపు, కంస కోపు, జడ కోపు, భారత కోపు, భామ కోపు, లాలి కోపు, లంకె కోపు, కలువరాయి

కోపు మొదలైనవి ఉన్నాయి. కోలాటంలో పాటనూ, పాటతోపాటు ఆటను మొదలు పెట్టటం ఎత్తుగడ అంటారు. అందరూ వలయంగా ఏర్పడి దేవతలకూ, దేవుళ్ళకూ, రాజకీయ నాయకులకూ జై కొట్టి, వారి వారి కిష్టమైన ప్రార్థనలు చేసి ఇట తయ్యకు తాధిమిత, అనడంతో ఆట ప్రారంభ మౌతుంది. ఎత్తుగడ నుంచి పాట ఆట వేగాన్ని పుంజుకుంటుంది.

కోలాట నృత్యమును స్త్రీలు, పురుషులు కూడా చేస్తారు. వ్యవసాయ వృత్తియందున్న రైతు పురుషులు ఈ కోలాటములలో పాల్గొంటారు. దినమంతా కష్టించి పొలం పనిచేసి, సంధ్యవేళ ఇల్లు చేరి, భోజనాదులు ముగించుకొన్న పిదప వినోదముగా కాలము గడుపు ఆటలలో కోలాటము ముఖ్యమైనది. కోలాట విద్యలో నిపుణులైనవారు కరీంనగర్ జిల్లాలో అధికముగా ఉన్నారు. సుమారు నలుబది ఏబది కోపులను తెలిసిన వారు కూడా కరీంనగర్ జిల్లాలో ఉన్నట్లు చెబుతారు.



## ఉసెత్తుకోవడం

కోలాటంలో రెండవ కాలం నుంచి మూడో కాలానికి వెళ్ళడాన్ని ఉసెత్తు కోవటం అంటారు. అప్పటివరకూ నెమ్మదిగా చిరుతలు కొడుతున్న ఆటగాళ్ళు ఒక్కసారిగా హుషారుగా, ఎగురుతూ, పాడుతూ, పాట కనుకూలంగా అడుగులు వేస్తూనే కోలాటం వేయటాన్ని ఉసెత్తుకోవటం అంటారు. దీనినే త్వరితం ఉసి, దుడుకు అని కూడా అంటారు. ఇలా ఆటలో ఉసెత్తు కోవడం ప్రేక్షకులను ఎంతో ఆనంద పరుస్తుంది.

## అద్భుత ప్రదర్శనలు

ఆంధ్రప్రజల జీవితంలో ఈ కోలాట నృత్యం పెనవేసుకొనిపోయి ఉన్నది. భక్తిభావంతో దేవుని స్తంభాన్ని పట్టుకొని ఇంటింటికీ తిరిగి, ప్రతి ఇంటిముందూ రాత్రిపూట ప్రొద్దుపోయే వరకూ ఈ కోలాట నృత్యాలు చేస్తుంటారు. ప్రతి పల్లెలోనూ విరామ సమయాల్లో, ఈ కోలాట నృత్యాలను పెద్దపెద్ద తిరునాళ్ళ సమయంలోనూ, దేవుళ్ళ ఉత్సవాలలోనూ బహిరంగంగా వీధుల్లోనూ ప్రదర్శిస్తారు.

ఇరవై నుంచి నలభైమంది వరకు రంగురంగుల కోల కర్రలతో కాళ్ళకు గజ్జెలు కట్టుకొని బృంద నాయకుని ఆధ్వర్యంలో ఇద్దరు చొప్పున ఒకరికొకరు ఎదురుగా నిలబడి వలయాకారంగా నృత్యం నిర్వహిస్తారు. అందులో జడకోపు కోలాటంలో లయబద్ధంగా నృత్యంచేస్తూ కోలాలతోనే జడను అల్లడం, విప్పడం చేయడం అనేది అత్యంత అద్భుతమైన ప్రదర్శన.

## స్త్రీల కోలాటం

స్త్రీలు సరిసంఖ్యలో నేలపై కూర్చొని చేతులతో కుడి ఎడమల అందిం చుకొంటూ కోలాటమేస్తారు. అరచేతులతో కోలాటమేస్తారు. కోలాటంలో కర్రలు ఉపయోగిస్తారు. అందరు నేలపై చక్కముళ్ళు వేసుకొని కూర్చొని చప్పట్లు చరుస్తూ రకరకాల పాటలు పాడతారు.

## జడ కోలాటం

జడబిళ్ళను చెక్కతో తయారుచేసి రంధ్రాలు పెట్టి ఒక్కో రంధ్రంలో ఒక తాడును అమర్చుతారు. ఒక్కొక్క స్త్రీ ఒక తాడు ఎడమచేత్తో పట్టుకొని, కుడిచేత్తో కర్రను పట్టుకొని రకరకాల జడలను వేయటం, మరల విప్పటం. ప్రత్యేకంగా స్త్రీలు మాత్రం కొన్ని ప్రాంతాల్లో పాల్గొంటారు. పురుషులు కూడా వేస్తారు.

## కోలాటానికి కావలసినవి

కోలాట ప్రక్రియకు, జట్టు, జట్టు నాయకుడు, ఆటగాడు, గరిడి, లుద్ది, కోపు, ఎత్తుగడ, ఉసెత్తు, ముక్తాయింపు అవసరం. ఇంతేగాక కోలాట కర్రలు, గజ్జెలు, అందెలు, కొరడా, వాయిద్యాలు, వెలుగునిచ్చే దీపములు కోలాటానికి పనికి వచ్చే వస్తువులు.

కోలాటం ఆడే ఆట గాళ్ళందరినీ కలిపి జట్టు అంటారు. జట్టు అంటే గుంపు లేక సమూహము అని అర్థం చెపుతారు. ఈ జట్టులోని ఆటగాళ్ళు జట్టుకు నాయకుడు ఒకడు వుంటారు.

జట్టులో సభ్యులు సరి సంఖ్యలోనే వుంటారు. బృంద సభ్యులందరూ గురువు చెప్పే మాటకు కట్టుబడి క్రమశిక్షణతో మెలగుతారు. జట్టు నాయకుణ్ణి కోలన్న పంతులనీ, పెన్నుద్దఅనీ, ముందు పాటగాడనీ, అయ్యవారనీ, మేళగాడనీ వివిధ పేర్లతో పిలుస్తారు.

## కోలాటాల కర్రలు ఎలా ఉంటాయి



కోలాట కర్రలు మొదట సన్నగానూ, మద్యలో ఉబ్బెట్టుగానూ, చివర సన్నగానూ వుంటాయి. పట్టు కోవడానికి వీలుగా పిడి వుంటుంది. ఈ కర్రలను చేవ కలిగిన బిల్లుడు, చంద్ర, ఏపె, రేల, టేకు, ఏగెస మొదలైన జాతుల చెట్లనుంచి కర్రలను ఎంచుకుంటారు. ఈ కోలాటపు చిరుతలను చక్కగా చత్రిక పడతారు. పిడివద్ద అందెలనూ, కోల చివర గజ్జెలనూ ఏర్పాటు చేస్తారు. కోలాటం చేశేటప్పుడు వీటి ధ్వని మధురంగా వుంటుంది. ఆటగాళ్ళందరు కాళ్ళకు గజ్జెలు కట్టుకుంటారు.

కొన్ని ప్రాంతాల్లో జట్టు నాయకుడు కొరడాను భుజాన వేసుకుని ప్రదర్శనలో క్రమశిక్షణను పాటించని వారికీ, తప్పు చేసిన వారిపైకి ఈ కొరడా ఝుళిపిస్తాడు. వారికి ఈ కొరడా పక్కలో బల్లెంగా వుంటుంది. ఒక్కొక్కసారి అందరినీ హెచ్చరించడానికి మధ్య మధ్యన చెళ్ళుమనిపిస్తాడు.

# 122.పగటి వేషాలు



జానపదకళలు ఆదరణ తక్కువ కావడంచేత చాలా కళలు భిక్షుక వృత్తిగా మారిపోయాయి. బుర్రకథ, వీధినాటకం, యక్షగానం వంటి కళారూపాలు భిక్షుకవృత్తిగా మారిపోయిన దశ కనిపిస్తుంది. అట్లాంటి కళారూపాలలో పగటివేషాలు ఒకటి. చాలా జానపద కళారూపాలు మతపరంగానో, కులపరంగానో, వాద్యాలపేరుతోనో పిలువబడితే కేవలం ప్రదర్శనా సమయాన్ని బట్టి పిలువబడేది పగటివేషాలు కళ. అనేకమైన వేషాలు ప్రదర్శింపబడడంచేత, పగటిపూటనే ప్రదర్శింపబడడంచేత ఇవి పగటివేషలయ్యాయి. పగటి వేషాలనే పైటేషాలని కూడా అంటారు.

## వీధి నాటకాలే పగటివేషాలు

పగటి వేషాలు జానపద కళారూపాల్లో ప్రముఖమైనవి. వీధినాటకాలే పగటివేషాలుగా మారాయని పరిశోధకుల అభిప్రాయం. ప్రదర్శించే వేళను బట్టి, సమయాన్ని బట్టి వీటికి పగటివేషాలని పేరు వచ్చింది. కేవలం పగటిపూట మాత్రమే వీటిని ప్రదర్శిస్తారు. పగటివేషాలను, సంచారి పగటివేషాలని, స్థానిక పగటివేషాలని విభజించవచ్చు. సంచారి పగటివేషాల వాళ్ళు దాదాపుగా సంచారజీవనం చేస్తూ ప్రదర్శన లిస్తుంటారు. వీళ్ళనే బహురూపులు అనికూడా అంటారు. పగటివేషాల ప్రదర్శన ఒక ఊళ్ళో నెలల పాటు ఉంటుంది. ప్రతి రోజు ప్రదర్శించి తరువాత చివరి రోజున సంభావనలు తీసుకుంటారు. జానపద కళలూ చాలా వరకు యాచక వృత్తిగా మారిపోయాయి. అట్లా మారిన వాటిలో పగటివేషాలు ఒకటి. వచ్చిన సంభావన అందరు పంచుకుంటారు. వీరు ఆహార్యం, అలంకరణ పట్ల శ్రద్ధ వహిస్తారు. సంభాషణలు, వీరు చెప్పే పద్యాలు రక్తి కట్టిస్తాయి.

## పగటివేషాల్లో వచ్చిన మార్పులు

ప్రాచీన కాలంలో అనేక పగటివేషాలు ప్రదర్శింపబడేవి. కాని ఇప్పుడు అన్ని వేషాలు వేయడం లేదు. కారణం జీవనంలో వచ్చిన మార్పులేనని వీరు చెబుతారు. ఒకప్పుడు బోడి బాపనమ్మ వేషం వేసేవారు. కాని ఉదయమే ఈ విధవ మోహం చూడలేమని ఈ వేషంతో మా యింటి వద్దకు రావద్దని కొందరు చెప్పడం మూలాన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ వేషం వేయడంలేదని వీరు చెబుతున్నారు. అట్లే కులాలకు, మతాలకు

చెందిన సాత్తని వేషం, బ్రాహ్మణ వేషం వంటివి వేయడంలేదు. వీరు ప్రదర్శించే వేషాలలో అర్ధనారీశ్వర వేషం ప్రత్యేకమైనది. ఈ వేషం మేకప్ వేయడానికి దాదాపుగా 3 గంటల సమయం పడుతుందని, సాయంకాలం దాకా ఈ మేకప్ ఉండాలి కాబట్టి ప్రత్యేకమైన రంగులు వాడతామని వీరు చెబుతారు. ఒకే వ్యక్తి స్త్రీ, పురుష వేషాలు ధరించి సంభాషణలు చెప్పడం అంటే సామాన్యం ఏమీ కాదు.

## పగటి వేషాల చారిత్రకత

జనవ్యవహారంలో ఉన్న కథలను బట్టి పగటివేషాలు రాజు కళింగ గంగుకథ, సంబెట గురవ రాజు కథ, విజయనగర రాజుల కథలు ప్రస్తావనలోకి వస్తాయి. పగటి వేషాలకు చారిత్రకాధారాలున్నాయి. భిక్షుకవృత్తిగా ప్రారంభమైన ఈ కళ కాలక్రమంలో ఒక సంక్లిష్ఠ రూపంగా మారింది. శాతవాహనుల పరిపాలనా కాలమందే ఈ కళారూపం ఉందని, హాలుని గాథాసప్తశతిలో దీని ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. మార్గ, దేశి, శిష్ఠ సాహిత్య లక్షణాలన్ని మూర్తీభవించిన కళ పగటివేషాలు.

## పగటివేషాలు - వర్గీకరణ

పగటి వేషాలు ఒకప్పుడు దాదాపుగా 64 ఉండేవని కాని ఇప్పుడు 32 వేషాలు మాత్రమే వేస్తున్నామని నంద్యాల కళాకారులు అంటారు. ఇతివృత్తం ఆధారంగా పగటి వేషాలను ఐదు విధాలుగా విభజించవచ్చు.

**మతపరమైనవి :** ఆదిబైరాగి వేషం, చాత్తాది వైష్ణవ వేషం, కొమ్ము దాసరి వేషం, హరిదాసు వేషం, ఫకీరు వేషం, సాహెబుల వేషం.

**కులపరమైనవి :** బుడబుక్కల వేషం, సోమయాజులు–సోమిదేవమ్మ వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం, వీరబాహు వేషం, గొల్లబోయిడు వేషం, కోయ వాళ్ళ వేషం, దేవరశెట్టి వేషం, దేవాంగుల వేషం, ఎరుకలసోది వేషం వంటివి.
**పురాణపరమైనవి:** జంగం దేవర వేషం, శక్తి లేదా శూర్పణఖ వేషం, అర్ధనారీశ్వర వేషం వంటివి.
**జంతు ప్రదర్శన పరమైనవి:** గంగిరెద్దుల వేషం, పాములోల్ల వేషం,
**ఇతరములు:** పిట్టలదొర వేషం, చిట్టి పంతులు వేషం, కాటికావిళ్ళ వేషం వంటివి.

## పగటివేషాలు - ప్రదర్శన రీతులు

పగటివేషాల్లో కొన్నింటిలో సంభాషణలకు ప్రాధాన్యత ఉంటే మరి కొన్నింటిలో పద్యాలకు, అడుగులకు, వాద్యాలకు ప్రాధాన్యత ఉంటుంది. బుడబుక్కల వేషం, ఎరుకలసాని వేషం, బోడి బ్రాహ్మణ స్త్రీ వేషం వంటి వాటిలో సంభాషణలకు ప్రాముఖ్యత ఉంటుంది. పురాణ వేషల్లో హార్మోనియం, తబలా వంటి వాద్యాలతో పాటు యక్షగాన శైలిలో ప్రదర్శన ఉంటుంది. కుల సంబంధమైన పగటివేషాలు సంఘంలోని అనేక కులాల వారి జీవనవిధానాన్ని వ్యంగ్యంగా ప్రదర్శిస్తాయి. ప్రతి కులాన్ని గురించి తెలియచేస్తూ ఆ కులాలపై సమాజం యొక్క అభిప్రాయాలను విమర్శిస్తాయి.

## వ్యంగ్యమే పరమావధి

పగటివేషాల లక్ష్యం వ్యంగ్యమే. వీరికి రంగస్థలం అంటూ లేదు. ఇంటిగడప, వీధులు, సందులు, గొందులు, అన్ని వీరి రంగస్థలాలే. ప్రదర్శన సమయాల్లో ప్రేక్షకులు, ప్రదర్శకుల మధ్య వ్యత్యాసముండదు.

పగటి వేషాల్లోనే ప్రత్యేకత, ప్రావీణ్యత కలిగిన వేషం అర్ధనారీశ్వర వేషం. ఒక వ్యక్తి మధ్యలో తెర కట్టుకొని ఒకవైపు నుండి పార్వతి, మరోవైపునుండి శివుడుగా అలంకరణ చేసుకొని ప్రదర్శనలిస్తాడు. తెర మార్చుకుంటు న్నప్పుడు ఒక వైపు నుండి చూస్తే శివుడు మరో వైపునుండి చూస్తే పార్వతిని చూసిన అనుభూతి కలుగుతుంది. తెర మార్చుకోవడంలోనే వీరి నైపుణ్యమంతా దాగిఉంది.

## పగటివేషాలు గొప్పతనం

పగటి వేషాలలో ఉండే గొప్పతనం ఇతరుల్ని నమ్మించడం. ఒకనాటి పరిపాలకుల దృష్టికి ప్రజల సమస్యలను తీసుకు రావడం, వర్గమానాలను చేరవేయడం కొరకు ప్రధానంగా ఈ ప్రదర్శనలు ప్రచారంలోకి వచ్చాయని ప్రతీతి.

## రాయలసీమలో పగలేసిగాళ్ళు

రాయలసీమ ప్రాంతంలో పగటివేషగాళ్ళను పగలేసి గాళ్ళని పిలుస్తారని తమ జానపద కళా సంపదలో డాక్టర్ తూమాటి దొణప్ప గారు ఉదహరించారు. వీరు కూడా విప్ర వినోదులు లాంటి వారు. దొర వేషం దొరసాని వేషం, వడ్డెరవాడు బ్రాహ్మణ వితంతువు మొదలైన వేషాలను ధరించి చమత్కారమైన మాటల తీరుతో ప్రజలను ఆనందింప చేస్తారు. ధరించే ఆయా పాత్రల నడక, మాట యాస, భాషా ఉచ్ఛారణ వారికి వెన్నతో పెట్టిన విద్య. ప్రతి వేషాన్నీ తీర్చి దిద్దుకుని సహజత్వం వుట్టిపడేలా వుండే అలంకరణ వస్తు సామాగ్రిని వారే సమకూర్చుకుంటారు. ఎవరు ఏ మాట మాటాడినా పరిహాస దరహాసంతో సమాధానాలిస్తారు.

# 123. జోగాట

తెలంగాణ ప్రాంతంలో హరిజనులలో జోగువారను ఒక నర్తకులశాఖ వారున్నారు. వారు డప్పుల వాద్యము ఆధారముగా చేసుకొని నృత్యము చేస్తారు. ఈ జాతి వారిలో ఎవరైనా చనిపోయినప్పుడు శవమును స్మశాన వాటికకు గొనిపోవునప్పుడు జోగాట ఆడుతూ వెళ్తారు.

వీరి నృత్యము లన్నింటిలోను పిండోత్పత్తి క్రమము తెల్పునట్టిది ప్రత్యేకంగా చెప్పదగినది. ఈ నృత్యంలో జీవుడా తల్లి గర్భంలో బిందు రూపంలో ప్రవేశించినది మొదలు, వివిధ మాసములందు ఆ పిండము పెరుగు విధానము, ప్రసవం, అటుపై జీవితములోని వివిధ ఘట్టములను వారు చక్కగా ఆడతారు.

ఇలాంటిదే వేదాంత చర్యలతో కూడిన గొల్లకలాపము నందలి గొల్లభామ శృతి, స్మృతుల ఆధారంగా ఉదాహరణలిస్తూ అభినయించెదరు. కేవలం చావు సందర్భాలలోనే కాక సంతోష సమయాలలో, వేడుకలలో, వివాహాలలో, ఉత్సవాల్లో కూడ ఈ జోగువారు వారి డప్పు నృత్యాన్ని ప్రదర్శిస్తారు. సర్కారాంధ్రలో వీరిని మాదిగలంటారు. చాటింపు వేయడం, జాతర్లకు, ఉత్సవాలకు డప్పు వాయిద్యాలను వేస్తుంటారు.

# 124. బుర్ర కథ



ప్రబోధానికీ, ప్రచారానికీ సాధనంగా ఈనాటికీ విస్తృతంగా ఉపయోగ పడే కళా రూపం బుర్ర కథ. యక్షగాన పుత్రికలయిన జంగం కథ, శారద కథలకు రూపాంతరమే బుర్రకథ. ఇది సంగీతం, నృత్యం, నాటకం–ఈ మూడింటి మేలుకలయిక.

బుర్రకథలో నవరసాల సమ్మేళనం ఉంటుంది. ముఖ్యంగా వీర, కరుణ రసాలను బాగా ఒప్పించే ప్రక్రియ ఇది. ప్రదర్శన సౌలభ్యాన్ని బట్టి, వీరగాథలను గానం చేసేందుకు ఈ ప్రక్రియ ప్రచార సాధనంగా ఎంతగానో ఉపకరిస్తుంది.

బుర్రకథ అనగానే నాజర్ పేరు గుర్తుకు వస్తుంది. ఆయనకు ఎందరెందరో ఏకలవ్య శిష్యులు బుర్రకథనే జీవనాధారం చేసుకొని బ్రతుకుతున్నారు. నాజర్ పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం బుర్ర కథలు బహుళ ప్రచారం పొందినవి.

## ముగ్గురుతో కూడిన బృందం

ముగ్గురు బృందముగా ఉండే బుర్రకథ ప్రదర్శనలో మధ్య పాత్రధారి ముఖ్య కథకుడు గానూ, మిగిలిని ఇద్దరిలో ఒకరు వంత కథకు, మరొకరు హాస్య కథకులుగానూ ఉంటారు. సాధారణంగా ఇది నిలుచుని చెప్పే కథ ఐనా, సౌలభ్యత కోసం కూర్చుని కూడా బుర్రకథ చెప్పి శ్రోతలను రంజింపజేయగలవారు కొన్ని ప్రాంతాలలో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు సమీపాన దొడ్డిపట్ల గ్రామంలో కూర్చుని బుర్రకథ చెప్పే బృందాలు ఉన్నాయి.

వినరా భారత వీరకుమారా విజయం మనదేరా అన్న చరణం బుర్రకథల్లో సర్వ సామాన్యం. బుర్రకథ ప్రదర్శకులలో ముగ్గిరిని కథ, రాజకీయం, హాస్యం అని పిలుస్తారు. మధ్యలో ఉండే కథకుడు పాడేదానికి చెప్పేదానికీ ఇటూ అటూ ఉన్న ఇద్దరూ తందాన తానా అని వంత పాడతారు.

కాలపరిణామములో యక్షగానమే బుర్రకథగా రూపొందింది అంటారు. కథకుడు వాయించే తంబురా బుర్రనుబట్టి బుర్రకథ అని పేరు వచ్చింది. ఈకథలో వంత “తందానతాన”, కాబట్టి దీనిని “తందాన పాట” అనికూడా అంటారు. యక్షగానంలో కథచెప్పేది స్త్రీ. బుర్రకథలో

కథ సామాన్యంగా పురుషుడే చెబుతాడు. ఇపుడు స్త్రీలు కూడా బుర్రకథ చెపుతున్నారు. దీనిని వృత్తిగా స్వీకరించి ప్రచారంలోకి తెచ్చినవారు జంగాలు. అందుకే దీనికి **"జంగం కథ"** అనికూడ పేరు వచ్చింది. కథకుడు సామాన్యంగా నిలుచుని కథ చెప్పడు. ముందుకు వెనుకకు అడుగులు వేస్తూ, నృత్యంచేస్తూ, గిర్రున తిరుగుతూ, మధ్య మధ్య కూర్చొని అభినయిస్తూ కథ చెపుతాడు. దీనితో ప్రేక్షకుల హృదయాలు రసార్ద్రమవుతాయి.

**కథ :**ఇతనే ప్రధాన కథకుడు. ముఖ్య కథను, వర్ణనలనూ, నీతినీ, వ్యాఖ్యలనూ వచనంగా–అంటే మాటల్లో చెబుతూ, సందర్భం వచ్చిన చోట భావపరమైన స్ఫూర్తిని కలిగించేందుకు రసవంతమైన పాటలు పాడతాడు. కథకుడు ముఖ్య కళాకారుడు. ఇతనే ముఖ్య కథకుడు. ఇతను హాస్యంగా మాట్లాడడం చాలా అరుదుగా ఉంటుంది. ఒకవేళ ఎప్పుడైనా వేరే కబుర్లతో మిగిలిన ఇద్దరూ పక్కదారి పడుతున్నా.. ముఖ్య కథలోకి తీసుకొస్తూ నిబద్ధతతో కథ చెప్పడం ఇతని బాధ్యత. ఈ పాత్ర పోషించే వ్యక్తికి మాటా, ఆటా, పాటా బాగా తెలిసి ఉండాలి. ఇక కథ సంగతి సరేసరి. అతని వేషధారణ కూడా రంగుల అంగరఖా, తలపాగా, నడుము గుడ్డ, ముత్యాల గొలుసు, కాలిగజ్జెలతో కనుల పండువుగా ఉంటుంది.

**రెండో వ్యక్తి :**ఇతను ముఖ్య కథకుడి కుడిభుజం వైపు ఉంటాడు. అంటే – బుర్రకథ చూసేవారు ఎడమ పక్కనుంచి ఒకటి, రెండు, మూడు అని లెక్కపెడితే మొదట లెక్కకు వచ్చేది ఇతనే! ఇతను హాస్యగాడు కాదు. ఇతన్ని రాజకీయం అంటారు. అంటే – ముఖ్య కథకుడు ఎక్కువగా పాటలతో కథను చెబుతుంటే – మధ్యలో వచనం వచ్చినప్పుడల్లా సీరియస్

చర్చల్ని ఇతను కథకుడితో చేస్తుంటాడు. లేదా అతను వచనంతో కథ చెబుతుంటే - ఆహా ఓహో అంటూ వంత పాడుతుంటాడు. రంగుల దుస్తులతో, విభూతి రేఖలతో, చేతి డప్పులతో వీరు కథకునికి పాటలోనూ, చిందులోనూ తోడుంటాడు. కథలో పట్టు నిలబెడుతుంటారు. ఏమైందని ప్రశ్నిస్తూంటాడు. ఉత్సాహాన్ని, ఊపును పెంచుతుంటాడు. ప్రేక్షకుల ఆసక్తిని పెంచుతుంటాడు. మూడో వ్యక్తి హాస్యం చేసినప్పుడు అతనితో ఇతను చర్చిస్తాడు. ఆ సమయంలో కథకుడు వెనక్కి వెళ్తాడు. రాజకీయం, హాస్యం ఇద్దరూ సరదా సంగతులు చర్చించుకున్నాక- మళ్లీ మధ్యలోని కథకుడు ముందుకొచ్చి ముఖ్య కథను కొనసాగిస్తాడు. అయితే కొందరు అపోహపడే విధంగా రాజకీయం అనే ఈ వ్యక్తి - హాస్యగాడితో చర్చిస్తాడే గానీ హాస్యాన్ని పంచడం ఇతని బాధ్యత కాదు. కథ చెప్పేటప్పుడు ముఖ్య కథకుడికి అండగా ఉండి సహకరించడమే ఇతని ముఖ్య బాధ్యత.

**మూడవ వ్యక్తి** హాస్యం. బుర్ర కథ మొత్తం తీక్షణంగా సాగితే ఇబ్బంది కాబట్టి - అవకాశం ఉన్నప్పుడల్లా ఇతను హాస్యంగా మాట్లాడతాడు. - ప్రస్తుత నిత్య జీవితానికి సరిపడే విధంగా కబుర్లు చెబుతూ - ముఖ్య కథకి అప్పుడప్పుడు అడ్డుకట్ట వేస్తున్నట్టు అనిపిస్తుంది గానీ - అది కేవలం వినోదం కోసమే! హాస్యగాడు తన హాస్యంతో ముఖ్య కథ తాలూకు విలువని తగ్గించకూడదు. ఎక్కడైనా అలా తగ్గితే కథకుడు జోక్యం చేసుకుని - కథ తాలూకు గాంభీర్యాన్ని కోల్పోకుండా చూస్తాడు. తిరిగి కథలోకి జనాన్ని తీసుకు వెళతాడు.

# 125.హరికథ



హరికథ అన్నది తెలుగు వారి సంప్రదాయ కళారూపం. హిందూ మతపరమైన భక్తి కథలు, ప్రధానంగా హరిలీలలను సంగీత, సాహిత్యాల మేళవింపుతో చెప్పడాన్ని హరికథ అంటారు.

## హరికథ పుట్టుక

హరికథ పుట్టుక గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హరికథ వేదాలనుండి పుట్టిందని కొందరు భావిస్తారు. మరికొందరు నారద

భక్తిసూత్రము హరికథ యొక్క మూలమని భావించారు. ఇంకొందరు యక్షగానమే హరికథగా రూపాంతరం చెందిందని భావిస్తున్నారు.

హరికథ మూలమేదైనా ఆంధ్రదేశములోని హరికథా ప్రక్రియ తన ప్రదర్శనలో వినూతనత్వములోను, నవరస సమ్మేళనంతోనూ, వివిధ రాగాలను పలికించటములోనూ ప్రత్యేకమైనది.

## అన్ని పాత్రలలో ఒకే వ్యక్తి

ఈ కథ చెప్పువారిని భాగవతులు లేదా భాగవతార్ అని అంటారు. ఆదిభట్ల నారాయణదాసు, పరిమి సుబ్రమణ్యం భాగవతార్ మొదలగు వారు ఈ ప్రక్రియలో ఆద్యులు, ప్రముఖులు.

హరికథా కళారూపంలో ఒకే ఒక పాత్రధారి మూడు గంటల పాటు కథాగానం కావిస్తాడు. ఒకే వ్యక్తి అన్ని పాత్రల్లోనూ జీవించి, రసవత్తరంగా నటిస్తాడు. నోటితో వాచికం చెపుతూ, మృదుమధురమైన గానం పాడుతూ, ముఖంలో సాత్వికమూ, కాలితో నృత్యమూ చేతులతో ఆంగికమూ గుప్పిస్తూ ఆకర్షణీయ మైన ఆహార్యంతో ఏకకాలంలో అభినయిస్తాడు. హరికథలో వున్న ప్రత్యేకత ఇదే.

హరికథకుని వేషధారణ కూడా సామాన్యమే. చేతిలో చిరతలు, కాలికి గజ్జెలు, పట్టు దోవతి పంచకట్టు, పట్టు కండువా నడుముకు కట్టి, మెడలో ఒక పూలహారం ధరించి చక్కగా తిలకం దిద్దుతాడు.

# 126.జంగందేవరలు



తలపైన ఫణిచక్రం కలిగిన కిరీటం, నుదుట విభూతి రేఖలు, చంకలో జోలె, ఒక చేతిలో ఇత్తడి గంట, మరో చేతిలో కర్ర, జంగం దేవరల ఆహార్యంగా ఉంటుంది. సంక్రాంతి రోజుల్లో బుడబుక్కలవాడు అర్ధరాత్రి వచ్చి బుడబుక్కని వాయిస్తూ వెళ్ళగానే వేకువ ఝామున శంఖం ఊదుతూ, గంటను మ్రోగిస్తూ, శివుని కీర్తిస్తూ జంగం దేవర ఊరంతా కలియ తిరుగుతూ, ప్రతి ఇంటి ముందు ఆగి గృహస్థులను దీవిస్తూ ముందుకు కదులుతాడు.

జంగాలు శైవ భిక్షగాళ్ళు. జంగాలలో మిండ జంగాలు, బుడిగె జంగాలు, గంట జంగాలు అనే ఉపకులాలున్నాయి. చేతిలో గంటనాదం చేస్తూ హర హర మహాదేవ శంభోశంకర అంటూ శంఖం ఊదుతూ ఇంటి ముందుకు వచ్చే జంగమయ్యలను చూసి సాక్షాత్తు భోళా శంకరుడే వచ్చినట్లుగా ఒకప్పుడు భక్త పారవశ్యంతో పరవశించేవారు. రామాయణ కాలంలో అరణ్యవాసంలో ఉన్న సీతాదేవిని ఎత్తుకుపోవడానికి రావణుడు జంగందేవర వేషంలో వచ్చాడు కాబట్టే అతన్ని సీతాదేవి సాక్ష్యాత్తు శివుడే

తన పర్ణశాల ముందుకు వచ్చాడని భావించి లక్ష్మణరేఖను సైతం దాటి వచ్చింది. పూర్వకాలంలో జంగందేవర ఇంటి వద్దకు రాకపోతే మంచి చెడు కార్యక్రమాలను ఏవైనా సరే ఎక్కడివక్కడి ఆగిపోవాల్సిందే. సమాజంలో ఆదరణ కరువు కావడంతో తమ కులవృత్తి పట్ల వారికే ఆసక్తి సన్నగిల్లింది. చనిపోయిన వారికి కర్మలు చేయడం వీరి ప్రధాన వృత్తి. బ్రాహ్మణులకు తప్ప మిగిలిన అన్ని కులాలకు వీరు కర్మకాండలు చేస్తారు. కర్మ చేసే రోజు వీరు గంట మోగిస్తూ శంఖం ఊదుతూ వెళ్ళి బావి వద్ద గాని, చెరువు వద్దగానీ పిండాలు పెడతారు.

## మిండ జంగాలు

వేశ్యా లోలురై వారి ఇండ్లలోనే విహరించిన కారణంగా వీరిని మిండ జంగములని వ్యవహరించే వారు.

## గంట జంగాలు

గంట జంగాలు శైవ, వీర శైవ మతానికి చెందిన వీర ముష్టలూ, జంగాలూ, వారి వారి కళారూపాలే కాకుండా ఒంటరిగా జంగం దేవర వేషంలో ఇంటింటికీ తిరిగి యాచిస్తారు. బసవేశ్వరుడుగా వేషధారణను తీర్చి దిద్దు కుంటారు. వారిలో ఎంతో పూజ్యభావం గోచరిస్తుంది. పైనుంచి క్రిందికి అంగరఖాను తొడుగుతారు. తెల్లని తలగుడ్డనూ చుడతారు. మెడకు పొడవాటి అంగ వస్త్రాన్ని ధరింస్తారు. ముఖానికి గంభీరంగా విభూతి రేఖలను దిద్దుతారు. గంట వాయిస్తూ, శంఖం పూరిస్తూ వచ్చే గంట జంగాన్ని సాక్షాత్తు బసవేశ్వరుడని ఊహించి ఇంట్లో

వారంతా భిక్షను వేస్తారు. భిక్షను స్వీకరిస్తూ మంత్రాన్ని ఉచ్చరిస్తూ విభూతి నిస్తారు. శంభో శంకర అంటూ, గంట చుట్టూ ఒక పుల్లను త్రిప్పుతూ ఓంకార నాదాన్నీ పలికిస్తారు. పిన్నలూ, పెద్దలూ అందరూ పూజ్య భావంతో విభూతిని స్వీకరిస్తారు. ఈ రకంగా గంట జంగాలు వీర శైవ మతాన్ని ప్రబోధించే ప్రచారకులుగా జీవిస్తూ ఊరూరా తిరుగుతూ వుంటారు.

## బుడిగె జంగాలు

జంగం కథలు చెప్పే వారిని బుడిగె జంగాలని పిలు స్తారు. బుడికెను కంచుతోగానీ ఇత్తడితో గానీ తయారు చేస్తారు. గుమ్మె టకకు ఒక వైపున బెత్తపు చత్రాన్ని బిగించి, తోలుతో మూస్తారు. రెండప ప్రక్కన కూజామూతిలాగా, అనాచ్ఛాతీతంగా వుంటుంది. కథకునికి ఇరు ప్రక్కలా వున్న వంతగాళ్ళు ఒక్కొక్కరూ తమ గుమ్మెటను చంకకు తగిలించు కుంటారు. కుడిచేతి వ్రేళ్ళతో, చర్మము పైన వాయిస్తూ రెండవ ప్రక్క మూస్తూ గుంభనగా శబ్దాన్ని తెప్పిస్తారు. కథ చెప్పే బుడిగె జంగం నిలువుటంగీ తొడిగి, తలపాగాచుట్టి, కాళ్ళకు గజ్జెలు, మువ్వలు కట్టుకుని, భుజంమీద తంబురాను ధరించి, చేతి వ్రేలికి అందెలు తొడిగి, వాటిని తంబురాకు తట్టుతూ రెండవ చేతితో తంబురా తీగను మీటుతూ కథను ప్రారంబిస్తారు. కథకునికి వంతలుగా వున్న వారు గుమ్మెటలు ధరించి కథకునికి పంత పాడుతూ, పాట వరుస ననుసరించి గుమ్మెటలను వాయిస్తూ మధ్య మధ్య హాస్యగాడు చలోక్తులతో హాస్యాన్ని క్రుమ్మరిస్తూ, ప్రేక్షకుల్ని నవ్విస్తూ వారి మెప్పు పొందుతాడు.

# 127. బుడబుక్కలవాడు




గతంలో బుడబుక్కల వాళ్లు శ్మశానం సమీపంలో నివసించే వాళ్లు. వీరు కాటికాపర్లు. ఏడాదిలో ఒక్కసారి మాత్రమే గ్రామాల్లోకి వచ్చేవాళ్లు. సంక్రాంతి పండుగకు ముందు కేవలం ఓ వారం పది రోజుల పాటు మాత్రమే వీళ్లు ఊళ్లోకి వచ్చేవాళ్లు. తమ చేతిలో డమరుకం తరహాలోని వాయిద్యాన్ని వాయించుకుంటూ ఇల్లిల్లూ తిరిగి... ఆ ఇంటికి సంబంధించి, ఇంటి సభ్యులకు సంబంధించి భూత భవిష్యత్తు వర్తమానాల గురించి రాగయుక్తంగా వినిపించేవారు.

అప్పట్లో బుడబుక్కల వారి జోస్యాన్ని ప్రజలు ఎంతగానో విశ్వసించేవారు. శ్మశానంలో కొలువుండే రుద్రుడే వీరి నోట తమ జాతకాన్ని పలికిస్తారని నమ్మేవారు. జోస్యం తమకు అనుకూలంగా ఉన్నా..

ప్రతికూలంగా ఉన్నా.. ఇంటి యజమాని సదరు బుడబుక్కల వాడికి సంతృప్తి కలిగేలా ధాన్యాన్ని ముట్టజెప్పేవారు.

## వాద్యాన్నిబట్టే వారికి పేరు

వీరి చేతిలోని డమరుకం చేసే శబ్దం డబుక్కు డబుక్కు అంటూ వినిపించేది. అదే, వ్యావహారికంలో బుడబుక్కు బుడబుక్కు అని.. డమరుకాన్ని డబుక్కు బుడబుక్కు అన్న శబ్దం వచ్చేలా వాయించే వారిని బుడబుక్కల వాళ్లు అనీ పిలిచే వారు.

## జంగమదేవరలే వీరు

నిజానికి వీరు జంగమ దేవరలు. ఒంటినిండా రకరకాల వర్ణాల వస్త్రాలను ధరించేవారు. మొలకు పంచె కట్టు ఉండేది. తలకు వర్ణరంజితమైన వస్త్రంతో పాగా చుట్టుకునే వారు. కళ్లకు ఇంతలేసి కాటుక పూసేవారు. నుదుటన భస్మాన్ని దట్టించేవారు. అసలు వీళ్లని చూడగానే పిల్లలకు భయమేసేది. అందుకే తల్లిదండ్రులు మారాం చేసే పిల్లల్ని బుడబుక్కలోడికి పట్టిస్తా జాగ్రత్త అంటూ బెదిరించి దారిలోకి తెచ్చేవారు. వీరు శ్మశానానికి సమీపంలోనే గుడిసె వేసుకొని నివసిస్తూ ఉండేవారు. మారిన కాలంతో పాటే.. వీరి వృత్తిగత జీవితమూ మారిపోయింది. ఇప్పుడు కాటికాపర్లు ఎవరూ ఊళ్లలోకి రావడం కానీ.. జోస్యాలు చెప్పడం కానీ చేయడం లేదు.

# 128.చెక్క భజనలు



చెక్కభజన సకల కళాసమన్వితమైన జానపద నృత్య కళారూపం. ఆంధ్రదేశపు పల్లెలలో అనాదిగా వస్తున్న కళారూపాలలో చెక్క భజన ముఖ్యమైంది. దేవుని స్తంభాలను పట్టుకుని ఇంటింటికీ తిరుగుతూ భక్తి భావంతో భజనలు చేస్తారు. పల్లెలో వుత్సాహం వున్న యువకులందరూ తీరిక సమయాలలో ఇరవై మంది దళ సభ్యులుగా చేరి, ఒక గురువును ఏర్పాటు చేసుకుని రాత్రి సమయంలో కట్టుదిట్టంగా ఈ విద్యను నేర్చుకుంటారు. ఇది శాస్త్రీయమైన జానపద నృత్య కళ. ఇది ఎంతో క్రమ శిక్షణతో నేర్చుకుని చేయవలసిన కళ.

ఉత్సాహం కొద్దీ చేసే భజన కాదిది. భక్తి తన్మయత్వంతో భగవంతుణ్ణి వేడుకుంటారు. అలా వేడుకుంటూ భక్తి పారవశ్యంలో అమితోత్సాహంలో చేసే నృత్యం చెక్కభజన.

భజన చేసే వారే భక్తి భావంలో మునిగిపోవటం కాక, ప్రేక్షకుల్ని కూడా తన్మయత్వంలో ముంచేస్తారు. చెక్కభజన ప్రేక్షకుల్ని ఉత్తేజితుల్ని చేస్తుంది.

ముఖ్యంగా పల్లెల్లో తీరిక సమయాలలోనూ వర్షాలు లేని రోజుల్లోనూ, పండుగ సమయాలలోనూ, దేవుళ్ళ కళ్యాణ సమయాలలోనూ, తిరునాళ్ళ సమయాలలోనూ రథోత్సవాలలోనూ, జాతర్లలోనూ ఈ చెక్కభజనల్ని చేస్తారు.

## భజన చెక్కల్ని ఎలా తయారుచేస్తారు?

అడుగు పొడుగైన చెక్కల్ని తయారు చేసుకుని, రెండు ప్రక్కలా ధ్వని రావడానికి గుండ్రటి ఇనుప బిళ్ళలనుగాని, ఇత్తడి బిళ్ళలను గానీ రెండేసి చొప్పున అమర్చుతారు. తాళం ప్రకారం చెక్కలను కొట్టేటప్పుడు ఈ బిళ్ళలు శ్రావ్యమైన ధ్వనినిస్తాయి.

అన్ని చెక్కలూ ప్రయోగించినప్పుడు ఈ ధ్వని గంభీరంగా ఒకే శ్రుతిలో వినిపించి భజనపరుల్ని ఉత్సాహ పరుస్తాయి. ఈ చెక్కలపై నగిషీలు చెక్కి సుందరంగా వుంటాయి.

ఈ బృందలలో కథా వృత్తాన్ని బట్టి కొందరు పురుషులుగానూ, మరి కొందరు స్త్రీ పాత్ర ధారులుగానూ ప్రవర్తిస్తారు. ఉదాహరణకు గోపికా క్రీడల్లో పురుషులు కృష్ణులుగానూ, స్త్రీలు గోపికలుగానూ నర్తిస్తారు.

# గురుపూజ

చెక్క భజన నేర్చుకోవాలనుకున్న యువకులందరూ చేరి ఒక గురువుని ఎన్నుకుంటారు. గురుపూజతో నృత్యాన్ని ప్రారంభిస్తారు. ప్రతి గురువూ ఒకే రకంగా ఈ చెక్క భజన విద్యను ప్రదర్శింపడు.

ఎవరి విధానం వారిది. ఈ చెక్క భజన రాయలసీమలో కడప జిల్లాలో పుట్టి, ఆంధ్ర దేశమంతటా వ్యాపించిందని, అందుకు నిదర్శనం గురువులు చెప్పిన మూలాలు మాత్రమేకాక, జిల్లాలో ప్రతి గ్రామంలోనూ చెక్కభజన బృందాలుండటం కూడ అందుకు నిదర్శనమనీ, అలాగే చెక్క భజనకు సంబం ధించిన గేయాలు ఎన్ని వున్నాయో చెప్పటం కష్టమనీ అంటారు.

# చెక్క భజన స్వరూపం ఎలా ఉంటుంది?

చెక్క భజనల ఇతి వృతాలు సాధారణంగా ఈ విధంగా వుంటాయి. భక్తి పాటలు, భారత, భాగవత, రామాయణాలకు చెందిన పురాణ పాటలు, నీతిని ప్రభోధించే పాటలు, వీర గాథలు, ఇతరాలు, జడకోపు విద్యల్నీ ప్రదర్శిస్తారు.

# వేషధారణ ఎలా ఉంటుంది?

అందరూ ఒకే రంగుగల తల గుడ్డలను, అందంగా చుడతారు. ఒక ప్రక్క రిబ్బను కుచ్చులాగా అందంగా వ్రేలాడుతుంది. పంచెల్ని నృత్యానికి అడ్డు తగలకుండా ఎగరటానికి వీలుగా వుండే లాగా సైకిల్ కట్టులాగా మడిచి కడతారు. పురుషులు ఒకే రంగుగల బనియన్‌లను ధరిస్తారు.

స్త్రీ పాత్రలకు లంగా, రవికె, పవిటెకు ఓణీ లాగా గుడ్డను ఉపయోగిస్తారు. ఈ బృందాలలో ఇరవై మొదలు ముప్పై వరకూ సమసంఖ్యలో బృంద సభ్యులుంటారు. పన్నెండు సంవత్సరాల నుంచి పాతిక సంవత్సరాల వయస్సుకల యువకులందరూ ఈ భజనలో పాల్గొంటారు.

## చెక్కభజనలోని సొగసు

రాయలసీమలో–మరీ ముఖ్యంగా కడప, చిత్తూరు జిల్లాల్లో – చెక్కభజన పాటలు చాలా ప్రాచుర్యం పొందాయి.

ఇందులో భజన చెయ్యడానికి వాడే చెక్కలు పొడవుగా ఉండే పలకలను పోలి ఉండడం వల్ల చెక్కభజననే పలకల భజన అని కూడా అంటారు.

చేతుల్లో మూరెడు పొడవుండే తాళపు చెక్కలతో, కాళ్ళకు గజ్జెలతో వలయాకారంలో తిరుగుతూ తాళపు చెక్కలు వాయిస్తూ తాళానికి అనుగుణంగా పాటలు పాడుతూ నృత్యం చేస్తూ ఉంటారు. ఒకే చేతిలో రెండు చెక్కలను ఆడిస్తూ వాయించడం చెక్కభజనలోని సొగసు.

వలయాకారంలో తిరిగే కళాకారులు కొన్ని సార్లు ఉద్దులు–వెలుద్దులుగా (జతలు జతలుగా) మారి ఎదురెదురుగా అడుగుమార్చి అడుగువేస్తూ ఉద్ది మార్చి ఉద్ది (ఒక అడుగులో ఒకవైపు–ఇంకొక అడుగులో రెండవవైపు) తిరుగుతూ నృత్యం చేస్తారు.

పెన్నుద్దికాడైన గురువు పాటలోని ఒక్కొక్క చరణం అందిస్తే మిగిలిన వాళ్ళు అందుకుని పాడుతూ నృత్యం చేస్తారు.

# చెక్క భజనను ఎలా ప్రారంబిస్తారు?

భజన ప్రారంభించే ముందు దేవుని పటాలకు పూజ చేస్తారు. టెంకాయ కొట్టి చిరుతలు పట్టుకుని సాష్టాంగ నమస్కారం చేస్తారు. అందరూ వలయాకారంగా నిలబడి లయతో చెక్కలను మోగిస్తారు. గురువు పాడగా వంత పాడతారు. తరువాత ఒక్కొక్క అడుగు వేయిస్తాడు.

అలా కుడికాలుతోనూ, ఎడమకాలితోనూ, చాక చక్యంగానూ ఆడిస్తూ వుంటారు. అందరూ ఒకే విధంగా వాయిస్తున్న సమయంలో గురువు అకస్మాత్తుగా ఆగుతాడు. అందరూ అలాగే ఆపేస్తారు. అంతా నిశ్శబ్దం. ఆ సన్నివేశం అద్భుతంగా వుంటుండి.

ఇలాంటి వాటిని నిలుపులు అంటారు. నృత్యం ఉధృతస్థాయిలో ఉన్నప్పుడు కూడ ఈ విధంగా నిలుపుదల చేస్తాడు. ఈ నిశ్శబ్ధాలు, మళ్ళీ ప్రారంభాలు. బృంద సభ్యుల యొక్క కలయికనూ లక్ష్యాన్నీ, క్రమశిక్షణనూ, గురుభక్తిని చాటుతాయి. చెక్క భజన ప్రారంభించే ముందు ప్రప్రథమంగా విఘ్నేశ్వరుని ప్రార్థించి, తరువాత వరుసగా భక్తి పాటలు పాడుతారు.

## జడ కోపులు

చెక్క భజన ప్రారంభించి కొంత కార్యక్రమం జరిగిన తరువాత చివరిగా చేసేది జడ కోపులు. ఈ కోపులు ప్రేక్షకుల్ని ఎంతగానో ముగ్ధుల్ని చేస్తాయి. అందరూ గుండ్రంగా నిలబడతారు. రంధ్రాలతో కూడిన గుండ్రని చంద్రాకారం గల బిళ్ళను తయారు చేస్తారు. రంధ్రాలలో రంగు రంగుల త్రాళ్ళను వేలాడదీస్తారు. ఆ చెక్కను ఎత్తుగా వున్న ఒక దూలానికి లాగి

కడతారు. లేదా గ్రామ మధ్యలో వున్న చెట్టుకు వ్రేలాడ దీస్తారు. దీనిని జడకోపు బిళ్ళ అంటారు. బృందసభ్యులు ఒక్కొక్కరూ ఒక్కొక్క తాడును ఏడమ చేత్తో పట్టుకుని కుడిచేత్తో చెక్కల్ని పట్టుకుని తాళ్ళ సహాయంతో ఆడుగులు వేస్తూ లోపలికి బయటికి గుండ్రాకారంగా తిరుగుతారు. మధ్య గురువు పాటలు పాడుతుండగా కళాకారులందరూ పాట పాడుతూ జడను అల్లుతారు. దీనిని జడ కోపు అంటారు.

## రక రకాల కోపులు

ఈ కోపుల్లో రకరకాల కోపులున్నాయి. అవి సాదా జడకోపు, నూగాయ జడ కోపు, డబుల్ నూగాయ జడ కోపు, కరక్కాయ జడ, గర్భ జడ, పట్టెడ జడ, పచ్చుల జడ, నాలుగు పచ్చుల జడ, వల జడ, బొంగు జడ, పుట్ల జడ ... ఈ విధంగా రకరకాల జడలను అల్లుతారు. ఇవి ఎంతో నైపుణ్యంతో అల్లబడతాయి. చూపరులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. బృందంలో ఏ ఒక్కరు తప్పు చేసినా జడ చిక్కుపడి పోతుంది. చిక్కుపడిన జడను విడదీయటం చాల కష్టం ఈ జడలను అల్లటం ఎంతో సాధన చేస్తారు. ఒక జడకూ మరో జడకూ ఏ మాత్రం సంబంధం వుండదు. పాట పాడుతూ, అడుగు వేస్తూనే ఈ కోపులను వేస్తారు.

పూర్వం చెక్కభజనలో కేవలం పురాణ సంబంధమైన, భక్తి పాటలే పాడేవారు. ప్రస్తుతం చెక్కభజనలో భక్తి, పౌరాణిక, శృంగార, హాస్య సంబంధమైన పాటలు పాడుతూ వస్తున్నారు. ఆనాడు తిత్తి, మద్దెల, కంజీర చెక్కభజనకు వాయిద్యాలుగా ఉపయోగించేవారు. ఇప్పుడు హార్మోనియం, డోలు, కంజీర, తబలా వాయిద్యాలుగా వాడుతున్నారు.”

# 129. చిలక జోస్యం



ముఖాన రూపాయి బిళ్ళంత కుంకంబొట్టు, ముంజేతులకు మురుగులు, నెత్తిమీద గొడుగు, కాలికి కడియం, చెవులకు పోగులు, చంకన చిలక పంజరం పెట్టుకొని వీధుల వెంట జోస్యం చెబుతామంటూ తిరుగుతుంటారు కొంతమంది వీరు చెప్పేదే చిలకజోస్యం.

## చిలకజోస్యం అంటే ఏమిటి?

చిలక జోస్యంపై ఆసక్తి కలవారు పిలిచి చిలక జోస్యం చెప్పమంటే పంజరం కింద పెట్టి, బిచాణా పరచి, దానిమీద పది పన్నెండు కవర్లు వరుసగా పేర్చి కొంత ధనాన్ని తీసుకొని ప్రశ్న అడిగేవారి పేరు ఉచ్చరిస్తూ

పంజరం తలుపు తీసి చిలుకను బయటకు పిలుస్తాడు. ఆ చిలుక వయ్యారంగా బయటకు వచ్చి ఓరగా యజమానిని చూస్తూ కవర్లలో ఒక్కొక్కటే ముక్కుతో తీసి పక్కన పెడుతూ ఎక్కడో ఒక కవరు దగ్గర ఆగి దాన్ని కరచి పెట్టి తెచ్చి అతనికి ఇస్తుంది. ఆ కవరులోని కార్డుల పై వెంకటేశ్వరస్వామి, సత్యన్నారాయణస్వామి, ఆంజనేయస్వామి, పార్వతీ పరమేశ్వరులు, సీతా రామలక్ష్మణులు, దుర్గ వగైరా దేవతల బొమ్మలలో ఏదో ఒకటి ఉంటుంది. మరో కాగితం మీద : మీరు అనుకుంటున్న పని ఆరునెలల్లో నెరవేరుతుంది, వచ్చే అమావాస్య వెళ్ళిన దగ్గరనుంచి మీ జాతకం మారిపోతుంది. ఆకస్మిక ధనలాభం, ఎవరితోనూ శతృత్వం మంచిది కాదు.. వంటి ఎవరికైనా వర్తించేటువంటి వంటి మూడు నాలుగు వాక్యాలు అచ్చు కాబడి వుంటాయి.

అవి చదివి వృచ్ఛకుని కోరికకు అన్వయించి చెప్పి అందులోని బొమ్మలు అతనిపై ఎలా అనుగ్రహం చూపుతున్నాయో ఒప్పే విధంగా చిలకజోస్యం చెప్పే వ్యక్తి చెబుతాడు. ఈ చెప్పడంలోని నేర్పే ఆ చిలుక జోస్యం చెప్పించుకున్న వ్యక్తి సంభ్రమాశ్చర్యాలలో ముంచెత్తుతుంది. ఆ పైన ఆ జ్యోతిష్యుని వ్యాఖ్యాన పూర్వకమైన వాక్కు సమ్మోహితులను చేస్తుంది. ఈ చిలక జోస్యాలకు ఒకప్పుడు రాజమండి జంతర్ మంతర్ రోడ్డు ప్రసిద్ధి చెందింది. ఈ చిలుకజోస్యం తెలుగువారి వినోద సాంప్ర దాయాల్లో చాలా ప్రముఖమైనది.

# 130.సోది




**"సోదోయమ్మ సోది, సోదడగ రండమ్మా సోది" "సోది చెబుతాం, సోది చెబుతాం"** అని మిట్ట మధ్యాహ్నం వేళ చిన్న ఏక్తార తంబుర ఒకదాన్ని చేత్తో మీటుతూ ఆశృతిలో గొంతుకలిపి పాటలా మాటలు పలుకుతూ సోదికత్తెలు వీధుల్లో తిరుగుతుంటారు.



సోది చెప్పించుకునే స్త్రీ చేటలో మూడు సోలల బియ్యం పోసి ఎదురుగా కూర్చొని చెయ్యి చాపుతుంది. సోదికత్తె ఆమె చేయి స్పృశిస్తూ, ఆమెకు సంతానం, పిల్లలు, పెళ్ళిళ్ళు, ప్రయాణాలు, భార్యా భర్తల సంబంధం, ఆర్థిక పరిస్థితులు, గతించిన విషయాలు, పూర్వం మరణించిన పెద్దల కోర్కెలు... ఇలా ఎన్నో విషయాలు ఎడతెగని వాగ్ధోరణితో చెప్పుకుపోతుంటుంది.

మగవాళ్ళని పుంజులనీ, ఆడవాళ్ళని పెట్టనీ, పుంజంటే గడ్డం, పెట్టంటే బొట్టు అని పలికే సంజ్ఞా పరిభాష వీళ్లదే. సోదిగత్తె తను సోది చెబుతూనే చెప్పించుకునే వాళ్ల నుండి తనకు కావలసిన సమాచారం రాబట్టుకు చెబుతుందనేది ప్రతీతి.

ఏమైనా వీళ్ళు కూడా ఆడవాళ్లని బాగా ఆకట్టుకొని బియ్యం శేర్ల కొద్దీ దండుకుపోతుంటారు. ఇందులో ఎక్కువగా పనిచేసేది పరేంగిత జ్ఞానం. ఈ సోది చెప్పించుకొనుట అనే అలవాటు లేదా లక్షణం తెలుగు వారిలో ఒకప్పుడు ప్రబలంగానే ఉండేది. ప్రస్తుతం సోది చెప్పేవాళ్ళుగానీ, చెప్పించుకునేవారిగానీ అంతగా కనిపించటం లేదు.

# 131.ఎలుగుబంట్ల వేషాలు

పూర్వం ఎలుగుబంట్ల వేషాలు ఎక్కువగా సంబరాల్లోనే కనిపిస్తాయి. ఇద్దరు రెండు ఎలుగు బంట్లుగా చెక్కతో చేసిన ఎలుగుబంటి ముఖాలను తమ ముఖాలకు తగిలించుకొని, ఎలుగుబంటి వెంట్రుకల వలె నలుపు రంగు వేసిన జనపనార పీచు చిక్కం ఒళ్ళంతా తొడుక్కొని "తాసా" అనే వాయిద్యానికి అనుగుణంగా ఎలుగు బంటివలె గంతులేస్తుంటారు. "తాసా" అంటే మెడనుండి గుండెలమీదకు తాడుతో వేలాడదీసుకొని రెండు చేతుల తోనూ గెండు పుల్లముక్కలతో వాయించే వాయిద్యం. ఇందులో శక్తి వేషం కూడా వుంటుంది.

చెక్కతో చేయబడి, రంగులు వేయబడి, పెద్ద నాలుక చాపి చూపుతున్న శక్తిముఖం తగిలించుకొని, పెద్ద పెద్ద స్థనాలు అమర్చుకొని, పైన నల్ల అంగీ తొడుక్కుని, ఒక చేతిలో కత్తి, ఒకచేతిలో శూలం ధరించి ఈ ఎలుగు బంట్లతో సమంగా ఎగురుతూ చేరిన జనాన్ని అప్పుడప్పుడు అదలిస్తుంటారు. ఈ విశేషాలు చూడముచ్చటగాను, భయంగొలిపే విధంగాను ఉంటాయి. ఒకప్పుడు పిల్లలు, పెద్దలు అందరూ ఈ సాంప్రదాయపు వేషాలను ఎంతగానో ఇష్టపడి ఆనందించేవారు.

# 132.భోగం మేళాలు

ఒకప్పుడు భోగంమేళాలు లేనిదే ఏ ఉత్సవాలు జరిగేవి కాదు. పది పదిహేనుమంది భోగపు స్త్రీలు మేళంగా వస్తారు. ఈ మేళానికి ఒక నాయకురాలు ఉంటుంది. ఫిడేలు, హార్మోనియం, మద్దెలలు ప్రక్క వాయిద్యాలుగా ఉంటాయి. వీరు సినిమా పాటలు పాడుతూ ఇద్దరు ముగ్గురు ముందుకొచ్చి నాట్యాలు చేస్తుంటే మిగిలిన వారు వెనుక నిలబడి తాళంకొడుతూ పాడుతుంటారు. సాధారణంగా విలాస పురుషులే వీరి చెంతకు వస్తారు. వారు కోరిన ప్రకారం వీరు పాడి ఆడుతుంటారు. తర్వాత తాంబూలాలిచ్చి రవంత రంగుచేసి సొమ్ములు వసూలు చేస్తుంటారు. వీరు అప్పుడప్పుడు సిగ్గులేకుండా పచ్చి శృంగారంకూడా వెలగ బెడుతూ రసికులను రెచ్చ గొట్టడంకూడా జరుగుతుంది. ఇలాంటి వానిలో వీరు నిర్వహించే ఎలుగుబంట్ల నృత్యం (బేర్ డాన్స్) చెప్పుకోదగ్గది. ఒకామె మగ ఎలుగుగానూ, మరొక ఆమె ఆడ ఎలుగుగానూ నటిస్తూ చూపించే రతిక్రియ లాంటివి కృత్యాలు వయస్సు పండినవాళ్ళను కూడా ఉత్సాహపరుస్తాయి. అలాగని వీరిదంతా చౌకబారు నాట్యం అనడానికి వీలు లేదు. వీరి మేజువాణీ ఉత్తమ నాట్య శ్రేణికి చెందిన పక్రియ. నాయకురాలు పాడే జావళీలకు పండిత పామరులు కూడా పరవశించ వలసిందే. అంటే వీరి మేళాలు భక్తి శృంగారాల మేళవింపు అన్నమాట.

# 133.ఫకీరు వేషం

ఫకీర్లు ముస్లిం కులంలో ఒక తెగ. వీరు అల్లాను సంస్మరిస్తూ, అల్లాకెనాం జపిస్తూ ఇంటింటికీ తిరుగుతూ, ముస్లిములను ఆశీర్వదిస్తారు.

వీరు ఒక పెద్ద కంజీరాను చేతిలో ధరించి, తలకు పెద్ద తలపాగా చుట్టీ, మెడలో ఫకీరు పూసలు ధరించి, పొడుగాటి లాల్చీలను ధరించి, మొలకు గళ్ళ లుంగీలను ధరిస్తారు.

ప్రతి జట్టుకూ ఇద్దరు ముగ్గురు వుంటారు. మధ్యలో పాటకుడు పాట పాడుతూ వుంటే మిగిలిన ఇద్దరూ అల్లాకేనాం అంటూ వంత పలుకుతారు.

పాడి పంటల్ సల్ గుండాలి....అల్లాకేనాం
తల్లి పిల్లల్ సల్ గుండాలి....అల్లాకేనాం
తల్లి కొడుకుల్ సల్ గుండాలి....అల్లాకేనాం
హిందూ ముస్లిం లంతా....అల్లాకేనాం
వారు హేకం కావాలండి....అల్లాకేనాం

అంటూ పాడుతూ, మధ్య మధ్య రక్తి కొరకు కఱ్ఱతో చేయబడ్డ, ఒక రకమైన కిఱ్ఱు శబ్దం వచ్చే దానిని చేతిలో ధరిస్తారు.

కొన్ని ప్రాంతాల్లో ఫకీరు వేషం వేసిన వ్యక్తి ఈ విధంగా ప్రవర్తిస్తాడు.

ప్రేక్షకుల్లోంచి ఒకరిని పిలిచి ఫకీరు ఇలా జోస్యం చెబుతాడు. అతని చెయ్యి చూస్తున్నట్లు నడిస్తూ "మీరు తలంచిన కార్యం తప్పక అవుతుంది. మీ కుడికంట్లో భాగ్య రేఖ వుంది. ఎడమ కంట్లో లక్ష్మి వుంది. తలచిన తలపు, కోరిన కోర్కెలు ఇక కొనసాగుతాయి. వశీకరణ రేఖ వుంది. ధాన్య రేఖ వుంది. ధనరేఖ వుంది. మీలో మంచి దానగుణం ఉంది. మంచి ఆలోచనలు ఉన్నాయి. ఒక జంగం వచ్చినా, ఒక జోగి వచ్చినా, ఒక ఫకీరు వచ్చినా దాన ధర్మాలు చేద్దామని మనస్సులో మీకు ఉంది. ఇదిగో హుస్సేన్ హుస్సేన్ బారాబాహి మాం. ఒక రాత్రి నాకు పీరు కనిపించాడు. నాటి నుండి తిననివ్వడు, ఆకలి కానివ్వడు, దేశ దేశాలంట త్రిప్పుతుంటాడు. జోస్యాలు చెప్పమంటాడు. వెండిముట్ట వద్దన్నాడు, రాగిపుచ్చుకోవద్దన్నాడు, బంగారమైతే పుచ్చుకోమన్నాడు. అంచేత మీరు బంగారము ఇస్తే నాకు అభ్యంతరంలేదు తీసుకోవడానికి అని ముస్లిం యాసతో మాట్లాడుతుంటే ఆ తెలుగు యాసకూ అంతర్గతమైన అతని కోరిక చెప్పే తీరుకూ నవ్వువస్తుంది. అతని మాటలు వినేవారు అతనికి తృణమో, పణమో సమర్పించుకొంటారు.

హైస్కూలు కాలేజీ విద్యార్థులు వారి వారి వార్షికోత్సవాలలో ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తూ వుంటారు. ఈ కళారూపాన్ని ఆంధ్రప్రజా నాట్య మండలి, హిందూ మత సామరస్యం కొరకు ఉపయోగించి ఆంధ్ర ప్రజలలో విశేషంగా ప్రచారం చేశారు.

# 134. వైకుంఠపాళి



వైకుంఠపాళీ తెలుగు వారికి ప్రత్యేకమయిన ఆట. వైకుంఠపాళీ పటాన్ని పరమపద సోపానపటమని కూడా వ్యవహరిస్తారు. వైకుంఠపాళీ పటంలో 132 గళ్ళు ఉంటాయి. ఈ గళ్ళు రకరకాలయిన బొమ్మలతో అంకెలు వేసి ఉంటాయి. ఈ గళ్ళకు దిగువన పాములు, ఏనుగులు ఉంటాయి.

అది పాతాళమనీ, ఆ ఏనుగులు అష్టదిగ్గజాలనీ పైనున్న భూమి (అంకెలు ఉన్న గళ్ళ)ని ఆ ఎనిమిది ఏనుగులూ మోస్తున్నాయనీ హిందువుల విశ్వాసం. ఈ ఆటపేరు "వైకుంఠపాళి". కాని ఎక్కువ మంది **"పాముల పటం"** అని అంటుంటారు వాడుక భాషగా. ఈ ఆటను ఎందరైనా, ఎవరైనా ఆడుకోవచ్చును. ఈ ఆట ఆడేవారు ఒక్కొక్కరు ఒక్కొక్కరకం ఆటకాయలను ఏర్పరచుకోవాలి. ఆట ప్రారంభించడానికి ముందు ఆట ఆడేవారందరూ వైకుంఠపాళి పటమునకు ఎదురుగా కూర్చొని, నాలుగు పందెపు గవ్వలతో పందెం వేస్తూ ఆడతారు.

అష్టాచెమ్మా ఆట ఆడే విధంగానే, కన్ను, రెండూ, మూడు, అష్టాచెమ్మా అనే పందాలు ఈ ఆటలో చలామణిలో ఉన్నాయి. అందులో వలెనే ఈ ఆటలో కూడా పైపందెం వేస్తారు.

ఉదాహరణకు 16 (సుగుణం) గడిలో ఉన్న నిచ్చెన దగ్గరకు ఆటకాయ వచ్చినప్పుడు ఆ నిచ్చెన సాయంతో 28 (సాలోక్యం) గడిని చేరుకుంటుంది

వైకుంఠపాళీ పటంలో 16, 19, 30, 41, 52, 63, 65, 74, 79, 87 సంఖ్యలుగల గళ్ళల్లో నిచ్చెనలు ఉన్నాయి. ఏ పందానికైనా ఆటకాయ ఆయా గళ్ళలోనికి వచ్చినప్పుడు అక్కడవున్న నిచ్చెన సాయంతో పైగడికి చేరుకోవచ్చును. ఉదాహరణకు 63 **ధాతృత్వం** గడిలో ఉన్న నిచ్చెన దగ్గరకు ఆటకాయ వచ్చినప్పుడు ఆ నిచ్చెన సాయంతో 83 గడి అయిన **యశస్సు** చేరుకుంటుంది. అలా చేరుకోవడాన్ని **'నిచ్చెన ఎక్కడం'** అంటారు. పుణ్యం చేసిన వారికి పుణ్యం దక్కి నిచ్చెన ఎక్కడం

జరిగిందంటారు. అప్పుడు పై పందెం వేసుకునే అవకాశం ఇస్తారు. పై పందెం వల్ల మళ్ళీ నిచ్చెన ఎక్కినట్లయితే మళ్ళీ మరో పై పందెం వేసుకోవచ్చును. ఇలా ఆట కొనసాగుతూ ఉంటుంది.

ఈ పటంలో నిచ్చెనలు ఉన్నట్లుగానే అక్కడక్కడ పాములు కూడా ఉన్నాయి. ఆటకాయ నిచ్చెన పాదం దగ్గరికి వచ్చినప్పుడు పైకి వెళ్ళినట్లే పాము తల దగ్గరికి ఆటకాయ వచ్చినప్పుడు పాము కరిచి ఆటకాయ పాముతోక చివరి వరకూ కిందికి దిగి పోతుంది. అంటే ఉదాహరణకు 26వ గడిలో ఉన్న పాము కరచినప్పుడు దాని తోక ఉన్న 3వ గడికి వచ్చి, అక్కడ ఉన్న చిన్న పాము మూలంగా ఆటకాయ పాతాళం చేరుకుంటుంది. ఇట్లు పాము తోక దగ్గరకు రావడాన్ని **'పాము మింగడం'** లేక **'కరవడం'** అంటారు. ఇక 106వ గడిలో ఉన్న పెద్ద పాము మింగిందంటే ఆటకాయ ఒకేసారి 1వ గడిలోనికి వచ్చి పడుతుంది. చివరకు 121 గడిలో ఉన్న పామును తప్పించుకొని 122వ గడికి ఆట కాయ చేరుకున్నట్లయితే పుణ్య లోకానికి చేరినట్టే. అక్కడి నుండి చివరి వరకూ వెళ్ళి తిరుగు ముఖం పట్టి మధ్యనున్న దైవ స్వరూపాన్ని చేరు తుందో ఆ పందెం పడినప్పుడే ఆటకాయ దైవ సన్నిధికి చేరినట్టు చెప్ప వచ్చును. దైవ సన్నిధికి చేరినట్టు ఆ వైపూ ఈ వైపూ ఉన్న వారిని ద్వార పాలకులనీ, వారు దైవ దర్శనం కాకుండా అడ్డగిస్తూ ఉంటారనీ, అందు వల్ల వాళ్ళ చుట్టూ తిరిగిన తర్వాతనే దైవ దర్శనం అవుతుందని ఒక నమ్మకం. వైకుంఠ ఏకాదశి రోజున రాత్రి జాగరణ చేసే సందర్భంలో తెలుగువారు సాధారణంగా ఈ ఆట ఆడుతూ ఉంటారు.

# 135. దాగుడుమూతలు



చిన్న పిల్లలు పెద్ద పిల్లలతో కలసి ఆడుకునే ఆట ఇది. పిల్లల్లో కాస్త పెద్ద పిల్లలు ఈ ఆటలో పెద్దగా వ్యవహరిస్తారు. వారు ఇంట్లో పిల్లలతో పాటుగా ఇరుగుపొరుగువారిని కూడా పిలుచుకుని ఈ ఆటను మొదలు పెడతారు. ఈ ఆటలో పిల్లల సంఖ్యతో నియమం లేదు. పిల్లలంతా

వరుసగా నిల్చున్న తరువాత అందులోపెద్దగా ఉన్నవారు ఎదురుగా నిల్చున్న వారిలో ఎవర్నో ఒకరిని పిలిచి వారి వెనుక కూర్చుని ముందు కూర్చున్న వారి కళ్లను ఒక చేత్తో మూస్తారు. కళ్లు మూసిన మరో చేత్తో కళ్లు మూయించుకున్నవారి చేతిని పట్టుకొని తిప్పుతూ "వీధి వీధి గుమ్మడి.. వీరి పేరేమి అంటూ పాటపాడుతారు. మధ్యలో దాగుడు మూతలు దండాకోర్ అని ఎదురుగా నిల్చున్న పిల్లలను అటు ఇటు మారి నిలబడమంటారు. తరువాత వీధి వీధి గుమ్మడి వీధి పేరేమి అంటూ కళ్లు మూసిన వారి చేతితోపట్టుకొని ఒక్కోక్కరి పేరు అడిగి చెప్పిస్తాడు. కళ్లు మూసుకొన్న పిల్లవాడు ఏ పేరు చెప్పితే ఆ పేరుతో వారిని దాక్కొమని చెప్తారు. ఆ తరువాత చివరకు అందరూ దాక్కున తరువాత దాగుడు మూతలు దండాకోర్ పిల్లీ వచ్చే ఎలుక భద్రం అంటూ కళ్లగంతలను తీసివేస్తారు కళ్లమీద ఉన్న చేయిని తీసివేసి దాక్కుని వారిని పట్టుకోమని చెప్తారు. అట్లా దాక్కున్నవారిని కనిపెడితే వాళ్లు ఔట్ అయినట్టు అంటారు. ఇలా అందరినీ ఔటు చేసి మొదట ఔట్ అయిన వారిని దొంగగా నిర్ణయించి మళ్లీ ఆ పెద్దవారి వీరి కళ్లు మూసి ఆట మొదలు పెడతారు. ఇలా చాలాసేపు ఈ ఆట కొనసాగిస్తారు. పిల్లలంతా సంతోషంగా ఆడుకుంటారు.

**దాగుడు మూత-దండాకోర్, పిల్లీ వచ్చే ఎలుకా బద్రమ్**
**ఎక్కడి దొంగలు అక్కడనే గప్‌చిప్ సాంబారు బుడ్డీ**
**కళ్ళూ మూసీ కాలీకోర్, ఎక్కడి దొంగలు అక్కడనే**
**అడుక్కో - బడుక్కో సాంబార్ బుడ్డీ**

# 136.ఒప్పులకుప్ప



తెలుగు వారింట చాలా ప్రసిద్ధమైన ఆటగా దీనిని పరిగణిస్తారు. ఒప్పులకుప్ప ఆట ఆడుటకు ఇద్దరుగాని, నలుగురు కాని బాలికలు కావలయును. ఇద్దరు ఆడుట సులభము. ఇరువురు బాలికలు ఎదురెదురుగా నిలిచి ఎదుటి ఆమె కుడిచేతిని తన ఎడమ చేత్తో ,ఆమె ఎడమచేతిని తన కుడిచేత్తో గట్టిగా బిగించి పట్టుకొని పాదాలకు బలంగా నిలబెట్టి ఇద్దరూ వెనక్కి ఏటవాలుగా వంగి చేతుల్ని బాగా చాపి గిర్రున

తిరిగే ఆట ఒప్పులకుప్ప. దీనివల్ల పాదాలకు మోకాళ్ళకీ నడుముకీ చేతులకు చక్కని వ్యాయామం ఈ క్రింది పాట పాడుచూ చుట్టు తిరుగుదురు.




"ఒప్పులకుప్పా, ఒయ్యారి భామా,
మినపప్పు - మెంతీపిండి,
తాటీబెల్లం - తవ్వెడునెయ్యి
గుప్పెడు తింటే - కులుకూలాడీ
గూట్లో రూపాయి-నీ మొగుడు సిపాయి"

ఈ ఆటకు సంబంధించిన పాటను రకరకాలుగా పాడుదురు.

"ఒప్పుల కుప్ప - ఒయ్యారి భామ"
సన్నబియ్యం, చాయ పప్పు
చిన్న మువ్వ - సన్నగాజు,
కొబ్బరి కోరు, చెల్లపచ్చు
రోట్లో తవుడు - నీ మొగుడెవడు?
గూట్లో రూపాయి - నీ మొగుడు సిపాయి

ఒప్పులకుప్పా, ఒయ్యారిభామ!
సన్నబియ్యం, చాయపప్పు
చిన్నమువ్వ, సన్నగాజు
కొబ్బరి కోరు, బెల్లపచ్చు
గూట్లో రూపాయి, నీ మొగుడు సిపాయి

రోట్లో తవుడు, నీ మొగు డెవడు?
నడుమ కట్టె నా మూట చిట్టి
దూదూ పుల్ల దురావ్ పుల్ల
చూడకుండా జాడా తీయ్
ఊదకుండా పుల్లా తీయ్

మరికొందరు "కొబ్బరి చిప్పలు–చిల్లపిక్కలు" అని పాడుతూ ఆడతారు. ఒకరు ఒక మాట అంటే, రెండో మాటని మరొకరు అందుకొని పాడతారు. మరికొందరు ఈ క్రింది విధంగా కూడా పాడుదురు.

"చెన్నపట్నం, చెరుకు ముక్క
నీకోముక్క, నాకో ముక్క
భీముడి పట్నం, బిందెల జోడు,
నీకో బిందె, నాకో బిందె,
కాళీపట్నం, కాసుల జోడు,
నీకో కాసు, నాకో కాసు"

ఈ ఆటనే బాలికలు తమ చేతుల నెదుటి బాలిక అరచేతిలోతమవ్రేళ్ళ గోళ్ళు ఆనునట్లు పట్టుకొని క్రింది పాట పాడుచు తిరుగుదురు.

"చిప్ప చిప్ప గోళ్ళు – సింగరాజు గోళ్ళు
మా తాత గోళ్ళు – మండావ రాళ్ళు
చుక్క చుక్కల గోళ్ళు – సుందరమ్మ గోళ్ళు"

అని ఆనందంతో ఆడుకొందురు.

# 137. అచ్చనగండ్లు




ఈ ఆట ప్రతి పల్లెలో ఆడపిల్లలు ఇంటి పట్టున కూర్చొని ఆడుకునే ఆట. ఈ ఆటను ఐదు గచ్చకాయలతో ఎందరైనను ఆడవచ్చును. ఐదు గచ్చకాయలను చేతితో పట్టుకొని అందులో ఒక కాయను మాత్రము పై కెగురవేసి ఆ కాయ మరల క్రిందికివచ్చు వ్యవధిలో చేతిలోని నాలుగు కాయలు నేలపై విడిచి ఎగురవేసిన కాయను పట్టుకొని ఆ కాయనే మరల ఎగురవేసి క్రింది కాయలను ఒక్కసారి నాలుగు కాయలను, రెండవసారి మూడు కాయలను, మూడోసారి రెండేసి చొప్పున రెండు సార్లుగా నాలుగు కాయకలను, ఒక్కొక్కమారు ఒక్కొక్కటి చొప్పున విడివిడిగా నాలుగు కాయలను చేతిలోనికి జరుపుకొని పైకెగురవేసిన

కాయనందుకొందురు. నిర్ణీతమైన ఒక సంఖ్యను నియమించుకొని ఆ సంఖ్య వరకు ముందెవ రాడెదరో వారు గెలిచినట్లు నిర్ణయించుకొందురు. ఆడునప్పుడు కాయలను ఎగురవేసి పట్టుటయందుగాని, జరుపుట యందుకాని తప్పి పోయినచో ఆట తప్పినట్లు భావించి తోటి బాలికలు **'చెంగనాలో చెంగనాలు'** అని అరచుచు ఆటను ప్రక్క బాలికకు ఇచ్చెదరు. ఈ ఐదు కాయలతో ఆడు ఆటలో అనేక భేదములు చూపుచు ఆడుదురు. కుప్పీలు, పువ్వీలు, రెండు కాయలు, ఒక్కం కాయ, మూగ కుప్పీలు, సీతమ్మ వారి పువ్వీలు, అద్దుడు కుప్పీలు, కుంకుమ భరిణెలు .. ఇట్లా వేరు వేరు పేర్లతో ఆడుదురు. "ఒకటి ఓ చెలియా, రెండు రేవన్నా, మూడు ముచ్చిలుకా, నాలుగు నందన్నా, అయిదు అరటిపండు, ఆరుం జవ్వాదీ, ఏడుం బేడీలూ, ఎనిమిది ఎలమందా, తొమ్మిది తోకుచ్చూ, పదీ పట్టెడా" అనే పాటను పాడుచూ చాలా సంతోషంగా ఆడుకుంటారు. గచ్చకాయలు దొరకని చోట చిన్న చిన్న గులక రాళ్ళతో కూడా ఆ ఆటను ఆడుకుంటారు.

నాలుగు పిక్కల్ని పుంజి అంటారు. రెండు **పుంజీలు** ఓ **కచ్చటం,** ఐదు కచ్చటాలేమో **గుర్రం,** ఐదు గుర్రాలు కలిపితే ఓ **ఏనుగు.** ఎవరెక్కువ ఏనుగుల్ని చేస్తే వాళ్లు గెలిచినట్టు. దీనికి చింత పిక్కల్ని కుప్పగా పోయాలి. ఒక పిక్కని ఎగిరేసి పట్టుకునేలోగా నాలుగు పిక్కలు కుప్పలోంచి వేరుచెయ్యాలి. అప్పుడు ఓ పుంజి అవుతుంది. ఇలా పై పిక్కని పట్టుకో లేనంత వరకూ ఆట సాగుతుంది.

# 138. తొక్కుడుబిళ్ల



ఆనాటి అమ్మాయిలకెంతో ఇష్టమైన ఆట ఇది. ఈ ఆటను ఇద్దరు ఆడవచ్చు. ముందుగా పక్కపక్కనే ఉండే నాలుగు నిలువు గళ్ళు, రెండు అడ్డగళ్ళు గల దీర్ఘ చతురస్త్రాకార గడులను గీయాలి. తరువాత గడుల బయట బాలికలు నిలుచోవాలి. ముందుగా ఒక బాలిక చేతిలో బిళ్ళను ముందు గడిలో వేసి కాలు మడిచి మిగతా ఎనిమిది గడులను దాటించి బయటకు తీసుకురావాలి. తరువాత రెండవ గడి, తరువాత 3,4,5,6,7,8, ఇలా అన్ని గడులను దాటించాలి. ఏ సమయంలో కూడా కాలు గాని, బిళ్ళగాని, గడుల గీతలను తాకరాదు. గడులన్ని అయిపోయాక కాలి వేళ్ళ మధ్య బిళ్ళను బిగించి పట్టుకుని దాన్ని కుంటి కాలితో ఎనిమిది గడులను గెంతి రావాలి. అలాగే కాలి మడం మీద పెట్టి గడులను దాటాలి. తరువాత తలపై పెట్టుకొని దాటాలి. తరువాత అర చేతిలో, ఆపై మోచేతిపై , భుజం పై, పెట్టుకొని అన్ని గడులను దాటాలి. తరువాత బిళ్ళను గడుల అవతల వేసి కళ్ళు మూసుకొని అన్ని గడులను దాటాలి. ఇవన్నీ దాటితే ఆట వారిదే అవుతుంది.

# 139. చెమ్మచెక్క-చారడేసి మొగ్గ



చెమ్మచెక్క అనే ఈ ఆట ఆడపిల్లలు ఆడుకునే ఆట. ఈ ఆట ఆడుటకు ఇద్దరు కాని ముగ్గురు కాని నలుగురు కాని పిల్లలు కావలెను. ఇద్దరు బాలికలు చదునైన చోట ఎదురె దురుగ నిలుచుండి చేతులను తట్టుచు బారలు చాచుచు ఈ క్రింది పాట పాడుచు, పాట లయకనుగుణముగ అడుగులు వేయుచు, చిందులు త్రొక్కుచు ఆడుచుందురు.

చెమ్మచెక్క, చేరడేసి మొగ్గ
అట్లు పోయంగ, ఆరగించంగ
రత్నాల చెమ్మ చెక్క రంగులేయంగ

**ముత్యాల చెమ్మచెక్క ముగ్గులేయంగ**
**పగడాల చెమ్మచెక్క పందిరేయంగ**
**పందిట్లో మాబావ పెళ్ళి చేయంగ**
**సుబ్బారాయుడి పెండ్లి, చూచి వత్తాము రండి**
**అమ్మల్లారా, అక్కల్లారా పోయివత్తాము రా రండి**
**మా వాళ్లింట్లో పెండ్లి, మళ్ళీ వద్దాం రండి,**
**దొరగారింట్లో పెండ్లి, దోచుకువద్దాం రండి.**

అని పాడుతూ ఒకరి చేతులను ఒకరు తాకుతూ సంతోషంతో ఆడతారు. సర్కారు జిల్లాలలో, రాయలసీమలో పాడే పాట దీనికి కొంచెము భిన్నముగా ఉండును.

మొదటి చరణమైన 'చెమ్మ చెక్క' అనునపుడు బాలికలు దగ్గరగ ఎదురెదురుగా నిల్చుండి ఒకళ్లొకళ్ళు చేతులు తట్టు కొనవలెను. 'చేరడేసి మొగ్గ' అనునపుడు కాళ్ళతో వెనుకకు ఒక చిందు వేయుచు అదే సమయ మున చేతులు బారలు చాపవలెను. ఇట్లే మరల ఇంకొక చరణము పాడుచు మరల బాలికలు దగ్గరకు చిందువేసి ఒకళ్ళొకళ్ళు చేతులు తట్టుకొన వలెను. మరల ఇంకొక చరణము పాడుచు దూరము వెళ్ళి బారలు చాపవలెను. బాలికలు వేయు చిందులు పాట యొక్క లయను అనుసరించి ఉండవలెను. తెలుగు దేశమునంతటను ఈ ఆటకు ఈ పాటనే పాడుదురు. ఈ ఆటకు పైన తెలిపిన పాటే ప్రాణము.

కొన్ని ప్రాంతాలలో మధ్య మధ్య, ఒకరి కొకరు ప్రశ్నకు సమాధానంగా ఇలా ప్రారంభిస్తారు.

ధిమిత - ధిమిత
ఏమి ధిమిత? పసుపు ధిమిత
ఏమి పశుపు? తోట పసుపు
ఏమి తోట? ఆకుతోట?
ఏమి ఆకు? తమలపాకు
ఏమి తమ్మ? పుట్ట తమ్మ.
ఏమి పుట్ట? పాము పుట్ట
ఏమి పాము? త్రాసు పాము



బాలిక లందరూ ఇలా పాడుతూ వుంటే బాలురు మరో గమ్మత్తు పాట పాడుతారు.

ఏమి త్రాచు? నల్లత్రాచు.
భూమికి తాళం వేస్తే - రంగా
భోగందానికి - సవరం దొరికె
సవరం బట్టుకెళ్ళి సాని కిస్తే
సాని నాకు జాబులు ఇస్తే
జాబులు పట్టు కెళ్ళి మామ కిస్తే
మామ నాకు పిల్లనిచ్చే
పిల్ల పేరు మల్లిమొగ్గ
నా పేరు జమీందార్.

# 140. ఓమన గుంటలు



వామన గుంటలు పాత కాలపు ఆట. సుమారు 1950 తరువాత క్రమేపీ మరుగున పడిపోయింది. ఓమన గుంటలు ఇంటిలో కూర్చొని ఆడుకొనే ఒక ఆట. దీనినే వానగుంటలు, ఒనగండ్లు, బద్దీలాట అని కూడా వ్యవహరిస్తారు. ఈ ఆట కోసం ప్రత్యేకంగా తయారుచేసిన చేప ఆకారం లో ఉన్న కొయ్యపెట్టె. మరబందు పెట్టి తయారు చేయబడిన రెండు పలకల కొయ్య సాధనం. ఇది తెరచుటకు మూయుటకు వీలుగ నుండును. దీనిలోపల ఒక్కొక్క పలకకు ఏడు గుంటలుగా రెండు పలకలకు కలిసి పదునాలుగు గుంటలు తొలచి యుండును. ఒక్కొక్క గుంటలో పద మూడేసి చింత గింజలనుగాని, కుంకుడు గింజలు లాంటివి పోయుదురు.

ఆట ప్రారంభంలో ఆట ఆడువారు ఒక గుంటలోని గింజలని మొత్తం తీసుకొని ఖాళీ చేసిన గుంటకు కుడివైపు గుంటతో ప్రారంభించి వరుసగా ఒక్కొక్క గుంటకు ఒక గింజ చొప్పున పంచడం ప్రారంభిస్తారు. చేతిలోని గింజలన్నీ అయిపోతే ఆ తరువాత గుంట (ఈ గుంట ఎవరిదైనా కావచ్చు) లోని రాళ్లను తీసి పంచడం కొనసాగిస్తారు. ఇలా చేతిలోని గింజలన్నీ అయిపోయి పంచడానికి వీలులేకుండా ఖాళీ గుంట వచ్చే వరకు ఒకే వ్యక్తి పంచుతూ ఉంటారు.

అలా చేతిలోని గింజలన్నీ అయిపోయి ఆ తరువాత ఖాళీ గుంట తటస్థ పడితే ఆ ఖాళీ గుంట తరువాత గుంటలో ఉన్న గింజలన్నీ పంచిన వ్యక్తి గెలుచుకుని గుంటలో నుండి తీసుకొని పక్కన పెట్టుకుంటుంది. ఖాళీ గుంట తటస్థపడి దాని తరువాత గుంట కూడా ఖాళీగా ఉంటే మీ తడవు ముగుస్తుంది కానీ గింజలు మాత్రం ఏమీ గెలుచుకోరు. ఆ తరువాత ఎదుటి ఆటగానికి పై విధంగా పంచే అవకాశం వస్తుంది. పంచడం ప్రారంభం మాత్రం మన అర్ధభాగములోని గుంటలతోనే ప్రారంభించాలి. ఆట చివరి దశలలో ఒక ఆటగానికి పంచే తరుణం వచ్చినా పంచడం ప్రారంభించడానికి తన అర్ధ భాగములోని గుంటలన్నీ ఖాళీగా ఉంటే పంచలేడు. ఇక పంచే అవకాశము తిరిగి ఎదుటి వ్యక్తికి ఇవ్వవలసిందే.

వరుసగా పంచేటప్పుడు ఒక గుంటలో పంచకుండా దాటెయ్యడము, వ్యతిరేక దిశలో పంచడము నిషిద్ధము. ఒక వ్యక్తి పంచుతుంటే అవతలి వ్యక్తి జాగ్రత్తగా గమనిస్తూ ఉంటాడు.

ఇలా ఒకరి తర్వాత ఒకరు పీటలోని గుంటలన్నీ ఖాళీ అయ్యేదాకా ఆడతారు. చివరలో ఎవరెన్ని గింజలను గెలుచుకున్నారో లెక్కపెడతారు. అత్యధిక గింజలు గెలుచ్కున్నవారే విజేతలు.

అంతేకాక ఖాళీ గుంటలలో కాయలు పడినపుడు అవి నాలుగు కాయలు కాగానే 'ఆవు' అని తీసుకొందరు. అట్లు తీసుకొనక పోయినచో అవి మురిగి పోయినట్లే. మరల ఎనిమిది కాయలు ఆ గుంటలో చేరిన తరువాత కాని వానిని తీసుకొనవలెను.

## అత్తా కోడళ్ళాట

ఏదన్నా గుంట నుండి మొదలు పెట్టి మూల నున్న గుంట ఖాళీగ ఉండి మన చేతిలో ఒకె గింజ ఉంటే అది ఆ గుంటలో వేయకుండా గుంట పైన పెట్టి అది తమ ఇల్లు అంటారు. అందులో ఎన్ని గింజలు పడితే అన్ని వారివే. వేరేవాళ్ళు అందులో గింజలు వేయకూడదు. దీనిని కొన్ని ప్రాంతాలవారు అత్తాకోడళ్ళాట అని అంటారు.

## దొంగా పోలీసు

ఇందులో ఒక గుంట నుండి అన్ని గింజలు తీసి పక్క గుంటలో వేయాలి. మళ్ళీ పక్క గుంట నుండి తీసి ఆ పక్క గుంటలో వేయాలి. అలా ఖాళీ గుంట రాగానే తట్టి పక్క గుంటలోని గింజలన్నీ తీసుకోడమే దొంగా పోలీస్ ఆట.

# 141. కుచ్చకుచ్చ పుల్లాలు

ఇసుకలో చేతులు కదిలిస్తూ చేతిలో ఉన్న పుల్లను అందులో దాచాలి. ఆ పుల్లను ఎక్కడ దాచి ఉంటామో ఎదుటి పిల్లవాడు చెప్పగలగాలి. ఇసుకలో చేతులు కదిలిస్తున్నపుడు ఎదుటి వారు దాన్ని గమనించకుండా పుల్లను నేర్పుగా ఒక చోట వదలిపెట్టగలగాలి. ఎదుటి వాడు పుల్ల ఎక్కడ ఉందో పట్టేశాడా ఓడిపోయినట్లే! ఇదే ఈ ఆట విధానం.

ఈ ఆటను **వెన్నెలవర్తి ఆట అనీ, వెన్నెలపట్టి అనీ, దూదుంపుల్లాట** అని రకరకాలుగా అంటారు. ఇది ఇద్దరు పిల్లలు ఆడుకొనే ఆట. ఇసుకలో కూర్చుని ఆడే ఈ ఆట ఎంతో ప్రాచీనమైనది.

ఈ ఆట మొదలు పెట్టడానికి ముందు ఒక పిల్లవాడు రెండో వాడిని కళ్ళు మూసుకోమని చెబుతాడు. మూరెడు పొడవు, నాలుగు అంగుళాల ఎత్తు ఉన్న ఇసుకలో ఒక అగ్గిపుల్లను తన అరచేతిలో పెట్టుకుని ఆ ఇసుకలో దాచేస్తాడు. ఆ అగ్గిపుల్లను ఎక్కడ పెట్టానో చెప్పమంటూ పాట పాడతాడు. ఆ పాట ఈ విధంగా సాగుతుంది.

వెనకా వెనకా వేముల తోట
కనకాహడ్లు కామునిరూపులు
మేఘశంకులు మెత్తని గోళ్ళు
దూదీమణులు దుప్పటి రేకులు



ఈ ఆటని కళ్లు మూసుకోకుండా కూడా ఆడతారు. ఇసుకలో పుల్లను ఎక్కడ పెట్టిందీ రెండోవాడు గమనించనంత నేర్పుగా పెట్టాలి.

"చిక్ చిక్ పుల్లా, షికారు పుల్లా
దొంగలొస్తున్నారు, దాక్కో పుల్లా"

అని కూడా పాడతారు. మరికొన్ని చోట్ల మరో విధంగా కూడా పాడతారు.

కుచ్చు కుచ్చు పుల్లా
కూరాకు పుల్లా
దొమ్మరోడొస్తాడు
దాక్కోవె పుల్లా
దూదూ పుల్లా
దూరాయ్ పుల్లా
చూడాకుండా
జాడా తియ్
ఊదాకుండా
పుల్లాతియ్!

ఇలా చెప్పగానే రెండోవాడు రెండు అరచేతి వేళ్ళు కలిపి పుల్ల ఫలానా దగ్గరుందని గ్రహించి దానిపై అరచేతుల్ని వేస్తాడు. ఇప్పుడు పుల్లను ఇసుకలో దాచిన పిల్లవాడు దాన్ని వెతుకుతాడు, పుల్ల ఇతనికే దొరికితే ఇతను గెలిచినట్లు, పుల్ల ఎదుటివాడి చేతుల కింద ఉంటే అతను గెలిచినట్లు. గెలిచినవారు పుల్లతో ఆటను ప్రారంభించాలి. ఇలా ఆట కొనసాగుతుంది.

# 142. అవ్వా-అప్పచ్చా

"అవ్వా – అప్పచ్చా" చాలా తమాషా అయిన ఆట. ఇద్దరు పిల్లలు కుడి ఎడమ చేతులు ఒకరి భుజాలు మీద ఒకరు వేసుకొని, రెండో చేతి వేళ్ళను కలిపి పట్టుకొని మొత్తం మిద చేతులను కుర్చీలా అమర్చుతారు. దానిమీద ఒక పిల్లను ఎక్కించి ఏనుగు అంబారి మోసినట్లు ఊరేగిస్తారు.

"అవ్వా–అప్పచ్చా" ఆటను ఆడాలంటే ముగ్గురు పిల్లలు ఉండాలి. ఎక్కువ మంది ఉంటే, పిల్లల్ని మార్చి మార్చి ఆడుకోవచ్చు.

ముందుగా ముగ్గురూ వలయంగా నిలబడి చేతులు పట్టుకొని పంటలు వేయాలి. ముందుగా ఎవరు పండితే వారిని ఏనుగుమీద ఎక్కించాలి. మరి ఏనుగు ఏది? మిగతా ఇద్దరూ ఏనుగుగా మారతారన్నమాట. ఇద్దరు పిల్లలు ఎదురెదురుగా నిలబడతారు. తమ కుడి అరచేతులను నోటికి నొక్కి "అవ్వా – అప్పచా" అని ఎడమ చేతిని పైకిలేపి నిచ్చెన కట్టాలి. ఎదురు బాలుడు కూడా అలాగే కట్టాక ఇద్దరూ చేతులు కలుపుతారు. ఇప్పుడు ఆ నిచ్చెన ఏనుగు అన్నమాట.

పండిన పిల్లవాడిని చేతుల మధ్య కూర్చుండ బెట్టుకుని, పైకిలేపి ఊరేగించాలి. అప్పుడు ఇలా పాడాలి.

**"ఏనుగమ్మా! ఏనుగు**
**ఏనుగు ఒళ్ళు నల్లనా**

**ఏనుగు కొమ్ములు తెల్లన**
**ఏనుగు మీదా రాముడు**
**ఎంతో చక్కని దేవుడు."**

ఇలా పాడుతూ చివరిదాకా తీసుకెళ్లి అక్కడే దించాలి. ఇప్పుడు రెండో బాలుడు, ఆ తర్వాత మరొకరు ఇలా పిల్లలంతా "అవ్వా – అప్పచ్చా" ఆడతారు. చూసేవారికి, ఆడవారికి కూడా ఈ ఆట ఆనందాన్ని ఇస్తుంది.

# 143. అప్పడప్పడ తాండ్ర



దీన్ని ఆడటానికి కొందరు పిల్లలు వలయాకారంగా కూర్చుంటారు. వాళ్లలో ఒకరు నేలమీద అరచేతిని ఆనించి పెడతారు. దాని మీద మరొకరు తమ అరచేతిని ఉంచుతారు. అలా అందరూ ఒకరి చేతిమీ దొకరు పెట్టిన తర్వాత... మొదటి చెయ్యి పెట్టిన పిల్లాడు తన రెండో చేత్తో అన్నింటికంటే పైన ఉన్న చేతిపై **అప్పడప్పడ తాండ్ర, ఆవకాయ తాండ్ర గంగాలమ్మ చెవి పట్టుకో** అని చరుస్తాడు. ఆ చెయ్యి ఎవరిదైతే ఆ అబ్బాయి... చెయ్యి తీసేసి పక్క వాళ్ల చెవి పట్టుకుంటాడు. అలా అందరి చేతులయ్యాక ఒకరి చెవులొకరు పట్టుకుని గీరి గారి... గీరి గారి అంటూ ముందుకీ వెనక్కి ఊగుతారు.

# 144. ఒంగు దూకుళ్ళు



ఒకరు కూర్చొని ఒక కాలు చాపుతారు. మిగిలిన వాళ్లు దానిపై నుంచి దాటాలి. తరవాత ఆ కాలి బొటన వ్రేళ్లపై రెండవ కాలి మడమ పెడతారు. అది దాటినా తరవాత కుడి చేయి వ్రేళ్లు చాపి దానిపై పెడతాడు. దాని మీద నుంచి కూడా దాటాలి. ఆ తరవాత కూర్చున్న మనిషి కాలి బొటన వేలిని చేతి వ్రేళ్ళతో తాకుతూ వంగుంటాడు, ఆ తరవాత చేతిని మోకాలి మీద, తరవాత మడుం మీద, ఇలా పెంచు కుంటూ వెళ్తాడు. అందరు అతని మించి దాటవలసి ఉంటుంది. ఎవరైతే దాటలేక పోతారో వాళ్లు ఓడిపోయినట్లు లెక్క . సాధారణంగా మగ పిల్లలు ఈ ఆట ఆడతారు. ఈ ఆట ఆడటం వలన శరీరానికి మంచి వ్యాయామం చేసినట్లు అవుతుంది. శరీరం దృఢత్వాన్ని పొందుతుంది.

# 145.గుజ్జన గూళ్ళు (బువ్వాట)



ఇది కేవలం సంసారపు శిక్షణ ఇచ్చే ఆట. బువ్వాలాట అని కూడా పిలువబడే ఈ ఆటను పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో చిన్న పిల్లలు ఆడుకునేవారు. ఈ ఆటలో పిల్లలు ఎందరైనా పాల్గొనవచ్చును.

పిల్లలు తమ పెద్దలనడిగి బియ్యము, పప్పులు, మరమరాలు, బెల్లం, పంచదార తెచ్చుకొని తాము ఆడుకొని లక్కపిడతల్లో పోసి వాటిని పొయ్యి

మీద పెట్టినట్లు, దించినట్లు నటిస్తూ కొంతసేపటికి అందరూ కలిసి తింటారు. ఈ ఆట ఆడినప్పుడు బొమ్మల పెళ్ళి చేసి రెండు జట్లుగా చీలి వియ్యాల వారికి విందు పెట్టుటకై గుజ్జనగూళ్ళు పెట్టుదురు.

బాగుగా పండిన చింతకాయలను తెచ్చి నేర్పుతో దానిలోని గుజ్జును గుల్ల చెడకుండా వుండునట్లు పూర్తిగా తీసివేసి, ఆ గుల్లలో బియ్యము పోసి, దానిని మండు చున్న పొయ్యిలోని కుమ్ములోని పెట్టి అవి ఉడికిన తరువాత ఆ పిల్లలు గుజ్జన గూళ్ళు అని వేడుకగా తిందురు.

ఈ గుజ్జన గూళ్ళు ఆటను రుక్మిణి, గరిక ఆడినట్లు భాగవతంలోను, మనుచరిత్రలోను వ్రాయబడి ఉన్నది.

## పూర్తిగా అంతరించిపోతున్న ఆట

ఆధునిక విద్య, ఆధునిక ఆటలు, ఉమ్మడి కుటుంబాల విచ్ఛిన్నం వల్ల ఈ ఆట నేడు దాదాపు పూర్తిగా అంతరించిపోయినది. భారతీయ సంప్రదాయాన్ని, కుటుంబ వ్యవస్థను ప్రతిబింబించే ఈ ఆటను పాశ్చాత్య విష సంస్కృతి ప్రభావానికి గురైన నేటి పిల్లలకు తల్లిదండ్రులు తెలిపరచవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఇప్పటికీ బువ్వాలట సామాన్లను విశాఖపట్నం జిల్లా ఏటికొప్పక గ్రామం వారు తయారుచేస్తారు. బువ్వాలట సామాన్లు నగరాల్లో జరిగే హస్త కళా ప్రదర్శనల్లో కూడా అమ్ముతుంటారు.

# 146.బొంగరాలాట




కర్రతో చేయబడ్డ బొంగరాలు ఇప్పటికీ తిరునాళ్ళు మొదలైన చోట్ల అమ్ముతుంటారు. బొంగరం గుండ్రంగా, తల భాగం పెద్దదిగా (గోపురం పోలిగ్గా), మధ్య భాగం మూడు నాలుగు మెట్లుగా తగ్గుకుంటూ వచ్చి, కింద చిన్న బొడిపెం వంటిది ఉండి, దాని అడుగున మధ్యలో ఓక ఇనుప ముల్లు (ములుకు) ఉంటుంది. ఆ ముల్లు దగ్గరనుంచి మెట్ల చుట్టూ తలవరకూ నులక తాడు గానీ, నవారు తాడుగానీ చుట్టి, తాడు చివర చూపుడు వేలు, బొటన వేలుకీ మధ్య పట్టుకుని లాఘవంతో కిందికి విసిరితే అది కింద గిరున తిరుగుతుంది.

## బొంగారాల ఆట ఎలా ఆడతారు?

ఈ బొంగరాలతో ఆట బలే గమ్మత్తుగావుంటుంది. ఆడే వాళ్ళంతా వాళ్ళ బొంగరాలకు తాళ్ళుచుట్టి సిద్ధంగా ఉంటారు. ఒకరు ఒకటి,

రెండూ, మూడూ అనగానే అందరూ ఒకేసారి బొంగరాలు నేలబారున విసిరి అవి తిరుగుతుంటే ఎవళ్ళమట్టుకు వాళ్ళు తమ బొంగరాల్ని తమ తాళ్ళతో పై కెగరేసి ఎవరయితే ముందు అందుకుంటారో వారు గెలిచినట్టు. మిగతావాళ్ళంతా తమ బొంగరాలు నేలమీద తగుమోస్తరు వలయంగీసి అందులో పెడతారు. ఈ నెగ్గిన ఆటగాడు తన బొంగరానికి తాడుచుట్టి వానిమీదికి విసురుతాడు. దానిముల్లు అక్కడ కొన్నింటికి కన్నాలు పొడిచి తిరుగుతుంటుంది. దాన్ని మరల ఆ బొంగరందారుడు తాడుతో పైకి ఎగరేసి అందుకోవాలి. అలా అందుకోలేకపోతే మళ్ళీ ఆట మొదటికి వస్తుంది. అలా పొడిచిన కన్నాలను "పుచ్చా" లంటారు. ఒక్కొసారి ఆ బొంగరం తగలడంతో ఆ వలయంలోని కొన్ని బొంగరాలు గీతదాటి బయటకు వచ్చేస్తాయి. అప్పుడు ఆ బొంగరాల తాలూకు వాళ్ళు కూడా తొలివ్యక్తిలాగే వలయంలోని బొంగరాలను కొడుతూ ఆడవచ్చు. అన్ని బొంగరాలూ బయటికి వచ్చేస్తే అందరూ నేలబారున బొంగరాలను తిప్పి మొదటిలాగే ఆడతారు.

## జాగరూకతే ముఖ్యం

ఈ ఆటకు బొంగరం తిప్పడంలో నేర్పరితనం, గురిచూసి కొట్టగలగడం, అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఏమరుపాటు లేకుండా చూసుకుంటుండడం ముఖ్యం. ప్రఖ్యాత జానపదకథ "రాములమ్మకథ"లో ఈ బొంగరమే కథను క్లైమాక్స్‌కు తీసుకెడుతుంది. శ్రీనాథుని పల్నాటి చరిత్రలో బాలచంద్రుని యుద్ధోన్ముఖుని చేసింది కూడా ఈ బొంగరాలాటే.

# 147.గోళీలాట



గోళీలాట పిండికాయ, రాతిపింజా, సీసము, బొందు మొదలగునవి గోళీలలో రకములు. ఆటలలో కంచాలాట, బచ్రాట, పెద బచ్రాటలు కొన్ని రకములు కలవు. బచ్రాట యందు కాయ పెచ్చుచచ్చును బట్టి ఆడుచుందురు. ఎవరి కాయ హెచ్చయినచో వారు ముందర కొట్టుచుందురు. కంచాలాట యందు, ఈ క్రింది వరుస ప్రకారముగ ఆడుచుందురు. ఒకటి, ఒండు, రెండోయి రోలు, మూడోయి ముత్తి, నాలగోయి నవ్వ, ఐదు బండు, ఆరొాక దార, ఏడి చారబొద్దు, ఎనమదల కున్ను, తొమ్మదల మొగ్గ, తొట్టికి లగ్గం, ఈ విధంగా పదిసార్లు కాయని ఎవరయితే ముందర కొట్టెదరో వారు పండినట్లు అనగా వాడికను ఆడవలసిన పనిలేదు. చివరకు మిగిలిన వానిచే ఈ పండిన వారందరు దేకుళ్ళు పెట్టించెదరు. (దేకుళ్ళు అనగా గోళీకాయను మోచేతితో లేక ముంజేతితో నెట్టుట)

# 148.కర్రా బిల్లా (చిల్లగర్ర ఆట)



ఈ ఆట గోణి బిళ్ళ, గూటి బిళ్ళ, బిళ్ళ కర్ర, చిల్లంగోడు, కోడింబిళ్ళ, చిల్లగోల, బిల్లంగోడు అనే రకరకాల పేర్లతో ప్రచారంలో ఉంది. సుమారు 4 అంగుళాలు ఉన్న కర్ర ముక్క, రెండు అడుగులు పొడవుగల కర్ర ఒకటి ఈ ఆటకు ఉపయోగింతురు. వీటిలో చిన్న దానిని 'బిళ్ళ' అనీ, పెద్దదాన్ని 'కర్ర' అని అందురు. అందువల్లనే ఈ ఆటకు 'కర్రబిళ్ళ' అని పేరు. నేలమీద చిన్న 'కంచా' (గుంట) త్రవ్వి ఈ కంచా మీద 'బిళ్ళ'ను

ఉంచి కర్రతో ఎగుర కొట్టుదురు. దీనిని 'గూటుట' అందురు. సాధారణంగా ఈ ఆటను ఇద్దరు లేక నలుగురు ఆడుదురు. ఒకరు బిళ్ళను గూటునప్పుడు రెండవవారు కంచాకు కొంత దూరంలో నిలబడి బిళ్ళ క్రింద పడకుండా పట్టుకోవలెను. అలా పట్టుకోగలిగినచో బిళ్ళను గూటిన వాడు ఓడినట్టు. అలా పట్టుకోలేకపోతే బిళ్ళపడిన స్థలం దగ్గర నుంచి దానిని తిరిగి కంచా దగ్గరకు విసరును. విసరినప్పుడు కంచా నుంచి బిళ్ళ ఉన్న స్థలాన్ని కర్రతో కొలవగా ఆ దూరం ఒక కర్ర కంటె ఎక్కువ దూరం ఉంటే ఆట సాగించవచ్చును. తక్కువ ఉంటే గూటిన వాడు ఓడిపోయినట్లే.

గూటినవాడు ఆ బిళ్ళ చివరను కర్రతో కొట్టి అది పైకి లేచినపుడు దూరమునకు పోవునట్లు దానిని కర్రతో కొట్టి, విసరును. ఈ విధముగా మూడు పర్యాయములు కర్రతో బిళ్ళను కొట్టి మూడవసారి కొట్టినప్పుడు బిళ్ళ పడిన స్థలం నుంచి కంచావరకుగల దూరమును కొలువవలెను. పది కర్రల పొడవును 'లాల' అందురు. గూటినవాడు ఆ దూరమును అంచనాగా ఎన్ని లాలలుండునో చెప్పును. చెప్పినదాని కన్నా ఎక్కువ దూరమున్న అతడు గెలిచినట్లు. అలా లెక్కపెట్టినప్పుడు ఎన్ని లాలలుంటే అన్ని సార్లు ఓడిపోయినవారు ఒంటి కాలితో గెంతుతూ కూత పెడుతూ బిళ్ళపడిన స్థలం నుంచి కంచా నుంచి బిళ్ళ వరకు కుంటుతూ రావలెను. ఈ ఆటను వర్లాకిమిడి, బరంపురం ప్రాంతాల్లో 'గిల్లీదండి' అని, కృష్ణాజిల్లా ప్రాంతంలో 'గోడి బిళ్ళ' అని, ఉత్తరదేశంలో 'గూలిదండా' అందురు.

# 149. అష్టాచెమ్మా



అష్టాచెమ్మా ఆటను నేడు కూడా చిన్నా పెద్దా, ఆడామగా అనే తారతమ్యం లేకుండా గవ్వలతోను, చింత పిక్కలతోను సరదాగా ఆడుకుంటారు. ఈ ఆటకు నాలుగు గవ్వలను ఉపయోగిస్తారు. వీటిని పందెపు గవ్వలంటారు. అష్టాచెమ్మా పటము గీసి ఆట ఆడుదురు. 'X' గుర్తు ఉన్న గళ్ళలో మధ్య నున్న దానిని వంట గడి అనీ, నాలుగు వైపులా 'x' గుర్తులు ఉన్న గళ్ళను ఆట గళ్ళని అందురు.

ఈ ఆట సాధారణంగా ఇద్దరుగాని, నలుగురుగాని ఆడుదురు. ఎక్కువమంది ఉన్నప్పుడు ఇద్ద రేసి, ఉజ్జీలుగా ఉండి ఎనిమిదిమంది కూడా ఆడవచ్చును. నాలుగు వైపులా ఉన్న ఆటగాళ్ళల్లో ఒక్కొక్కరు నాలుగేసి చొప్పున నలుగురు నాలుగు రకాల చింత పిక్కలుగాని, గవ్వలు గాని, రాళ్ళు గాని ఆటకాయలుగా పెట్టుకొందురు.

పందెపు గవ్వల్ని నేలపైన విసరి పందెము వేసినప్పుడు అందులో ఒక గవ్వ తిరగబడి మూడు బోర్ల పడితే 'కన్ను' అనీ, రెండు తిరగబడి రెండు బోర్లపడితే 'రెండు' అనీ, మూడు తిరగబడి ఒకటి బోర్లపడితే 'మూడు' అనీ, నాలుగూ తిరగబడితే 'చెమ్మా' అనీ, నాలుగూ బోర్ల పడితే 'అష్టా' అనీ పేర్లు. కన్నుకి ఒకటి, రెండుకి రెండు, మూడుకి

మూడు, చెమ్మాకి నాలుగు, అష్టాకి ఎనిమిది గళ్ళ చొప్పున ఆటకాయలను నడుపుదురు. కాయ గళ్ళలో నడిచి చుట్టు తిరిగి వెళ్ళి చంపుడు దొరకగానే లోపలి గళ్ళలోకి దిగి, మళ్ళీ చుట్టు తిరిగిన తరువాత పండుతుంది. ఇలాగే తక్కిన గళ్ళలో ఉన్న కాయలును ఆయా గళ్ళ ప్రకారం లోపలికి దిగి పండును. పందెం వేసినప్పుడు చెమ్మా పడితే ఒక కాయ, అష్టాపడితే రెండు కాయలు విడుతాయి. అష్టా, చెమ్మా పందెములు పడినప్పుడు మాత్రం మళ్ళీ మరొకసారి పందెము వేయుదురు. ఈ పందెమును పై పందెములకు కలిపి కాయను నడుపుకొందురు. వరుసగా మూడు అష్టాలు గాని, మూడు చెమ్మాలు గాని పడినప్పుడు మరల నాలుగో పందెం అదే పందెం పడితేనే లెక్క పెట్టుదురు. లేకపోతే లెక్క పెట్టరు. ఇట్లు లెక్కపెట్టని పందెములను 'మురిగిళ్ళు' 'మురిగీసు' అని అందురు. మూడు పందెములు మురిగి పోయినవని వాటి అర్థము. ఆటగళ్ళలో ఉన్న పిక్కలను చంప కూడదు. అందువల్ల ఆ స్థలాలలో కాకుండా బయటి గళ్ళలో రెండో మనిషి కాయ ఉన్నట్లయితే, తాను వేసిన పందెముతో తన కాయ అక్కడికి వచ్చేటట్టుగా నడిపించి అక్కడున్న బయటివారి కాయను తీసివేయుదురు. దీనినే చంపడం అందురు. ఎవరి కాయలైనా చంపబడి ఉన్నప్పుడు వారు పందెం వేసే సమయంలో అష్టాచెమ్మాలలో ఏదైనా పడితే చెమ్మాకి ఒకటి, అష్టాకి రెండు చచ్చిన కాయలను విడిపించు కొనవచ్చును. ఈ విడిపించు కొన్న కాయలను తిరిగి వారి గళ్ళలో పెట్టుకొని యథాపూర్వక ముగా ఆట ఆడుదురు. ఆటగళ్ళలో ఎన్నికాయలైనా ఉండవచ్చును. మొదట పండిన వాళ్ళు మాత్రం తక్కిన అందరినీ ఓడించినట్లే.

# 150.గుడుగుడు గుంజం



బాలబాలికలు ఎంతో ఇష్టంగా ఆడుకునే ఆట. పిల్లలందరూ సాయంత్రంవేళ ఒక చోట కూర్చొని రెండు చేతుల పిడికిళ్ళు బిగించి ఒకరి పిడికిలి మీద మరొకరి పిడికిలి ఉంచాలి. ఆటలోపెద్దగా ఉండే ఒకరు పిడికిలిలో తన చూపుడు వ్రేలు ఉంచి ఆడిస్తూ ఈ విధంగా పాడుతుంది.

గుడు గుడు గుంజం గుండే రాగం
పాముల పట్టుం పగడారాగం
చిన్నన్న గుర్రం చిందులు తొక్కే
పెద్దన్న గుర్రం పెండ్లికి పోయే
నీ గుర్రం నీళ్ళకు పోయే
నా గుర్రం పాలకు పోయే
కత్తెయ్యనా-బద్దెయ్యనా,

**రోలెయ్యనా-రోకలయ్యేనా**
**వేన్నీళ్ళు పొయ్యనా-చన్నీళ్ళు పొయ్యనా**

అని అడుగుతూ పైన పిడికిలిగల వారు ఆట పెద్ద అడిగిన దానికి తనకు ఇష్టమైన దానిని కోరాలి. ఉదాహరణకు కత్తెయ్యమని కోరినచో ఆట పెద్ద తన చూపుడు వ్రేలితో వారి పిడికిలి మీద కత్తితో నరికినట్లు కొట్టాలి. తరువాత వారు తన పిడికిలి ముద్దుపెట్టుకొని వెనుకకు దాచుకోవాలి. అందరూ ఈ విధంగా చేసిన తరువాత ఆట పెద్ద వారందరినీ మీ చేతులు ఏమైపోయాయి అని అడుగు తుంది. పిల్లెత్తుకొని పోయాయని వారందరూ చెప్తారు. పిల్లని ఎందాక తరిమారి అని అడిగిన దానికి కొండపల్లి దాకా తరమామని వారు చెబుతారు. తరువాత ఆట పెద్ద పిల్లలందరికి చక్కిలిగింత పెడుతుంది.

ఉత్తరాంధ్రలో ఇదే ఆట కాస్త భిన్నంగా సాగుతుంది. ఇక్కడ పాట అనంతరం ఆట వస్తుంది. పాట కూడా కాస్త మారుతుంది.

**గుడుగుడు గుంచం, గుండే రాగం,**
**పాముల పట్నం, పటికా బెల్లం,**
**తాతా తాతా నీ పెళ్లెప్పుడూ...**
**రేపు గాక ఎల్లుండి.**
**పెదనాన్న గుర్రం పెళ్లికి పోయె,**
**చిన్నాన్న గుర్రం ఛుట్టికి పోయె,**
**నా చేతులేమో పిల్లెత్తుకు పోయే**



అంటూ అందరూ చేతుల్ని వెనక్కి పెట్టేసుకుంటారు. తరువాత కొన్ని

ప్రశ్నలుంటాయి. మొదటి పిల్లాడితో అవి మొదలవుతాయి. ఆ ప్రశ్నలు... వాటికి ఆ పిల్లలిచ్చే సమాధానాలు...

నీ చేతులేవి - పిల్లెత్తుకుపోయింది
పిల్లినెక్కడి వరకూ తరిమావ్ - గోల్కొండ వరకూ
గోల్కొండేమిచ్చింది - గవ్విచ్చింది
గవ్వేంచేసావ్ - గోతిలో కప్పెట్టాను
గొయ్యేమిచ్చింది - గడ్డిచ్చింది
గడ్డేం చేశావ్ - ఆవుకి వేశాను
ఆవేమిచ్చింది - పాలిచ్చింది
పాలేంచేశావ్ - అమ్మకిచ్చాను
అమ్మేమిచ్చింది - జున్నిచ్చింది
జున్నేం చేశావ్ - నాన్న కిచ్చాను
నాన్నేమిచ్చారు - రూపాయిచ్చారు
రూపాయేం చేశావ్ - పంతులుగారికిచ్చా
పంతులేం చేశారు - చదువూ చెప్పే
చదివేం చేశావ్ - మామాకిచ్చే
మామేమిచ్చాడు - పిల్లానిచ్చే...
పిల్లా పేరు మల్లే మొగ్గా, నాపేర్ జమిందార్

చివరి సమాధానం పూర్తవడంతో ఆ కుర్రాడు పరిగెత్తుతాడు. అతణ్ని పట్టుకోవడానికి మిగిలిన వాళ్లు వెంటపడతారు. ఎవరైతే పట్టుకుంటారో వాళ్లే విజేత.

# 151.వన భోజనాలు




కార్తీకమాసములో బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారు. ఈ రోజును ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చు. అసలు కార్తీక మాసం వచ్చిందంటే చాలు ప్రతి ఇంట్లో ఒక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని ఉంటుంది. ఏడాది కాలంలో ఎప్పుడు కుదిరినా కుదరక పోయినా బంధుమిత్రులతో కలిసి కొంత సమయం గడింపేందుకు వనభోజనాలు గొప్పసందర్భంగా మారింది.

## పురాణాల ప్రకారం కార్తీక వనభోజనాలు

పురాణ కథల ప్రకారం చెప్పాలంటే కార్తీక పురాణంలో వనభోజనాల ప్రసక్తి ప్రముఖంగా కనిపిస్తుంది. కార్తీక మాసంలో ఉసిరి చెట్టు ఉన్న వనంలో, విష్ణుమూర్తిని అర్చించి వనభోజనం చేసినవారి సకల పాపాలూ తొలగిపోతాయన్నది పురాణంలోని మాట. ఈ సంప్రదాయాన్ని తరచి చూస్తే వనభోజనానికి ఎందుకంత ప్రాధాన్యతో అర్థమవుతుంది.

## ఉసిరిచెట్టు క్రిందే ఉత్తమం

వన భోజనానికి ఎంచుకునే ప్రదేశం అత్యంత పవిత్రంగా ఉండాలి. వన భోజనాలకు రకరకాల ఫల, పుష్ప, వృక్షాలు కలిగిన ఏటి ఒడ్డున ఉన్న ప్రదేశాన్ని ఎన్నుకోవడం ఉత్తమం. అక్కడ తప్పనిసరిగా ఉసిరి చెట్టు ఉండాలి. తులసివంటి మొక్కలు కూడా ఉంటే మరీ మంచిది. బయట నుండి తెచ్చినవి కాకుండా సాధ్యమైనంత వరకు ఆహార పదార్థాలు ఆ వన ప్రదేశంలోనే వండుకోవాలి. సాత్విక ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి. ఉసిరి చెట్టు కింద సాలగ్రామం పెట్టి కార్తీక పూజలు చేయాలి. తరువాత విస్తరాకులలో గానీ అరిటాకుల్లో గాని అందరూ కలసి భోజనం చేయాలి. ఇలా అందరూ కలసి పని చేయడంలో సహకార స్ఫూర్తి మనకు కనపడు తుంది. స్నేహాన్ని, సమైక్యతను పెంచేదే ఈ వనభోజనాల సంప్రదాయం.

# 152.పూర్ణకుంభం



పూర్ణ కుంభం (నిండు కుండ) అనేది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధికారిక చిహ్నము. ఈ కుంభం లేదా కలశము అనేది సాధారణంగా నీటితో నింపబడి ఉండి, పైభాగాన 'టెంకాయ' (కొబ్బరి కాయ)ను కలిగి, చుట్టూ మామిడాకులచే అలంకరింపబడి వుంటుంది.

## పూర్ణ కుంభాన్ని ఎలా తయారు చేస్తారు

దీని కొరకు సాంప్రదాయికంగా ఇత్తడి కుండను ఉపయోగిస్తారు, అది అందుబాటులో లేనప్పుడు రాగి లేదా మట్టి కుండలు కూడా ఉపయోగిస్తారు. ఈ కుండను కలశం లేదా కుంభం అనికూడా అంటారు. కొన్నిసార్లు ఈ కుంభాన్ని బియ్యంతో నింపుతారు, తెల్లని లేదా ఎర్రని



దారాన్ని ఈ కుండమెడకు లేదా మొత్తం కుండకు చుడతారు. మామిడాకు లతో ఈ కుండ ముఖం వద్ద వృత్తాకారంలో అలంకరిస్తారు. కొన్నిసార్లు టెంకాయను తెల్లటి లేదా పసుపు బట్టతో కప్పుతారు. ఈ విధంగా పూర్ణకుంభం తయారవుతుంది. దీనిని సాంప్రదాయికంగా పవిత్రమైనదిగా భావిస్తారు, మంత్రోచ్చారణలతో తయారుచేస్తారు. దీనిని శుభసూచకంగా భావించి శుభకార్యాలలో ఉపయోగిస్తారు. ఉదాహరణకు పెండ్లి, గృహ ప్రవేశం, రోజువారీ ప్రార్థనలు మొదలగునవి. దీనిని ముఖ ద్వారాలవద్ద 'స్వాగత సూచకంగా' కూడా ఉంచుతారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన మార్పులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార చిహ్నంలో ప్రభుత్వం మార్పులు చేసింది. చిహ్నంలో ఇప్పటి వరకు 'పూర్ణ కుంభం' ఉండేది. అయితే, అది తప్పని ప్రభుత్వం తేల్చింది. పూర్ణ కుంభం కాదు పూర్ణ ఘటం అని ప్రకటించింది.

# 153.మామిడి తోరణాలు



హిందూ సంప్రదాయంలో పండుగలు, శుభకార్యాలు జరుపుకునేటప్పుడు ఇంటికి తోరణాలు కట్టడం ఆనవాయితి. ఏదైనా ఓ శుభకార్యం ప్రారంభించారంటే చాలు.. వెంటనే గుమ్మానికి తోరణాలు కట్టేస్తుంటారు. ఆ తోరణాలు కట్టడానికి ఎక్కువగా ఉపయోగించేది మామిడి ఆకులు మాత్రమే. మామిడి ఆకులు లేకుండా ఏ శుభకార్యం జరగదు కూడా.

గృహప్రవేశ కార్యం అయిన ఇంట్లోకి మామిడితోరణాలు కళకళలాడూతూ అతిథులకు స్వాగతం పలుకుతున్నట్లు ఉంటాయి. ఈ ఆచారము వెనుక ఓ శాస్త్రీయ విషయాన్ని గ్రహించారు కాబట్టే, అనేక శుభకార్యాలలో మామిడి ఆకును వాడతారు.

గుమ్మాలకు మామిడి తోరణాలు ఎందుకు కట్టుతారంటే.. పండుగలు లేదా శుభకార్యాల సమయాల్లో కుటుంబ సభ్యుల్లో పని ఒత్తిడిని, శ్రమను పోగొట్టేది మామిడాకు తోరణమే. కొంతమంది పండుగ రోజుల్లో కూడా ఉదయాన్నే లేవకుండా.. నిద్రపోతుంటారు అలాంటి వారికి మామిడి తోరణాలు మంచిగా పనిచేస్తాయి. ఈ తోరణాలు ఇంట్లో కట్టితే నిద్ర లేమిని పోగొడుతుంది.

ప్రాచీన కాలం నుండి పర్వదినాల్లో యజ్ఞయాగాల్లో ధ్వజారోహణం చేస్తుంటారు. దీనిని అనుసరించే తోరణాలు కట్టే ఆచారం వచ్చిందని అంటారు.

పండుగ రోజుల్లో దేవుళ్లకు పూజలు చేస్తూ.. నాకు ఈ కోరిక తీర్చు స్వామి అంటూ ప్రార్థిస్తుంటాం. ఈ కోరికలను మామిడి ఆకులే నెరవేర్చు తాయని చాలామంది నమ్ముతారు.

మామిడి ఆకుల గురించి రామాయణ,మహాభారత గ్రంధాలలో కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రతి శుభకార్యంలోను మంగళ తోరణాలు కట్టటానికి మామిడి ఆకులను తప్పనిసరిగా ఉపయోగిస్తాం. ఎందుకంటే మామిడి ప్రేమకు, సంపద, సంతానాభివృద్ధికి సంకేతం. అందుకే పూజకు ముందు ఉంచే కలశంలో కూడా తప్పనిసరిగా మామిడి ఆకులను ఉపయోగిస్తాం.

మామిడి ఆకులో లక్ష్మీదేవి కొలువై ఉంటుందని మన పెద్దలు చెబుతూ ఉంటారు. అందువల్ల ఆ ఆకులతో గుమ్మానికి తోరణం కడితే ఇంటిలోకి ధనం చేరి ఆ ఇల్లు సిరిసంపదలతో తులతూగుతుంది.

ఇంటి ప్రధాన గుమ్మానికి మామిడి తోరణం కడితే ఏమైనా వాస్తు దోషాలు ఉంటే తొలగిపోతాయి. అలాగే ఇంటిలో నెగిటివ్ ఎనర్జీ తొలగి పోయి పాజిటివ్ ఎనర్జీ వచ్చి అన్ని శుభాలే జరుగుతాయి.

ఇంట్లో ఏమైనా దుష్ట శక్తులు ఉంటే పోతాయి. అలాగే దేవతల అనుగ్రహం కూడా కలుగుతుంది.

ఈ తోరణాలు ఇంట్లో కట్టితే  మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు కడితే ఇంట్లో ఉండే గాలి శుభ్రమవు తుందట. ఇంట్లో ఉండే ఆక్సిజన్ శాతం పెరిగి స్వచ్ఛమైన గాలి మనకు లభిస్తుంది. తద్వారా చక్కని ఆరోగ్యం కలుగుతుందట.

మామిడాకుల పాత్ర లేకుండా ఏ శుభకార్యం జరగదు. మంగళ తోరణాలు కట్టేందుకు వాడేది మామిడి ఆకులనే. పూజకు ముందుంచే పూర్ణకుంభంలో అమర్చేది మామిడి ఆకులనే. పూర్ణకుంభమంటే భూదేవిరూపం. అందులో పోసే నీరు మనజీవితానికి మూలాధారమైనవి. ఆ కుంభంలో ఉంచే కొబ్బరికాయ, అమర్చే మామిడి ఆకులు జీవితాన్ని సూచిస్తాయి. ఆ పూర్ణకుంభం అమరిక లక్ష్మీదేవి రూపమవుతుంది.

మామిడి చెట్టును కూడా దైవ సమానంగా భావిస్తారు.మామిడి చెట్టును దైవ సమానంగా భావించడం వల్ల మన ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగినా, పండుగలు జరిగిన మొదటగా గుమ్మానికి మామిడి తోరణాలు వేలాడదీస్తారు.

# 154.పట్టు వస్త్రములు ధరించుట

హిందూ సాంప్రదాయం ప్రకారం పెళ్ళి మొదలుకుని ఎటువంటి పూజాది క్రతువులు అయినా పట్టు వస్త్రధారణ ఆడవారు, మగవారు కూడా ధరించాలి. ఆడవారికీ పట్టు వస్త్రాలకీ అవినాభావ సంబంధం ఉంది. రక రకాల రంగుల్లో, ఎన్నో విధాల పట్టు వస్త్రాలు, చీరలు, మనకెప్పుడూ అందుబాటులోనే ఉంటాయి. పట్టు వస్త్రధారణ, సమాజంలో ఉన్నత స్థితిని, ఐశ్వర్యాన్నీ కూడా సూచిస్తుంది.

అయితే, పట్టు వస్త్ర ధారణకు సంబంధించి ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయా? ధర్మ శాస్త్రం, ఆధునిక శాస్త్రం కూడా చెబుతోంది ఏమిటంటే, మన చుట్టూ, జీవించి ఉన్న ప్రతీ ప్రాణి చుట్టూ, ఓరా అనబడే సప్తవర్ణ కాంతి పుంజం ఉంటుందని, అది మన యొక్క శరీర, మానసిక స్థితులని బట్టి మారుతూ ఉంటుంది అని చెప్పింది. పట్టు వస్త్రాలు ధరించినప్పుడు ఈ ఓరా ఏంతో శక్తివంతంగా, కాంతివంతంగా మారి, చుట్టూ ఉన్న అత్యున్నతమైన అనుకూల శక్తినీ ఆకర్షించి, మన శరీరంలో ప్రసరింప జేసేలా చేస్తుందట. అందుకే, పవిత్ర కార్యాచరణల్లోనూ, పూజాది క్రతువులు చేసేడప్పుడు, గుడికి వెళ్ళేడప్పుడు, ఆడవారినీ, మగవారినీ కూడా, పట్టు వస్త్రాలు ధరించమని, ఇలా ఉండటం మన ధర్మం అని చెప్తారు.

# 155.కాళ్లకి పారాణి



కాళ్లకు పారాణి అచ్చమైన తెలుగు సంప్రదాయం. కాళ్లకు పారాణి పూసుకుని పావడా కుచ్చెళ్లు ఎత్తిపట్టుకుని వెండి పట్టాలు ఘల్లు ఘల్లుమంటూండగా కన్నెపిల్లలు నట్టింట నడయాడడం తెలుగువారి ముంగిళ్ళలో ఎంతో సుందర దృశ్యం.

పారాణిని పెళ్ళి సమయంలో పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు కాళ్ళకు చేతులకు పూసి అందంగా తీర్చిదిద్దుతారు. ఇది గోరింటాకు వలె ఉన్నప్పటికి దీనికి ప్రత్యేక స్థానం ఉంది. దీనిని పెళ్ళి సమయంలో వధువరుల అలంకరణలో ఒక సాంప్రదాయంగా వాడుతున్నారు.

పసుపుతో పాటు పాదాల అలంకారానికి వాడేది పారాణి. పసుపు సున్నం నీరు కలిపితే వస్తుంది చక్కని ఎర్రని పారాణి. బాగా పల్చగా ఉంటే దీనిని వసంతం అంటారు. పూర్వం వసంతం అడటానికి పిచికారి గొట్టంలో ఈ ఎర్రని ద్రవాన్నే పోసే వారు. ఈ రంగులు సహజమైనవి కనుక ప్రమాదకారులు కావు. ఆహ్లాదకరంగా ఉండటమే కాదు త్వరగా పోతాయి కూడాను. దిష్టి తియ్యటానికి, ముఖ్యంగా శుభ సందర్భాలలో పారాణి నీటిని (ఎర్ర నీళ్ళు అంటారు) ఉపయోగిస్తారు.

అన్నీ శుభకార్యాలలో కాళ్ళకి పారాణి పెట్టే సంప్రదాయం ఈ నాటికీ కొనసాగుతోంది. ఇది ఆడవారికి సంబంధించింది అనుకుంటాం. కాని ఇది స్త్రీ పురుషులకు ఇద్దరికీ వర్తించే సంప్రదాయం. కనుకనే పెళ్లిళ్లు, వడుగులు మొదలైన సందర్భాలలో పెళ్లి కొడుకుకి పసుపు రాసి, పారాణి పెడతారు. పసుపు పారాణి మంగళ ద్రవ్యాలు. ఐదోతనానికి చిహ్నాలుగా భావన.

ప్రత్యేకమైన పూజలు చేసేప్పుడు పూజ చేసే వారూ, వారి చేత ముత్తైదువలుగా పూజింప బడేవారూ పాదాలకి పసుపు పారాణి విధిగా అలంకరించుకోవలసి ఉంటుంది. నూతన వధువు అని చెప్పటానికి కాళ్ల పారాణి తడి ఆరలేదు అని ఆలంకారికంగా చెప్పటం వివాహానికి పారాణికి ఉన్న అవినాభావ సంబంధాన్ని సూచిస్తుంది. పచ్చని పసుపు మీద ఎర్రని పారాణి గీతలు పాదానికి ఎంతటి అందాన్ని కలిగిస్తాయి. అందంతో పాటు ఆరోగ్యం.

# 156.దీపం పెట్టడం



దీపం పెట్టడం మన హిందూ సంప్రదాయంలో చాలా విశిష్ట స్థానాన్ని పొందినది. రోజు శుచిగా స్నానం చేసి, ఉతికిన బట్టలు కట్టుకొని దేవుని ఎదుట నిలిచి నేతితో కాని నూనెతో కాని దీపాన్ని వెలిగిస్తారు.

## దీపం వెలిగించే విధానము

ముందుగా దీపంలో వేయవలసిన వత్తిని తీసుకొని వాటి కొనలని వేళ్ళతో దగ్గరికి చేయాలి. ఇప్పుడు దీపంలో నూనె కానీ నెయ్యి కాని వేయాలి. వత్తులను మొత్తం నూనె కానీ నెతితో కానీ తడపకూడదు. ఇలా చేయటం వల్ల దీపం కొండేక్కదు (దీపం ఆరిపోయింది అని

అనకూడదు, అందుకే దాని బదులుగ కొండెక్కింది అంటారు). ఇప్పుడు వత్తిని వెలిగించండి. కుంకుమను తీసుకొని దీపానికి పెట్టాలి. మీరు కూడా కుంకుమను ధరించాలి.



దీపం పెట్టె సమయం లో ఈ క్రింది శ్లోకం చదవాలి.

**దీపం జ్యోతి పరబ్రహ్మ, దీపం జ్యోతి జనార్ధన,**
**దీపేన హరతే పాపం, సంధ్యా దీపం నమోస్తుతే.**

దీపము కలిగిన ఇంట, దాపున శ్రీలక్ష్మి ఉండి పాపములు పారద్రోలి, ధనములను ఇచ్చి, ఆరోగ్యం, శాంతిని ఇచ్చి, బ్రహ్మాండముఖి కాపాడుము మమ్ము అని అనుకోవాలి.

# 157.హారతి



మంగళ హారతి హిందూ సంప్రదాయ దేవతార్చనలో ఒక ముఖ్యమైన భాగం. ప్రతి దేవత యొక్క పూజ పూర్తయిన తరువాత కర్పూరంతో మంగళ హారతి ఇస్తారు. సాధారణంగా ఈ హారతి ఇస్తున్నప్పుడు అక్కడ ఉన్న పెద్దవారు ఆయా దేవతల మంగళ హారతి పాటలను పాడతారు. కొన్ని సందర్భాలలో మనుషులకు కూడా హారతి ఇస్తారు. పెళ్ళి, పుట్టినరోజులలో హారతి ఇవ్వడంలో ఉద్దేశం వారికి దిష్టి తీయడమే.

# పూజలో హారతి ఉద్దేశ్యం

భగవంతుని పూజలో చేసే అనేక ఉపచారాలలో హారతి ఒకటి. దీనినే నీరాజనం అని కూడా అంటారు. దీపం లేదా దీపాలు లేదా కర్పూరం వెలిగించి పూజా విగ్రహానికి ముందు త్రిప్పడం హారతిలో ప్రధాన విషయం. ఇందుకు అనుబంధంగా సంగీతం వాయిస్తారు. పాటలు, శ్లోకాలు, మంత్రాలు చదువుతారు. దీనిని "హారతి" లేదా "ఆరతి" అంటారు. హారతి సమయంలో భక్తులు పాట లేదా భజనలో పాలు పంచుకొంటారు. అనంతరం హారతిని కళ్ళకద్దుకొంటారు. పురాతన కాలంలో స్వల్పంగా దీపాల కాంతి ఉన్నపుడు భగవంతుని రూపం అంత స్పష్టంగా కనిపించేది కాదు. అప్పుడు హారతి వెలుగులో కనుల పండువుగా భగవంతుని మూర్తిని దర్శించే భాగ్యం భక్తులకు కలిగేది. ఇది హారతి సంప్రదాయానికి ఇంత ప్రాముఖ్యత రావడానికి ఒక కారణం కావచ్చును.



## నేతి ఒత్తులతో హారతి

నేతి వత్తులతో హారతి ఇవ్వడంలో అనేక సంప్రదాయాలున్నాయి. ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు, పదకొండు, పదహారు, ఇరవై – ఇలా వివిధ సంఖ్యల వత్తులతో హారతులిస్తారు. హారతి తరువాత మంత్రపుష్పం పూజ జరుగుతుంది.

## దక్షిణాది, ఉత్తరాది సంప్రదాయాలు

ఉత్తర భారతదేశంలో "జయజగదీశ హరే" అనే పాట దాదాపు అన్ని పూజలలోను వాడుతారు. ఈ భజన గేయం వివిధ దేవతల స్తోత్రాలకు అనుగుణంగా పాఠాంతరాలు కలిగి ఉంది కాని అన్నింటికీ ఒకటే బాణీ వాడుతారు. దక్షిణాదిలో హారతి విధానం మరింత వైవిధ్యం కలిగి ఉంటుంది. "మంగళం" అనే పదంతో అంతమయ్యే పాటలు, శ్లోకాలు ఎక్కువగా పాడుతారు.

తిరుమల ఉత్తర మాడ వీధిలో నివసించే తరిగొండ వెంగమాంబ అనే భక్తురాలి హారతి తీసుకోనిదే బ్రహ్మోత్సవాల సమయంలో ఆమె ఇంటి ముందునుండి రథం కదిలేది కాదట. అందుకు ప్రతీకగా ప్రతీ రోజూ రాత్రి ఏకాంతసేవ అనంతరం వెంగమాంబని పాట పాడి హారతి ఇమ్మని భక్తులూ, అర్చకులూ అడిగేవారట. కాలక్రమంలో అది ఒక సేవగా స్థిరపడిపోయింది. ఈ సేవనే తరిగొండ ముత్యాల హారతి అనేవారు. వెంగమాంబ తరువాత ఆమె దత్తపుత్రిక వారసురాలయ్యింది. వారి వారసుల పరంపర నేటికీ కొనసాగుతూనే ఉంది.

# 158.మంగళ హారతులు

మంగళం పాడటం అంటే కథ చెప్పడం పూర్తయిందనే సంకేతంతో పాటు విన్నవారికి శుభం కలగాలని పలికే పలుకులు. అంతేకాదు, దేవతానుగ్రహంతోనే ఈ సృష్టి మనుగడ సాగిస్తోంది కాబట్టి సృష్టి స్థితి లయకారులకు కృతజ్ఞతాపూర్వక వందనాలు సమర్పించుకోవాలన్న విశ్వాసమూ ఈ సంప్రదాయంలో ఇమిడి ఉంది.

తెలుగింట్లో శుభకార్యాలు జరిగినప్పుడు మంగళ హారతులు పాడడం సంప్రదాయం. పూజైనా, వ్రతమైనా, పెళ్ళైనా, ఆఖరికి పుట్టిన రోజైనా చివరగా మంగళ హారతి తప్పనిసరి. సంగీత కచేరి కూడా మంగళంతో ముగిస్తారు. ఆ సమయంలో ఆహూతులలో హారతులు బాగా పాడగలిగిన వాళ్ళ కోసం అందరు చూస్తారు. కాస్త పాడగలిగిన వారు కూడా, నాలుగు మంగళ హారతులు తెలిస్తే బాగుండు అనుకుంటారు.

వినసొంపుగా ఉండే ఈ మంగళ హారతి గీతాల సాహిత్యమూ ఇంపుగా ఉంటుంది. ఈ పాటలు వింటే, చదివితే అందరికీ శుభం కలుగుతుందన్నది జానపద కళాకారుల నమ్మకం. సాధారణ పరిభాషలో మంగళం పాడటం అంటే విడిచిపెట్టడం, ఆపేయడం అనే అర్థాలు స్థిరపడ్డాయి కానీ, నిజానికిది శుభం పలకడం, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం.

# 159.ముత్తయిదువకు బొట్టు పెట్టడం



ముత్తైదువలెవరైనా తమ ఇంటికి వస్తే వెళ్లేటప్పుడు పుణ్యస్త్రీ అయిన ఆ ఇంటామె కుంకుమతో తాను ముందు బొట్టుపెట్టుకొని తరువాత ఆమెకు "దీర్ఘ సుమంగళీ భవ" అని బొట్టుపెడుతుంది. ఇది తెలుగువారి సంప్రదాయం. ఇక్కడ అతిథికి బొట్టు పెడితే చాలదా, తనుముందు బొట్టు పెట్టుకోవడం దేనికీ అనే ప్రశ్న రావచ్చు. విధరాండ్రు బొట్టు పెట్టుకోరాదు. వారు ఇతరులకు బొట్టుపెట్టడం కూడా అమంగళం. అందువల్ల తాను ముందు బొట్టు పెట్టుకోవడం ఎదుటివారికి తానుకూడా పుణ్యస్త్రీనే అని తెలియ చెప్పడమన్నమాట.

# 160.ప్రదక్షిణము



ప్రదక్షిణము లేదా పరిక్రమము అనే పదానికి అర్థం తిరగడం. హిందువులు దేవాలయంలోని దేవుని చుట్టూ ప్రదక్షిణం చేస్తారు. దైవ ప్రదక్షిణములో మెల్లగా నడచుట, చేతులు జోడించుట, దేవునినే ధ్యానిం చుట అనేవి ముఖ్యమైన భాగాలు. భగవదుపచారాల్లో ప్రదక్షిణ నమస్కారం చివరిది, పరిపూర్ణమైనది. ఏవైనా గ్రహాచారాలు బాగలేకపోయినా, అరిష్టాలేర్పడినా ఆలయాల్లో నియమిత సంఖ్యలతో ప్రదక్షిణ చేస్తే వాటి పరిహారం జరుగుతుందని హిందూ ధర్మ శాస్త్రాలు సూచిస్తాయి.

# ప్రదక్షిణ పద్ధతులు

ఆలయాల్లో చేసే ప్రదక్షిణల్లో చాలా రకాలున్నాయి. మామూలుగా ధ్వజస్తంభం నుంచి ప్రారంభించి తిరిగి చివరకు ధ్వజస్తంభం వద్దకు చేరుకుని దైవానికి నమస్కరించడం ఒక ప్రదక్షిణ క్రమం. చండీశ్వరుడున్న శివాలయంలో ప్రదక్షిణ విధానం మరొక పద్ధతిలో ఉంటుంది. దానికి చండీ ప్రదక్షిణం అని పేరు. ఇంట్లో పూజల సందర్భంలో ఆత్మ ప్రదక్షిణ చేయాలి. గుడులలో ఆత్మ ప్రదక్షిణ చేయరాదు. ఆలయంలో ఉన్న దైవం విశ్వశక్తి కేంద్రబిందువునకు ప్రతీక. ఆయన చుట్టూ ఉన్న ఆలయం అనంత విశ్వానికి సంకేతం. ప్రపంచంలో జరిగే పరిణామాలే ప్రదక్షిణలు. జీవితం అంటే ఒక చుట్టు ఆవృతం. జననం నుంచి మరణం వరకు ఈ విశ్వంలో మన జీవితమే ఒక ప్రదక్షిణ. ఇలా ఎన్నో జన్మల్లో సంపాదిం చుకున్న కర్మల ఫలితాన్నే ఈ జన్మలో అనుభవిస్తాం. ప్రదక్షిణ పేరుతో పరమాత్ముని చుట్టూ తిరగడం వలన జన్మల చుట్లలో చేసిన కర్మల దుష్ఫలితాలను తొలగించుకోగలం. అంతే కాదు. అత్యధిక ప్రదక్షిణలు చేయడం వలన రానున్న జన్మల చుట్లను కూడా అధిగమించవచ్చునని నమ్మకము. కర్మ క్షయమే ప్రదక్షిణలో పరమార్థం. మన మనోవాక్కాయ కర్మలు పరమేశ్వ రుని చుట్టూ పరిభ్రమించాలన్నదే ప్రదక్షిణలోని ప్రధానోద్దేశ్యం.

# ప్రదక్షిణ గురించి పురాణ కథ

"విశ్వమంతా తిరిగి శీఘ్రంగా ప్రదక్షిణ చేసి వచ్చిన వానికే గణాధి పత్యం" అని పార్వతీ పరమేశ్వరులు షరతు విధించినపుడు కుమారస్వామి మయూర వాహనంపైనెక్కి విశ్వాన్ని చుట్టి రావడానికి వెంటనే బయలు

దేరాడు. మూషిక వాహనుడైన మహాగణపతి అలా వెళ్ళలేకపోయాడు. కానీ, తెలివిగా పార్వతీ పరమేశ్వరుల చుట్టూ ప్రదక్షిణ చేశాడు. చిత్రంగా సుబ్రహ్మణ్యుడు వెళ్ళిన ప్రతి చోటా అంతకు మునుపే గణపతి వచ్చి వెళ్ళిన జాడలు కనిపించాయి. ముందుగా విశ్వాన్ని చుట్టి వచ్చిన వాడు వినాయకుడేనని నిర్ణయించి శివుడు, ఇతర దేవతలు అతనికే గణాధిపత్యాన్ని ఇచ్చారు. కుమారస్వామి అలకను తీర్చి పార్వతీ పరమేశ్వరులు బుజ్జగించారు. అయితే ఈ కథలో కుమారస్వామి, గణపతిలలో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అని కాదు. ఉన్నచోటనే ఈశ్వరుని ఆవిష్కరించుకోవాలన్నది గణపతి చాటిన సందేశం. అన్ని చోట్లా ఈశ్వరుని సందర్శించాలన్నది సుబ్రహ్మణ్యుని బోధ. దైవ ప్రదక్షిణము వలెనే అశ్వత్థ ప్రదక్షిణము, భూప్రదక్షిణము, కులశైల ప్రదక్షిణములు ఒక దాని కంటే ఒకటి దశోత్తరతమమైన ఫలితాన్నిస్తాయి. అలాగే తండ్రికి, గురువుకు, తల్లికి చేసిన ప్రదక్షిణలు ఒకదాని కంటే ఒకటి పది రెట్లు ఫలాన్నిస్తాయి. ఉదయము, సాయంకాలము వేళల్లో సూర్య ప్రదక్షిణము సర్వసిద్ధిప్రథమని చెప్పబడింది. శ్రీ రమణ మహర్షి ప్రదక్షిణం అన్న పదాన్ని విశ్లేషించారు. ప్ర అనే అక్షరం సమస్త పాపాల వినాశనానికి సూచకం. ద అంటే కోరికలన్నీ తీరడమని భావం. క్షి అన్న వర్ణం రాబోయే జన్మల క్షయాన్ని సూచిస్తుంది. న అంటే అజ్ఞానం నుండి విముక్తి ప్రాప్తి అని చెప్పారు.

## గో ప్రదక్షిణ పురాణం

బ్రహ్మ అహల్యను అత్యంత సౌందర్యవతిగా సృష్టించాడు. దేవతలందరూ ఆమెను పరిణయమాడాలనుకున్న వారే. అప్పుడు బ్రహ్మ త్రిలోకా

లను ఎవరైతే ముందుగా చుట్టి వస్తారో ఆమెను వివాహమాడడానికి అర్హులని ప్రకటిస్తాడు. ఇంద్రుడు తన శక్తులన్నింటినీ ఉపయోగించి ముల్లోకాలను తిరిగి వచ్చి అహల్యను ఇచ్చి వివాహం జరిపించమని బ్రహ్మను కోరుతాడు. అప్పుడు నారదుడు వచ్చి గౌతముడు ఇంద్రుడికంటే ముందుగా ముల్లోకాలను చుట్టి వచ్చాడని చెపుతాడు. గౌతముడు తన దైనందిన పూజలో భాగంగా గోవు చుట్టూ మూడు ప్రదక్షిణలు చేశాడని. ఒకరోజు అలా ప్రదక్షిణ చేస్తుండగా ఆవు లేగ దూడకు జన్మనిచ్చిందనీ, శాస్త్రాల ప్రకారం శిశువును ప్రసవిస్తున్న ఆవు ముల్లోకాలతో సమానమనీ అందుకే అతనికి ఆ ఫలితం దక్కిందనీ తెలియజేస్తాడు. కాబట్టి అహల్యను గౌతముడికే ఇచ్చి పెళ్ళి చేయమని చెపుతాడు.

## ప్రదక్షిణంలో రకాలు

**ఆత్మ ప్రదక్షిణము:** తనచుట్టూ తానే చేసుకొనే ప్రదక్షిణం.


**పాద ప్రదక్షిణము:** పాదములతో నడుస్తూ ఆచరించే ప్రదక్షిణం.

**గిరి ప్రదక్షిణము:** దేవుడు కొలువుండే కొండ చుట్టు చేసే ప్రదక్షిణం.

**అంగ ప్రదక్షిణము:** సాత్వికావయవాలు నేలకు తగిలేటట్లుగా దొర్లు కుంటూ చేసే ప్రదక్షిణం.

**దండ ప్రదక్షిణము:** అవ్యగ్ర చిత్తములో దండ ప్రణామాలు చేస్తూ ఆచరించే ప్రదక్షిణం.

# 161.నమస్కారము



ప్రపంచ సంస్కృతులలో ఎదుటి మనిషిని గౌరవించు అతి చక్కని ముద్రగా నమస్కారము పరిగణింపబడుతుంది. గురువులు, పెద్దవారు, గౌరవనీయులు ఎదురైతే రెండు చేతులు జోడించి, తలను కొద్దిగా ముందుకు వంచి, తమ భక్తిని ప్రకటించుకొనే ప్రక్రియే నమస్కారము.

ఈ నమస్కార విధి తెలుగువారి సంప్రదాయాలలో ఒకటిగా చెప్పబడింది. నమస్కారం చేయడాన్ని శాస్త్రాలలో నాల్గు విధాలగా చెప్పబడింది. అవి సాష్టాంగ నమస్కారం, దండ ప్రణామం, పంచాంగ నమస్కారం, అంజలి నమస్కారం.

## సాష్టాంగ నమస్కారం

మనస్సు, బుద్ధి, అభిమానం, రెండు పాదాలు, రెండు చేతులు, శిరస్సు అను ఈ ఎనిమిదింటితో చేయు నమస్కారమే సాష్టాంగ నమస్కారం. ఇందులో ఒక వ్యక్తి యొక్క శరీరంలోని అష్ట భాగాలు భూమిని తాకుతూ బోర్లా పడుకొనే మాదిరిగా దేవునికి ఎదురుగా పడుకొని నమస్కారం చేస్తారు.

## దండ ప్రణామం

నేలమీద పడిన దండము (కర్రలాగా) శరీరాన్ని భూమిపైవాల్చి పరుండి కాళ్లు చేతులను చాపి అంజలి చేయుట దండ ప్రణామం.


## పంచాంగ నమస్కారం

రెండు పాదాల వేళ్లు, రెండు మోకాళ్లు, తల భూమిపైనుంచి రెండు చేతులను తలవద్దచేర్చి అంజలి చేయుట పంచాంగ నమస్కారం. ఇది ఎక్కువగా స్త్రీలు చేస్తారు.

## అంజలి నమస్కారం

ఇది సర్వసాధారణమైన రెండుచేతులను కలిపి నమస్కారం అనటం. భారతదేశ వ్యాప్తంగా హిందూమత సంబంధమైన విధులు నిర్వర్తించేప్పుడు, మతాచార్యుల ఎదుట, భగవంతుని ముందు ప్రవర చెప్పి నమస్కరిస్తూంటారు. **చతుస్సాగర పర్యంతం గో బ్రాహ్మణస్య శుభం భవతి.... త్రయార్షయ ప్రవరాన్వితః శాఖాధ్యాయీ అహంభో అభివాదయే** అంటూ నమస్కరించడం వైదిక విధానం. చేతి వేళ్లను చేవుల వెనుకకు చేర్చి ముందుకు కాస్త వంగిన భంగిమలో పైసంస్కృత వాక్యాన్ని ఉచ్ఛరిస్తారు. మనుష్యులకు నమస్కరించేప్పుడు కుడిచేయిని ఎడమచెవికి, ఎడమచేయిని కుడిచెవికి చేర్చి ప్రవర చెప్పాలి. దేవతలకు నమస్కరించాల్సి వస్తే ఎడమచేతిని ఎడమచెవికి, కుడిచేతిని కుడిచెవి వెనక్కి చేర్చి ప్రవర చెప్తారు.

# 162.పంచాంగ శ్రవణం




తెలుగువారి తొలి పండుగ ఉగాది. ఈ పర్వదినం నాడు పంచాంగ శ్రవణానికి వెళ్లడం తెలుగువారి సంప్రదాయం. ఈ రోజు దేవాలయం లోనో, రచ్చబండ దగ్గరో పురోహితుడి నుంచి ఆ ఏడాది తమ జీవనం ఎలా సాగుతుందో, వాతావరణం ఎలా ఉంటుంది, పంటల పరిస్థితి ఏమిటి? అనే విషయాలను తెలుసుకునేందుకు ఉత్సుకత చూపుతారు. ఉగాది రోజున వేపపచ్చడి ఎంత ముఖ్యమో పంచాంగశ్రవణం కూడా అంతే ముఖ్యం అంటారు పెద్దలు.

## నవనాయకుల సంచార విశేషాలు

పంచాంగం ప్రకారం వ్యవసాయానికీ, వర్షానికీ, రాజ్యానికీ... ఇలా ప్రతి విభాగానికీ ఓ అధిపతి ఉంటాడు. ఇలా తొమ్మిదిమంది నాయకులను

నవనాయకులు అని పిలుస్తారు. వీరి సంచారం వల్ల రాబోయే రోజులలో వ్యవసాయం ఎలా ఉంటుంది, దేశంలో పరిస్థితులు ఎలా ఉంటాయో ఊహిస్తారు. నవనాయకుల సంగతి అలా ఉంచితే... ఒకో మాసానికీ అధిపతిగా ఉండే గ్రహం వల్ల కూడా అనూహ్య ఫలితాలు ఉండవచ్చు.

ఒకో మనిషి నక్షత్రం ప్రకారం అతని ఆదాయవ్యయాలు, రాజపూజ్య అవమానాలూ లెక్క కడతారు. దీని వల్ల మనుషులలో ఆదాయాన్ని మించి ఖర్చు చేయకూడదనీ, అనువు కానీ చోట అధికులమని అవమానం పాలు కాకూడదనీ జాగ్రత్త ఏర్పడుతుంది. ధార్మికులకు పంచాంగం ఇంత ఉపయుక్తం కాబట్టే... సంవత్సరపు తొలిరోజున పంచాంగ శ్రవణం చేసి తీరాలంటారు పెద్దలు.

## ధార్మికపరమైన సందేహాల నివృత్తి

ధార్మికపరమైన సందేహాలను తీర్చుకునేందుకు కూడా పంచాంగ శ్రవణం అవసరం. అధికమాసంలో శుభకార్యాలు చేసుకోవచ్చా? గ్రహస్థితి బాగోలేకపోతే ఏం చేయాలి? నోములు ఎప్పుడు జరుపుకోవాలి? వ్రతం ఎలా చేసుకోవాలి?... వంటి సవాలక్ష సందేహాలన్నింటికీ ఊరూరా పంచాంగ శ్రవణం వేదికగా మారుతుంది. అందుకనే పంచాంగ శ్రవణ చేసినవారికీ, విన్నవారికీ కూడా నవగ్రహాల ఆశీస్సులు లభిస్తాయని ఫలశ్రుతిగా చెబుతారు.

# 163.జానపదుల వివాహంలో కొన్ని ఘట్టాలు

## ఐరేండ్ల పూజా

పెండ్లిలో అత్యంత ముఖ్యమైన తంతు ఐరెండ్ల పూజ. కుమ్మరి ఇంటి నుండి కొత్త కుండలను తీసుకొచ్చి పూజించే విధానాన్ని ఐరెండ్ల పూజ అంటారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత నిష్టగా, శ్రద్ధతో చేస్తారు. ప్రాచీన వివాహ వ్యవస్థను గమనిస్తే అన్ని కులాల కలుపుగోలుగా తోస్తుంది. గ్రామంలోని అనేక కులాలు ఈ కార్యక్రమంలో పాల్గొని దిగ్విజయం చేస్తారు. అందుకు ప్రతిఫలంగా వీరికి అనేక కట్న కానుకలు సమర్పించుకొని ఆనందాన్ని వ్యక్తం చేస్తారు.

## జానపదుల వివాహంలో పోలు పీట

పచ్చని పందిరి అయిపోయిన తరువాత వడ్లుపోసి దానిపైన ఎత్తైన పీటను వేసి పెండ్లి కుమారుడిని దానిపై కూర్చోబెట్టి మంగళి మైలపోలు తీస్తాడు. అనగా పెండ్లి కుమారుని కాలి గోర్లు మొదలైనవి శుభ్రం చేస్తాడు.

## అందుగ గుంజ

అందుగ చెట్టు కాండాన్ని తెచ్చి పచ్చని పోరుక రోజున ఇంటి ముందు నాటుతారు. ఇది కళ్యాణ అభివృద్ధి మరియు క్షేమాన్ని సూచిస్తుంది. ఈ చెట్టు అంత పెద్దగా పెరిగితే కాపురం అంత చక్కగా ఉంటుందని గ్రామీణులు నమ్ముతారు.

## జానపదుల వివాహంలో గంటె పుస్తెలు

పెళ్ళిలో ప్రధానమైనవి గంటెపుస్తెలు. స్త్రీకి వివాహం అయినది అనడానికి ప్రధాన సాక్ష్యం. పెళ్ళిలో ఈ ఘట్టాన్ని మాంగళ్యధారణ అంటారు. దీనిని చాలా పవిత్రంగా బావిస్తారు. దీనికి పవిత్రంగా పూజ చేసి ముత్తైదువులతో నమస్కరించి వరుడి చేత వడువు మెడలో కట్టిస్తారు. పెళ్ళి అయిన తరువాత వీటిని ఎత్తి పరిస్థితుల్లోను మెడనుండి తీసివేయరు.

## అందుగ గుంజ పోచమ్మ పూజ

పెళ్ళికి కొన్ని రోజుల ముందు ఈ పోచమ్మ పూజను నిర్వహిస్తారు. దీనిని ఆదివారం రోజున వేట మాంసంతో చేస్తారు. పేదవారు కోడితో చేసుకుంటారు. ఈ పూజకు గ్రామంలో అత్యంత ప్రాముఖ్యం ఇస్తారు. డప్పులు, బ్యాండ్, పరివారం, బంధువులు కలిసి ఈ మొక్కు చెల్లిస్తారు.

## పచ్చ పొరుక

పెళ్ళి ముందు రోజును పచ్చని పోరుక అంటారు. పచ్చని పొరుక అనగా ఇంటిముందు పందిరిపై పచ్చని చెట్టు కొమ్మలని వేసి నీడ చేయడం. కాపురం కలకాలం పచ్చగా ఉండాలని దీనిని చేస్తారు. పూర్వం ఎద్దుల బండిలో అడవి నుండి ఈ పచ్చని పొరుకని తెచ్చేవారు. ప్రస్తుతం టెంట్ వేస్తూ సరిపెడుతున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారికి భోజనం పెట్టి వారి ఇంటికి సాగనంపుతారు.

## పసుపు ఇసురుడు

ముత్తైదువులు కొందరు కలిసి పసుపు కొమ్ములను ఇసురురాయిలో వేసి ఇసురుతారు.

# 164.కనకాభిషేకము



9 కాని, 11 కాని బంగారపు పూవులు, తులసీదళములు, గంగ నీరు, రామేశ్వరం బావులలో నీరు, 4వ తరం ఇంటి పెద్దవారిని కూర్చో బెట్టి వెండి చిల్లుల పళ్ళెంలో తులసీ దళములు, బంగారపు పూవులు పెట్టి బ్రాహ్మణుడు మంత్రాలు చదువు తూంటే, ఈ నీటితో అభిషేకము చేయుదురు. మనుమడు తన కొడుకును ఎత్తుకుని ముందుగా ముది మనవ సంతానము చేత అభిషేకము చేయిస్తారు. మిగిలిన వారందరూ ఒకరి తరువాత ఒకరు అభిషేకము చేయుదురు.

బంగారపు నిచ్చెన, వెండి కఱ్ఱ, గొడుగు, పాదరక్షలు, పీట, ధనము, చెంబు, గంధపుచెక్క, తులసీదళం, ఆవుదూడ – ఈ దశ దానములు నాల్గవ తరం ఇంటిపెద్ద ముదిమనవ సంతానమును పట్టుకుని పదిమంది బ్రాహ్మణులకు దానముగా ఇవ్వవలెను. ముదిమనవ సంతానము చేతుల మీదుగా ఇంటి పెద్దలకు బట్టలు పెట్టించవలెను.

# 165.షష్టిపూర్తి వేడుక



'జన్యతషష్టమే వర్షే మృత్యురుగ్రరథా నృణాం ।
దశభిస్త్వధికే తస్మిన్ మృత్యుర్భీమథోనృణాం ।
విజయాఖ్యరథోమృత్యుః అష్టసప్తతిమే భవతే ।-(శాంతి కమలాకరం)

మానవునికి 59 సంవత్సరాలు దాటి 60వ సంవత్సరంలో ప్రవేశించగానే 'ఉగ్రరథ' అనే మృత్యువు మనను వెంటాడుతుంది. అందువల్ల

60 సంవత్సరములు నిండిన వెంటనే 'ఉగ్రరథశాంతి' కార్యక్రమం జరిపి షష్ఠిపూర్తి చేయాలి. అదేవిధంగా 70 సంవత్సరాలు నిండితే 'భీమరథ' అనే మృత్యుదోషం కలుగుతుంది. కాబట్టి 'భీమరథశాంతి' చేయాలి.

అలాగే 78 సంవత్సరములు నిండితే 'విజయరథశాంతి' చేయాలి. పుట్టినప్పటినుండి 83 సంవత్సరాల 4 మాసాలకు వేయి చంద్రదర్శనాలు పూర్తవుతాయి. కాబట్టి అప్పుడు 'సహస్ర చంద్రపూర్ణ దర్శనం' చేయాలి. నూరు సంవత్సరాలు పూర్తిగా నిండితే 'పూర్ణ శతాభిషేకం' నిర్వహించాలని శాస్త్రాలు చెబుతున్నాయి.

60 సంవత్సరాలు నిండిన తరువాత ఈ వేడుక జరుపుకొందురు. ఆనాటి ఉదయాన భార్యాభర్తలిద్దరూ తలస్నానం చేసి, తల్లిదండ్రులు ఉంటే వారిని కుర్చీలో కూర్చుండబెట్టి వారి చుట్టూ ప్రదక్షిణచేసి, కాళ్ళకు నమస్కారము చేసి వారికి అక్షింతలు ఇచ్చి వారి ఆశీర్వాదములు తీసుకొన వలెను. తరువాత దగ్గరలో ఉన్న గుడికి వెళ్ళి పూజ అభిషేకము చేయించు కొనవలెను. అవకాశమున్నచో ఆ సంవత్సరము మొత్తము గోత్ర నామములతో పూజ చేయించుకొనుట చాలా మంచిది.

స్తోమత కల్గిన వారు ఈ వేడుకను ఇంకా గొప్పగా చేసుకొంటారు. అలా చేసుకోవాలనుకున్న వారు ముందుగా బ్రాహ్మణులను సంప్రదించి వారు సూచించిన విధంగా ఈ వేడుక జరిపించుకోవాలి.

# 166.భీమ రథశాంతి వేడుక



60 సంవత్సరములు నిండిన తరువాత ఉగ్రరథ శాంతి (షష్టి పూర్తి) జరిపినట్లే 70 సంవత్సరములు నిండిన పిమ్మట భీమరథశాంతి జరుపుకుంటారు. పది ముందు తరముల వారికి పదకొండు భావితరముల వారికి విష్ణులోక నివాసము కల్పించగల కనకాభిషేకము అను క్రియ నిర్వర్తించుటకు సహస్రమాస జీవులు మాత్రమే అర్హులని పరమేశ్వరుడు పార్వతిదేవికి చెప్పినట్లు ధర్మశాస్త్రములు తెలుపుచున్నవి. ప్రపౌత్రుని అనగా మనుమని మనుమని చూచిన వ్యక్తియైనను దీనిని ఆచరించ వచ్చును.

# 167.విజయరథశాంతి వేడుక

ఎక్కువ వయస్సు ఆరోగ్యంగా జీవించే పెద్దలకు ఆయా వయస్సులు దాటి సమయంలో వచ్చే దోషనివారణకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

78 సంవత్సరాలు నిండిన దంపతులను ఉదయాన తలార స్నానం చేయించి పెండ్లి కొడుకును, పెండ్లికూతురుని చేయుటము, మంగళ స్నానము. పురోహితుడు అంకురార్పణ చేసి గణపతి హోమము మృత్యుం జయ హోమము చేయుదురు. కొందరు శ్రీ సత్య న్నారాయణస్వామి వారి వ్రతము చేసుకొందురు.

వివాహంలో జరిగే వేడుకగానే తలంబ్రాలు పోసుకొనుట, బిందెలో ఉంగరములు వేయుట, దండలు మార్చుకొనుట, మొదలగు వేడుకలు చేస్తారు. సాయంకాలము ఊరేగింపుగా వేడుక మండపమునకు బయలుదేరి వెళ్ళేదరు. కొడుకులు - కోడళ్ళు, ఈ దంపతులిద్దరికి పాదపూజచేసి నూతన వస్త్రాలు పెట్టవలెను. ఈ శుభ కార్యమునకు వచ్చిన అతిధులకు భోజనముతో పాటు స్తోమతను బట్టి బహుమతులు కూడా పంచెదరు. ఆనాడు బ్రాహ్మణులచే జపము చేయిం చుకుని దశదానములు బ్రాహ్మణులకు ఇవ్వవలెను.

# 168.సహస్ర చంద్రదర్శన వేడుక



83 సంవత్సరాల 4 నెలలు పూర్తి అయితే 1000 చంద్రోదయములు చూసిన పుణ్యం ఆనాటికి కలుగుతుంది. దీనినే సహస్ర చంద్రోదయము అని అంటారు. అనగా 84 సంవత్సరంలోకి అడుగు పెట్టడమంటే! వేయి పౌర్ణమిలను చూచినవారగుదురు. వేయి చంద్రదర్శనములు చేసిన వారిగా గుర్తించి, వారికి ఈ వేడుక జరిపించెదరు. ఈ సమయంలో అభిషేకము, పూజలు, జపములు, హోమములు జరుపుకొందురు. శ్రీ సత్యన్నారాయణ స్వామి వారి వ్రతము చేసుకొనవచ్చును. బంగారపు

నిచ్చెన, వెండివి కర్ర, గొడుగు, తులసిదళము, పాదరక్షలు, పీట, ధనము, చెంబు, గంధపు చెక్క, ఆవుదూడ, దశదానములు బ్రాహ్మణులకు దానమిస్తారు.

దంపతులకు ఉంటే దంపతులకు, లేక ఒకరిగా ఉంటే ఒక్కరితో ఈ వేడుక జరుపుకుంటారు. ఆనాటి ఉదయమే తలస్నాన మాచరింపజేసి నూతనవస్త్రాలు ధరింపచేయాలి. తరువాత కుర్చీలో కూర్చుండబెట్టి కుమారులు, కుమార్తెలు అల్లుళ్ళు, కోడళ్ళు వారి పిల్లలు, మనవలు, ముదిమనవళ్ళు అందరూ ఆయనకు పాదపూజ చేసి నమస్కరించి, వారి ఆశీర్వాదం తీసుకోవాలి. తరువాత దగ్గరలో ఉన్న గుడికి పోయి అభిషేకము చేయించాలి. స్తోమత కల్గినవారు ఈ వేడుకను గొప్పగా జరిపించుకుంటారు. బంధుమిత్రులకు విందు భోజనాలు ఏర్పాటుచేసి గొప్ప కానుకలు పంచుతారు.

## కొబ్బరికాయ కొట్టడంలో అంతరార్థం



క్షుద్రదేవతలకు నోరున్న జంతువుని బలి యిస్తారట. సాత్విక దేవతలకు నోరులేని జంతువుని బలి ఇస్తారట. కొబ్బరికాయ మొక్క వస్తుంది గనక అదిప్రాణే అని, ఆ కాయలోని నీరు శరీరంలో రక్తంలాంటిదని, గుంజు మాంసంలాంటిదని, పైపెంకు చర్మంలాంటిదని, అందువల్ల ఒక కొబ్బరికాయను అర్పించడమంటే ఒక జంతువును బలివ్వడమే అని కొందరి భావన.

# 169.అంత్యేష్టి



హిందువుల జీవితంలోని చివరి సంస్కారం అంత్యేష్టి. ఒక హిందువు తన జీవితాన్ని వివిధ దశల్లో వివిధ సంస్కారాల ద్వారా పవిత్రం చేసుకున్న తర్వాత మరణానంతరం అతడి వారసులు అతని ఆత్మకు శాంతి, సద్గతులు కలగాలని కోరుతూ చేసేవి అంతిమ సంస్కారాలు లేక అంత్యేష్టి.

## మరణానికి ముందు

మరణమాసన్నమైన వ్యక్తి తన కుటుంబసభ్యులను, బంధువులను, ఆత్మీయులను పిలిపించుకుని కన్నుమూసే ముందు అందరినీ ఒకసారి

చివరిసారిగా చూసుకుని, వారికి, ప్రపంచానికి వీడ్కోలు పలుకుతారు. వారు తృప్తిగా కన్నుమూయడానికి, మరణానంతరం వారు సంతోషంగా ఉండడానికి వీలుగా వారిపేరుమీద, వీలైతే వారి చేతుల మీదుగానే దాన ధర్మాలు జరుగుతాయి.

## అంతిమయాత్రకు ముందు

చనిపోతున్నవారి నోట్లో దగ్గరివారు తులసితీర్థం, గంగాజలం మొదలైన పవిత్ర జలాలను పోస్తారు.

## అంతిమయాత్ర సాగే విధానం

**పాడె:** శవాన్ని అంత్యక్రియలు జరిగేచోటికి తీసుకువెళ్ళడానికి ఏడుకట్లతో ప్రత్యేకంగా తయారుచేసిన పొడవాటి నిర్మాణం. శవాన్ని దానిమీదికి చేరుస్తారు.

**అంతిమయాత్ర:** మరణించినవారి బంధువులు, మిత్రులు, ఆత్మీయులందరూ అంతిమయాత్రలో పాల్గొంటారు. అందరూ కలసి శ్మశానస్థలిని చేరుకుంటారు.

**అనుస్తరణి:** జీవితసాగరాన్ని దాటి అవతలికి వెళ్ళేటప్పుడు సహాయకారిగా ఉంటుందనే నమ్మకంతో హిందువులు పవిత్రంగా భావించే గోవును మరణించినవ్యక్తి తరపున దానంగా ఇస్తారు.

**దింపుడుకళ్ళెం:** భగవదనుగ్రంవల్లో లేదా మారేదైనా కారణాల వల్ల చనిపోయినవారి ఆయుస్సు ఇంకా తీరలేదని యమధర్మరాజు వెనక్కి పంపెయ్యడం వలనో చనిపోయినవారు తిరిగి బ్రతుకుతారనే నమ్మకంతో, బ్రతకాలనే ఆశతో అంతా సిద్ధమయ్యాక కూడా అంత్యక్రియలను కొన్ని

నిమిషాలసేపు ఆలస్యం చేయడానికి పాడెను శ్మశానానికి తీసుకువెళ్ళే దారి మధ్యలో దించి శవం చెవిలో మూడసార్లు పేరుపెట్టి పిలుస్తారు. ఒక్కోసారి మరణించారని పొరబాటుగా భావించినవారు తర్వాత తిరిగి లేవడం వల్లే ఈ ఆచారం పుట్టి ఉంటుంది.

**దహనం:** శరీరాన్ని దహనం చెయ్యడానికి చితిపై ఉంచేముందు శరీరానికి జలంతో అభిషేకం చేయించడంతోబాటు అంత్యక్రియల్లో భాగంగా చేసే కర్మ కొంత ఉంటుంది. అది పూర్తయాక శరీరాన్ని చితిపై ఉంచి వేదమంత్రాల మధ్య నిప్పంటిస్తారు.

**ఉదకకర్మ:** చితిపై మంటల మధ్య శరీరం కాలిపోగా ఆ వేడిని తగ్గించి మరణానంతర జీవుడిని చల్లబరచడానికి ఉదకం (నీళ్ళు) సమర్పిస్తారు.

**ఓదార్పు :** ఆత్మీయుడిని పోగొట్టుకుని దు:ఖంలో ఉన్నవారికి పెద్దలు జీవితమింతేనని తెలుపుతూ మతగ్రంథాల్లో నుంచి గాథలను, జీవితసత్యాలను బోధపరిచి దు:ఖభారాన్ని తగ్గిస్తారు.

**అశౌచం:** చావు సంభవించిన ఇంటిలో నివాసముండడం మంచిది కాదనే నమ్మకంతో సంవత్సరకాలం ఆ ఇంటిని ఖాళీగా ఉంచుతారు. దీన్ని సూతక మని అంటారు (సూతకం రెండురకాలు: జాతాశౌచం, మృతాశౌచం).

**అస్థిసంచయనం:** శరీరం కాలి బూడదైనా ఎముకలు పూర్తిగా కాలిపోవు. ఆ బూడిదలో మిగిలిపోయిన ఎముకలను ఏరి తీసుకోవడం అస్థి సంచయనం.